
'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసీ గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 136

మంగళవారం 6-8-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**రూపాయి విలవిల..**

ఆరేళ్లలో అతిపెద్ద పతనం!..

ఒకేరోజు 113 పైసలు డౌన్ - బిజినెస్‌లో



**బంగారం భగభగ**

ఔన్స్‌కు 1,482 డాలర్లకు దూకుడు.

దేశీయంగానూ కొత్త రికార్డులు - బిజినెస్‌లో

# మిషన్ కశ్మీర్

# 370 రద్దు


అమిత్ షా

"ఐక్య భారతదేశం కోసం అత్యున్నత త్యాగాలు చేసిన దేశ భక్తులందరికీ మా ప్రభుత్వం అర్పిస్తున్న నివాళే ఈ నిర్ణయం. యావత్ దేశానికీ అభినందనలు. ఎన్నో ఏళ్ల నుంచి నలుగుతున్న చారిత్రక తప్పిదాన్ని ఈరోజు మోదీ ప్రభుత్వం సరిచేసింది"

మరిన్ని వార్తలు, కథనాలు 4, 5, 6, 7లలో




**జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లుకు ఆమోదం ఇలా**

| 125 | 61 |
|---|---|
| అనుకూలం | ప్రతికూలం |

అనుకూలం: జేడీ(యూ) మినహా మిగిలిన ఎన్డీయే పార్టీలు, వైఎస్సార్‌సీపీ, టీఆర్‌ఎస్, టీడీపీ, అన్నా డీఎంకే, బీజేడీ, బీఎస్పీ, ఆప్
వ్యతిరేకం: కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఎన్సీపీ, ఆర్జేడీ, వామపక్షాలు

## రెండు ముక్కలుగా కశ్మీరం

- జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి తొలగింపు
- అసెంబ్లీసహిత యూటీగా జమ్మూకశ్మీర్, అసెంబ్లీరహిత యూటీగా లదాఖ్
- కేంద్రప్రభుత్వం సంచలన, చరిత్రాత్మక నిర్ణయం
- రాష్ట్రపతి నోటిఫికేషన్ అనంతరం తీర్మానాన్ని ఆమోదించిన రాజ్యసభ
- నేడు లోక్‌సభకు బిల్లులు, తీర్మానం
- తీవ్రంగా వ్యతిరేకించిన ప్రతిపక్షాలు
- భారత చరిత్రలో ఇది చీకటిరోజని మండిపాటు
- చారిత్రక తప్పిదాన్ని సరిచేశామన్న బీజేపీ

నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రెండోసారి అధికారం చేపట్టిన 90 రోజుల్లోనే అత్యంత సంచలన, సాహసోపేత నిర్ణయాన్ని తీసుకుంది. దశాబ్దాల సంఘ్ పరివార్ కలలను, ఎన్నికల హామీని నెరవేరుస్తూ, కశ్మీర్‌లో 72 ఏళ్ల నుంచి నలుగుతున్న వేర్పాటువాదం, ఉగ్రవాదం సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులేస్తూ.. జమ్మూకశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న రాజ్యాంగంలోని 370, 35–ఏ అధికరణాలను రద్దు చేసింది. అలాగే జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను కూడా తొలగిస్తూ, దానిని అసెంబ్లీతో కూడిన కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చింది. లదాఖ్ ప్రాంతాన్ని కూడా జమ్మూకశ్మీర్ నుంచి పూర్తిగా వేరు చేసి, ప్రత్యేక కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించింది. వీటికి సంబంధించిన తీర్మానం, బిల్లులను కేంద్రం సోమవారమే రాజ్యసభలో ఆమోదింపజేసుకుంది. ఈ బిల్లులు, తీర్మానాన్ని లోక్‌సభలో మంగళవారం ప్రవేశపెట్టనుండగా, దిగువ సభలో ప్రభుత్వానికి భారీ మెజారిటీ ఉండటంతో అక్కడ కూడా వీటిని ఆమోదింపజేసుకోవడం కేంద్రానికి నల్లేరు మీద నడకే కానుంది. కేంద్రం చర్యను అనేక పార్టీలు, వివిధ వర్గాల ప్రజలు మనస్ఫూర్తిగా స్వాగతించగా, కాంగ్రెస్, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలు తదితర ప్రతిపక్ష పార్టీలు మాత్రం తీవ్రంగా వ్యతిరేకించాయి. రాజ్యసభలోనూ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు ఈ పార్టీల సభ్యులు తీవ్ర నిరసనలకు దిగారు. కేంద్రం ప్రజాస్వామ్యాన్ని హత్య చేస్తోందనీ, భారత చరిత్రలో ఇదో చీకటి రోజని వారు ఆరోపించారు.

- వివరాలు 2లో


కర్ఫ్యూ నేపథ్యంలో జమ్మూలో జవాను పహారా

### 370

| రద్దుకు ముందు.. | రద్దు తర్వాత |
|---|---|
| మిగతా రాష్ట్రాలతో పోలిస్తే.. జమ్మూకశ్మీర్ ప్రజలకు ప్రత్యేక హక్కులు, ప్రభుత్వానికి ప్రత్యేక అధికారాలు | ఇకపై ప్రత్యేక హక్కులు, అధికారాలు ఉండవు |
| రాష్ట్ర ప్రజలకు ద్వంద్వ పౌరసత్వం | ఇకపై ఒకే పౌరసత్వం |
| రాష్ట్రానికి ప్రత్యేకంగా జెండా ఉంది.. | ఒకే పతాకం.. అది త్రివర్ణమే.. |
| ఆర్టికల్ 360(ఆర్థిక అత్యయిక స్థితి) అమలు చేయలేం.. | ఆర్టికల్ 360 అమలు చేయొచ్చు.. |
| పంచాయతీలకు హక్కులు లేవు | మిగతా రాష్ట్రాల్లో ఉన్నట్లుగానే.. పంచాయతీలకు హక్కులు |
| శాసనసభ కాలపరిమితి ఆరేళ్లు | శాసనసభ కాలపరిమితి 5 సంవత్సరాలు |
| హిందువులు, సిక్కులు తదితర మైనార్టీలకు రిజర్వేషన్లు లేవు | ఇప్పుడు 16 శాతం రిజర్వేషన్ల అమలు |
| వేరే రాష్ట్రాల వారు ఇక్కడ భూములు, ఆస్తులు కొనడం నిషేధం | అన్ని రాష్ట్రాల ప్రజలు ఇక్కడ భూమి, ఆస్తులు కొనవచ్చు |
| సమాచారహక్కు చట్టం వర్తించదు | సమాచారహక్కు చట్టం అమలు |
| వేరే రాష్ట్రానికి చెందిన వ్యక్తిని ఇక్కడి మహిళ పెళ్లాడితే ఆమెకున్న స్థానిక పౌరసత్వం, హక్కులు పోతాయి. | భారతీయుడ్నిగానీ, విదేశీయుడ్నిగానీ పెళ్లాడినా స్థానిక హక్కులు పోవు. భారత పౌరసత్వం ఉంటుంది.. |

## మీడియా చేతికి 'టాప్ సీక్రెట్'

- అమిత్ షా చేతిలోని పత్రాలను ఫొటో తీసిన మీడియా
- ఈ నెల 7న జాతినుద్దేశించి ప్రసంగించనున్న ప్రధాని
- త్వరలో అఖిలపక్ష భేటీ నిర్వహిస్తారని జాబితాలో ప్రస్తావన - వివరాలు 4లో

# ఇసుక ధరలకు రెక్కలు

### గోదావరికి వరదతో నిలిచిన రవాణా

- ఆన్‌లైన్ ద్వారా విక్రయాలకు టీఎస్ఎండీసీ బ్రేక్
- స్టాక్ పాయింట్ల వద్ద నిండుకుంటున్న నిల్వలు
- రంగంలోకి దళారీలు.. ధరలు పెంచి జోరుగా అమ్మకాలు.. బహిరంగ మార్కెట్‌లో రూ. 2,200పైనే పలుకుతున్న టన్ను ధర



సాక్షి, హైదరాబాద్

వారం రోజులుగా గోదావరి నదికి వరద పోటెత్తుతుండటంతో తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీఎస్ఎండీసీ) నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌లు మూతపడ్డాయి. రీచ్‌లకు వెళ్లే రహదారులు బురదమయం కావడంతో ఇసుక రవాణా నిలిచిపోయింది. దీంతో ఆన్‌లైన్ విధానంలో ఇసుక విక్రయాలను టీఎస్ఎండీసీ తాత్కాలికంగా నిలిపివేసింది. డిమాండ్‌కు అనుగుణంగా ఇసుక సరఫరా లేకపోవడాన్ని దళారీలు సొమ్ము చేసుకుంటుండటంతో బహిరంగ మార్కెట్‌లో ఇసుక ధర అమాంతం పెరిగింది. గోదావరికి వరద ఉధృతి తగ్గి కొత్త రీచ్‌లు అందుబాటులోకి వస్తేనే ఇసుక సరఫరా మెరుగవుతుందని టీఎస్ఎండీసీ వర్గాలు చెబుతున్నాయి.

**మూతపడిన రీచ్‌లు...**

రాష్ట్రంలో సుమారు 30 రీచ్‌ల ద్వారా టీఎస్ఎండీసీ ఇసుకను వెలికితీస్తూ సగటున రోజుకు 30 వేల క్యూబిక్ మీటర్ల ఇసుకను ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. టీఎస్ఎండీసీ వెలికితీస్తున్న ఇసుకలో 96 శాతం గోదావరి తీరంలోని పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల పరిధిలోని రీచ్‌ల నుంచే వస్తోంది. అయితే వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో గోదావరికి వరద పోటెత్తుతుండటంతో రీచ్‌లు మూతపడ్డాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం ఆరు రీచ్‌లే పనిచేస్తున్నాయని టీఎస్ఎండీసీ వర్గాలు చెబుతున్నాయి. అయితే గతంలో ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్న వాహనాలకు మాత్రం ఇసుకను లోడ్ చేస్తున్నారు.

**అమాంతం పెరిగిన ధరలు...**

ఆన్‌లైన్ విధానంలో టన్ను ఇసుకను రూ. 600 చొప్పున టీఎస్ఎండీసీ విక్రయిస్తుండగా రవాణా, ఇతర చార్జీలు కలుపుకొని సీజన్‌లో రూ. 1,250 నుంచి రూ. 1,500 వరకు ధర పలికింది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఇసుక విక్రయాలు నిలిచిపోవడంతో కొరతను దళారీలు సొమ్ము చేసుకుంటున్నారు. నాణ్యమైన ఇసుక (ఫైన్ శాండ్) ధర బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం టన్నుకు రూ. 2,200కుపైనే పలుకుతోంది. ముడి ఇసుక (కోర్ శాండ్) టన్నుకు రూ. 1,400 చొప్పున లభిస్తున్నా వినియోగదారులు ఫైన్ శాండ్ కొనుగోలుకే ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఫైన్ శాండ్‌కు రాష్ట్రంలో ఉన్న కొరతను దళారీలు ఆసరాగా తీసుకుని ధరలు అమాంతం పెంచేశారు. గతేడాది అక్టోబర్‌లో ఆఫ్ సీజన్‌లో టన్ను ఇసుక ధర రూ. 3వేలకుపైగా

మిగతా 2వ పేజీలో ▶

## ఎంబీబీఎస్ మూడో కౌన్సెలింగ్‌కు బ్రేక్

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయం

- 550 జీవో ప్రకారం రిజర్వేషన్లు అమలు కాలేదన్న అభిప్రాయం
- సర్దుబాటు చర్యలు చేపట్టాలని ఆరోగ్య వర్సిటీకి ఆదేశం
- ఎప్పుడు కౌన్సెలింగ్ నిర్వహించేది... ఎలా సర్దుబాటు చేసేది అనే విషయంపై అస్పష్టత

3లో












నిన్నట్నుంచీ ఏ చానల్ మార్చినా ఇదే వస్తోందండీ!



## 'పాలమూరు'కు రూ.10 వేల కోట్ల రుణం

- దేవాదుల, సీతారామ, ఎఫ్ఎఫ్‌సీకు మరో రూ.2,638 కోట్లు
- కాళేశ్వరం ప్యాకేజీ–12 పనుల పూర్తికి 1500 కోట్లు
- వివిధ సంస్థల నుంచి రుణాలు తీసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు.. రూ.41,500 కోట్లకు చేరనున్న కాళేశ్వరం రుణాలు! - వివరాలు 16లో


భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం

## నదుల ఉగ్ర తాండవం

కృష్ణా, గోదావరిలో వరద ఉధృతం

- జూరాలకు 2.662 లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు
- శ్రీశైలంలోకి 2.36 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 121 టీఎంసీలకు చేరిన నిల్వ.. రోజుకు 21 టీఎంసీల చొప్పున రాక .. మహాబలేశ్వర్‌లో 38 సెం.మీ, కోయినాలో 25 సెం.మీల కుండపోత
- నేడు మేడిగడ్డ, ధర్మపురికి సీఎం - వివరాలు 16లో




## బేర్ 'విశ్వ'రూపం!

వాణిజ్య యుద్ధ భయాలు, కశ్మీర్ పరిణామాలతో అమ్మకాల వెల్లువ

- ప్రపంచ మార్కెట్ల పతనం.. ఆజ్యం పోసిన చైనా కరెన్సీ డీవేల్యూ భయాలు
- సెన్సెక్స్ 418 పాయింట్లు డౌన్.. ఐదు నెలల కనిష్టానికి సూచీ
- 135 పాయింట్లు పడిపోయి 10,863కి చేరిన నిఫ్టీ

- బిజినెస్‌లో




# కశ్మీరంపై సోషల్ 'యుద్ధం'

సాక్షి, హైదరాబాద్: జమ్మూకశ్మీర్ విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయం తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున చర్చనీయాంశమైంది. గత నాలుగైదు రోజులుగా కశ్మీర్ పరిణామాలను గమనిస్తున్న ప్రజానీకం సోమవారం ఉదయం నుంచే టీవీలకు అతుక్కుపోయింది. 370వ అధికరణ ద్వారా ఆ రాష్ట్రానికి ఉన్న ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించడం, రాష్ట్రాన్ని 2 కేంద్రపాలిత ప్రాంతాలుగా విడగొట్టడంతో తెలుగు ప్రజలు సోమవారమంతా ఇదే విషయంపై చర్చలు జరిపారు. ఏ ఇద్దరు మనుషులు కలిసినా, రాజకీయ నేతలు ఎదురుపడినా కశ్మీర్ అంశంపైనే మాట్లాడుకోవడం గమనార్హం.

### ఏమవుతుందో ఏమో?

దేశ భద్రత, భావోద్వేగాలకు సంబంధించిన విషయంలో కేంద్రం తీసుకున్న కీలక నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశాలపై చర్చ జరుగుతోంది. ముఖ్యంగా సీమాంతర ఉగ్రవాదం పెరుగుతుందా.. తగ్గుతుందా అనే విషయంపై ఎక్కువగా చర్చ జరగడం తెలుగు ప్రజల చైతన్యానికి నిదర్శనంగా నిలిచింది. దీంతో పాటు కేంద్రం తీసుకున్న నిర్ణయం పట్ల కశ్మీర్ ప్రజల్లో ఎలాంటి స్పందన వస్తుంది.. దేశ భద్రతకు సంబంధించి ఏమైనా పరిణామాలు జరుగుతాయా.. సరిహద్దుల్లో సైన్యం మోహరింపు ఎలా ఉంది.. స్థానికంగా ఎలాంటి వివాదాలు తలెత్తకుండా పోలీసులు తీసుకుంటున్న చర్యలు.. కేంద్ర నిర్ణయం స్టాక్‌మార్కెట్లపై ఎలాంటి ప్రభావం చూపింది.. అనే అంశాలు సోమవారం తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారాయి.

### సామాజిక మాధ్యమాల్లోనూ..

సామాజిక మాధ్యమాల వేదికగా కశ్మీర్ అంశంపై భిన్న వాదనలు నడిచాయి. 370వ అధికరణ ద్వారా అక్కడి ప్రజలకు సంక్రమించిన అధికారాల విషయంలో ఇరువర్గాలు ఓ రకంగా సామాజిక మాధ్యమాల్లో యుద్ధమే చేశాయి. ఈ అధికరణ ద్వారా కశ్మీర్‌లో వివాహానంతర వారసత్వ హక్కులు, దేశంలోని ఇతర రాష్ట్రాలకున్న ప్రత్యేక అధికారాలు, కశ్మీర్‌లో కేంద్ర చట్టాలు, అత్యున్నత న్యాయస్థానాల తీర్పుల అమలు తదితర అంశాలపై పోస్టులు వైరల్ అయ్యాయి. ఈ అధికరణ నెహ్రూ, అబ్దుల్లాల మధ్య జరిగిన చీకటి ఒప్పందమని కొందరు, దేశాన్ని విభజించి పాలించేందుకు జరుగుతున్న కుట్రను ఎదుర్కోవాలంటూ మరికొందరు సామాజిక మాధ్యమాల్లో వాదోపవాదాలు చేస్తూ పోస్టులు పెట్టారు.

## బీజేపీది నియంతృత్వ ధోరణి

### ఆ ఆర్టికల్స్ రద్దుతో కశ్మీర్ సమస్య మరింత జటిలం: సురవరం



సాక్షి, హైదరాబాద్: జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370, ఆర్టికల్ 35 (ఏ)లను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం అప్రజాస్వామికమైనదని, బీజేపీ ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి ఇది అద్దం పడుతోందని సీపీఐ అగ్రనేత సురవరం సుధాకరరెడ్డి ధ్వజమెత్తారు. ఒకే దేశం, ఒకే చట్టం, ఒకే మతం, ఒకే ఎన్నికలు, అనేది మూర్ఖపు ఆలోచన.. ఇలాంటి ఫాసిస్ట్ ఆలోచనలు దేశానికి ప్రమాదకరమన్నారు. దీనిపై పునరాలోచించాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం మఖ్దూంభవన్‌లో పార్టీ నేతలు అజీజ్ పాషా, చాడ వెంకటరెడ్డితో కలసి సురవరం మీడియాతో మాట్లాడారు. కేంద్ర నిర్ణయం ఫెడరలిజానికి వ్యతిరేకమన్నారు. కశ్మీర్ సమస్య మరింత జటిలమయ్యే ప్రమాదముందన్నారు.

**ఫెడరలిజానికి వ్యతిరేకం..**

ఆర్టికల్ 370 ఉండాలనుకునే కశ్మీరీ ప్రజల్లో అనేక రకాల అసంతృప్తులు రెచ్చగొట్టి పాకిస్తాన్ అనుకూల శక్తులు పెంచడానికి ఉపయోగపడుతుందని సురవరం చెప్పారు. రాజ్యసభలో ప్రకటనతో మొదలుపెట్టిన కొన్ని నిమిషాల్లోనే రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆర్టికల్ 370ను రద్దు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడాన్ని ఆయన తప్పుబట్టారు. రాష్ట్రాన్ని విభజించి, కేంద్రపాలిత ప్రాంతం చేయడం ద్వారా అక్కడి ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చేందుకు కేంద్రం ప్రయత్నించడం ఫెడరలిజానికి వ్యతిరేకమన్నారు.

## శ్యామాప్రసాద్ ముఖర్జీ కల నెరవేరింది



సంజయ్



అరవింద్

సాక్షి, న్యూఢిల్లీ: ఒకే దేశం, ఒకే ప్రధాని నినాదంతో శ్యామాప్రసాద్ ముఖర్జీ కన్న కలలు నెరవేరాయని బీజేపీ ఎంపీ బండి సంజయ్ పేర్కొన్నారు. పార్లమెంటు ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకించిన పార్టీలు సిగ్గుతో తలదించుకోవాలని పేర్కొన్నారు. ఇది భారత ప్రజల విజయంగా అభివర్ణించారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు బీజేపీ ఆర్టికల్ 370 రద్దు చేసిందని పేర్కొన్నారు.

**ఎంఐఎం, టీఆర్ఎస్ నేతలకు చెంపపెట్టు**

జమ్మూ కశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం కాదన్నట్టుగా మాట్లాడిన టీఆర్ఎస్ నాయకులు, ఎంఐఎం నేతలకు చెంపపెట్టులా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని బీజేపీ ఎంపీ అరవింద్ పేర్కొన్నారు. సోమవారం ఆయన పార్లమెంటు వద్ద మీడియాతో మాట్లాడారు. ఆర్టికల్ 370 రద్దు నిర్ణయంతో కశ్మీరీ పండిట్లు, సైనికుల ఆత్మలకు శాంతి కలిగినట్లయిందని అన్నారు.

## కశ్మీర్‌లో గణనీయ మార్పు: కవిత



సాక్షి, హైదరాబాద్: 'జమ్మూ కశ్మీర్ రాష్ట్ర పునర్విభజనపై కేంద్రం తీసుకున్న నిర్ణయంతో గణనీయ మార్పు వస్తుందని భావిస్తున్నా. కశ్మీర్ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటున్నా. వారంతా క్షేమంగా ఉంటారని, త్వరలో కశ్మీర్‌లో శాంతి నెలకొంటుందని ఆశిస్తున్నా..'అంటూ నిజామాబాద్ మాజీ ఎంపీ కవిత వ్యాఖ్యానించారు. జమ్మూ కశ్మీర్ పరిణామాలపై సామాజిక మాధ్యమ వేదిక ట్విట్టర్ ద్వారా సోమవారం కవిత స్పందించారు. కవిత ట్వీట్‌కు పలువురు నెటిజన్లు స్పందిస్తూ.. గతంలో పార్లమెంటు వేదికగా కశ్మీర్ పండిట్ల సమస్యను టీఆర్ఎస్ ఎంపీ హోదాలో కవిత లేవనెత్తిన విషయాన్ని ప్రస్తావించారు.

## తెలంగాణ అప్రమత్తం!

- కేంద్ర హోం శాఖ, నిఘావర్గాల హెచ్చరికలు
- జిల్లాల ఎస్పీలు, కమిషనర్లతో డీజీపీ టెలీకాన్ఫరెన్స్
- హైదరాబాద్‌లో పలుచోట్ల కశ్మీరీల నిరసన

సాక్షి, హైదరాబాద్: కశ్మీర్‌లో అధికరణ 370, అధికరణ 35ఏ రద్దు పరిణామాల నేపథ్యంలో తెలంగాణ పోలీసులు అప్రమత్తమయ్యారు. కేంద్ర హోం శాఖ, నిఘా వర్గాల సమాచారం మేరకు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా హై అలర్ట్ ప్రకటించారు. ఎక్కడా ఎలాంటి ర్యాలీలు, విజయోత్సవాలు, సభలకు అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఒకవేళ చేయాలనుకుంటే మాత్రం అందుకు తమ అనుమతి తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లో కొన్నిచోట్ల అనుమతి లేకుండా ర్యాలీలు తీసేందుకు యత్నించిన వారిని పోలీసులు అడ్డుకున్నారు. పార్లమెంటులో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అధికరణ 370 రద్దు ప్రకటనకు ముందే అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులను కేంద్ర నిఘావర్గాలు హెచ్చరించాయి. ప్రకటన అనంతరం కేంద్ర హోం శాఖ వర్గాలు అధికారికంగా తెలంగాణ పోలీసులను అప్రమత్తం చేశాయి.

### ఎస్పీలు, కమిషనర్లతో డీజీపీ కాన్ఫరెన్స్..

కేంద్రం ఆదేశాలతో అప్రమత్తమైన డీజీపీ మహేందర్‌రెడ్డి అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. శాంతిభద్రతల విషయంలో తగిన సూచనలు చేశారు. సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు. సైబర్, టాస్క్‌ఫోర్స్, ఎస్‌వోటీ, టీఎస్ఎస్పీ పోలీసులతోనూ డీజీపీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్లు, ఎస్పీలతో పాటు, కొన్ని ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్లకు కూడా పలు సూచనలు చేశారు. ఉద్రిక్తతలు తొలగి సాధారణ వాతావరణం వచ్చేంత వరకు ఉన్నతాధికారుల నుంచి కానిస్టేబుల్ వరకు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. డీజీపీ ఆదేశాలతో తెలంగాణ పోలీసులు అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా సున్నితప్రాంతాలు అధికంగా ఉండే హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో, ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో కొన్ని సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక గస్తీ నిర్వహిస్తున్నారు.

# ఆర్టికల్ 370 రద్దు

- చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్న మోదీ ప్రభుత్వం
- ఇకపై కేంద్ర పాలిత ప్రాంతాలుగా జమ్మూ కశ్మీర్, లదాఖ్
- రాష్ట్రపతి నోటిఫికేషన్ అనంతరం తీర్మానాన్ని ఆమోదించిన రాజ్యసభ
- తీవ్రంగా వ్యతిరేకించిన విపక్షాలు
- చారిత్రక తప్పిదాన్ని సరిచేశామన్న బీజేపీ

న్యూఢిల్లీ:

గతకొన్ని రోజులుగా కశ్మీర్‌లో నెలకొన్న హైడ్రామాకు సోమవారం తెరపడింది. భారీ సంఖ్యలో బలగాల తరలింపు, అమర్‌నాథ్ యాత్రికులు, పర్యాటకులను కశ్మీర్ నుంచి వీలైనంత త్వరగా వెళ్లిపోవాలనడం తదితరాల నేపథ్యంలో నెలకొన్న ఉత్కంఠ వీడింది. ప్రతిపక్షాల భయాల్ని నిజం చేస్తూ, లేదు లేదంటూనే కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, ఆర్టికల్ 35–ఏలను రద్దు చేసింది. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌పై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సంతకం చేసిన అనంతరం ఆ తీర్మానాన్ని హోం మంత్రి అమిత్ షా రాజ్యసభలో ప్రవేశపెట్టగా, సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. అలాగే జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని రెండు భాగాలుగా విడగొట్టి లదాఖ్ ప్రాంతాన్ని పూర్తిగా కేంద్ర పాలిత ప్రాంతంగా చేసింది. లదాఖ్ కాకుండా, మిగిలిన జమ్మూ కశ్మీర్‌ను కూడా కేంద్ర పాలిత ప్రాంతంగానే మార్చింది. అయితే ఢిల్లీ, పుదుచ్చేరిల్లో లాగానే జమ్మూ కశ్మీర్ కూడా అసెంబ్లీతో కూడిన కేంద్ర పాలిత ప్రాంతంగా ఉంటుంది. సరిహద్దుల మార్పులకు సంబంధించి 'జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు–2019'ని కూడా అమిత్ షా రాజ్యసభలో ప్రవేశపెట్టగా, ఓటింగ్ అనంతరం సభ ఈ బిల్లును ఆమోదించింది. బిల్లుకు అనుకూలంగా 125 ఓట్లు, వ్యతిరేకంగా 61 ఓట్లు వచ్చాయి. ఈ తీర్మానం, బిల్లులను మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టి చర్చించనున్నారు. అక్కడ అధికార పక్షానికి భారీ ఆధిక్యం ఉండటంతో ఆమోదం సులభం కానుంది. తీర్మానం, బిల్లులు ఆమోదం పొందడంతో బీజేపీతోపాటు పలు పార్టీల నేతలు కూడా ఆనందం వ్యక్తం చేశారు. దశాబ్దాల నాటి చారిత్రక తప్పిదాన్ని తమ పార్టీ సరిచేసిందని బీజేపీ పేర్కొంది. మరోవైపు జమ్మూ కశ్మీర్‌లో ప్రధాన పార్టీలైన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ), పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ)లతోపాటు ప్రధాన విపక్ష పార్టీలైన కాంగ్రెస్, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్ తదితర పార్టీలు కేంద్రం చర్యను తీవ్రంగా నిరసించాయి. కాగా, ఎన్సీ, పీడీపీ నేతలు, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రులు ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీలతోపాటు పీపుల్స్ కాన్ఫరెన్స్ నాయకుడు సజ్జద్ లోనేను కూడా సోమవారం సాయంత్రం శ్రీనగర్‌లో అరెస్టు చేసినట్లు అధికారులు చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో ఇంటర్నెట్ కనెక్షన్లను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు.

### అమిత్ షా ప్రసంగానికి మోదీ ప్రశంసలు

రాజ్యసభలో చర్చ సందర్భంగా అమిత్ షా చేసిన ప్రసంగాన్ని మోదీ అభినందించారు. గతంలో జరిగిన చారిత్రక అన్యాయాలను అమిత్ షా ఎంతో సవ్యంగా వివరించారనీ, జమ్మూ కశ్మీర్ ప్రజల పట్ల ప్రభుత్వ దృక్పథాన్ని చక్కగా వివరించారని ప్రశంసించారు. అమిత్ షా ప్రసంగాన్ని మోదీ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. షా ప్రస్తావించిన విషయాలు విస్తృతంగా, లోతైన విశ్లేషణలతో ఉన్నాయని మోదీ అన్నారు.

### రెండు జెండాలు, రాజ్యాంగాలు ఇక ఉండవు: షా

సభ అనంతరం అమిత్ షా ఓ ట్వీట్ చేస్తూ ఇకపై కశ్మీర్‌లో రెండు జెండాలు, రెండు రాజ్యాంగాలు ఉండవని పేర్కొన్నారు. 'ఐక్య భారతదేశం కోసం అత్యున్నత త్యాగాలు చేసిన దేశ భక్తులందరికీ మా ప్రభుత్వం అర్పిస్తున్న నివాళే ఈ నిర్ణయం. యావత్ దేశానికీ అభినందనలు. ఎన్నో ఏళ్ల నుంచి నలుగుతున్న చరిత్రాత్మక తప్పిదాన్ని ఈరోజు మోదీ ప్రభుత్వం సరిచేసింది'అని అమిత్ షా ట్విట్టర్‌లో తెలిపారు. దృఢ సంకల్పంతో నిలిచిన ప్రధాని మోదీని ఆయన అభినందించారు. ఈ అంశంపై మంగళవారం లోక్ సభలో చర్చ జరుగుతుందని తెలిపారు. జమ్మూకశ్మీర్, లదాఖ్‌ల్లో శాంతి, అభివృద్ధితో కూడిన కొత్త ఉదయానికి తమ చరిత్రాత్మక నిర్ణయం తలుపులు తెరుస్తుందని అమిత్ షా పేర్కొన్నారు. బీజేపీ నాయకుడు రాం మాధవ్ కూడా ట్వీట్ చేస్తూ, జమ్మూ కశ్మీర్ దేశంలో సంపూర్ణంగా భాగం అవ్వడం కోసం పోరాడి త్యాగాలు చేసిన, డా. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ నుంచి అనేక మంది దేశభక్తులకు గౌరవం దక్కిందని కొనియాడారు.



కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ఢిల్లీలో సంబరాలు చేసుకుంటున్న హిందూ సేన కార్యకర్తలు



ఆర్టికల్ 370 రద్దు, కశ్మీర్ పునర్విభజన అంశాలపై రాజ్యసభ ఆమోదం తర్వాత పార్లమెంటు వద్ద మీడియాతో మాట్లాడుతున్న గులాంనబీ ఆజాద్, చిదంబరం తదితరులు

### ఇదీ రాష్ట్రపతి ఉత్తర్వు!

సాక్షి, న్యూఢిల్లీ: రాజ్యాంగంలోని ఆర్టికల్ –370ను రద్దు చేస్తూ భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉత్తర్వులు జారీచేశారు. దీనిని రాజ్యాంగ (జమ్మూకశ్మీర్‌కు వర్తింపు) ఉత్తర్వులు, 2019గా పిలుస్తారు. ఈ ఉత్తర్వులు ఇలా ఉన్నాయి. 'ఆర్టికల్ 370లోని నిబంధన (1) ద్వారా దఖలు పడిన అధికారాలతో రాష్ట్రపతి జమ్మూకశ్మీర్ ప్రభుత్వ సమ్మతితో ఈ కింది ఉత్తర్వులు జారీచేశారు.

1. (1) దీనిని రాజ్యాంగ (జమ్మూకశ్మీర్‌కు వర్తింపు) ఉత్తర్వులు–2019గా పిలుస్తారు. (2). ఇది అమల్లోకి రాగానే రాజ్యాంగ (జమ్మూకశ్మీర్‌కు వర్తింపు) ఉత్తర్వులు–1959 రద్దవుతాయి.
2. రాజ్యాంగంలోని అన్ని నిబంధనలు, సమయానుసారం సవరించినవి సహా, జమ్మూకశ్మీర్ రాష్ట్రానికి వర్తిస్తాయి. అలాగే మినహాయింపులు, మార్పులు ఈ కింది రూపంలో వర్తిస్తాయి. ఆర్టికల్ –367కు నాలుగో నిబంధన జత చేయడమైంది. "(4) ఈ రాజ్యాంగ ఉద్దేశాలు జమ్మూకశ్మీర్‌లో అమలయ్యేందుకు (ఎ) ఈ రాజ్యాంగ రెఫరెన్సెస్ లేదా నిబంధనలు ఈ రాష్ట్రానికి అన్వయించవచ్చు. (బి) జమ్మూకశ్మీర్ రాష్ట్ర మంత్రి మండలి సలహా మేరకు ఆ రాష్ట్ర శాసనసభ సిఫారసుతో రాష్ట్రపతి గుర్తించే వ్యక్తికి చేసే రెఫరెన్స్ జమ్మూకశ్మీర్ గవర్నర్‌కు చేసే రెఫరెన్స్‌గా అన్వయించాలి. (సి) జమ్మూకశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన రెఫరెన్సెస్‌ను.. రాష్ట్ర మంత్రివర్గ సలహామేరకు చర్యలు తీసుకునే గవర్నర్‌కు చేసే రెఫరెన్స్‌గా అన్వయించాలి. (డి) 370 ఆర్టికల్‌లోని నిబంధన (3)లో 'రాష్ట్ర రాజ్యాంగ శాసన సభ'ను 'రాష్ట్ర లెజిస్లేటివ్ అసెంబ్లీ'గా చదవాలి.."

## వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నాం

- నిధుల కేటాయింపుల్లో ప్రాధాన్యతనివ్వాలి
- కేంద్ర పీఆర్‌శాఖ కార్యదర్శికి మంత్రి ఎర్రబెల్లి విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: గ్రామాల సమగ్రాభివృద్ధికి వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్న తెలంగాణకు నిధుల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి రాహుల్ ప్రసాద్ భట్నాగర్ కు రాష్ట్ర పీఆర్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ పర్యటనకు వచ్చిన రాహుల్‌ప్రసాద్‌ను సోమవారం కలుసుకున్న మంత్రి రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు వివరించారు. స్థానిక సంస్థల బలోపేతమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కొత్త పీఆర్ చట్టాన్ని అమలులోకి తెచ్చిందని తెలిపారు. పరిపాలన వికేంద్రీకరణ లక్ష్యంగా తెచ్చిన ఈ కొత్త చట్టం ప్రకారం 4 వేలకు పైగా కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయని తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు నిర్మించాల్సి ఉందని... దశలవారీగా రాష్ట్రానికి ఎక్కువ జీపీ భవనాల నిర్మాణం అవసరం ఉందని చెప్పారు. హరిత హారం, మిషన్ భగీరథ వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని, దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న వీటికి కేంద్రం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ ఒక వినతిపత్రాన్ని భట్నాగర్‌కు అందజేశారు.

## 'ఎంబీబీఎస్' రిజర్వేషన్ల అమల్లో అన్యాయం: కృష్ణయ్య

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ రిజర్వేషన్ల అమలులో అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం ఆరోపించింది. ఈ మేరకు సోమవారం సచివాలయంలో ఆర్.కృష్ణయ్య నేతృత్వంలోని బృందం వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని కలసి వినతిప్రతం సమర్పించింది. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. జీవో 550 ప్రకారం అడ్మిషన్లు జరిగి ఉంటే పొరపాట్లు జరిగి ఉండేవి కావన్నారు. గత 19 ఏళ్లుగా అమలవుతున్న జీవోను మార్చేటప్పుడు నిపుణుల సలహాలు, సూచనలు తీసుకుంటే అందరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. తక్షణమే దీనిపై జోక్యం చేసుకోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని కోరారు. మూడో కౌన్సెలింగ్ వెంటనే జరిపి నష్టపోయిన సీట్లను ఆయా వర్గాలకు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# 73 వేల టన్నుల బియ్యం మిల్లర్ల వద్దే

- సీఎంఆర్ కింద ధాన్యాన్ని తీసుకుని కాలం వెళ్లదీస్తున్న వైనం
- మిల్లర్ల నుంచి రావాల్సిన బియ్యం విలువ రూ.117 కోట్లు
- పౌర సరఫరాల శాఖ ఒత్తిడితో ముందుకొచ్చిన 32 మంది మిల్లర్లు
- నాలుగు విడతల్లో బకాయిలు చెల్లించేందుకు సుముఖత..

సాక్షి, హైదరాబాద్:

రాష్ట్రంలో రైతుల నుంచి సేకరించి ఇచ్చిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికి ఇవ్వడంలో మిల్లర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు. కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద ఇవ్వాల్సిన బియ్యాన్ని అప్పగించకుండా కుంటి సాకులతో కాలం వెల్లదీస్తున్నారు. ఏకంగా 2010–11 నుంచి 2014–15 వరకు 89 మంది మిల్లర్ల నుంచి రూ.117.22 కోట్ల విలువ చేసే 73 వేల మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి రావాల్సి ఉంది. దీనిపై ఎన్నిమార్లు నిలదీసిన మిల్లర్ల నుంచి నేడో రేపో అని సమాధానమే వస్తోంది. దీనిపై దృష్టి పెట్టిన పౌర సరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ సోమవారం మిల్లర్లతో చర్చించి కొద్దిమేర సఫలమయ్యారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యాన్ని పంపిణీ చేసేందుకు పౌరసరఫరాల శాఖ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి మిల్లర్లకు ఇస్తుంది. మిల్లర్లు వాటిని మిల్లింగ్ చేసి ఒక క్వింటాల్ ధాన్యం తీసుకుంటే 68 కిలోల బాయిల్డ్ రైస్ లేదా రా రైస్ 67 కిలోల చొప్పున ప్రభుత్వానికి అప్పగించాలి. అయితే కొందరు మిల్లర్లు ఈ బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వడం లేదు. దీనిపై పౌరసరఫరాల శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందు కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా ఎగవేతదారుల జాబితాను తయారు చేసింది.

### 32 మంది మిల్లర్లు ఓకే..

ఈ విషయమై సోమవారం పౌరసరఫరాల భవన్‌లో సీఎంఆర్ ఎగవేసిన మిల్లర్లతో కమిషనర్ అకున్ సబర్వాల్ సమావేశమయ్యారు. ఒక్కొక్క మిల్లర్‌తో కమిషనర్ నేరుగా మాట్లాడారు. దీంతో దాదాపు 32 మంది మిల్లర్లు బకాయిలు చెల్లించడానికి ముందుకొచ్చారు. ఈ 32 మంది మిల్లర్ల బకాయి రూ. 44.55 కోట్లు ఉంది. మొదటి విడత 25 శాతం కింద రూ.11.14 కోట్లు చెల్లించడానికి మిల్లర్లు సంసిద్ధత వ్యక్తం చేశారు. మిల్లర్లకు సీఎంఆర్ కింద ప్రభుత్వానికి ఇవ్వవలసిన బియ్యాన్ని అప్పగించాలని, ఇందుకోసం వారికి కొంత వెసులుబాటును కూడా కల్పిస్తున్నామని కమిషనర్ అన్నారు. 25 శాతం చొప్పున నాలుగు విడతలుగా బకాయిలు చెల్లించడానికి అవకాశమిచ్చారు. మొదటి విడతలో 25 శాతం సీఎంఆర్ బియ్యాన్ని అప్పగించి, మిగిలిన 75 శాతానికి బ్యాంక్ గ్యారెంటీ ఇస్తే వచ్చే ఖరీఫ్‌లో మిల్లింగ్ సామర్థ్యాన్ని బట్టి ధాన్యాన్ని కేటాయించడం జరుగుతుందన్నారు.

### అవకాశాన్ని వినియోగించుకోండి: కమిషనర్ అకున్ సబర్వాల్

బియ్యానికి బదులు మార్కెట్ ధర ప్రకారం నగదు చెల్లించే అంశాన్ని పరిశీలించాలని, అలాగే వన్‌టైం సెటిల్‌మెంట్‌కు అవకాశం ఇవ్వాలని, బ్యాంక్ గ్యారెంటీ కాకుండా కొలాట్రల్ ష్యూరిటీని పరిగణనలోకి తీసుకోవాలని ఈ సందర్భంగా కొంతమంది మిల్లర్లు కోరారు. దీనిపై పౌరసరఫరాల శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డితో చర్చించి సాధ్యాసాధ్యాలను బట్టి నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ అకున్ సబర్వాల్ తెలిపారు. పాత బకాయిలపై ప్రభుత్వం ఇచ్చిన మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీఎంఆర్ బకాయిల వల్ల ప్రభుత్వంపై అధిక వడ్డీ భారం పడుతోందని, బకాయిల వసూళ్లపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. 2019–20 ఖరీఫ్ సీజన్‌లో మొత్తం సీఎంఆర్ బకాయిలను మిల్లర్లు ఎవరైనా తిరిగి అప్పగించిన పక్షంలో వారికే ప్రస్తుత ధాన్యాన్ని ఇస్తామన్నారు. 2019–20 రబీకి ముందు మరో 25 శాతం సీఎంఆర్‌తో పాటు ఆ సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్‌ను కూడా అప్పగించాలని, 2020–21 ఖరీఫ్ సీజన్‌లో కూడా ఈ పద్ధతి కొనసాగుతుందని ఆయన తెలిపారు.





# టార్గెట్ జాబ్..

- ఉన్నత విద్యా బోధనలో సమూల మార్పులకు యూజీసీ చర్యలు
- లెర్నింగ్ ఔట్ కమ్ బేస్డ్ కరిక్యులమ్ ఫ్రేమ్ వర్క్ రూపకల్పన
- 16లోగా మెయిల్ ద్వారా సలహాలు, సూచనలివ్వాలని కోరిన యూజీసీ

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగం, ఉపాధి అవకాశాలే లక్ష్యంగా ఉన్నత విద్యలో మార్పులకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) శ్రీకారం చుట్టింది. దీని కోసం ఓ ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. లెర్నింగ్ ఔట్‌కమ్ బేస్డ్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్‌ను (ఎల్‌వోసీఎఫ్) రూపొందించింది. అందులో డిగ్రీ, పీజీ స్థాయిల్లో హిందీ, స్టాటిస్టిక్స్, ఎలక్ట్రానిక్ సైన్స్, బయోకెమిస్ట్రీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, మాస్ కమ్యూనికేషన్ తదితర సబ్జెక్టులకు సంబంధించి ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించింది. గతేడాదే దీనిని అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టినా ఆచరణకు నోచుకోలేదు. ఈసారి అమలుకు పక్కా చర్యలకు సిద్ధమవుతోంది. దీని కోసం విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు, మేధావుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలని యూజీసీ నిర్ణయించింది. తమ వెబ్‌సైట్‌లో ఎల్‌వోసీఎఫ్ డ్రాఫ్టును అందుబాటులో ఉంచింది. ఈనెల 16లోగా మెయిల్ ద్వారా(locfugc@ gmail.com) సలహాలు అందజేయాలని కోరింది.

### మార్పు ఇలా..

కాలేజీల్లో చేయిస్తున్న ప్రాక్టికల్స్‌కు, బోధిస్తున్న పాఠ్యాంశాలకు పొంతన ఉండటం లేదని యూజీసీ తేల్చింది. పది ప్రధాన అంశాల్లో మార్పులు అవసరమని యూజీసీ నిర్ణయించింది. విజ్ఞానం పొందడం, అర్థం చేసుకోవడం, నైపుణ్యాలను మెరుగు పర్చడం, ప్రవర్తన వంటి ప్రధాన అంశాలతో విద్యా బోధనలో మార్పును తీసుకురావాలని నిర్ణయించింది. కమ్యూనికేషన్ స్కిల్స్, రైటింగ్ స్కిల్స్, రీడింగ్, అనాలిసిస్, క్రిటికల్ థింకింగ్, సైంటిఫిక్ అప్రోచ్, యాటిట్యూడ్, వ్యాల్యూస్, ఎథిక్స్ విద్యార్థుల్లో పెంపొందేలా బోధనలో మార్పులను తేవాలని నిర్ణయించింది.

### వీటికి ప్రాధాన్యం..

ప్రస్తుతం క్రిటికల్ థింకింగ్, అనాలిటికల్ థింకింగ్, ప్రాబ్లం సాల్వింగ్ ప్రధానమని యూజీసీ గుర్తించింది. ఏదేని ఓ సమస్యను వివిధ రకాలుగా ఎలా సాల్వ్ చేయొచ్చో విద్యార్థులకు నేర్పించే బోధన పద్ధతులు అవసరమని పేర్కొంది. విశ్లేషణాత్మకంగా వివరించడం, తార్కిక ఆలోచన, శాస్త్రీయ దృక్కోణాన్ని పెంపొందించేలా విద్యా బోధన ఉండాలని చెప్పింది. పరిశోధనలకు ప్రాధాన్యమిచ్చేలా విద్య, బోధన సాగాలని తెలిపింది. ప్రతి విద్యార్థిలో కోఆపరేషన్, టీం వర్క్, లీడర్‌షిప్ క్వాలిటీస్‌ను పెంపొందించేలా సిలబస్‌ను మార్చాలని స్పష్టం చేసింది.



### యూజీసీ సూచనలు..

- డిజిటల్ లిటరేచర్‌ను ఎలా ఉపయోగించుకోవాలన్న దానిపైనా అవగాహన కల్పించేలా బోధన ఉండాలి.
- సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించుకొని బోధన ఎలా కొనసాగించాలన్న అంశంలోనూ మార్పులు అవసరం.
- సెల్ఫ్ డైరెక్టివ్ లెర్నింగ్‌కు ప్రాధాన్యం పెంచాలి. మోరల్, ఎథికల్ వ్యాల్యూస్‌తో విద్యను కొనసాగించడం, నాలెడ్జ్ అప్‌డేట్ చేసుకోవడం, థియరీని ప్రాక్టికల్స్‌కు అనుసంధానించడం వంటివి చేయాలి.
- ఫీల్డ్ బేస్డ్ లెర్నింగ్‌కు ప్రాధాన్యం, ఇంటర్న్‌షిప్, ఫీల్డ్ విజిట్, ఇండస్ట్రీ విజిట్ వంటి వాటిని పెంచాలి. వీటిపై పరీక్షలు, క్లోజ్డ్ అండ్ ఓపెన్ బుక్స్ ఎగ్జామినేషన్ విధానం తీసుకురావాలి.

## 23లోగా తుది జాబితా ప్రకటించండి

### పోలింగ్ కేంద్రాలపై పలు మున్సిపాలిటీలకు ఎస్‌ఈసీ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కోర్టు కేసుల కారణంగా పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రచురించని మున్సిపాలిటీలు ఈ నెల 23లోగా ఆ జాబితాలు ప్రకటించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్‌ఈసీ) ఆదేశించింది. జాబితాల ప్రచురణకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎస్‌ఈసీ కార్యదర్శి ఎం.అశోక్‌కుమార్ సోమవారం విడుదల చేశారు. హైకోర్టులో కేసులు దాఖలైన నేపథ్యంలో కొన్ని మున్సిపాలిటీలు పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాలు ప్రచురించకపోవడం, కొన్ని మున్సిపాలిటీలు ముసాయిదాలు ప్రకటించినా పార్టీలతో భేటీలు నిర్వహించకపోవడంతో తుది జాబితాలు ప్రచురించకపోవడం, మరికొన్ని మున్సిపాలిటీలు మిగతా ప్రక్రియ పూర్తిచేసినా తుది జాబితాను ప్రకటించకపోవడం వంటివి చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో పోలింగ్ కేంద్రాలు ప్రచురించని మున్సిపాలిటీల కోసం విడిగా షెడ్యూల్‌ను జారీ చేయాలన్నా మున్సిపల్ పరిపాలన డైరెక్టర్ విజ్ఞప్తిపై స్పందిస్తూ ఎస్‌ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది.

**షెడ్యూల్ వివరాలు..**

- 9న సంబంధిత మున్సిపల్ కమిషనర్లు పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను తయారు చేయాలి.
- 13న పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురణ
- 16న సాయంత్రం 5 వరకు అభ్యంతరాలు, సలహాల స్వీకారం. అదేరోజు 3 గంటలకు రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం
- 19న అభ్యంతరాలు, క్లెయిమ్స్ పరిష్కారం
- 20న కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు పోలింగ్ కేంద్రాల తుది జాబితా సమర్పణ
- 21న మున్సిపాలిటీల పోలింగ్ కేంద్రాల జాబితాలకు జిల్లా ఎన్నికల అధికారుల ఆమోదం
- 23న పోలింగ్ కేంద్రాల జాబితాల తుది ప్రచురణ.

## ఇసుక ధరలకు రెక్కలు

▶ మొదటి పేజీ తరువాయి

పలికిన విషయాన్ని వినియోగదారులు గుర్తుచేస్తున్నారు.

**స్టాక్ పాయింట్ల వద్ద నిండుకుంటున్న నిల్వలు...**

వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని టీఎస్ఎండీసీ స్టాక్ పాయింట్ల వద్ద కనీసం కోటి క్యూబిక్ మీటర్ల ఇసుకను నిల్వ చేసేలా ప్రణాళిక సిద్ధం చేసింది. హైదరాబాద్ పరిధిలో ఉన్న ఇసుక డిమాండ్ నేపథ్యంలో అబ్దుల్లాపూర్‌మెట్, భౌరంపేట, వట్టినాగులపల్లిలో సబ్ స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుతం స్టాక్ పాయింట్ల వద్ద కేవలం రెండు లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలే ఉన్నాయి. అయితే మరో 2, 3 రోజుల్లో రీచ్‌ల సంఖ్య పెరగడంతోపాటు ములుగు, భద్రాచలం జిల్లాల్లో కొత్త రీచ్‌లు అందుబాటులోకి వచ్చే అవకాశముందని టీఎస్ఎండీసీ వర్గాలు వెల్లడించాయి. ఇసుక రీచ్‌లు అందుబాటులోకి వచ్చాకే ఆన్‌లైన్ విధానంలో ఇసుక విక్రయాలు తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

# ‘370’ వల్లే కశ్మీర్‌లో పేదరికం

## రాజ్యసభలో చర్చ సందర్భంగా అమిత్ షా వెల్లడి

- సాధారణ పరిస్థితులు నెలకొనడానికి ఆ అధికరణమే అడ్డంకి
- కశ్మీర్ భూతల స్వర్గం, అది అలాగే ఉంటుంది
- పాలస్తీనాలాగా మారనివ్వబోమని స్పష్టీకరణ
- జమ్మూ కశ్మీర్ అస్తిత్వాన్ని చెరిపేస్తున్నారు: గులాం నబీ ఆజాద్
- అమిత్ షా వచ్చినప్పుడు అణుబాంబు పేలినట్లుగా అనిపించదని వ్యాఖ్య
- భారత చరిత్రలో ఇది దుర్దినమన్న విపక్షాలు
- బిల్లులు, తీర్మానాన్ని ఆమోదించిన రాజ్యసభ

న్యూఢిల్లీ

జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న రాజ్యాంగంలోని 370వ అధికరణాన్ని రద్దు చేసే తీర్మానాన్ని, అలాగే జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లును రాజ్యసభ సోమవారం తీవ్ర గందరగోళం నడుమ ఆమోదించింది. 370వ అధికరణాన్ని రద్దు చేయడం కోసం రాష్ట్రపతి సంతకంతో నోటిఫికేషన్ విడుదలైన అనంతరం హోం మంత్రి అమిత్ షా తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టారు. అలాగే జమ్మూ కశ్మీర్‌ను ఇకపై అసెంబ్లీతో కూడిన కేంద్ర పాలిత ప్రాంతంగా మారుస్తూ, ఆ రాష్ట్రంలోని లదాఖ్ ప్రాంతాన్ని కూడా విడదీసి, పూర్తిగా మరో కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చే ‘జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు–2019’ను, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను జమ్మూకశ్మీర్‌లో కూడా అమలు చేసే మరో బిల్లును కూడా అమిత్ షా సభలో ప్రవేశపెట్టారు. తీర్మానం, రిజర్వేషన్ల బిల్లును మూజువాణి ఓటుతో రాజ్యసభ ఆమోదించింది. పునర్వ్యవస్థీకరణ బిల్లుపై మాత్రం ఓటింగ్ నిర్వహించగా, అనుకూలంగా 125 ఓట్లు, వ్యతిరేకంగా 61 ఓట్లు వచ్చాయి. దీంతో బిల్లు ఆమోదం పొందింది. ఈ వ్యవహారమంతా సాగుతున్న సమయంలో సభలో విపక్ష సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. జమ్మూ కశ్మీర్‌పై అమిత్ షా ప్రకటన చేసిన వెంటనే కాంగ్రెస్, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) తదితర పార్టీల సభ్యులు నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. అక్కడే కూర్చొని తీవ్ర నిరసన తెలిపారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ) ఎంపీ ఒకరు తన బట్టలు చించుకుని నిరసన తెలిపారు. మరో పీడీపీ ఎంపీతో కలిసి ఆయన రాజ్యాంగం ప్రతులను చించడంతో వారిద్దరినీ మార్షల్స్ బలవంతంగా బయటకు లాక్కెళ్లారు. ఎన్డీయేలో భాగమైన జేడీ(యూ) మినహా, మిగిలిన అన్ని ఎన్డీయే పార్టీలూ బిల్లుకు మద్దతు తెలిపాయి. తటస్థ పార్టీలైన వైఎస్సార్‌సీపీ, అన్నా డీఎంకే, బీజేడీ, బీఎస్పీ, ఆప్ వంటి ప్రాంతీయ పార్టీలు కూడా మద్దతు తెలపగా, కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఎన్సీపీ, ఆర్జేడీ, వామపక్షాలు తదితర పార్టీలు వ్యతిరేకించాయి. ఎన్డీయేలోనే భాగమైన జేడీ(యూ) మాత్రం సభ నుంచి వాకౌట్ చేసింది. ముందుగా చెప్పకుండా, బిల్లు ప్రతులను సభ్యులకు అందజేయకుండానే బిల్లును ఎలా ప్రవేశపెడతారని విపక్ష సభ్యులు ప్రశ్నించగా, రాజ్యసభ చైర్మన్ వెంకయ్య సమాధానమిస్తూ, ఈ అంశం అత్యవసర, దేశ ప్రయోజనాలకు సంబంధించినదనీ, తనకున్న విశేషాధికారాలను ఉపయోగించి ముందస్తు నోటీసు లేకుండానే, బిల్లును సభ్యులకు అందజేయకుండానే సభలో ప్రవేశపెట్టేందుకు తాను ప్రభుత్వానికి అనుమతినిచ్చానని వెంకయ్య తెలిపారు. బిల్లు ప్రతులను సభ్యులకు అందజేసిన రోజే బిల్లును ఆమోదింపజేసుకోవడాన్ని విపక్ష సభ్యులు ప్రశ్నించగా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ చారిత్రక తప్పిదాన్ని తమ ప్రభుత్వం సరిచేస్తోందని చెప్పారు. బిల్లు ప్రతులను సభ్యులకు అందజేసిన రోజే వాటిని ప్రభుత్వాలు ఆమోదింపజేసుకున్న ఘటనలు గతంలో 38 సార్లు జరిగాయని న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ చెప్పారు.


బిల్లుపై చర్చ సందర్భంగా రాజ్యసభలో మాట్లాడుతున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

తమ ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకమని అమిత్ షా తెలిపారు. తీర్మానాన్ని, బిల్లును సభలో అమిత్ షా ప్రవేశపెట్టగానే విపక్ష సభ్యులు తొలుత నినాదాలు చేశారు. అనంతరం వెల్‌లోకి వెళ్లి అక్కడే కూర్చొని నిరసన తెలిపారు. వారిలో ఆజాద్‌తోపాటు కాంగ్రెస్ ఉప నేత ఆనంద్ శర్మ, తృణమూల్ ఎంపీ డెరెక్ ఒబ్రయిన్ తదితరులున్నారు. 370వ అధికరణం కారణంగా ఇన్నాళ్లూ జమ్మూకశ్మీర్ రాష్ట్రం పూర్తిగా భారత్‌లో విలీనం కాలేకపోయిందని అమిత్ షా పేర్కొన్నారు. ‘370వ అధికరణం ఇక ఎంతమాత్రమూ జమ్మూ కశ్మీర్‌కు వర్తించదు. పార్లమెంటు సిఫారసుల ఆధారంగా ఆర్టికల్ 370ని రద్దు చేస్తున్నట్లు రాష్ట్రపతి ప్రకటించారు. 2019 ఆగస్టు 5 నుంచి ఆర్టికల్ 370లోని అన్ని నిబంధనలూ రద్దయ్యాయి. ఇక నుంచీ భారత రాజ్యాంగంలోని అన్ని నిబంధనలూ జమ్మూ కశ్మీర్‌లో కూడా అమలవుతాయి’అని తెలిపారు. ఆర్టికల్ 370ని రద్దు చేసే అధికారిక నోటిఫికేషన్‌పై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఇప్పటికే సంతకం చేశారని అమిత్ షా సభకు చెప్పారు. జమ్మూ కశ్మీర్‌లో ప్రస్తుతం శాసనసభ రద్దయినందున, ఆ అసెంబ్లీ అధికారాలన్నీ పార్లమెంటు ఉభయ సభల వద్ద ఉన్నాయని షా చెప్పారు. ‘రాష్ట్రపతి ఉత్తర్వులను చర్చించిన అనంతరం పార్లమెంటు ఉభయ సభలు తీర్మానాన్ని ఆమోదించగలవు’అని అన్నారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రతులను సభలోని సభ్యులందరికీ అందజేశారు. 370వ అధికరణాన్ని రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా రద్దు చేయడం లేదా సవరించవచ్చని ఆయన నిబంధనలను చదివి వినిపించారు. ఎస్పీ ఎంపీ రాంగోపాల్ యాదవ్ మాట్లాడుతూ రాజ్యాంగ సవరణ లేకుండానే రాజ్యాంగాన్ని సవరించవచ్చా అని ప్రశ్నించగా, అమిత్ షా సమాధానమిస్తూ, ‘1952, 1962ల్లో కాంగ్రెస్ వెళ్లిన దారిలోనే ఇప్పుడు మేం వెళ్తున్నాం. అప్పుడు కాంగ్రెస్ రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారానే 370వ అధికరణాన్ని వారు సవరించారు’అని చెప్పారు. విపక్షాల వాదనలో బలం లేదనీ, రాజకీయాల కోసమే వాళ్లు దీనిని వ్యతిరేకిస్తూ సభలో గందరగోళం సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు.

### బట్టలు చించుకున్న అహ్మద్ మిర్



అమిత్ షా ప్రకటన అనంతరం పీడీపీకి చెందిన ఎంపీ ఫయాజ్ అహ్మద్ మిర్ తన బట్టలు చించుకుని నిరసన తెలిపారు. రాజ్యాంగ ప్రతులను చించేశారు. దీంతో ఆయనతోపాటు మరో పీడీపీ ఎంపీని బయటకు పంపాల్సిందిగా వెంకయ్యనాయుడు మార్షల్స్‌ను ఆదేశించారు. ‘భారత రాజ్యాంగం అత్యున్నతం. రాజ్యాంగాన్ని ఎవరూ చించజాలరు. సభలోనే రాజ్యాంగాన్ని చించడం, ఇండియాకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం కుదరదు. నేను మీపై చర్య తీసుకుంటాను’అని వెంకయ్య అన్నారు. మార్షల్స్ వీరిని చేరుకోబోతుండగానే, బీజేపీ ఎంపీ విజయ్ గోయెల్ వారితో గొడవకు దిగబోయారు. అయితే వెనుక నుంచి ఆయనను లాగడంతో ఆ ఇద్దరు ఎంపీలను ముట్టుకోలేకపోయారు.

### లేచి స్వాగతం పలికిన బీజేపీ ఎంపీలు..

సభలోకి అమిత్ షా అడుగు పెడుతుండగా, బీజేపీ ఎంపీలంతా లేచి ఆయనకు స్వాగతం పలికారు.

### ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకుంటుంది: వైగో

తమిళనాడుకు చెందిన వైగో మాట్లాడుతూ ఆత్యయిక స్థితి రోజులు మళ్లీ వచ్చాయనీ, ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని హత్య చేస్తోందని ఆరోపించారు. భవిష్యత్తులో కశ్మీర్ కూడా కొసోవో, దక్షిణ సూడాన్, తూర్పు తైమూర్‌లా మారుతుందని హెచ్చరించారు. ప్రపంచంలో భారత్‌కు కూడా శత్రువులు ఉన్నారనీ, ఈ అంశంపై ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కమిషన్ జోక్యం చేసుకుంటుందని వైగో అన్నారు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన డెరెక్ ఒబ్రెయిన్ మాట్లాడుతూ ‘ఈ సోమవారం ఓ దుర్దినం. దేశ రాజ్యాంగానికి, భారత అభిప్రాయానికి, రాజ్యసభకు ఇది చీకటి రోజు’అని అన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో రాబోయే ఐదేళ్లలో పాలస్తీనాలాగ కశ్మీర్ మారుతుందని ఆర్జేడీ ఎంపీ మనోజ్‌కుమార్ ఝా విమర్శించారు. డీఎంకేకి చెందిన తిరుచ్చి శివ మాట్లాడుతూ ఇలాంటి విషయాల మీద నిర్ణయం తీసుకునే అధికారం రాష్ట్ర అసెంబ్లీకే ఉంటుందనీ, కేంద్రం చేస్తున్నది చెల్లదని అన్నారు. సీపీఎం సభ్యుడు టీకే రంగరాజన్ మాట్లాడుతూ ఈ అంశంపై ప్రభుత్వం జమ్మూ కశ్మీర్ ప్రజలను సంప్రదించలేదనీ, ఆరెస్సెస్–బీజేపీలు కలిసి దేశ రాజ్యాంగాన్ని, ఐక్యతను చెడగొడుతున్నాయని అన్నారు.

## 72 గంటల్లోనే..!

జమ్మూకశ్మీర్‌లో రాజకీయ పరిణామాలు చకచకా మారిపోవడానికి కేవలం 72 గంటలు మాత్రమే పట్టింది. ఆగస్టు 2న ఉగ్రముప్పును సాకుగా చూపుతూ అమర్‌నాథ్ యాత్రను నిలిపివేసిన కేంద్రం..దాదాపు 35వేలమంది అదనపు బలగాలను కశ్మీర్‌కు పంపింది. దీంతో అందరికీ కశ్మీర్‌లో ఏదో జరగబోతోంది? అన్న అనుమానం వచ్చింది. ఈ విషయంలో కేంద్రం మౌనముద్ర దాల్చడంతో ఆర్టికల్ 370, ఆర్టికల్ 35ఏలను రద్దుచేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే ఆదివారం అర్ధరాత్రి దాటాక మాజీ సీఎంలు ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీలను పోలీసులు గృహనిర్బంధంలోకి తీసుకోవడం, రాష్ట్రం పలుచోట్ల 144 సెక్షన్ విధించడంతో కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్ణయమే తీసుకోబోతోందని అందరికీ చూచాయగా అర్థమైపోయింది. ప్రధాని మోదీ నివాసంలో సోమవారం కేబినెట్ భేటీ ముగిశాక రాజ్యసభకు వచ్చిన హోంమంత్రి అమిత్ షా ఆర్టికల్ 370ని రద్దుచేస్తున్నామని ప్రకటించడంతో కశ్మీర్‌లో ఒక్కసారిగా కలకలం చెలరేగగా, దేశంలోని పలుచోట్ల సంబరాలు మిన్నంటాయి. రాజ్యసభ జరుగుతుండగానే రాష్ట్రపతి కోవింద్ గెజిట్ నోటిఫికేషన్ జారీచేయడంతో 72 గంటల్లో ఈ మొత్తం ప్రక్రియ ముగిసింది.



## కల నెరవేరింది!

జమ్మూకశ్మీర్ స్వతంత్ర ప్రతిపత్తి రద్దు ద్వారా పార్టీ సిద్ధాంతకర్త శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయాన్ని బీజేపీ నెరవేర్చింది. ‘ఒకే దేశానికి రెండు రాజ్యాంగాలు ఉండవు. ఇద్దరు ప్రధానులు ఉండరు. రెండు జాతీయ చిహ్నాలు ఉండవు’అంటూ ఆయన 1950లలోనే నెహ్రూ ప్రభుత్వం తీరును తప్పుపట్టారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కశ్మీర్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించడంతో ఆయన్ను 1953 మే 11వ తేదీన అరెస్టు చేశారు. అప్పట్లో ఆ కశ్మీర్‌లోకి ప్రవేశించాలంటే భారతీయులు గుర్తింపుకార్డు చూపించాల్సి ఉండేది. శ్రీనగర్‌లో జైల్లోనే ఆయన అదే ఏడాది జూన్ 23వ తేదీన అనుమానాస్పద రీతితో కన్నుమూశారు. కలకత్తా వర్సిటీకి పిన్నవయస్సులోనే వీసీ అయిన డాక్టర్ ముఖర్జీ 1929లో భారత జాతీయ కాంగ్రెస్ తరఫున బెంగాల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు ఎన్నికయ్యారు. నెహ్రూ తొలి ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. అనంతరం ఆయన కాంగ్రెస్‌ను వదిలి, భారతీయ జనసంఘ్‌ను 1951లో స్థాపించారు. ఇదే బీజేపీకి మాతృసంస్థ. 1952 జూన్ 26వ తేదీన పార్లమెంట్‌లో ప్రసంగించిన ముఖర్జీ.. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించడంపై నెహ్రూను గట్టిగా నిలదీశారు. ఇలాంటి విధానాలు దేశాన్ని ముక్కలుగా చేస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖర్జీ మరణాన్ని బీజేపీ మరిచిపోలేకపోయింది. 2004లో మాజీ ప్రధాని వాజ్‌పేయి ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.. శ్యామా ప్రసాద్ ముఖర్జీ కశ్మీర్‌లోకి ప్రవేశించటానికి ముందుగా పంజాబ్‌లోనే పోలీసులు అరెస్టు చేశారని భావించాం. కానీ, అలా జరగలేదు. కశ్మీర్ ప్రభుత్వం, నెహ్రూ కుట్రపన్ని కశ్మీర్‌లోకి అనుమతించిన ముఖర్జీని, తిరిగి వెళ్లకుండా చేశారు. జమ్మూకశ్మీర్‌లోని షేక్ అబ్దుల్లా ప్రభుత్వం ఈ కుట్రను అమలు చేసింది’అని పేర్కొనడం గమనార్హం.

## కొసావోగా మారనివ్వం: అమిత్ షా

బిల్లుపై చర్చ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ ఆర్టికల్ 370, ఆర్టికల్ 35–ఏ కారణంగానే జమ్మూ కశ్మీర్‌లో పేదరికం, ఉగ్రవాదం, అవినీతి ఉన్నాయనీ, అభివృద్ధి జరగలేదని అన్నారు. కశ్మీర్‌పై ఆందోళన వద్దనీ, ఏ పాలస్తీనా లాగానో, కొసావో లాగానో కశ్మీర్‌ను తాము మారనివ్వమని ఆయన చెప్పారు. ‘కశ్మీర్ అంటే భూతల స్వర్గం. అది అలాగే ఉంటుంది. ఇందులో ఏ భయమూ అక్కర్లేదు’అని పేర్కొన్నారు. సరైన సమయం వచ్చినప్పుడు, సాధారణ పరిస్థితులు నెలకొన్నప్పుడు జమ్మూకశ్మీర్‌కు మళ్లీ తిరిగి పూర్తి స్థాయి రాష్ట్ర హోదాను కూడా ఇస్తారని అమిత్ షా స్పష్టం చేశారు. ‘రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనడానికి ఆర్టికల్ 370నే అతిపెద్ద అడ్డంకి. జమ్మూ కశ్మీర్‌ను దేశంలోని అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతంగా మార్చేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఆర్టికల్ 370, 35–ఏ ఉన్నంత కాలం అక్కడి నుంచి ఉగ్రవాదాన్ని చెరిపివేయడం సాధ్యపడదు. భారత చట్టాలు అక్కడ అమలు కాకుండా ఈ రెండు అధికరణాలు అడ్డుపడుతున్నాయి. అభివృద్ధిని అడ్డుకుని, అవినీతిని విశృంఖలం చేస్తున్నాయి. గత 70 ఏళ్లలో కశ్మీర్‌లో కేవలం మూడు కుటుంబాలే పాలన సాగించి, ప్రజాస్వామ్యాన్ని నీరుగార్చి, అవినీతికి ఊతమిచ్చాయి. జమ్మూ కశ్మీర్‌ను ఆర్టికల్ 370యే నాశనం చేసింది. ఆ రాష్ట్రంలో పేదరికానికి ఆ అధికరణమే కారణం. స్థిరాస్తి వ్యాపారంలో భూముల ధరలు మిగతా ప్రాంతాలతో పోలిస్తే కశ్మీర్‌లో చాలా తక్కువగా ఉన్నాయి. కానీ సిమెంటు బస్తా మాత్రం మిగతా ప్రాంతాల కన్నా అక్కడే రూ. 100 ఎక్కువగా ఉంది. బయటి వాళ్లు స్థలాలు కొనకూడదన్న నిబంధన కారణంగా ఆ రాష్ట్రంలో పర్యాటకం కూడా అభివృద్ధి చెందలేదు. ఆర్టికల్ 370 కారణంగా అక్కడ ఏ పరిశ్రమనూ పెట్టలేము. ఏ ప్రైవేటు ఆసుపత్రీ ఆ రాష్ట్రానికి వెళ్లదు. విద్యలోనూ ఇంతే. విద్యా హక్కు చట్టమే అక్కడ అమలు కావడం లేదు. విద్య ఫలాన్ని కశ్మీరీ బాలలు ఎందుకు పొందకూడదు? జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదం కారణంగా దాదాపు 42 వేల మంది పౌరులు ఇప్పటివరకు చనిపోయారు. ఈ చావులకు ఎవరి విధానం కారణం? ఇప్పుడు.. ఆర్టికల్ 370 రద్దయిన తర్వాత కశ్మీర్ నిజంగా భారత్‌లో అంతర్భాగం అవుతుంది’అని అమిత్ షా తన ప్రసంగంలో పేర్కొన్నారు.

## రాష్ట్రం తల నరికారు: ఆజాద్

రాజ్యసభలో జరిగిన ఘటనలపై సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గులాం నబీ ఆజాద్ స్పందిస్తూ, ‘భారత దేశానికి కిరీటంగా భావించే రాష్ట్రం తలను నరికేశారు. కశ్మీరీ అస్తిత్వాన్ని చెరిపేశారు. ఇలా జరుగుతుందని నా రాజకీయ జీవితంలో నేను ఏనాడూ ఊహించింది కూడా లేదు’అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు సభలో బిల్లు ప్రవేశపెట్టే సమయంలో ఆజాద్ మాట్లాడుతూ కశ్మీర్ లోయ మొత్తం కర్ఫ్యూ విధించారనీ, ముగ్గురు మాజీ సీఎంలను గృహ నిర్బంధంలో ఉంచారన్నారు. కశ్మీర్‌లో ప్రస్తుత పరిస్థితిపై తొలుత చర్చించాలని ఆజాద్ పట్టుబట్టారు. అయినా తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు అమిత్ షాకు వెంకయ్య అనుమతినిచ్చారు. దీంతో ‘రిజర్వేషన్ బిల్లుకు మేం వ్యతిరేకం కాదు. కానీ కశ్మీర్‌లో పరిస్థితిపై ముందుగా చర్చించాలి’అని ఆజాద్ డిమాండ్ చేశారు. ‘భారత్‌లో జమ్మూకశ్మీర్ విలీనం అవ్వడంలో 370వ అధికరణం పాత్ర కీలకం. గత 70 ఏళ్లలో అక్కడ లక్షలాది మంది భద్రతా సిబ్బంది, పౌరులు మరణించారు. ఇద్దరు ఎంపీలు రాజ్యాంగాన్ని చించేయడాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. కానీ వారు మా పార్టీ మనుషులు కాదు. మేం రాజ్యాంగానికి కట్టుబడి ఉంటాం. కానీ ఇప్పుడు బీజేపీ ప్రజాస్వామ్యాన్ని చంపేసింది’అని మండిపడ్డారు. ‘జమ్మూకశ్మీర్‌ను తేలిగ్గా తీసుకున్నారు. ఇది సిగ్గు మాలిన చర్య. లెఫ్టినెంట్ గవర్నర్ పాలనలోకి జమ్మూకశ్మీర్‌ను తీసుకొచ్చి విలువలేకుండా చేశారు. ఈ బిల్లు పాసైన రోజు భారత చరిత్రలో దుర్దినం. భారత చిత్రపటం నుంచి జమ్మూకశ్మీర్‌ను తొలగిస్తున్నారు. ఈ రోజు హోం మంత్రి వచ్చినప్పుడు అణుబాంబు పేలితే ఉండే వాతావరణాన్ని సభలో చూపించారు. నవభారతాన్ని నిర్మించేందుకు మీరు పాత భారతాన్ని ముక్కలుగా విడగొట్టి నాశనం చేస్తారా? ఓట్లకోసం దేశ చరిత్ర, సంస్కృతి, ఐక్యతతో ప్రభుత్వం ఆటలాడకూడదు. రాష్ట్ర అభీష్టానికి విరుద్ధంగా ఆర్టికల్ 370, 35(ఏ)లను రద్దు చేస్తున్నారు. జమ్మూకశ్మీర్ ప్రజలు భద్రతా దళాలకు మద్దతుగా ఉన్నారు. పాకిస్తాన్ మతం, వాళ్ల మతం ఒక్కటే అయినా వారు పాక్‌ను ఎంచుకోలేదు. కానీ మీరిప్పుడు కశ్మీర్ దేశం నుంచి విడిపోయేందుకు పునాదులు వేస్తున్నారు. విలీనం చట్టాల ద్వారా జరగదు. ప్రజల మనసుల ద్వారా జరుగుతుంది. గుజరాత్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చేందుకు మీరు బిల్లును తీసుకురాగలరా? విషయాలను ప్రభుత్వం తేలిగ్గా తీసుకుంటుంది. అధికారమనే మత్తులో కేంద్రం జమ్మూకశ్మీర్ చరిత్రను తుడిచిపెడుతోంది’అని అన్నారు.



ఆజాద్ వ్యాఖ్యలపై అమిత్ షా ఎదురుదాడి చేస్తూ, 1947 అక్టోబర్ 27న జమ్మూ కశ్మీర్ భారత్‌లో విలీనం అవ్వగా, 1949లో ఆర్టికల్ 370ని ప్రవేశపెట్టారనీ, అలాంటప్పుడు జమ్మూ కశ్మీర్ విలీనంలో 370వ అధికరణం కీలకం ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. ఆర్టికల్ 370 వల్లనే జమ్మూ కశ్మీర్ భారత్‌లో విలీనమైందన్న వాదన తప్పని ఆయన చెప్పారు. ఈ అధికరణాన్ని తాత్కాలిక పద్ధతినే రాజ్యాంగంలో ప్రవేశపెట్టారని.. రాజకీయంగా కృతనిశ్చయం లేక, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం గత ప్రభుత్వాలు దీనిని తొలగించలేదని షా ఆరోపించారు.



## ఇదో ఘోర తప్పిదం

జమ్మూ కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేయడంతో కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు పి.చిదంబరం తీవ్రస్థాయిలో బీజేపీపై మండిపడ్డారు. సోమవారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ.. ఆర్టికల్ 370 రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం ఘోర తప్పిదానికి పాల్పడిందని, ఇదొక చట్టపరంగా తీసుకున్న ప్రమాదకర నిర్ణయమని ఆరోపణలు చేశారు. బీజేపీ ప్రభుత్వం జమ్మూ కశ్మీర్‌ను చిన్నాభిన్నం చేస్తోందని, అక్కడి యువతను హింస వైపు ప్రేరేపించేలా చర్యలు తీసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ‘ఆర్టికల్ 370 రద్దు నిర్ణయం భారత దేశ చరిత్రలో చీకటి రోజుగా మిగిలిపోతుంది. మీరు (బీజేపీ) దీని నుంచి ఓ విజయాన్ని పొందారని అనుకోవచ్చు. వీధుల్లో మోగుతున్న డప్పు చప్పుళ్లతో మీరేదో అన్యాయాన్ని సరిచేశామని భావించవచ్చు. కానీ ఆర్టికల్ 370ని రద్దు చేసి ఈ సభ ఘోర తప్పిదానికి పాల్పడిందని భవిష్యత్ తరాలు తెలుసుకుంటాయి. ఈ ఘోర తప్పిదాన్ని కాంగ్రెస్ పార్టీ గట్టిగా వ్యతిరేకిస్తుంది. మేం ఇక్కడ కూర్చుంటాం. మీరు (రాష్ట్రాలు) చెప్పేది వింటాం. కానీ రాష్ట్రాలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటాం అనేలా బీజేపీ వైఖరి ఉంది. రాష్ట్రాల హక్కులను కాపాడాల్సిన రాజ్యసభలో ఉమ్మడి జాబితాలోని అంశాలపై బిల్లులు పాస్ చేస్తున్నారు. రాష్ట్రాల అధికారాలను బీజేపీ లాక్కుంటోంది. జమ్మూ కశ్మీర్‌లో మెజార్టీ యువత భారత్‌తోనే ఉంది. భారత్ నుంచి రక్షణ కోరుకుంటోంది. అదేసమయంలో కొంతమంది యువత హింసామార్గాన్ని ఎంచుకుంది. వాళ్లంతా భారత్ నుంచి స్వాతంత్ర్యం కోరుకుంటున్నారు’అని ఆందోళన వ్యక్తం చేశారు.

## రెండో అడుగు పీవోకే స్వాధీనమే!

### రాజ్యసభలో సుబ్రమణ్యస్వామి ప్రకటన



న్యూఢిల్లీ: ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన నేపథ్యంలో ఈ అంశంపై రాజ్యసభలో ప్రభుత్వానికి మద్దతు ప్రకటించిన రాజ్యసభ సభ్యుడు సుబ్రమణ్యస్వామి అనంతరం మీడియాతో మాట్లాడారు. ‘ఇక ప్రభుత్వ తదుపరి అడుగు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకోవడమే. ఆ ప్రాంతాన్ని భారత్‌కు తిరిగి అప్పగించమని పాకిస్తాన్ ప్రధానికి చెప్పడం తప్ప, ఇక మధ్యవర్తిత్వం వహించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఏమీ మిగలలేదు, ఆర్టికల్ 370 రద్దుపై సాహసోపేత చర్య తీసుకున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలకు అభినందనలు. పీవీ నరసింహారావు ప్రభుత్వ సమయంలోనూ పీవోకేను భారత్‌లో కలిపేందుకు చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆర్టికల్ 370ని రద్దుచేసేందుకు రాజ్యాంగ సవరణ చేయాలన్న కాంగ్రెస్ వాదన వారి అజ్ఞానాన్ని సూచిస్తోంది. ఈ విషయంలో ప్రభుత్వం చట్టం ప్రకారం నడుచుకుంటోంది. ప్రభుత్వ తీర్మానాన్ని పార్లమెంటుకు తెలియజేయడాన్ని సముచిత చర్యగా భావిస్తున్నాను. ఆర్టికల్370 రద్దు ఇప్పటికే ఆలస్యమైంది. ఆర్టికల్ రద్దు ఏకపక్షమని వాదించే వారికి.. 5లక్షల మంది కాశ్మీరీ పండిట్లను, సిక్కులను తరిమివేసిన రోజు గుర్తులేదా. స్వార్థ ప్రయోజనాల కోసమే ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయి’ అని అన్నారు.

# మీడియా చేతికి ‘టాప్ సీక్రెట్’

**అమిత్ షా చేతిలోని పత్రాలను ఫొటో తీసిన మీడియా**

**రేపు జాతినుద్దేశించి ప్రసంగించనున్న ప్రధాని**

**త్వరలో అఖిలపక్ష భేటీ నిర్వహిస్తారని జాబితాలో ప్రస్తావన**



రహస్య పత్రాలను పార్లమెంట్‌కు తీసుకువస్తున్న అమిత్‌షా

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ ప్రజలకు ప్రత్యేక హక్కులు కల్పిస్తున్న ఆర్టికల్ 370 రద్దు వ్యవహారాన్ని కేంద్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికతో చేపట్టింది. కేంద్ర కేబినెట్ సమావేశం అనంతరం పార్లమెంటు వద్దకు చేరుకున్న అమిత్ షా, మీడియాకు నమస్కారం పెట్టి ముందుకు కదిలారు. ఈ సందర్భంగా షా చేతిలో ‘టాప్ సీక్రెట్’పేరుతో ఉన్న పత్రాలు మీడియా కంట పడ్డాయి. ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలను.. రాజ్యాంగపరమైన, రాజకీయం, శాంతిభద్రతలు అనే మూడు అంశాలుగా వర్గీకరించారు. మొదటి విభాగంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడికి ఈ విషయాన్ని నివేదించినట్లు అమిత్ షా నోట్ చేసుకున్నారు. సోమవారం కేబినెట్ సమావేశం నిర్వహించాక పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టాలనీ, అదే సమయంలో రాష్ట్రపతి కోవింద్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారని అందులో ఉంది. అలాగే రాజ్యసభలో భద్రత విషయంలో ప్రధాని మోదీ సభ చైర్మన్ వెంకయ్యానాయుడితో చర్చిస్తారని ఉంది. ఇక రాజకీయ విభాగంలో అఖిలపక్ష భేటీ నిర్వహణకు పిలుపునివ్వడంతో పాటు ప్రస్తుత పరిస్థితిని ఎన్డీయే కూటమి ఎంపీలకు వివరించాలని అమిత్ షా నిర్ణయించారు. ప్రధాని మోదీ ఆగస్టు 7న జాతినుద్దేశించి ప్రసంగిస్తారని జాబితాలో ఉంది. జమ్మూకశ్మీర్ పునర్విభజన బిల్లుకు సగం కంటే ఎక్కువ రాష్ట్రాలు ఆమోదం తెలపాల్సిన నేపథ్యంలో జమ్మూకశ్మీర్ గవర్నర్ మాలిక్‌తో పాటు యూపీ, బిహార్, పశ్చిమ బెంగాల్, కేరళ, మధ్యప్రదేశ్, పంజాబ్, హరియాణా, అస్సాం రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ ప్రత్యేకంగా మాట్లాడుతారని ఈ నోట్‌లో ఉంది. మరోవైపు శాంతిభద్రతల అంశానికి సంబంధించి హోంశాఖ కార్యదర్శి రాజీవ్‌గౌబాను జమ్మూకశ్మీర్‌కు పంపాలని నిర్ణయించారు. యూపీ, బిహార్, పశ్చిమబెంగాల్, కేరళ, మధ్యప్రదేశ్, అస్సాం రాష్ట్రాల్లో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన భద్రతా కల్పించేలా ఆయా ప్రభుత్వాలను ఆదేశించాలని జాబితాలో చేర్చారు.

## ఉదయం నుంచి ఏం జరిగిందంటే!




**జమ్మూకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని రద్దుచేస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని పార్లమెంటు ముందుకు తీసుకొచ్చే క్రమంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర కసరత్తే చేసింది. న్యాయపరమైన, రాజ్యాంగపరమైన అంశాలను మరోసారి ధ్రువీకరించుకునేందుకు, కశ్మీర్‌లో తాజా పరిస్థితిపైనా ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా పలుమార్లు చర్చించుకున్నారు. అమిత్ షా, మోదీతోపాటు భద్రత వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశాలు, న్యాయ శాఖమంత్రితో సమావేశాలు నిర్వహిస్తూనే ఉన్నారు. సోమవారం ఉదయం నుంచి ఢిల్లీలోని పరిస్థితులను ఓసారి గమనిస్తే..**

- సోమవారం తెల్లవారుజామునే న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌తో అమిత్‌షా భేటీ అయ్యారు. న్యాయ, రాజ్యాంగపరమైన అంశాలపై వీరి మధ్య చర్చ జరిగింది.
- **7 గం॥కు:** ప్రధాని నివాసానికి చేరుకున్న హోంమంత్రి అమిత్‌షా దాదాపు గంటసేపు బిల్లుకు సంబంధించిన అంశంపై చర్చలు జరిపారు. రాజ్యసభలో బిల్లు సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహాన్ని చర్చించినట్లు సమాచారం.
- **9.30 గం॥కు:** ప్రధాని నివాసంలో కేబినెట్ సమావేశం మొదలైంది. ఈ సమావేశంలో ప్రధాని మోదీ, హోంమంత్రి షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సహా పలువురు ముఖ్యమైన అధికారులు పాల్గొన్నారు.
- **9.55 గం॥కు:** రాజ్యసభలో నేడు సభలో కీలకమైన చట్టాలను అత్యవసరంగా చర్చించాల్సిన అవసరం ఏర్పడిందంటూ రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు సంకేతాలిచ్చారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది.
- **10.10 గం॥కు:** అప్రమత్తంగా ఉండాలంటూ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీచేసింది.
- **10.30 గం॥కు:** ప్రధాని నివాసం నుంచి బయటకు వచ్చిన అమిత్ షా. ముగిసిన కేంద్ర కేబినెట్ భేటీ. అక్కడినుంచి షా నేరుగా పార్లమెంటుకు చేరుకున్నారు. 11గంటలకు రాజ్యసభలో, 12 గంటలకు లోక్‌సభలో అమిత్ షా మాట్లాడతారనే సమాచారం వచ్చింది.
- **11.00 గం॥కు:** పార్లమెంటుకు చేరుకున్న మోదీ, రాజ్‌నాథ్ సింగ్. అంతకుముందే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ మాట్లాడారని, 370 రద్దుకు సంబంధించిన సమాచారాన్ని అందించడంతోపాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారని సమాచారం.
- **11.15 గం॥కు:** రాజ్యసభలో జమ్మూకశ్మీర్ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టిన షా. జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370ను రద్దుచేసేందుకు నిర్ణయం తీసుకున్నామని సభ ముందు ప్రతిపాదన. సభలో విపక్ష సభ్యుల గందరగోళం. విపక్షాలు అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలిస్తామని.. దీనిపై సుదీర్ఘచర్చ జరిపేందుకు సిద్ధమని ప్రకటించిన అమిత్ షా.
- **6.55 గం॥కు:** సాయంత్రం వరకు రాజ్యసభలో వివిధ పార్టీల నేతలు 370 రద్దుపై తమ అభిప్రాయాలు వెల్లడించారు. బిల్లుకు పలుపార్టీలు మద్దతివ్వగా కాంగ్రెస్, జేడీయూ సహా పలు పార్టీలు వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించాయి. తీవ్రమైన చర్చోపచర్చల తర్వాత సాయంత్రం 6.55 గంటలకు రాజ్యసభ జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు–2019కు ఆమోదం తెలిపింది. మంగళవారం లోక్‌సభలో షా ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నారు.

**మంగళవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభలో అమిత్ షా ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నారు.**

# త్రిమూర్తులు... ఎంఎస్‌డీ



- ఆర్టికల్ 370 రద్దుపై వ్యూహాత్మకంగా వ్యవహరించిన మోదీ-షా-దోవల్ త్రయం
- దోవల్ సలహాతో అమర్‌నాథ్ యాత్రకు బ్రేక్.. భారీగా బలగాల మోహరింపు

**న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హక్కులు, స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370ని రద్దుచేసే విషయంలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్(ఎంఎస్‌డీ) వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఈ ఏడాది జూన్ నెలలోనే అందుకోసం ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఇందులోభాగంగా 1987 బ్యాచ్ ఐఏఎస్ అధికారి బీవీఆర్ సుబ్రహ్మణ్యంను జమ్మూకశ్మీర్ ముఖ్యకార్యదర్శి(సీఎస్)గా నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో ప్రధాని కార్యాలయం(పీఎంవో)లో సంయుక్త కార్యదర్శిగా ఉన్న సమయంలో సుబ్రహ్మణ్యం పనితనాన్ని గుర్తించిన మోదీ ఈ కీలక బాధ్యతను ఆయన భుజస్కంధాలపై పెట్టారు. అలాగే ఈ మొత్తం ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసే బాధ్యతను అమిత్‌షాకు అప్పగించారు. దీంతో రంగంలోకి దిగిన షా.. న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌తో పలుమార్లు సమావేశమయ్యారు. అదే సమయంలో కశ్మీర్‌లో క్షేత్రస్థాయిలో పరిస్థితుల్ని అధ్యయనం చేసే బాధ్యతను దోవల్‌కు అప్పగించారు. ఆర్టికల్ 370ను రద్దుచేస్తే తలెత్తే న్యాయపరమైన సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో ప్రసాద్ నేతృత్వంలోని కోర్ టీమ్‌తో చర్చలు జరిపారు. ఈ బృందంలో న్యాయశాఖ కార్యదర్శి అలోక్ శ్రీవాత్సవ్, హోంశాఖ అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.వర్మ, అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్, హోంశాఖ కార్యదర్శి రాజీవ్‌గౌబా తదితరులు సభ్యులుగా ఉన్నారు.

### ఆరెస్సెస్ ఆశీస్సులతో..

**మోదీ** ఆదేశాలతో రంగంలోకి దిగిన హోంమంత్రి అమిత్ షా నాగ్‌పూర్‌లోని బీజేపీ మాతృసంస్థ ఆరెస్సెస్ కార్యాలయానికి వెళ్లారు. జమ్మూకశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా చేయబోతున్న విషయాన్ని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, సంస్థ ప్రధాన కార్యదర్శి భయ్యాజీలకు వివరించారు. అనంతరం అమిత్ షా.. జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్‌తో పలుమార్లు సమావేశమై చర్చలు జరిపారు. ఒకవేళ ఆర్టికల్ 370ని రద్దుచేస్తే కశ్మీర్‌లో తలెత్తే పరిణామాలతో పాటు భద్రతను సమీక్షించాలని దోవల్‌కు సూచించారు. వెంటనే రంగంలోకి దిగిన దోవల్.. శ్రీనగర్‌లో 3 రోజులు పర్యటించారు. ఆర్మీ, పోలీస్, నిఘా సంస్థల ఉన్నతాధికారులతో పాటు కలెక్టర్లతో సమావేశమయ్యారు. అనంతరం ఢిల్లీ చేరుకున్న దోవల్ కశ్మీర్‌లో అమర్‌నాథ్ యాత్రను నిలిపివేయాలని కేంద్రానికి సూచించారు. అలాగే పర్యాటకుల్ని రాష్ట్రం నుంచి ఖాళీ చేయించాలనీ, 100 కంపెనీల అదనపు బలగాలను మోహరించాలని చెప్పారు. ఇంటర్నెట్, ల్యాండ్‌లైన్ ఫోన్ సేవలను నిలిపివేయాలని ముందుగానే నిర్ణయించారు. అదే సమయంలో కేంద్రం తీసుకోబోతున్న చర్యలకు సంబంధించి సమాచారాన్ని ముందుగానే సీఎస్ సుబ్రహ్మణ్యంకు కేంద్ర హోంశాఖ అందిస్తూ వచ్చింది. దీంతో ఆదివారం అర్ధరాత్రి మాజీ సీఎంలు ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ సహా పలువురు నేతల్ని పోలీసులు గృహనిర్బంధంలోకి తీసుకున్నారు.

### 'షా'మాస్టర్ ప్లాన్..

**ఇక** రాజ్యసభలో బిల్లును ప్రవేశపెట్టే విషయంలోనూ బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. కశ్మీర్ పునర్విభజన అంశం అంతర్జాతీయ స్థాయిలో తీవ్రమైన అంశమైనందున కేంద్రం తీసుకోబోయే చర్యల విషయమై కీలక సమాచారాన్ని షా కొన్ని మీడియా సంస్థలకు అందిస్తూ వచ్చారు. అదే సమయంలో రాజ్యసభలో కశ్మీర్ పునర్విభజన బిల్లు ఆమోదానికి అవసరమైన సభ్యుల మద్దతు కూడగట్టేందుకు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా బీజేపీ నేతలు అనిల్ బలూనీ, భూపేంద్ర యాదవ్‌లు తటస్థ పార్టీలు, ఇతర రాజ్యసభ సభ్యుల్ని కలిసి బిల్లుకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు. అలాగే అనర్హత వేటు భయంతో ఎస్పీ ఎంపీలు నీరజ్ శంకర్, సురేంద్ర నాగర్, సంజయ్ సేత్, కాంగ్రెస్ ఎంపీ సంజయ్ సింగ్‌లు రాజ్యసభకు గైర్హాజరయ్యారు. బిల్లుకు మద్దతిస్తానని బీఎస్పీ సభ్యుడు సతీశ్ మిశ్రా ప్రకటించారు. చివరికి రాజ్యసభలో తగిన మద్దతుందని నిర్ధారించుకున్నాకే ఈ చారిత్రాత్మక బిల్లును అమిత్ షా సోమవారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఓవైపు ఈ బిల్లుపై చర్చ సాగుతుండగానే రాష్ట్రపతి కోవింద్ ఆర్టికల్ 370ని రద్దుచేస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసేలా జాగ్రత్తలు తీసుకున్నారు. అంతకు ముందు పార్లమెంటు సమావేశాలకు హాజరుకావాలని బీజేపీ తమ ఎంపీలకు విప్ జారీచేసింది. ఈ మొత్తం ప్రక్రియ విజయవంతంగా సాగడంపై బీజేపీ నేత ఒకరు స్పందిస్తూ..'అమిత్ షాకు ఓటమన్నది తెలియదు. ఆయన భారత్ పాలిట సరికొత్త సర్దార్ పటేల్‌గా మారారు'అని ప్రశంసించారు.

## ముల్లును ముల్లుతోనే...

**ముల్లును** ముల్లుతోనే తీయాలని అంటారు. కశ్మీర్ అంశంలో కేంద్రం ఇదే సూత్రాన్ని అనుసరించింది. ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి అదే ఆర్టికల్‌ను అస్త్రంగా మలచుకుంది. ఆ ఆర్టికల్‌లో ఒక నిబంధనలో ఉన్న అంశాలను ప్రాతిపదికగా చేసుకొని దానినే ప్రయోగించడం విశేషం. ఆర్టికల్ 370లోని సెక్షన్ 3 ప్రకారం భారత రాష్ట్రపతి ఎప్పుడైనా, ఏ సమయంలోనైనా కశ్మీర్‌కు ఇచ్చిన స్వతంత్రప్రతిపత్తిని రద్దు చేయడానికి అధికారాలున్నాయి. ఇదే నిబంధనని బీజేపీ అనుకూలంగా మలచుకుంది.

### 370 (3)లో ఏమి ఉందంటే..

ఈ ఆర్టికల్‌లో ఉన్న నిబంధనలకు కట్టుబడి ఉండాల్సిన పనిలేదు. 370ని రద్దు చేయడం, లేదంటే కొన్ని మార్పులు చేర్పులు చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది. ఫలానా తేదీ నుంచి 370 రద్దు లేదంటే మార్పులు అమల్లోకి వస్తాయని రాష్ట్రపతి ఉత్తర్వులు ఇవ్వొచ్చు. ఈ నిబంధనతోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు పక్కాగా వ్యూహాలు రచించారు. కశ్మీర్‌కు బలగాలను తరలించడం దగ్గర్నుంచి రాష్ట్రపతి గెజిట్ నోటిఫికేషన్ వరకు ప్రణాళికా బద్ధంగా అమలు చేశారు. రాజ్యసభలో జమ్ము కశ్మీర్ పునర్వ్యవస్థీకరణకు తీర్మానం ప్రవేశపెట్టిన అమిత్ షా 370ని రద్దు చేయడానికి అదే ఆర్టికల్‌ను వినియోగించుకున్నామని సభలో ప్రకటించారు. కశ్మీర్‌కు బలగాలు తరలినప్పుడే 370 రద్దు చేస్తారన్న ఊహాగానాలు చెలరేగాయి. కానీ చాలా మంది రాజ్యాంగ నిపుణులు అది రద్దు చేయడం అంత సులభం కాదంటూ వాదించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 ప్రకారం 370ని రద్దు చేయాలంటే రాజ్యాంగాన్ని సవరించాల్సి ఉంటుంది. కానీ 370లో నిబంధన 3ని చాలా తెలివిగా వినియోగించుకున్న మోదీ ప్రభుత్వం రాజ్యాంగ సవరణ నుంచి తప్పించుకుంది.

## నో చెప్పిన అంబేడ్కర్



**రక్షణ**, విదేశీ వ్యవహారాలు మినహా తనదైన ప్రత్యేక రాజ్యాంగాన్నీ, ప్రత్యేక జెండానీ, అనుమతిస్తూ, స్వయంప్రతిపత్తిని కల్పిస్తూ భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 370ని పొందుపరచాలని భావించినప్పుడు ఈ డ్రాఫ్ట్‌ని ఎవరు తయారుచేయాలనే చర్చ వచ్చింది. తొలి న్యాయశాఖా మంత్రీ, రాజ్యాంగ రచనాసంఘం అధ్యక్షుడూ అయిన డాక్టర్. బీ.ఆర్. అంబేడ్కర్‌ని ఆర్టికల్ 370 ముసాయిదాని తయారుచేయాల్సిందిగా కోరారు. అయితే అందుకు ఆయన నిరాకరించారు. దీంతో ఆ బాధ్యతను 1949లో నాటి భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ కశ్మీర్ నాయకుడైన షేక్ అబ్దుల్లాపై ఉంచారు. అంబేడ్కర్‌ని సంప్రదించి ముసాయిదాని తయారు చేయాలని షేక్ అబ్దుల్లాకి సూచించారు. అయితే తదనంతరం నెహ్రూ మంత్రివర్గంలోని గోపాల స్వామి అయ్యంగార్ ఆర్టికల్ 370 ముసాయిదాని తయారుచేశారు.

## ఆర్టికల్ 370 రూపకర్త గోపాలస్వామి అయ్యంగార్



**ఒకప్పటి** మద్రాస్ రాష్ట్రానికి చెందిన గోపాలస్వామి అయ్యంగార్ ఈ ఆర్టికల్ 370కు ప్రధాన రూపకర్త. బ్రిటిష్ కాలంలో సివిల్ సర్వీస్ అధికారిగా వృత్తిజీవితం మొదలుపెట్టారు. 1937–43కాలంలో జమ్మూకశ్మీర్ సంస్థానానికి ప్రధానమంత్రిగా పనిచేశారు. 1947 అక్టోబర్‌లో కేంద్రంలో జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వంలో ఈయన కేంద్రమంత్రిగా పనిచేశారు. జమ్మూకశ్మీర్ వ్యవహారాలు ఈయనే చూసుకునేవారు. ఈయన సారథ్యంలోని బృందం 1948, 1952లో కశ్మీర్ సమస్యను ఐక్యరాజ్యసమితిలో లేవనెత్తింది.

# మారనున్న ముఖచిత్రం

**రా**జ్యాంగంలోని ఆర్టికల్ 370 రద్దుతో 35(ఏ) కూడా రద్దయింది. దీంతో కశ్మీర్ స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోయింది. ఇకపై కశ్మీర్ కూడా భారత్‌లో అంతర్భాగమే. అక్కడ ప్రత్యేక జెండాలు, ఎజెండాలు అమలు ఇక కుదరదు. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో కశ్మీర్ ముఖచిత్రం ఎలా మారబోతోందంటే..

- స్వతంత్ర ప్రతిపత్తి కోల్పోయిన జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా అవతరించనుంది. కేంద్రానికే ఈ ప్రాంతంపై పట్టు ఉంటుంది.
- కశ్మీర్ సొంత రాజ్యాంగం రద్దు కానుంది. ఆ రాష్ట్రానికి ప్రత్యేక జెండా కూడా ఉండదు.
- ఈ ప్రాంతానికి అసెంబ్లీ ఉన్నప్పటికీ ఢిల్లీ, పాండిచ్చేరి తరహాలో శాంతి భద్రతలు, భూముల నిర్వహణ కేంద్రం పరిధిలోనే ఉంటాయి. కేంద్ర హోం శాఖకు విశేష అధికారాలు సంక్రమిస్తాయి.
- జమ్మూకశ్మీర్ గవర్నర్ ఇకపై లెఫ్టినెంట్ గవర్నర్‌గా వ్యవహరిస్తారు.
- కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టాలన్నీ ఇక కశ్మీర్‌కు కూడా వర్తిస్తాయి.
- కశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక రణబీర్ పీనల్ కోడ్ (ఆర్‌పీసీ) స్థానంలో ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ) అమల్లోకి వస్తుంది.
- లదాఖ్ అసెంబ్లీ లేని కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పాటుకానుంది. ఆ ప్రాంత వాసులు ఎప్పట్నుంచో చేస్తున్న డిమాండ్ నెరవేరింది.
- జమ్మూ, కశ్మీర్‌తో ఆ ప్రాంతానికి ఎలాంటి సంబంధం ఉండదు. అండమాన్ నికోబార్, లక్షద్వీప్ మాదిరిగానే కేంద్రానికే విశేష అధికారాలు ఇక్కడ ఉంటాయి. కొండప్రాంతాల అభివృద్ధి మండలి కింద పాలన సాగుతుంది. లోక్‌సభ ఎన్నికల సమయంలోనే ఆ ప్రాంత ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోగలరు.
- ఇన్నాళ్లూ కశ్మీర్‌లో శాశ్వత నివాసులకు మాత్రమే అక్కడ భూములు, స్థిరాస్తుల క్రయవిక్రయాలపై హక్కులు ఉండేవి. ఇకపై దేశంలోని ఏ రాష్ట్రంలో పౌరులైనా కశ్మీర్‌లో భూములు, ఇతర స్థిరాస్తులు కొనుగోలు చేయగలరు. ఇష్టమైన వారు అక్కడ శాశ్వత నివాసం కూడా ఏర్పాటు చేసుకోవచ్చు.
- విద్య, ఉపాధి రంగాల్లో కూడా భారతీయులందరికీ అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రిజర్వేషన్లు కూడా అక్కడ విద్యాసంస్థల్లో అమలవుతాయి.
- కశ్మీర్ మహిళలు మరో ప్రాంతం వారిని పెళ్లి చేసుకున్నా వారి ఆస్తి హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లదు.
- కశ్మీర్ ప్రజలు సొంత పతాకం కావాలని అనుకుంటే అందుకు పార్లమెంటు ఆమోదం పొందాల్సి ఉంటుంది.

### అభివృద్ధికి బాటలు పడతాయా ?

కశ్మీర్‌లో క్రయవిక్రయాలపై హక్కులు లేకపోవడం, ఉగ్రవాదుల దాడుల కారణంగా శాంతిభద్రతలు అదుపులో లేకపోవడంతో ఇన్నాళ్లూ పెద్ద కార్పొరేట్ కంపెనీలేవీ కశ్మీర్‌లో పెట్టుబడులు పెట్టడానికి సాహసించలేదు. స్థానిక రాజకీయ పార్టీలు కూడా ఎన్నికల్లో లబ్ధి చేకూరడానికి అనుగుణంగానే వ్యూహాలు రచించాయి. అధికారం ఎక్కువగా స్థానిక ప్రభుత్వం చేతుల్లోనే ఉండిపోవడంతో పరిస్థితులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయాయి. ఇప్పుడు పరిపాలనంతా కేంద్రం చేతుల్లోకి రావడం, కశ్మీర్‌కు రాకపోకలపై అడ్డంకులన్నీ తొలగిపోవడంతో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. రాబోయే రోజుల్లో దేశంలో ఇతర ప్రాంతాలతో సంబంధాలు ఏర్పడడం వల్ల సామాజికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా కశ్మీర్‌లో అనూహ్య మార్పులు వస్తాయన్న అంచనాలు ఉన్నాయి. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు కొన్నాళ్లు హింసాకాండకు తెరతీసినా, పాలన అంతా కేంద్రం గుప్పిట్లోకి రావడం వల్ల ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణిచివేయడానికి అవకాశం ఉంటుంది. కశ్మీర్ లోయలో ఉగ్రవాదానికి ఊతమిస్తున్న వేర్పాటువాదులు, రాళ్ల దాడులతోనే కాలక్షేపం చేసే యువతను దారిలోకి తీసుకువచ్చే అవకాశాలు మెరుగవుతాయి. దీంతో కశ్మీర్‌కు కొత్త పెట్టుబడులు వచ్చి అభివృద్ధి పథంలో పయనిస్తుందనే అభిప్రాయాలైతే వినిపిస్తున్నాయి. మరోవైపు కశ్మీరీల మనోభావాలు మాత్రం దెబ్బ తినే అవకాశాలున్నాయనే వాదన వినిపిస్తోంది. ఇప్పటివరకు ముస్లిం మెజార్టీ ఉన్న ఆ ప్రాంతంలో హిందూ జనాభా పెరిగిపోతుందనే ఆందోళన స్థానికుల్లో ఉంది.



### ఆర్టికల్ 370 అంటే..

భారత రాజ్యాంగంలోని 21వ భాగంలో ఉన్న ఆర్టికల్ 370 ద్వారా జమ్మూకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి లభిస్తోంది. ఆ రాష్ట్రానికి కొన్ని ప్రత్యేక అధికారాలూ, రాజ్యాంగం, జెండా అమల్లో ఉన్నాయి. ఇవన్నీ తాత్కాలిక ప్రాతిపదికన లభిస్తాయన్న నిబంధన కూడా ఉంది. ఈ ఆర్టికల్ ప్రకారం రక్షణ, విదేశీ వ్యవహారాలు, ఆర్థిక, కమ్యూనికేషన్ల రంగాలపై మాత్రమే భారత ప్రభుత్వానికి సర్వాధికారాలు ఉన్నాయి. వాటికి సంబంధించిన చట్టాలు మాత్రమే కశ్మీర్‌లో అమలు చేయగలదు. మిగిలిన రంగాల్లో ఏం చేయాలన్నా అక్కడ రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. అంటే కశ్మీర్ ప్రజల పౌరసత్వం, ఆస్తి హక్కులు, ప్రాథమిక హక్కులు వంటి వాటికి సంబంధించి ప్రత్యేక రాజ్యాంగం అమల్లో ఉంటుంది. ఫలితంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 360 ప్రకారం ఆర్థిక అత్యవసర పరిస్థితిని కశ్మీర్‌లో విధించే అవకాశం కేంద్రానికి లేదు. విదేశీ దురాక్రమణలు, యుద్ధ పరిస్థితులున్నప్పుడు మాత్రమే అత్యవసర పరిస్థితి విధించే అధికారం కేంద్రానికి ఉంటుంది. 1947 దేశవిభజన సమయంలో అప్పటి కశ్మీర్ రాజు రాజా హరిసింగ్ కొన్ని షరతులకు లోబడి కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేశారు. హరిసింగ్ నియమించిన కశ్మీర్ పాలకుడు షేక్ అబ్దుల్లా, అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ కలిసి కొన్ని నెలల పాటు చర్చలు జరిపి 1949లో 370 ఆర్టికల్‌ను రూపొందించి రాజ్యాంగంలో చేర్చారు. కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని శాశ్వతంగా ఉంచాలని, తాత్కాలిక పద్ధతుల్లో హక్కులు ఇవ్వకూడదన్న అబ్దుల్లా వాదనను అప్పట్లో కేంద్రం పట్టించుకోలేదు.

### 35 (ఏ) అంటే..

**కశ్మీర్‌**లో శాశ్వత నివాసానికి సంబంధించిందే ఆర్టికల్ 35(ఏ). కశ్మీర్ రాజ్యాంగంలోని దీని ప్రస్తావన ఉంది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 కిందకి కూడా వస్తుంది. 1954లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సూచనల మేరకు బాబూ రాజేంద్ర ప్రసాద్ రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా దీనిని రాజ్యాంగంలో పొందుపరిచారు. దీని ప్రకారం భారత్‌లో ఇతర రాష్ట్రాల్లో ఉన్న పౌరులెవరూ జమ్మూకశ్మీర్‌లో భూములు, ఇతర ఆస్తుల్ని కొనుగోలు చేయలేరు. ప్రభుత్వ ఉద్యోగం కూడా చేయడానికి కుదరదు. కశ్మీర్‌లో 1911 సంవత్సరానికి ముందు పుట్టిన వారు, అక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నవారే శాశ్వత నివాసులు. వారికి మాత్రమే రాష్ట్రంలో భూములు, స్థిరాస్తుల కొనుగోలుపై హక్కులు ఉంటాయి. 1956లో రాజ్యాంగాన్ని అమల్లోకి తీసుకువచ్చినప్పుడు 35(ఏ) ఆర్టికల్ చేర్చిన తేదీ మే 14, 1954కి పదేళ్ల ముందు కశ్మీర్‌లో స్థిరనివాసం ఉన్నవారందరూ కశ్మీర్‌లో శాశ్వత నివాసులేనని స్పష్టం చేసింది. అయితే కశ్మీర్ మహిళలెవరైనా ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తుల్ని వివాహం చేసుకుంటే వారు ఆస్తి హక్కుల్ని కోల్పోతారు. ఈ నిబంధన మహిళా హక్కుల్ని కాలరాస్తోందని ఆ తర్వాత కాలంలో విమర్శలు వెల్లువెత్తి కొందరు కోర్టును ఆశ్రయించారు. 2002 అక్టోబర్‌లో జమ్మూకశ్మీర్ కోర్టు వివాహం చేసుకునే సదరు మహిళకు ఆస్తి హక్కులు ఇచ్చింది కానీ, వారికి పుట్టిన పిల్లలకు ఆస్తి హక్కులేవీ లభించవని స్పష్టం చేసింది.




## కశ్మీరీల్లో ఆగ్రహం.. ఆందోళన!

**జమ్మూ:** ఆర్టికల్ 370ని రద్దుచేయడంపై పలువురు కశ్మీరీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం నిర్ణయంతో రాష్ట్రంలో మళ్లీ హింస రాజుకుంటుందని భయాందోళనకు గురవుతున్నారు. కేంద్రం తాజా నిర్ణయం కారణంగా ముస్లిం మెజారిటీ గుర్తింపులను రాష్ట్రం కోల్పోతుందని మరికొందరు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే కొందరు స్థానికులు మాత్రం ఇందుకు కశ్మీర్ ప్రాంతీయ పార్టీలను తప్పుపడుతున్నారు. ఈ విషయమై శ్రీనగర్‌కు చెందిన ఫరూక్ అహ్మద్ షా మాట్లాడుతూ..'కేంద్రం నిర్ణయంతో మేం షాక్‌కు గురయ్యాం. కేంద్ర ప్రభుత్వాలతో గత 70 ఏళ్లుగా చేతులు కలుపుతున్న కశ్మీరీ రాజకీయ పార్టీలు ఆర్టికల్ 370ని ఎముకలగూడులా మార్చేశాయి. కేంద్రం తాజా నిర్ణయం వల్లే ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకునే అవకాశముంది'అని హెచ్చరించారు.

### ప్రజాగ్రహం పెల్లుబుకుతుంది..

కేంద్ర ప్రభుత్వం తమను ఇంకెంతకాలం గృహనిర్బంధంలో ఉంచుతుందని కశ్మీరీ యువకుడు అర్షద్ వార్సీ(20) ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఆర్టికల్ 370ని రద్దుచేయడం అంటే తమ ఆగ్రహాన్ని వెలిబుచ్చేందుకు వీల్లేనట్లు కాదని స్పష్టం చేశారు. మరో మహిళా టీచర్ మాట్లాడుతూ..'ఈ దుస్థితికి జమ్మూకశ్మీర్‌లోని ప్రధాన రాజకీయ పార్టీలే కారణం. ఆర్టికల్ 370 రద్దుతో మా గుర్తింపును కోల్పోయినట్టైంది'అని చెప్పారు.

### కశ్మీరీ పండిట్ల సమస్య అదే..

ఇక ఫాతిమా బానో అనే మహిళా ఎంట్రప్రెన్యూర్ కూడా తాజా పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. 'కేవలం ఆర్టికల్ 370 రద్దుతో దశాబ్దాలుగా కశ్మీర్‌లో కొనసాగుతున్న అశాంతి, హింస సమసిపోతుందా? అలా జరుగుతుందన్న నమ్మకం నాకు లేదు. కశ్మీరీ పండిట్లు తమ స్వస్థలాలకు తిరిగొచ్చేందుకు ఆర్టికల్ 370, ఆర్టికల్–35ఏ అన్నవి అసలు అడ్డంకే కాదు. పండిట్లు తిరిగిరావడానికి శాంతిభద్రతల పరిస్థితులే ప్రధాన అడ్డంకిగా ఉన్నాయి'అని తెలిపారు.

# టైమ్ బాగుందనే..

**న్యూఢిల్లీ:** ఊహించినట్లుగానే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు పది రోజుల ముందు ప్రధాని మోదీ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయం తీసుకుంది. జమ్ము కశ్మీర్ విషయంలో దశాబ్దాలుగా రగులుతున్న సమస్యను పరిష్కరించామన్న ఖ్యాతితోపాటు కల్లోల ప్రాంతాన్ని తన గుప్పిట్లోకి తెచ్చుకుంది. ఏకాకిగా మారిన దాయాదితోపాటు బలహీన విపక్షాలు సుస్థిర సర్కారు కలిసొచ్చాయి. ఎదురు లేకుండా నిర్ణయాలను నెగ్గించుకుంది.

### సుస్థిరతకు ఢోకా లేదనే..

వరుసగా రెండోసారి ప్రధాని మోదీ నేతృత్వంలో బలమైన ప్రభుత్వం అధికారంలోకి రావడం, దరిదాపుల్లో ఎన్నికలేవీ లేకపోవడంతో 370 ఆర్టికల్ రద్దు, జమ్ము కశ్మీర్ పునర్విభజనపై కేంద్రం ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయాన్ని వేగంగా తీసుకుంది. తన వ్యూహం బెడిసికొట్టినా సర్కారు సుస్థిరతకు వచ్చే ముప్పు కూడా ఏదీ లేకపోవడంతో చకచకా అమలు చేసింది. విపక్ష సభ్యుల చేరికలతో రాజ్యసభలోనూ బలం పెరగడంతో బిల్లును నెగ్గించుకోగలమనే నమ్మకానికి వచ్చింది. రాజ్యసభలో తగినంత మంది సభ్యులు మద్దతు కూడగట్టే బాధ్యతను అనిల్ బలూని, భూపేంద్ర యాదవ్‌లతో కూడిన బృందానికి అమిత్ షా అప్పగించారు. బీఎస్పీ నేత సతీష్ మిశ్రా మద్దతు కూడా లభించడంతో ఎగువ సభలోనూ ప్రక్రియ సాఫీగా సాగిపోయింది.



### ఏకాకిగా మారిన దాయాది...

**సై**నిక బలగాల పరంగా చూసినా కూడా భారత్ ఇప్పుడు మెరుగైన స్థితిలో కదనోత్సాహంతో ఉంది. బాలాకోట్‌పై వైమానిక దాడులు, పాక్ చెరలో చిక్కిన వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్‌ను దౌత్యపరంగా ఒత్తిడి తెచ్చి విడుదల చేయించడం ద్వారా భారత్ మరోసారి తన పైచేయిని నిరూపించుకుంది. వరుస పరిణామాలతో పాకిస్తాన్ అంతర్జాతీయంగా ఏకాకిగా మారింది. తన ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా చైనా నుంచి కూడా పాక్‌కు మద్దతు కరువైంది. ఇతర దేశాలేవీ కూడా పాక్‌కు మద్దతుగా నిలిచే అవకాశాలు లేవని బాలాకోట్‌పై వైమానిక దాడుల సమయంలోనే రుజువైంది. తమ దేశంలో ఉగ్రమూకలు భారీగా తిష్ట వేసినట్లు స్వయంగా పాక్ ప్రధానే అంగీకరించారు. దాయాది అప్పుల్లో కూరుకుపోయి ప్రతిఘటించలేని స్థితికి చేరుకోవడం, బలహీన ప్రధానిగా ఇమ్రాన్‌ఖాన్ ఇంటా బయట విమర్శలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కశ్మీర్‌పై గట్టి నిర్ణయాన్ని అమలు చేసేందుకు ఇదే సరైన తరుణమని కేంద్రం భావించింది. కశ్మీర్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జోక్యం కోసం ఇమ్రాన్‌ఖాన్ తాజాగా ప్రయత్నించడంతో భారత్ అప్రమత్తమైంది. తన వ్యవహారాలను తానే చక్కదిద్దుకునే సత్తా ఉందని చాటడంతోపాటు ఇతర దేశాలు తలదూర్చటాన్ని సహించబోమని గట్టి సంకేతాలు ఇవ్వాలని నిర్ణయించింది. జమ్ము కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన మరో ఆర్నెళ్లు పొడిగించడం, రాష్ట్రంలో పరిస్థితులన్నీ తమ కనుసన్నల్లోనే ఉండటంతో బిల్లుపై ముందుకు కదిలింది. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కశ్మీర్ అంశానికి తాము సరైన ముగింపు పలికామన్న ఖ్యాతి దక్కించుకోవడంతోపాటు విపక్షాలు వ్యతిరేకించలేని పరిస్థితిలో ఉండటంతో ఇక ఎదురే లేకుండా పోయింది.



1992లో '370 హటావో ఆందోళన్'లో మోదీ

### బలహీన విపక్షాలు..

బీజేపీని దీటుగా ఎదుర్కోవడంలో కాంగ్రెస్ విఫలం కావడం, పార్టీ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకుని రాహుల్ చేతులెత్తేయటం, విపక్షాలు చెల్లాచెదురు కావడం, సార్వత్రిక ఎన్నికల ఫలితాల నుంచి ఇప్పట్లో కోలుకునే పరిస్థితి లేకపోవడం మోదీ సర్కారుకు కలిసొచ్చాయి. ఎన్డీయేతర పక్షాలు కూడా మోదీ సర్కారు నిర్ణయాన్ని వ్యతిరేకించలేని పరిస్థితిని కేంద్రం కల్పించింది.

### అనుకూల వాతావరణం..

**భ**ద్రతా దళాలు పెద్ద ఎత్తున మోహరించడం, వర్షాలు పడుతుండటంతో కశ్మీర్ లోయలో ప్రస్తుతం ఉగ్రవాదుల కదలికలు పెద్దగా లేవు. ఇక వచ్చే చలికాలంలోనూ ప్రతికూలత కారణంగా ఉగ్రవాదుల సంచారం తక్కువగా ఉంటుంది. వాతావరణం కూడా అనుకూలంగా ఉన్నందున కేంద్రం కశ్మీర్‌పై ముందడుగు వేసింది.

## కశ్మీర్ పిక్చర్‌లో

రావణ కాష్టంలా మండుతూనే ఉన్న కశ్మీర్ సమస్యకు...ఆర్టికల్ 370 రద్దు పరిష్కారం అవుతుందా ?
ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సింది కాలమే..! అయితే 1949లో మొదలైన ఈ సమస్యలో కీలక పాత్ర ధారులు ఎవరు

# నాయక్ - ఖల్‌నాయక్

### ఆద్యుడు... రాజా హరిసింగ్!



కశ్మీర్ సమస్యకు మూల పురుషుడు.. జమ్మూ కశ్మీర్ రాజ్యానికి చిట్ట చివరి రాజు. 1895 సెప్టెంబరు 23న జమ్మూలోని అమర్ మహల్‌లో జన్మించిన రాజా హరిసింగ్... 1909లో తండ్రి రాజా అమర్ సింగ్ జమ్వాల్ మరణం తరువాత బ్రిటిష్ పాలకుల కనుసన్నల్లో విద్యాభ్యాసం పూర్తి చేశారు. అజ్మీర్‌లోని మేయో కాలేజీలో చదువు పూర్తయిన తరువాత డెహ్రాడూన్‌లోని ఇంపీరియల్ కేడెట్ కార్ప్స్‌లో మిలటరీ శిక్షణ పొందిన హరిసింగ్‌ను బాబాయి మహారాజా ప్రతాప్ సింగ్ 1915లో జమ్మూ కశ్మీర్ సైనికాధికారిగా నియమించారు. 1925లో గద్దెనెక్కిన రాజా హరిసింగ్.. తన రాజ్యంలో నిర్బంధ ప్రాథమిక విద్యను అమలు చేశారు. బాల్యవివాహాలను రద్దు చేయడమే కాకుండా సమాజంలోని అన్ని వర్గాల వారికీ పూజా మందిరాలు అందుబాటులో ఉండేలా చట్టాలు చేశారు. రాజకీయంగా తొలి నుంచి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా వ్యవహరించిన హరిసింగ్... మత విద్వేషాలను రెచ్చగొడుతుందని ముస్లింలీగ్, దాని సభ్యులనూ పూర్తిగా వ్యతిరేకించారు. పష్తూన్ల దాడుల్లో కోల్పోయిన రాజ్యాన్ని మళ్లీ దక్కించుకునేందుకు భారత ప్రభుత్వంతో చేతులు కలిపిన హరిసింగ్ తన చివరి రోజులను ముంబైలో గడిపారు. 1961 ఏప్రిల్ 26న హరిసింగ్ మరణించగా వీలునామా ప్రకారం.. ఆయన అస్థికలను జమ్మూ ప్రాంతం మొత్తం చల్లడంతోపాటు తావీ నదిలో నిమజ్జనం చేశారు.

### తొలి నేత... షేక్ అబ్దుల్లా...



కశ్మీరీల సమస్యలన్నింటికీ భూస్వామ్య వ్యవస్థ కారణమని నమ్మిన.. ప్రజాస్వామ్య వ్యవస్థతోనే అభివృద్ధి సాధ్యమని చెప్పిన కశ్మీరీ నేత షేక్ అబ్దుల్లా. జమ్మూ కాశ్మీర్ చివరి రాజు రాజా హరిసింగ్, భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూలకు మిత్రుడిగా మాత్రమే కాకుండా.. ఆ ప్రాంతంలో తొలి రాజకీయ పార్టీని స్థాపించిన వ్యక్తిగానూ షేక్ అబ్దుల్లాకు పేరుంది. అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలో విద్యనభ్యసించిన షేక్ అబ్దుల్లా 1932లో కశ్మీర్ ముస్లిం కాన్ఫరెన్స్‌ను స్థాపించారు. తరువాతి కాలంలో ఈ పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్‌గా మారింది. 1932 సమయంలోనే జమ్మూ కశ్మీర్‌కు ఒక అసెంబ్లీ ఏర్పాటైనప్పటికీ అధికారం మాత్రం రాజా హరిసింగ్ చేతుల్లోనే ఉండేది. రాజరికం తొలగిపోయిన తరువాత మూడుసార్లు ప్రభుత్వాన్ని నడిపిన అబ్దుల్లాను షేర్ -ఏ- కశ్మీర్‌గా పిలుస్తారు. కశ్మీర్ నుంచి రాజా హరిసింగ్ తొలగాలన్న డిమాండ్‌తో ఉద్యమం నడిపిన చరిత్ర కూడా ఈయనదే. 1953లో రాజ్యానికి వ్యతిరేకంగా కుట్ర పన్నాడన్న ఆరోపణలతో అబ్దుల్లాను 11 ఏళ్లపాటు జైల్లో పెట్టారు. ఆ తరువాత 1975లో భారత ప్రధాని ఇందిరాగాంధీతో కుదిరిన ఒప్పందంతో జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రిగా తిరిగి రాజకీయాల్లోకి వచ్చారు ఆయన. 1964లో కశ్మీర్ సమస్యకు పరిష్కారం కనుక్కోవాలన్న లక్ష్యంతో పాకిస్తాన్‌కు వెళ్లిన అబ్దుల్లా అప్పటి ప్రధానితో చర్చలు జరిపారు.

### తొలి, చివరి ప్రెసిడెంట్... రాజా కరణ్ సింగ్...



దేశంలో రాజభరణాలు, బిరుదులన్నింటినీ రద్దు చేసిన ఇందిరాగాంధీ మంత్రివర్గంలో మంత్రిగా పనిచేసిన వ్యక్తి రాజా కరణ్‌సింగ్. 1931 మార్చి తొమ్మిదిన ఫ్రాన్స్‌లోని కెయిన్స్‌లో జన్మించిన కరణ్‌సింగ్.. జమ్మూ కశ్మీర్ చివరి రాజు రాజా హరిసింగ్ ఏకైక సంతానం. కవిగా, దాతగా మాత్రమే కాకుండా.. ప్రచ్ఛన్న యుద్ధ పరిసమాప్తి సమయంలో అమెరికాలో భారత రాయబారిగానూ పని చేసిన ఘనత ఈయనది. 1949 అక్టోబరులో కశ్మీర్ రాజ్యం భారత ప్రభుత్వంలో విలీనమైన రోజు నుంచి 18 ఏళ్ల వయసులోనే జమ్మూకశ్మీర్ ప్రతినిధిగా నియమితుడైన కరణ్ సింగ్.. తరువాతి కాలంలో రాష్ట్ర తొలి, చివరి అధ్యక్షుడిగా, గవర్నర్‌గానూ వ్యవహరించారు. ఈ కాలంలోనే జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హక్కులు కల్పిస్తూ భారత రాష్ట్రపతి పేరుతో అనేక ఉత్తర్వులు వెలువడ్డాయి. 1961 నుంచి తనకు అందుబాటులో ఉన్న రాజభరణాన్ని 1973లో స్వయంగా త్యజించిన వ్యక్తిగా కరణ్‌సింగ్‌కు పేరుంది. 1967–73 మధ్యకాలంలో కేంద్ర పర్యాటక, పౌర విమానయాన శాఖల మంత్రిగా పనిచేశారు. 1984 వరకూ పలు దఫాలు లోక్‌సభకు ఎన్నికైన కరణ్ సింగ్ వైద్య ఆరోగ్యం, విద్య, సాంస్కృతిక శాఖల మంత్రిగా పనిచేశారు. 1971 పాకిస్తాన్ యుద్ధం సమయంలో తూర్పు దేశాలకు భారత ఉద్దేశాలను వివరించే దూతగానూ పనిచేశారు. 1999 వరకూ నేషనల్ కాన్ఫరెన్స్ తరఫున, ఆ తరువాత 2018 వరకూ కాంగ్రెస్ తరఫున రాజ్యసభ ఎంపీగా కొనసాగారు.

### అతివాది... యాసిన్ మాలిక్...



జమ్మూకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ అనే వేర్పాటువాద సంస్థ స్థాపకుడు యాసిన్ మాలిక్. భారత్, పాకిస్తాన్ రెండింటి నుంచి కశ్మీర్ వేరుపడాలన్నది ఈయన సిద్ధాంతం. 1966లో శ్రీనగర్‌లో జన్మించిన యాసిన్ తన సిద్ధాంతం కోసం తుపాకులు పట్టాడు కూడా. అయితే 1994 తరువాత ఈయన తీవ్రవాదాన్ని విడిచిపెట్టడమే కాకుండా... శాంతియుత మార్గాల ద్వారా మాత్రమే కశ్మీర్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రచారం చేశారు. 1987 అసెంబ్లీ ఎన్నికల్లో ఇస్లామిక్ స్టూడెంట్స్ లీగ్ అధ్యక్షుడిగా యాసిన్ మాలిక్ ముస్లిం యునైటెడ్ ఫ్రంట్‌కు ప్రచారం చేశారు. నేషనల్ కాన్ఫరెన్స్ కండబలాన్ని ఎదుర్కొనేందుకు మాలిక్ ఉపయోగపడ్డారని విశ్లేషకులు అంటారు. ఈ ఎన్నికల్లో అధికార పార్టీ రిగ్గింగ్‌కు పాల్పడటమే కశ్మీర్‌లో చొరబాట్ల సమస్యకు కారణమైందన్న విశ్లేషకుల అంచనాలను అంగీకరించని మాలిక్ రిగ్గింగ్ అంతకుముందు కూడా ఉందని అంటారు. 2007లో సఫర్ ఏ ఆజాదీ పేరుతో కొత్త సంస్థను ఏర్పాటు చేసిన యాసిన్ మాలిక్ కశ్మీర్ సమస్య పరిష్కారం పేరుతో తరచూ పాకిస్తాన్ ప్రధానితో సమావేశం కావడం, చర్చలు జరపడం భారతీయుల్లో ఆయన పట్ల తీవ్ర వ్యతిరేకతకు కారణమైంది. 2013లో పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థ లష్కరే తయ్యబా అధ్యక్షుడు హఫీజ్ సయీద్‌తో కలిసి యాసిన్ మాలిక్ ఒక నిరసన కార్యక్రమంలో పాల్గొనడం దేశంలో తీవ్ర చర్చకు దారితీసింది.

### స్వతంత్రవాది ఒమర్ ఫారూఖ్...



జమ్మూకశ్మీర్‌పై భిన్నాభిప్రాయం కలిగినవారిలో మిర్వాయిజ్ ఒమర్ ఫారూఖ్ ఒకరు. జమ్మూ కాశ్మీర్ భారత్ నుంచి వేరు పడాలని, స్వతంత్రంగా ఉండాలన్న భావజాలం కలిగిన హురియత్ కాన్ఫరెన్స్ సభ్యత్వమున్న పార్టీల్లో మిర్వాయిజ్ పార్టీ అవామీ యాక్షన్ కమిటీ కూడా ఒకటి. 2003లో హురియత్ కాన్ఫరెన్స్ రెండుగా చీలిపోగా మిర్వాయిజ్ నేతృత్వంలోని వర్గానికి మితవాద వర్గమని పేరు. కశ్మీర్ రాజకీయాల్లోకి రాకమునుపు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలనుకన్న మిర్వాయిజ్ ఆ తరువాతి కాలంలో ఇస్లామిక్ స్టడీస్‌లో స్నాతకోత్తర విద్యతోపాటు పీహెచ్‌డీ కూడా చేశారు. జమ్మూ కశ్మీర్‌లో తొలి రాజకీయ పార్టీగా గుర్తింపు పొందిన ముస్లిం కాన్ఫరెన్స్ తొలి అధ్యక్షుడు మిర్వాయిజ్ తాత. కశ్మీర్ సమస్యను అంతర్జాతీయ వేదికల్లో తరచూ లేవనెత్తే మిర్వాయిజ్ భారత్, పాకిస్థాన్‌ల మధ్య చర్చల ద్వారా మాత్రమే సమస్య పరిష్కారం అవుతుందని నమ్మేవారిలో ఒకరు. అయితే ఇరుపక్షాలు ప్రజల ఆశయాలను కూడా అర్థం చేసుకోవాలని అంటారాయన.

### ఉగ్రవాదానికి బీజం... గిలానీ...



కశ్మీర్ సమస్యకు బీజం పడిన సమయం నుంచి జీవించి ఉన్న అతికొద్ది మంది రాజకీయ నేతల్లో సయ్యద్ అలీ షా గిలానీ ఒకరు. 1929 సెప్టెంబరు 29న బండిపొరలో జన్మించిన గిలానీ వేర్పాటువాద సంస్థ హురియత్ కాన్ఫరెన్స్‌కు అధ్యక్షుడిగా చాలాకాలం పనిచేశారు. కశ్మీర్‌లో ఉగ్రవాదానికి బీజం పడింది గిలానీ విధానాల కారణంగానే అని కొంతమంది నేతలు ఆరోపిస్తారు. హురియత్ కాన్ఫరెన్స్ రెండు భాగాలుగా విడిపోయిన తరువాత తెహ్రీక్ ఏ హురియత్ పేరుతో మరో పార్టీని స్థాపించిన గిలానీ ఉగ్రవాదుల మరణాలకు నిరసనగా తరచూ కశ్మీర్‌లో బంద్‌లు, రాస్తారోకోలకు పిలుపునిచ్చేవారు కశ్మీర్ సమస్యకు స్వాతంత్ర్యం ఒక్కటే పరిష్కారమన్న అంశంపై ఒక సదస్సు నిర్వహించినందుకుగాను.. .2010లో భారత ప్రభుత్వం గిలానీతోపాటు రచయిత్రి అరుంధతీ రాయ్, మావోయిస్టు సానుభూతిపరుడు వరవర రావులపై భారత ప్రభుత్వం దేశద్రోహం కేసు నమోదు చేసింది. 2016లో బుర్హాన్ వానీ మరణం తరువాత ఏర్పడ్డ పరిస్థితుల్లో కశ్మీర్‌లో సాధారణ స్థితిని తీసుకొచ్చేందుకని గిలానీ ఐక్యరాజ్య సమితికి లేఖ రాశారు. భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై గిలానీ పాస్‌పోర్టును 1981లోనే రద్దు చేశారు. అయితే 2006లో మూత్రనాళ కేన్సర్ బారిన పడినట్లు నిర్ధారణ కావడంతో చికిత్స కోసం అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ గిలానీకి మళ్లీ పాస్‌పోర్టు దక్కేలా చేశారు.

## కేంద్ర పాలిత ప్రాంతాలుగా జమ్మూకశ్మీర్, లదాఖ్

| | ఇప్పటివరకు | ఇకపై |
|---|---|---|
| రాష్ట్రాలు | 29 | 28 |
| కేంద్రపాలిత ప్రాంతాలు | 7 | 9 |

**న్యూఢిల్లీ:** ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూ కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేయాలని కేంద్రం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రాల విభజన తర్వాత భారతదేశంలో వైశాల్యపరంగా అతి పెద్ద కేంద్ర పాలిత ప్రాంతంగా (యూటీ) జమ్మూ కశ్మీర్ నిలవనుంది. దీని తర్వాతి స్థానంలో లదాఖ్ ఉండనుంది. కశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించాలన్న కేంద్రం నిర్ణయాన్ని పీడీపీ, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. లదాఖ్‌ను యూటీ చేయడాన్ని ఆ ప్రాంతంలో నివసించే కొన్ని వర్గాల ప్రజలు మాత్రం స్వాగతిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన జమ్మూ కశ్మీర్, లదాఖ్‌లతో కలిపి భారత్‌లో యూటీల సంఖ్య తొమ్మిదికి చేరింది. జమ్మూ కశ్మీర్, లదాఖ్, ఢిల్లీ, పుదుచ్చేరి, డమన్ అండ్ డయ్యూ, దాద్రా నగర్ హవేలీ, ఛండీగఢ్, లక్షద్వీప్, అండమాన్ నికోబార్ దీవులు ప్రస్తుతం యూటీలుగా ఉన్నాయి. వీటిలో ఢిల్లీ, పుదుచ్చేరిలకు శాసనసభలు ఉండగా.. తాజాగా వీటికి జమ్మూ కశ్మీర్ జత చేరింది. శాసనసభలు ఉన్న యూటీలకు లెఫ్టినెంట్ గవర్నర్‌లు ఉంటారు. ఛండీగఢ్, దాద్రా నగర్ హవేలీ, డమన్ అండ్ డయ్యూ, లక్షద్వీప్, లదాఖ్, అండమాన్ నికోబార్ దీవులను కేంద్రం పాలించనుంది. యూటీల నుంచి పార్లమెంట్‌కు ఎంపికయ్యే వారి సంఖ్య మారుతుంటుంది. ఢిల్లీ నుంచి ఏడుగురు ఎంపీలు పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

**107 అసెంబ్లీ స్థానాలు:** 'జమ్మూ కశ్మీర్ పునర్విభజన బిల్లు–2019' ప్రకారం జమ్మూ కశ్మీర్ శాసనసభకు 107 స్థానాలు ఉండనున్నాయి. పునర్విభజన తర్వాత మరో 7 స్థానాలు పెరిగి 114కు చేరే అవకాశం ఉంది.

### '370'లు ఇంకా ఉన్నాయి!

ఈశాన్య రాష్ట్రాలకు ఎక్కువగా వర్తించే ఆర్టికల్ –371 ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. చాలా రాష్ట్రాలకు ఈ ఆర్టికల్ ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తోంది. ఆర్టికల్ –371ఏ నాగాలాండ్ హక్కులకు సంబంధించినది. నాగా ఆచార చట్టం ప్రకారం పౌర, నేర న్యాయ పాలన నిర్ణయాలకు సంబంధించి, భూ యాజమాన్యం, బదలాయింపునకు సంబంధించి నాగా అసెంబ్లీ ఆమోదించకుండా పార్లమెంట్ చేసే చట్టాలేవీ నాగాలకు వర్తించవు. ఆర్టికల్ –371ఏ లాంటిదే మిజోరంనకు సంబంధించిన ఆర్టికల్ –371జి. అస్సాంకు ఆర్టికల్ –371బి ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తోంది. ఇక ఆర్టికల్ –371సి మణిపూర్‌కు, ఆర్టికల్ –371ఎఫ్ సిక్కింకు, ఆర్టికల్ –371హెచ్ అరుణాచల్ ప్రదేశ్‌కు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తాయి.

# హిందూ రాజు ముస్లిం రాజ్యం

## హైదరాబాద్ దీనికి పూర్తి రివర్స్

స్వాతంత్ర్యానంతర పరిణామాల్లో రెండు రాచరిక పాలనల్లోని రాజ్యాంగ అంశాలు కీలకంగా మారాయి. అవే హైదరాబాద్, కశ్మీర్ సంస్థానాలు. ఈ రెండు సంస్థానాల మధ్య ఒక పోలిక ఉంది. హైదరాబాద్ సంస్థానంలో మెజారిటీ ప్రజలు హిందువులు కాగా, రాజ్యాధికారం ముస్లింల చేతిలో ఉండేది. కశ్మీర్‌లో మెజారిటీ ప్రజలు ముస్లింలు కాగా, అధికారం హిందూ రాజు చేతిలో



రాజా హరిసింగ్



మీర్ ఉస్మాన్ అలీఖాన్

ఉండేది. భారత్‌లో విలీనానికి నిజాం రాజు అంగీకరించకపోవడంతో 'ఆపరేషన్ పోలో'తో భారత్ సైన్యాన్ని దించడంతో, హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైంది. పాకిస్తాన్ సైన్యం దురాక్రమణకు రావడంతో కశ్మీర్ రాజు రాజా హరిసింగ్ కొన్ని షరతులు, ఒప్పందాలకు లోబడి కశ్మీర్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేశారు.

బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యాన్ని సాధించుకునేటప్పటికి 562 ప్రాంతాలు రాచరిక పాలనలో ఉన్నాయి. అయితే అందులో మూడు మాత్రం 1947 స్వాతంత్ర్యానంతరం కూడా అదే రాచరిక వ్యవస్థలో కొనసాగాయి. కశ్మీర్, హైదరాబాద్, గుజరాత్ కతీవార్ ప్రాంతంలోని జునాగఢ్‌లు మాత్రం 1947 నాటికి భారత్‌లో భాగం కాలేదు.

**హైదరాబాద్ సంస్థానం ప్రత్యేకత...**

బ్రిటిష్ పాలన సమయంలోనే హైదరాబాద్ సంస్థానానికి ప్రత్యేక సైన్యముండేది. ప్రత్యేకంగా రైల్వే, పోస్టల్ విభాగాలున్నాయి. హైదరాబాద్ సంస్థానంలో 80 శాతంగా ఉన్న హిందువులను ముస్లిం రాజు పాలించేవాడు.







భారత్ పాకిస్తాన్ విభజన సందర్భంగా హైదరాబాద్ సంస్థాన నిజాం రాజు 1947 జూన్ 26న హైదరాబాద్ సంస్థానం ఇటు పాకిస్తాన్‌లోకానీ, భారత్‌లో కానీ విలీనం కాబోదని ఫర్మానా జారీ చేశాడు. హైదరాబాద్ సంస్థానంపై సంపూర్ణాధిపత్యాన్ని కొనసాగించాలని భావించాడు. ఆయనకు టోరీ పార్టీ నాయకుడు విన్‌స్టన్ చర్చిల్ వెన్నుదన్నుగా నిలిచాడు. 1947 ఆగస్టు 15 నాటికి నిజాం రాజు తేల్చుకోలేకపోవడంతో భారత ప్రభుత్వం మరో రెండు నెలల సమయమిచ్చింది. నాటి కేంద్ర హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ హైదరాబాద్ స్వతంత్రతను ఒప్పుకునే ప్రసక్తే లేదని నిజాంని హెచ్చరించారు. హైదరాబాద్ సంస్థానంలోని ప్రజలపై నిరంకుశ పోకడలను మానుకోవాలని నిజాం రాజును భారత సర్కార్ 1948 సెప్టెంబర్ 7న హెచ్చరించింది. భారతసైన్యం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్‌లో అడుగుపెట్టడంతో హైదరాబాద్ సంస్థానం ఎట్టకేలకు భారత్‌లో విలీనమైంది. అదేసమయంలో ముస్లిం జనాభా అధికంగా ఉన్న కశ్మీర్ సంస్థానాన్ని రాజా హరిసింగ్ పాలిస్తున్నారు. కశ్మీర్‌పై పాకిస్తాన్ దండెత్తడంతో రాజా హరిసింగ్ కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేసేందుకు ముందుకొచ్చారు. చివరకు కొన్ని షరతులకు లోబడి 1948 అక్టోబర్ 27న కశ్మీర్ భారత్‌లో విలీనం అయ్యింది.

# పండిట్ల ఘర్ వాపసీ!

**370 రద్దుతో కశ్మీరీ పండిట్లలో ఉత్సాహం**

**తమ ఇళ్లకు తిరిగెళ్లే రోజులు దగ్గర్లో ఉన్నాయంటూ హర్షం**

దేశమంతా జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు నిర్ణయంపై వాదోపవాదనలు జరుగుతుంటే.. కశ్మీరీ పండిట్లు సంబరాలు చేసుకుంటున్నారు. వీరు కశ్మీర్‌ను ఎందుకు వదిలేయాల్సి వచ్చింది.. ఎందరు విడిచి వెళ్లారు? ఇప్పుడెక్కడ స్థిరపడ్డారు? లోయలో ఇప్పుడెందరున్నారు? చూద్దాం...

**మూడు కేటగిరీలు పండిట్లు..**

కశ్మీరీ పండిట్ల సమాజం ముఖ్యంగా మూడు వర్గాలు. వీరిలో ముందుగా చెప్పుకోవాల్సింది బన్మాసీల గురించి. కశ్మీర్ లోయ ముస్లిం రాజుల పాలనలో ఉన్నప్పుడు వీరంతా వ్యాలీని వదిలేసి వెళ్లిపోయి.. కొన్నేళ్లకు తిరిగి వచ్చారు. ఇక రెండో కేటగిరీ మల్మాసీ. లోయలో జరుగుతున్న అన్ని కష్టనష్టాలను తట్టుకొని అక్కడే స్థిరపడ్డారు. మూడో కేటగిరీ బుహ్రీస్. వ్యాపార వ్యవహారాలు సాగించే పండిట్లంతా ఈ కేటగిరీ వారే. అయితే 1989లో పండిట్ల భారీ వలసలతో వీరి మధ్య వ్యత్యాసాలు చాలా తగ్గిపోయాయి.

**డోగ్రా పాలనలో..**

1846 నుంచి 1947 వరకు డోగ్రా రాజవంశ పాలనలో ముస్లింల సంఖ్య మెజారిటీగానే ఉన్నప్పటికీ కశ్మీరీ పండిట్ల హవా సాగింది. ఈ కాలంలో లోయలో అధికంగా ఉన్న ముస్లింలతో సఖ్యతగానే ఉంటూ పండిట్లు జీవనం సాగించారు. అయితే 1950 భూ సంస్కరణ నిర్ణయాల ఫలితంగా 20 శాతం పండిట్లు కశ్మీర్ లోయను వదిలేసి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. 1981 నాటికి లోయలో పండిట్ల జనాభా కేవలం 5 శాతం.

**పెరిగిన అకృత్యాలు**

1989 మధ్య నాటికి ఇస్లామిక్ ఉగ్రవాదం పెరిగిపోయింది. పండిట్లలోని పురుషులను చంపడం, మహిళలపై అత్యాచారాలు జరపడం, వారి ఇళ్లలో చోరీలు చేయడం అధికమయ్యాయి. తప్పనిసరి పరిస్థితులలో పండిట్లు లోయను వదిలేసి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. కొన్ని కథనాల ప్రకారం 1990లో సుమారు 1,40,000 మంది పండిట్ల జనాభా ఉందని అంచనా వేయగా.. వారిలో లక్ష మంది కశ్మీర్‌ను వదిలేశారు. వలస వెళ్లిన వారిలో అధికంగా జమ్మూ, ఢిల్లీ చుట్టుపక్కల ప్రాంతాల్లో స్థిరపడ్డారు.

**పండిట్లకు బాల్ థాక్రే సాయం..**

కశ్మీర్ నుంచి వలస వచ్చిన పండిట్లకు మొదటగా సాయం చేసింది శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాక్రే. ఇంజనీరింగ్ కాలేజీల్లో పండిట్ల కుటుంబాల్లోని పిల్లలకు ఆయన రిజర్వేషన్లు కల్పించారు. కాగా జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం లెక్కల ప్రకారం 2010లో కశ్మీర్‌లో 808 పండిట్ల కుటుంబాల్లో మొత్తం 3,445 మంది జనాభా ఉన్నట్లు తేలింది.



# నాలుగు యుద్ధాలు



**1947 పీఓకే జననం**

ఈ యుద్ధాన్ని మొట్టమొదటి కశ్మీర్ యుద్ధమని కూడా పిలుస్తారు. దేశ విభజనకు ముందు అతి పెద్ద సంస్థానంగా ఉన్న జమ్మూ కశ్మీర్ హిందూ మతానికి చెందిన మహారాజా హరిసింగ్ పాలనలో ఉండేది. 1947 దేశ విభజన సమయంలో సంస్థానాల విలీనాన్ని బ్రిటీష్ పాలకులు వారి ఇష్టానికే వదిలిపెట్టారు. భారత్‌లో కలుస్తారా, పాక్‌లో కలుస్తారా ? లేదంటే స్వతంత్రంగా ఉంటారా అన్నది వారే నిర్ణయించుకోవాలని తెలిపారు. రాజా హరిసింగ్ భారత్‌లో ఎక్కడ కలుస్తారోనన్న ఆందోళనతో పాకిస్తాన్ 1947 అక్టోబర్‌లో కశ్మీర్‌పై దండయాత్ర చేసింది. ఇస్లాం ఆదివాసీలు పాక్ ఆర్మీ అండదండ చూసుకొని కశ్మీర్‌పై దాడికి దిగాయి. దీంతో మహారాజా హరిసింగ్ కశ్మీర్ ప్రాంతాన్ని భారత్‌లో కలుపుతానని ప్రకటించి మన దేశ సైనిక సాయాన్ని అభ్యర్థించారు. ఇరు వర్గాల మధ్య పోరు కొన్నాళ్లు సాగింది. కశ్మీర్‌లో అత్యధిక భాగాన్ని పాక్ ఆక్రమించుకుంది. అప్పుడే పాక్ ఆక్రమిత కశ్మీర్, వాస్తవాధీన రేఖ ఏర్పడ్డాయి. చివరికి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి జోక్యంతో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రకటించాయి. కశ్మీర్ లోయలో రెండింట మూడు వంతుల భాగం భారత్ కిందకి వచ్చాయి. ఇక పాక్ ఆక్రమించుకున్న ప్రాంతాన్ని ఆజాద్ కశ్మీర్ గిల్జిట్ బల్టిస్తాన్ అని పిలుస్తారు.

**1965 పాక్ పలాయనం**

జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదుల చొరబాటుకు పాక్ 1965లో భారీ కుట్రకు తెరతీసింది. ఆపరేషన్ గిబ్రాల్టర్ పేరుతో భారత్‌లో మారణహోమం సృష్టించడానికి పన్నాగాలు రచించింది. దీంతో భారత్ పశ్చిమ పాకిస్తాన్‌పై పూర్తి స్థాయి యుద్ధాన్ని ప్రకటించింది. మొత్తం 17 రోజుల పాటు సాగిన ఈ యుద్ధంలో ఇరుపక్షాలకు భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అత్యధికంగా యుద్ధట్యాంకులు వినియోగించింది ఈ యుద్ధంలోనే. దీనినే రెండో కశ్మీర్ యుద్ధం అని కూడా పిలుస్తారు. ఈ యుద్ధంలో కొద్ది రోజులకే పాక్ తోక ముడిచింది. పాకిస్తాన్ మీద భారత్ పైచేయి సాధించింది. అదే సమయంలో అమెరికా, రష్యా దౌత్యపరమైన జోక్యంతో యుద్ధం నిలిచిపోయింది. తాష్కెంట్ డిక్లరేషన్ అమల్లోకి వచ్చింది.

**1971 బంగ్లా విముక్తి**

ఈ యుద్ధంలో వాస్తవానికి కశ్మీర్ ప్రమేయం ప్రత్యక్షంగా లేకపోయినా పాక్‌కు అత్యంత నష్టం కలిగించింది, భారత్ కశ్మీర్‌లో తిరిగి కొంత భాగాన్ని ఆక్రమించుకుంది ఈ యుద్ధంతోనే. పశ్చిమ, తూర్పు పాకిస్తాన్‌ల మధ్య సంక్షోభం తలెత్తడంతో తూర్పు పాకిస్తాన్ (ప్రస్తుతం బంగ్లాదేశ్) పాలకుడు షేక్ ముజీబ్ర్ రెహ్మాన్‌కు అండగా భారత్ నిలబడింది. బంగ్లాదేశ్ విముక్తి కోసం పాక్‌తో యుద్ధం చేసింది. పాక్ ప్రభుత్వ ఆగడాలు భరించలేని బెంగాలీలు బంగ్లాదేశ్ విముక్తి కోసం పోరు బాట పట్టారు. వారికి అండగా నిలిచిన భారత్‌పైకి పాకిస్తాన్ యుద్ధానికి దిగింది. ఎన్నో ప్రాంతాలపై దాడులు మొదలు పెట్టింది. భారత్ ఆర్మీ వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఆ సమయంలోనే పాక్ అధీనంలో ఉన్న కశ్మీర్‌లో 5,795 చదరపు మైళ్ల భాగాన్ని మన సైన్యం కైవసం చేసుకుంది. రెండువారాల పాటు ఉధృతమైన పోరాటం తర్వాత బంగ్లాదేశ్ విముక్తి జరిగింది. ఆ తర్వాత కుదుర్చుకున్న లాహోర్ ఒప్పందంలో భాగంగా భారత్ కశ్మీర్‌లో తాను సొంతం చేసుకున్న భాగాన్ని పాక్‌కు తిరిగి ఇచ్చేసింది. ఇరు దేశాల మధ్య సుహృద్భావ వాతావరణం ఉండాలని, కశ్మీర్‌లో శాంతి నెలకొల్పాలనే భారత్ ఆ నిర్ణయం తీసుకుంది.

**1999 కార్గిల్ చొరబాటు**

1999 మొదట్లో పాకిస్తాన్ దళాలు వాస్తవాధీన రేఖ వెంబడి కశ్మీర్‌లోకి చొచ్చుకువచ్చాయి. కార్గిల్ జిల్లాలో అత్యధిక భాగాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. పాక్ చొరబాట్లను అడ్డుకోవడానికి ఈసారి పెద్ద ఎత్తున మిలటరీ చర్యకి భారత్ దిగింది. రెండు నెలల పాటు ఇరు దేశాల మధ్య పోరు సాగింది. పాక్ ఆక్రమించుకున్న ప్రాంతాలన్నింటినీ భారత్ మిలటరీ తిరిగి తన అధీనంలోకి తెచ్చుకోవడం మొదలు పెట్టింది. పాక్ ఆక్రమించుకున్న ప్రాంతంలో 75 నుంచి 80శాతం వరకు తిరిగి భారత్ అధీనంలోకి వచ్చేశాయి. ఇరు దేశాల మధ్య యుద్ధ తీవ్రత ఎక్కువైపోతూ ఉండడంతో పాకిస్తాన్‌ను వెనక్కి తగ్గమంటూ అమెరికా దౌత్యపరమైన ఒత్తిడిని పెంచింది. అప్పటికే పాక్ సైనికుల్లో నైతిక స్థైర్యం దెబ్బతింది. 4 వేల మంది వరకు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఆర్థికంగా కూడా ఆ దేశం బలహీనపడిపోయింది. భారీ పరాజయాన్ని మూటగట్టుకున్న పాక్ యుద్ధాన్ని నిలిపివేసింది. అలా కార్గిల్ యుద్ధంతో భారత్ అతి పెద్ద విజయాన్ని నమోదు చేసుకుంది.

## ఎవరేమన్నారంటే...

### జనసంఘ్ నుంచి ఉన్న ఆలోచన: అడ్వాణీ



ఆర్టికల్ 370 రద్దు జనసంఘ్ ప్రారంభ రోజుల నుంచి బీజేపీకి ఉన్న ప్రధాన ఆలోచన. జాతీయ సమగ్రతను బలోపేతం చేసేలా ఈ నిర్ణయం ఉంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం నాకు ఆనందాన్ని కలిగించింది. జమ్మూ కశ్మీర్, లఢఖ్‌లు శాంతితో పరిఢవిల్లి, అభివృద్ధి చెందేందుకు ప్రార్థనలు చేస్తా. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలకు అభినందనలు.

### ఇదో చీకటి రోజు: మెహబూబా ముఫ్తీ



1947లో కశ్మీర్‌కు భారత్ ఇచ్చిన మాటను తప్పింది. ఇక్కడి ప్రజలను భయపెట్టి జమ్మూకశ్మీర్‌ను లాక్కుంది. దీని వల్ల భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదు. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇదో చీకటి రోజు. కొద్ది రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై మీడియా వ్యవహరించిన తీరు బాధాకరం. ముస్లిం మెజారిటీ రాష్ట్రాలపై భారత ప్రభుత్వం దృష్టి సారించింది. ముస్లింలకు వారి సొంత రాష్ట్రంలోనే అధికారాలు తగ్గించే రీతిలో వ్యవహరిస్తోంది. ప్రస్తుతం నేను గృహనిర్బంధంలో ఉన్నాను. సందర్శకులను కలిసే వీలు లేదు. ఎప్పుడు బయటకు వస్తానో తెలియని పరిస్థితి.

### ఫఖ్రుద్దీన్‌లాగే చేశారు: రామచంద్రగుహ



రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆర్టికల్ 370 రద్దు చేస్తూ విడుదల చేసిన ప్రకటన 1975లో అప్పటి రాష్ట్రపతి ఫఖ్రుద్దీన్ అలీ ప్రకటించిన ఎమర్జెన్సీలాగే ఉంది. ఈ చర్య ప్రజాస్వామ్యానికి తగింది కాదు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని నాయకులు తీసుకున్న నిర్ణయం. పార్లమెంటు లోపలగానీ, బయటగానీ కనీసం చర్చ కూడా చేయలేని వారు మతితప్పి తీసుకున్న నిర్ణయం. ఇలాంటి నిర్ణయం తీసుకునే ముందు అక్కడ పని చేసిన ముఖ్యమంత్రులతో చర్చించరా? ప్రజల అభిప్రాయాలతో నిమిత్తం లేదా? ఇప్పుడు కశ్మీర్‌కి జరిగింది రేపు కర్ణాటకకు జరిగితే ఏం చేయాలి.

### భారత్, పాక్ సంయమనం పాటించాలి

**ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్**



ప్రస్తుత పరిస్థితులు మరింత దిగజారకుండా ఉండేందుకు భారత్, పాకిస్తాన్‌లు వీలైనంత వరకు సంయమనం పాటించాలి. భారత్, పాక్‌లు తాజాగా సరిహద్దు రేఖ వెంబడి సైనిక కార్యకలాపాలను ముమ్మరం చేయడాన్ని ఇరుదేశాల్లోని యూఎన్ మిలిటరీ పర్యవేక్షణ సంస్థ గుర్తించింది. దీంతో పరిస్థితులు మరింత దిగజారకుండా ఇరు దేశాలు వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

### హిందువులు నిశ్చింతగా ఉండగలరు

**అంతర్‌రాష్ట్రీయ హిందూ పరిషద్ నాయకుడు ప్రవీణ్ తొగాడియా**



జమ్మూ కశ్మీర్‌పై కేంద్రం తీసుకున్న నిర్ణయం గొప్పది. ఇది ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న అంశం. ఈ చర్యతో హిందుస్థాన్ కల నెరవేరింది. ఇప్పుడు కశ్మీరి హిందువులు తమ ఇళ్లను, స్థలాలను కాపాడుకొని, సురక్షితంగా జీవించగలరు. ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ జమ్మూ కశ్మీర్, లదాఖ్ ప్రాంతాలను వేరు చేయడం గొప్ప సాహసం.

### ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: బీజేడీ

జమ్మూ కశ్మీర్ వాస్తవానికి, ఈ రోజు భారత్‌లో అంతర్భాగమైంది. పీఓకే కూడా భారత్‌లో అంతర్భాగమయ్యే రోజు కోసం ఎదురు చూస్తున్నాం. స్వేచ్ఛ, సమగ్రత, సార్వభౌమాధికారాలే మా ప్రధాన లక్ష్యాలు. భారతీయులకు కశ్మీర్ అంశం భావోద్వేగపూరితమైంది.

### ఆర్టికల్ 370 రద్దుపై ట్వీట్ల వెల్లువ..

**న్యూఢిల్లీ:** జమ్మూ కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370 రద్దుపై ట్విట్టర్‌లో సోమవారం వేలాది మంది స్పందించారు. ఇది భారత్ సాధించిన విజయంగా అభివర్ణిస్తూ 'భారత్ ఏక్ హై' అని కొందరు నినదిస్తే.. 'స్టాండ్ విత్ కశ్మీర్' అంటూ కేంద్రం చర్యను వ్యతిరేకిస్తూ మరికొందరు కామెంట్లు చేశారు. సోమవారం రాజ్యసభలో ఆర్టికల్ 370 రద్దుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రవేశపెట్టిన తీర్మానానికి ఆమోదం లభించగానే ట్విట్టర్‌లో స్పందనలు వెల్లువెత్తాయి. ఇది చారిత్రాత్మక విజయం అని.. జాతీయ సమగ్రతను మరింత బలపరిచింది అంటూ కొందరు కామెంట్లు చేశారు. 'ఒకే జెండా, ఒకే జాతి, ఒకే దేశం, ఒకే రాజ్యాంగం.. కశ్మీర్ హమారా హై..' అంటూ ఒకరు ట్వీట్ చేయగా, చాలామంది 'అఖండ భారత్' అనే పేరుతో జాతీయ జెండాను పోస్ట్ చేశారు. ఇక ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాను కొనియాడుతూ చాలా మంది ట్వీట్ చేశారు. 2024లో మరోసారి ఎన్డీయేదే గెలుపని.. ఇక కాంగ్రెస్ మాజీ చీఫ్ రాహుల్ 2029 ఎన్నికలపై దృష్టి సారించాలని వ్యంగ్యంగా కామెంట్లు చేశారు. మరోవైపు కేంద్రం చర్యను నిరసిస్తూ జమ్మూ కశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో 'స్టాండ్ విత్ కశ్మీర్' అంటూ మరికొందరు ట్వీట్లు చేశారు. ముందు జాగ్రత్త చర్యగా ఆదివారం రాత్రి నుంచే కశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. మన కశ్మీరి ప్రజలపై జరుగుతున్న హింసను ఖండిద్దాం. వారికి మనం తోడుగా ఉన్నామని చాటి చెబుదామంటూ ట్వీట్లు చేశారు.

### చరిత్రాత్మకం.. దుస్సాహసం

**న్యాయనిపుణుల మిశ్రమ స్పందన**



**న్యూఢిల్లీ:** ఆర్టికల్–370ను రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంపై న్యాయ నిపుణుల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమయింది. కొందరు ఈ నిర్ణయాన్ని చరిత్రాత్మకం అంటూ స్వాగతించగా, మరికొందరు రాజకీయ దుస్సాహసం అంటూ తప్పుపట్టారు. సీనియర్ న్యాయవాది, రాజ్యాంగ న్యాయ నిపుణుడు రాకేశ్ ద్వివేది స్పందిస్తూ.. 'ఈ నిర్ణయం పూర్తిగా న్యాయబద్ధమయింది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కోర్టుల్లో వేసే పిటిషన్లు నెగ్గేందుకు అవకాశం లేదు. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న చరిత్రాత్మక నిర్ణయమిది. 370 నిబంధనను తొలగించాల్సిందే. కశ్మీర్‌లో బయటి వారికి కూడా అవకాశం కల్పించాలి. ఆర్టికల్ 35ఏ అవసరం ఏమిటో నాకు తెలియడం లేదు' అని వ్యాఖ్యానించారు. కేంద్ర న్యాయశాఖ మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత, న్యాయవాది అశ్వినీ కుమార్ స్పందిస్తూ.. జమ్మూకశ్మీర్ హోదాను మారుస్తూ కేంద్ర తీసుకున్న నిర్ణయంతో దేశంలో తీవ్ర రాజకీయ పరిణామాలు సంభవించే ప్రమాదముందన్నారు. మాజీ అటార్నీ జనరల్ సోలి సొరాబ్జీ, సీనియర్ అడ్వొకేట్ హరీశ్ సాల్వే మాట్లాడుతూ.. 'కేంద్రం తీసుకున్న చర్య ఏమంత విప్లవాత్మకమైంది కాదు. ఒకప్పటి రాష్ట్రపతి ఉత్తర్వుల స్థానంలో తాజా ఉత్తర్వులు అమల్లోకి వస్తాయి. ఇప్పటి వరకు ఆ రాష్ట్రంలో అమలుకు వీలు కాని చట్టాలను ఇకపై అమలు చేసేందుకు వీలుంటుంది. ఇది చాలా సంక్లిష్టమైన వ్యవహారం' అని పేర్కొన్నారు.

**తప్పుపట్టిన మాజీ మధ్యవర్తులు**

కశ్మీర్ సమస్య పరిష్కారం కోసం గతంలో భారత ప్రభుత్వం– కశ్మీరీల మధ్య జరిగిన చర్చల్లో పాల్గొన్న మధ్యవర్తులు తాజాగా మోదీ ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. జమ్మూకశ్మీర్‌లోని భాగస్వామ్య పక్షాలతో కనీసం సంప్రదించకుండా ఆర్టికల్ 370ని రద్దుచేయడాన్ని వారు తప్పుపట్టారు.

# ఆర్టికల్ 370 రద్దును ప్రతిఘటిస్తాం



- భారత్ చర్యను అడ్డుకుంటామన్న పాకిస్తాన్
- అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకెళతామని స్పష్టీకరణ
- నేడు ప్రత్యేకంగా సమావేశం కానున్న పార్లమెంట్

**ఇస్లామాబాద్:** జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ను రద్దు చేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయాన్ని పాకిస్తాన్ ఖండించింది. ఐరాస తీర్మానాలకు వ్యతిరేకంగా భారత్ తీసుకున్న నిర్ణయంపై అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకెళతామని తెలిపింది. కశ్మీరీలకు మద్దతు కొనసాగిస్తామని పేర్కొంది. తాజా పరిణామంతో రెండు అణ్వస్త్ర దేవాల మధ్య సంబంధాలు మరింత క్షీణిస్తాయని పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ వ్యాఖ్యానించారు. భారత్ ప్రకటన ఐరాస తీర్మానాలకు వ్యతిరేకమని అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ పేర్కొన్నారు. ఈ విషయమై చర్చించేందుకు ఆయన మంగళవారం ప్రత్యేకంగా పార్లమెంట్ ఉభయసభల సంయుక్త సమావేశం ఏర్పాటు చేశారు. పలు కశ్మీరీ సంఘాలు, సంస్థలు ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపాయి. నీలం లోయలో భారత్ బాంబు దాడులతో తీవ్రంగా దెబ్బతిన్న సరిహద్దు ప్రాంతాలను విదేశీ ప్రతినిధుల బృందం సందర్శించనుందని పాక్ అధికారులు తెలిపారు. నియంత్రణ రేఖ వెంబడి పౌరులే లక్ష్యంగా భారత్ చేసిన క్లస్టర్ బాంబులతో తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఈ విదేశీ బృందంలో చైనా, బ్రిటన్, ఫ్రాన్సు, టర్కీ, జర్మనీ దౌత్యాధికారులు ఉంటారన్నారు. అయితే, పాక్ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. అవి అబద్ధాలు, మోసమని పేర్కొంది.

**'అణ్వస్త్ర' దేశాల మధ్య సంబంధాలు క్షీణిస్తాయి:** ఆర్టికల్–370 రద్దుతో అణ్వస్త్ర పాటవ ఇరుగుపొరుగు దేశాల మధ్య సంబంధాలు మరింత దిగజారుతాయని ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు. మలేసియా ప్రధాని మహతీర్ మహమ్మద్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఆయన... కశ్మీర్ హోదాను మార్చడం అన్యాయం, ఐరాస తీర్మానాల ఉల్లంఘన. భారత్ చర్యతో అణ్వస్త్ర పాటవ దేశాల మధ్య సంబంధాలు మరింత దిగజారుతాయి' అని తెలిపారు. కశ్మీర్‌లో పరిస్థితులను నిశితంగా గమనిస్తుంటామని, పాక్‌తో చర్చలు జరుపుతుంటామని మలేసియా ప్రధాని మహతీర్ పేర్కొన్నారని పాక్ మీడియా తెలిపింది. వచ్చే నెలలో న్యూయార్క్‌లో జరిగే ఐరాస సమావేశాల సందర్భంగా ప్రధాని ఇమ్రాన్‌తో భేటీ ఉంటుందని కూడా ఆయన తెలిపారని పేర్కొంది.

**కశ్మీరీలకు మద్దతు కొనసాగిస్తాం**

కశ్మీర్‌పై భారత్ తీసుకున్న ఏకపక్ష, చట్ట విరుద్ధ చర్యను అడ్డుకునేందుకు సాధ్యమైన అన్ని ప్రయత్నాలను చేస్తామని పాక్ పేర్కొంది. విదేశాంగ శాఖ ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. 'భారత ప్రభుత్వ నిర్ణయం జమ్మూకశ్మీర్‌తోపాటు, పాకిస్తాన్ ప్రజలకు కూడా ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. భారత్ తీసుకునే చట్ట విరుద్ధమైన చర్యలను ప్రతిఘటించేందుకు ఈ వివాదంతో సంబంధం ఉన్న పాకిస్తాన్ శాయశక్తులా ప్రయత్నిస్తుంది. కశ్మీర్ ప్రజల స్వయం నిర్ణయాధికారానికి దౌత్యపరమైన రాజకీయ, నైతికమద్దతును కొనసాగిస్తామని మరోసారి స్పష్టం చేస్తున్నాం' అని తెలిపింది. కాగా, జమ్మూకశ్మీర్ పరిణామాలపై చర్చించేందుకు మంగళవారం పాక్ పార్లమెంట్ ప్రత్యేకంగా సమావేశం కానుంది.

### అంతర్జాతీయ సమాజానికి వివరిస్తాం

కశ్మీర్ విషయంలో భారత్ చర్యలను ఐరాస, ఇస్లామిక్ దేశాల సహకార సంస్థ (ఓఐసీ)తోపాటు మిత్రదేశాలు, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాల దృష్టికి తీసుకెళతామని పాక్ విదేశాంగ మంత్రి షా మహ్మూద్ ఖురేషి తెలిపారు. త్వరలో ఇక్కడ పర్యటించనున్న అమెరికా ప్రతినిధులకు కూడా ఈ విషయం తెలియపరుస్తాం' అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు. 'కశ్మీర్‌పై ఐరాస పలు తీర్మానాలు చేసింది. కశ్మీర్‌ను ఐరాస వివాదాస్పద ప్రాంతంగా గుర్తించిందన్న విషయాన్ని మాజీ ప్రధాని వాజ్‌పేయి కూడా అంగీకరించారు' అని ఆయన అన్నారు. 'కశ్మీరీలకు పాక్ మద్దతు ఇకపై నా కొనసాగుతుంది. భారత్ నిర్ణయం తప్పని చరిత్రే రుజువు చేస్తుంది' అని వ్యాఖ్యానించారు. భారత్ నిర్ణయం అక్కడి ప్రజల అభిప్రాయంపై ఎలాంటి ప్రభావం చూపబోదు అన్నారు.

# ముసురుకున్న సందేహాలు



**న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌ను పునర్విభజిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చట్టబద్ధతపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్టికల్ -370ను రద్దు చేయడం జమ్మూకశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సాంకేతికంగా సవరిస్తుందనే విమర్శలు ఎదురవుతున్నాయి.**

**ఇవీ చిక్కులు**

- ఆర్టికల్ 370 (3) ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వులపై 'రాజ్యాంగబద్ధమైన అసెంబ్లీ (కాన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీ)' సలహా తీసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా దీన్ని 'శాసనసభ (లెజిస్లేటివ్ అసెంబ్లీ)'గా సవరించారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లో శాసనసభ లేనందున ఆ అధికారాలు గవర్నర్‌కు దఖలు పడ్డాయి. గవర్నర్ సూచనల మేరకే ఆర్టికల్ -370ను రద్దు చేశారు. అయితే, ఇది చెల్లదని కొందరు నిపుణులు వాదిస్తున్నారు. రాష్ట్రపతి ఉత్తర్వులకు 'ముందు' రాజ్యాంగబద్ధమైన అసెంబ్లీ నుంచి ఏకాభిప్రాయం సేకరించాలని ఆర్టికల్ 370 (3)పేర్కొంటోంది.
- శాసనసభ ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కూడుకున్నది కాగా గవర్నర్ కేంద్రం ప్రతినిధిగా నియమితులవుతారు. ఎన్నికైన ప్రజాప్రతినిధుల స్థానంలో గవర్నర్ సూచనల ఆధారంగా ఆర్టికల్ -370ను రద్దు చేయవచ్చా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.
- మరోవైపు ఆర్టికల్ -370 తాత్కాలికం కాదని 2016లో ఎస్బీఐ వర్సెస్ సంతోష్ గుప్తా కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులు పేర్కొంటున్నాయి. రాజ్యాంగ బద్ధమైన అసెంబ్లీ సూచనలు చేసే వరకు అది 'పర్మినెంటే' అని చెబుతోంది. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ నుంచి అలాంటి సూచనలు ఏవీ రాలేదు.
- రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని సవరించడం, మార్చడం చెల్లదని పలు తీర్పుల్లో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆర్టికల్ -370 అందులో భాగమేనా? దాన్ని మార్చవచ్చా?
- ఆర్టికల్ -370 రద్దు భారత్‌లో జమ్మూకశ్మీర్ విలీనాన్ని సాంకేతికంగా సవరిస్తుంది.

**అంతర్జాతీయంగా అభ్యంతరం**

- ఐరాస భద్రతా మండలి 47వ తీర్మానం ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా కశ్మీర్ ప్రజలకు స్వయం నిర్ణయాధికార హక్కు కల్పించింది. ఆర్టికల్ -370 రద్దు, స్వయం ప్రతిపత్తిని తొలగించడం ఐరాస భద్రతా మండలి తీర్మానం ఉల్లంఘనగా మారే అవకాశం ఉంది.

### సరోగసీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం



**న్యూఢిల్లీ:** అద్దె గర్భం ద్వారా పిల్లలను కనేందుకు వీలుండే సరోగసీ విధానానికి సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. కమర్షియల్ సరోగసీ విధానాన్ని దేశంలో నిషేధిస్తున్నట్లు తెలిపింది. దీనికి సంబంధించిన 'సరోగసీ (రెగ్యులేషన్) బిల్లు–2019'కి లోక్‌సభ ఆమోదం తెలిపింది. మూజువాణి ఓటు ద్వారా సోమవారం బిల్లు పాసైంది. దీంతో ఇక కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో చట్టబద్ధమైన సరోగసీ బోర్డులు ఏర్పాటుకానున్నాయి. అలాగే సరోగసీ ద్వారా పుట్టిన బిడ్డను.. సదరు బిడ్డ తల్లిదండ్రులు ఎట్టిపరిస్థితుల్లోనూ వదులుకోకూడదు. సరోగసీ ద్వారా పిల్లలను పొందాలనుకునే దంపతులు తమ సమీప బంధువులు ద్వారా మాత్రమే పిల్లలను కనాలని బిల్లులో పేర్కొన్నారు. నిస్వార్థ సేవల ద్వారా బంధు వుల సాయం తీసుకోవాలని బిల్లులో ప్రస్తావించారు. ఈ బిల్లులో పేర్కొన్న దాని ప్రకారం చట్టబద్ధంగా వివాహం జరిగి ఐదేళ్లు నిండిన భారతీయ దంపతులు మాత్రమే సరోగసీ ద్వారా పిల్లలను పొందేందుకు అర్హులు.

### ట్రాన్స్‌జెండర్స్ బిల్లుకు లోక్‌సభ ఓకే

**న్యూఢిల్లీ:** ట్రాన్స్‌జెండర్స్‌కు ఆర్థిక, సామాజిక, విద్య విషయంలో సాధికారత కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లుకు సోమవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ (హక్కుల రక్షణ) బిల్–2019ను లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. దేశంలో ఉన్న 4.80 లక్షల మంది ట్రాన్స్‌జెండర్ల హక్కులు కాపాడటానికి జాతీయ అథారిటీని ఏర్పాటు చేయడానికి ఈ బిల్లు ఉపకరిస్తుంది.

# సైన్యం.. అప్రమత్తం



**న్యూఢిల్లీ:**

**జ**మ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడంతో పాకిస్తాన్ దాడులు నిర్వహించే అవకాశం ఉందని భావించిన కేంద్రం, పీఓకేలో భారీగా సైన్యాన్ని మోహరించింది. పాక్ నుంచి వచ్చే ఏ ప్రతిచర్యనైనా తిప్పికొట్టడానికి సైన్యం సిద్ధంగా ఉందని సైనికవర్గాలు తెలిపాయి. ఆర్మీ ప్రధానాధికారులంతా జమ్మూ కశ్మీర్‌లో జరుగుతున్న పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నారు. కశ్మీర్ లోయలో పాక్ హింసకు, ఐఈడీ పేలుళ్లకు పాల్పడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. అయితే ఏ సమయంలోనూ పరిస్థితిని చేజారనివ్వమని ఓ సీనియర్ మిలిటరీ అధికారి తెలిపారు. 2016లో హిజ్బుల్ ముజాహిద్దీన్ నాయకుడు బుర్హాన్ వానిని హతం చేసినపుడు కశ్మీర్‌లోయలో దాదాపు నాలుగు నెలలకుపైనే అస్థిరత నెలకొంది. అలాంటి పరిస్థితులు మళ్లీ ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆ అధికారి వెల్లడించారు. వైమానిక దళం కూడా అక్కడే ఉంటూ పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తోంది.

**వారిని అదుపు చేయాలి: కేంద్రం**

జమ్మూ కశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో భద్రతా దళాలను మరింత అప్రమత్తతో ఉంచాల్సిందిగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'జాతీయ ప్రయోజనాలు, దేశ భద్రతను బలోపేతం చేయడానికి కేంద్ర కేబినెట్ ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. ఈ నేపథ్యంలో సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగించేలా సాంఘిక వ్యతిరేక శక్తులు రెచ్చిపోయే ప్రమాదం ఉంది. వాటిని అదుపు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా మత పరమైన సున్నిత ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలి.' అని పేర్కొంది.

# ప్రపంచ మీడియాకు హెడ్‌లైన్స్

**భారత ప్రభుత్వ చర్యలపై నిశిత పరిశీలన**



**న్యూఢిల్లీ:** జమ్మూ కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370 రద్దు నిర్ణయం తీసుకున్న నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని భారత మీడియా ఆకాశానికెత్తేస్తూ సోమవారం రోజంతా ప్రత్యేక కథనాలు ప్రసారం చేసింది. ఆర్టికల్ 370 రద్దుతో పరోక్షంగా ప్రభావం పడే పాకిస్తాన్ మీడియా మోదీ ప్రభుత్వ నిర్ణయంపై వ్యతిరేక కథనాలు వండి వారుస్తోంది. ఈ అంశంపై ప్రపంచ మీడియా సంస్థలు ఎలా రిపోర్ట్ చేశాయో ఓసారి చూద్దాం.

**ది గార్డియన్:** జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తోన్న ఆర్టికల్ 370ని తొలగించడానికి ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం తీవ్రమైన నిర్ణయం తీసుకుందని లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ది గార్డియన్ వెల్లడించింది. జమ్మూ కశ్మీర్‌ను విభజించాలన్న నిర్ణయం కూడా నాటకీయమైన ఎత్తుగడ అని తెలిపింది. ఈ నిర్ణయం తో పాకిస్తాన్ వల్ల ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉందంది.

**బీబీసీ:** జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేయాలన్న భారత ప్రభుత్వ నిర్ణయం అత్యంత ముఖ్యమైన చర్యగా ప్రముఖ వార్తా సంస్థ బీబీసీ అభివర్ణించింది. అయితే ఈ నిర్ణయం వల్ల ఉద్రిక్తతలు రాజేసే అవకాశం ఉందంది.

**సీఎన్‌ఎన్:** ఆర్టికల్ 370ని రద్దు చేయాలన్న భారత ప్రభుత్వ చర్య కశ్మీరీలకు మానసికంగా పెద్ద షాక్ కలిగించిందని అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న సీఎన్‌ఎన్ సంస్థ పేర్కొంది. భారత్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఆ రాష్ట్రం పూర్తిగా స్తంభించిపోయిందని తెలిపింది.

**ది వాషింగ్టన్ పోస్ట్:** 'కలహాలకు కొత్త వేదిక'అంటూ భారత ప్రభుత్వ ఆర్టికల్ 370 రద్దు నిర్ణయాన్ని వాషింగ్టన్ పోస్ట్ రిపోర్ట్ చేసింది. భారత్‌లో కశ్మీర్ విలీనమవ్వడానికి ఆర్టికల్ 370 మూలమైందని పేర్కొంది.

# ఆవిర్భావం నుంచి రద్దు వరకు..



**ఆవిర్భావం నుంచి కశ్మీర్ సమస్యలకు, వివాదాలకు నిలయంగా మారింది. నాటి నుంచి కశ్మీర్ ప్రత్యేక హోదా రద్దు వరకు పరిణామాలు...**

- **1846:** ఆంగ్లేయులకు సిక్కులకు మధ్య జరిగిన మొదటి యుద్ధం దరిమిలా జమ్మూ పాలకుడు రాజా గులాబ్ సింగ్‌కు బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీకి మధ్య కుదిరిన ఒప్పందం (అమృతసర్ ఒప్పందం) మేరకు మార్చి 16న జమ్మూకశ్మీర్ స్వతంత్ర రాజ్యంగా ఆవిర్భవించింది.
- **1946, మే:** మహారాజుకు వ్యతిరేకంగా షేక్ అబ్దుల్లా క్విట్ కశ్మీర్ ఉద్యమాన్ని ప్రారంభించారు. అరెస్టయిన అబ్దుల్లాను కాపాడేందుకు నెహ్రూ విఫలయత్నం చేశారు.
- **1946, జులై:** బయటివారి ప్రమేయం అవసరం లేకుండా కశ్మీరీలు తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకుంటారని రాజా హరిసింగ్ ప్రకటించారు.
- **1947, జూన్3:** భారత దేశాన్ని భారత్, పాకిస్తాన్‌లుగా విభజించాలని మౌంట్ బాటెన్ ప్రతిపాదించారు
- **1947, జూన్19:** కశ్మీర్‌ను భారత్‌లోనో లేదా పాకిస్తాన్‌లోనో విలీనం చేసేలా హరిసింగ్‌ను ఒప్పించడం కోసం మౌంట్‌బాటెన్ ఐదు రోజులు కశ్మీర్‌లో ఉన్నారు
- **1947, జులై:** సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఆహ్వానం మేరకు రాజా హరిసింగ్ ఢిల్లీ వచ్చి గోపాల్ దాస్‌తో చర్చలు జరిపారు.
- **1947, జులై 11:** కశ్మీర్ స్వతంత్రం కోరుకుంటే పాకిస్తాన్ దానితో స్నేహం చేస్తుందని మహ్మద్ అలీ జిన్నా ప్రకటించారు
- **1947, ఆగస్టు1:** మహాత్మాగాంధీ హరిసింగ్‌ను కలిసి ప్రజాభీష్టం మేరకు విలీనంపై నిర్ణయం తీసుకోవాలని కోరారు.
- **1947, సెప్టెంబర్22:** పాకిస్తాన్‌లో విలీనానికి సానుకూలత తెలుపుతూ ముస్లిం కాన్ఫరెన్స్ నిర్ణయం తీసుకుంది. అయితే, భారత్‌లో విలీనం కావాలని మహారాజు నిర్ణయించారని పాకిస్తాన్ టైమ్స్ పేర్కొంది.
- **1947, అక్టోబర్:** భారత్–పాక్ యుద్ధం. పాక్ వాయవ్య రాష్ట్రానికి చెందిన వేల మంది గిరిజనులు కశ్మీర్‌పై, రాజ హరిసింగ్ సైన్యంపై దాడికి దిగారు. హరిసింగ్ భారత్ సహాయం కోరారు. దానికి భారత్ పెట్టిన షరతుకు హరిసింగ్ అంగీకరించారు. ఇరు పక్షాలు విలీన ఒప్పందంపై సంతకం చేశాయి.భారత సైన్యం కశ్మీర్‌ను రక్షించింది. కశ్మీర్ విషయమై జరిగిన మొదటి యుద్ధమిది.
- **1948:** కశ్మీర్ సమస్యను భారత దేశం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ముందుకు తీసుకెళ్లింది.కాల్పుల విరమణ, కశ్మీర్ భవిష్యత్తుపై ప్రజాభిప్రాయ సేకరణ వంటి అంశాలతో తీర్మానం కుదిరింది.
- **1949, జనవరి1:** భారత్,పాక్ మధ్య కాల్పుల విరమణ జరిగింది. కశ్మీర్‌లో కొంత భాగం పాక్‌కు వెళ్లిపోయింది.
- **1949:** జమ్మూకశ్మీర్‌ను భారత్‌లో భాగం చేయాలంటూ కశ్మీర్ అసెంబ్లీ ఉద్యమం చేపట్టింది.
- **1949, జూన్:** మహారాజా హరిసింగ్ తన కుమారుడు కరణ్ సింగ్‌ను రాజప్రతినిధిగా నియమించి తాను వైదొలిగారు.
- **1949, అక్టోబరు 17:** కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తూ రాజ్యాంగసభ రాజ్యాంగంలో 370 అధికరణను చేర్చింది.
- **1951, నవంబర్:** రాజా హరిసింగ్ అధికారాలను రద్దు చేస్తూ, శాసన సభను ప్రభుత్వానికి జవాబుదారీ చేస్తూ రాజ్యాంగ సభ చట్టం చేసింది.
- **1957:** జమ్మూకశ్మీర్ భారత్‌లో భాగమని, ఈ విషయమై ప్రజాభిప్రాయ సేకరణ జరిపే ప్రసక్తే లేదని భారత హోం మంత్రి గోవింద్ వల్లభ్ పంత్ స్పష్టం చేశారు.
- **1965:** కశ్మీర్ విషయమై భారత్, పాక్ మళ్లీ తలపడ్డాయి.
- **1966, జనవరి 10:** రష్యా మధ్యవర్తిత్వంలో ఇరు దేశాలు 1965కు ముందున్న స్థానాలకు వెళ్లిపోవాలంటూ రూపొందించిన తాష్కెంట్ ఒప్పందంపై భారత్, పాక్‌లు సంతకాలు చేశాయి.
- **1989:** అఫ్గానిస్తాన్ నుంచి వేలమంది మిలిటెంట్లు కశ్మీర్‌లోకి ప్రవేశించారు. పాకిస్తాన్ వారికి అవసరమైన శిక్షణ, ఆయుధాలు అందజేసింది
- **1989:** కశ్మీర్ నుంచి పెద్ద సంఖ్యలో హిందువులు (కశ్మీరీ పండిట్లు) ఇతర ప్రాంతాలకు వలసపోసాగారు.
- **1972:** భారత్, పాకిస్తాన్‌ల మధ్య సిమ్లా ఒప్పందం కుదిరింది. దీనికి అనుగుణంగా పాక్ ఆక్రమిత కశ్మీర్, కశ్మీర్‌ల మధ్య నియంత్రణ రేఖ(ఎల్‌వోసీ) రూపుదిద్దుకుంది.
- **1999:** పాకిస్తాన్ మద్దతుతో మిలిటెంట్లు కశ్మీర్ సరిహద్దు దాటి కార్గిల్‌లో భారత సైనిక స్థావరాలను చుట్టుముట్టారు. పది వారాల పాటు జరిగిన యుద్ధంలో భారత బలగాలను దురాక్రమణదారులను తిప్పికొట్టాయి.
- **2013, ఫిబ్రవరి:** భారత పార్లమెంటుపై దాడి కేసులో జైషే మహ్మద్ నేత అఫ్జల్ గురును ప్రభుత్వం ఉరితీసింది.
- **2015, మార్చి:** భారతీయ జనతాపార్టీ మొదటి సారి కశ్మీర్‌లో పీడీపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసింది.
- **2016:** భారత సైనిక స్థావరాలపై జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై సర్జికల్ స్ట్రైక్స్ జరిపింది
- **2019:** పుల్వామా వద్ద ఉగ్రవాదులు జరిపిన దాడిలో40 మంది భారత సైనికులు అమరులయ్యారు.దానికి ప్రతిగా భారత్ పాకిస్తాన్‌లోని బాలాకోట్‌పై మెరుపుదాడులు జరిపింది.
- **2019, ఆగస్టు2:** ప్రభుత్వం అమర్‌నాథ్ యాత్రను రద్దు చేసింది. యాత్రికులు స్వస్థలాలకు వెళ్లిపోవాలని ఆదేశం.
- **2019, ఆగస్టు 3:** కశ్మీర్‌లోని పర్యాటకులు, యాత్రికులు, ఇతర రాష్ట్రాల విద్యార్థులను స్వస్థలాలకు తరలించారు.
- **2019, ఆగస్టు 4:** మెహబూబా ముఫ్తి, ఒమర్ అబ్దుల్లాలను గృహ నిర్బంధం చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తదితర ఉన్నత భద్రతాధికారులతో చర్చలు జరిపారు.
- **2019, ఆగస్టు 5:** కశ్మీర్‌కు ప్రత్యేక హోదానిస్తున్న 370 అధికరణను కేంద్రం రద్దు చేసింది.

సాక్షి

మంగళవారం, ఆగస్టు, 6

# హఠాత్ నిర్ణయాలు!

**క**శ్మీర్‌కు భారీయెత్తున భద్రతా బలగాల తరలింపు, అక్కడ నిట్‌తోసహా విద్యా సంస్థలన్నిటికీ సెలవులు, అమర్‌నాథ్ యాత్ర అర్ధాంతరంగా నిలుపుదల, శ్రీనగర్‌లో నిరవధిక కర్ఫ్యూ వగైరా నిర్ణయాలతో నాలుగైదు రోజులుగా అందరిలోనూ ఉత్కంఠ రేపి, రకరకాల ఊహాగానాలకు తావిచ్చిన కేంద్ర ప్రభుత్వం సోమవారం చకచకా పావులు కదిపింది. జమ్మూ–కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి నిస్తున్న రాజ్యాంగంలోని 370వ అధికరణను రద్దు చేస్తూ రాష్ట్రపతి నోటిఫికేషన్ విడుదల చేసిన కొన్ని గంటల్లోనే అందుకు సంబంధించిన బిల్లు రాజ్యసభలో ప్రవేశపెట్టి దాని ఆమోదాన్ని పొందింది. పర్యవసానంగా ఆ రాష్ట్రంలో స్థిరాస్తుల కొనుగోలు అధికారం స్థానికులకు మాత్రమే పరిమితం చేసే 35ఏ అధికరణ కూడా రద్దవుతుంది. అంతేకాదు... జమ్మూ–కశ్మీర్ రాష్ట్ర ప్రతిపత్తిని రద్దు చేసి దాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడగొట్టే కశ్మీర్ పునర్విభజన బిల్లుకు కూడా రాజ్యసభ ఆమోదముద్ర వేసింది. ఈ బిల్లు చట్టమైతే జమ్మూ–కశ్మీర్ అసెంబ్లీతో కూడిన కేంద్ర పాలిత ప్రాంతంగా... లడఖ్ చట్టసభ రహిత కేంద్ర పాలిత ప్రాంతంగా మారతాయి. ఈ బిల్లులు మంగళవారం లోక్‌సభ ముందుకొస్తాయి. జనసంఘ్‌గా ఉన్నప్పటినుంచీ బీజేపీకి 370, 35ఏ అధికరణల విషయంలో ఉన్న అభిప్రాయాలు ఎవరికీ తెలియనివి కాదు. తమకు సొంతంగా మెజా రిటీ లభిస్తే వాటిని రద్దు చేస్తామని లోక్‌సభ ఎన్నికల సందర్భంగా విడుదల చేసే మేనిఫెస్టోల్లో ఆ పార్టీ హామీ ఇస్తూనే ఉంది. కానీ 2014 ఎన్నికల మేనిఫెస్టో ఆ అధికరణల రద్దుపై సంబంధిత పక్షాలతో చర్చించి ఒప్పిస్తామని తెలిపింది. ఎన్నికలయ్యాక 2015లో పీడీపీతో కలిసి జమ్మూ–కశ్మీర్‌లో కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు కుదిరిన ఉమ్మడి ఎజెండా స్వయంప్రతిపత్తి అంశంలో యథాతథ స్థితిని కొనసాగిస్తామని తెలియజేసింది. కానీ 2019 లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో మాత్రం స్వరం మారింది. వీటిని రద్దు చేస్తామని నిర్ద్వంద్వంగా చెప్పింది. ఎవరితోనూ సంప్రదించలేదన్న విమర్శలకు జవాబుగా బీజేపీ ఇప్పుడు ఈ మేనిఫెస్టోనే ఉదహరిస్తోంది. జమ్మూ–కశ్మీర్ పునర్విభజన బిల్లు అసాధారణమైనది. ఇంతవరకూ కేంద్ర పాలిత ప్రాంతాలకు రాష్ట్ర ప్రతిపత్తినిచ్చిన సందర్భాలున్నాయి. కొత్త రాష్ట్రాలు ఆవిర్భవించిన సందర్భాలున్నాయి. కానీ రాష్ట్ర హోదా గల ప్రాంతం రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా మారడం ఇదే తొలిసారి. పరిస్థితులు కుదుటపడితే జమ్మూ– కశ్మీర్‌కు మళ్లీ రాష్ట్ర ప్రతిపత్తిని ఇస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంటున్నారు. అది ఎంతవరకూ సాధ్యమో ముమ్ముందు చూడాలి. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రాల సంఖ్య 29కి పెరగ్గా, అది ఇప్పుడు మళ్లీ 28కి తగ్గింది.

దేశంలోని ఇతర సంస్థానాల విలీనానికీ, జమ్మూ–కశ్మీర్ విలీనానికీ మధ్య మౌలికంగా వ్యత్యాసాలున్నాయి. ఇతర సంస్థానాలు కొద్దికాలంలోనే దేశంలో విడదీయరాని భాగంగా మారాయి. కానీ జమ్మూ–కశ్మీర్‌కు అప్పుడు పాలకుడుగా ఉన్న హరిసింగ్‌తో కుదిరిన ఒప్పందం పర్యవసానంగా రాజ్యాంగంలో మొదట 370 అధికరణ, ఆ తర్వాత 35 ఏ అధికరణ వచ్చిచేరాయి. విదేశీ వ్యవహారాలు, రక్షణ, కమ్యూనికేషన్లు మినహా ఇతర అంశాల్లో రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం ఉంటే తప్ప జమ్మూ–కశ్మీర్ ప్రాంతంలో కేంద్ర చట్టాలేవీ అమలుకాబోవని 370 అధికరణ చెబుతోంది. అయితే 35ఏ అధికరణ విషయంలో ఆదినుంచీ వివాదం ఉంది. ఇది 1954లో రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా రాజ్యాంగంలో భాగమైంది. పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజారిటీ ద్వారా మాత్రమే రాజ్యాంగాన్ని సవరించి చేర్చాల్సిన అధికరణను ఇలా దొడ్డిదోవన తీసుకురావడమేమిటని అప్పట్లోనే జనసంఘ్ నేతలు నిలదీశారు. దీని రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై 2015లో జమ్మూ–కశ్మీర్ హైకోర్టు తీర్పునిస్తూ 35ఏను సవరణగా కాక 370 అధికరణకు వివరణగా లేదా అనుబంధంగా పరిగణించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్ సుప్రీంకోర్టులో పెండింగ్‌లోఉంది. అయితే 370 అధికరణ స్వభావరీత్యా తాత్కాలికమైనదే నన్న పిటిషన్‌ను 2016లో సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. అందులోని సబ్ క్లాజ్ 3లోనే అందుకు సంబంధించిన మెలిక ఉన్నదని తెలిపింది. రాష్ట్ర రాజ్యాంగ సభ సిఫార్సుతో రాష్ట్రపతి నోటిఫికేషన్ వెలువరించినప్పుడు మాత్రమే 370 రద్దవుతుందని ఆ క్లాజు చెబుతోంది. ఇప్పుడు రాష్ట్రపతి నోటిఫికేషన్ ద్వారానే అది రద్దయింది. కానీ అసెంబ్లీ సస్పెన్షన్‌లో ఉన్న ప్రస్తుత సమయంలో దాని సిఫార్సు లేకుండా తీసుకున్న ఈ చర్య చెల్లుతుందా అన్నది సుప్రీంకోర్టు తేల్చాల్సి ఉంది.

అయితే జమ్మూ–కశ్మీర్ మొదటినుంచీ కల్లోలంగా ఉండటం, అది ఉన్నకొద్దీ ఉగ్రరూపం దాలుస్తుండటం వాస్తవం. 2014లో అక్కడ ఉగ్రవాద ఘటనలు 222 జరిగితే నిరుడు అది 614కు చేరుకుంది. అప్పట్లో ఉగ్రవాదం కారణంగా భద్రతా దళాలకు చెందినవారు 47మంది మరణిస్తే, నిరుడు ఆ సంఖ్య 91కి చేరుకుంది. మత ఛాందసవాదుల ఆధిపత్యం గతంతో పోలిస్తే పెరిగింది. ఇప్పుడు 370 రద్దును గట్టిగా వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్ కూడా పరిస్థితి ఇంతగా దిగజారడానికి కారణమే. తన సుదీర్ఘపాలనా కాలంలో అది జమ్మూ–కశ్మీర్‌లో శాంతి నెలకొనడానికి అవసరమైన చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. దానికితోడు ఇప్పటికే అక్కడున్న పాక్ అనుకూల ఉగ్రవాద ముఠాలకు తోడు ఇతర ఇస్లామిక్ దేశాల మిలిటెంట్ల జాడలు కూడా కనబడుతున్నాయి. ఈ దశలో నిర్ణయాత్మకంగా వ్యవహరించకపోతే ముమ్ముందు పరిస్థితి చేయి దాటిపోతుందన్న ఆందోళన కేంద్రానికి ఉన్నట్టు కనబడుతోంది. తాజా నిర్ణయాల విషయంలో ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రులుగా పనిచేసిన ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ వంటివారిని సంప్రదిస్తే బాగుండేది. భారత్‌లో కశ్మీర్ విడదీయరాని భాగమని వారు దృఢంగా విశ్వసిస్తున్నవారే. ఏదేమైనా జమ్మూ–కశ్మీర్‌లో సాధ్యమైనంత త్వరగా సామరస్యం నెలకొనాలని, అది నిజమైన భూలోక స్వర్గంగా కాంతులీనాలని దేశ ప్రజలంతా ఆకాంక్షిస్తున్నారు.

### గ్రహం అనుగ్రహం

శ్రీవికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి శు.షష్ఠి రా.7.00 వరకు, తదుపరి సప్తమి నక్షత్రం చిత్త తె.4.26 వరకు (తెల్లవారితే బుధవారం), వర్జ్యం ప.1.16 నుంచి 2.47 వరకు, దుర్ముహూర్తం ఉ.8.16 నుంచి 9.06 వరకు, తదుపరి రా.10.57 నుంచి 11.54 వరకు అమృతఘడియలు... రా.10.22 నుంచి 11.53 వరకు.

**సూర్యోదయం :** 5.43
**సూర్యాస్తమయం:** 6.29
**రాహుకాలం :** ప. 3.00 నుంచి 4.30 వరకు
**యమగండం :** ఉ.9.00 నుంచి 10.30 వరకు

# ‘తలాక్’ సరే, మన ‘ఇంటి’ గుట్టో?!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

**తలాక్ విషయంలో ముస్లిం దేశాలే మారుతున్నప్పుడు మనం మాత్రం మారకూడదా? అని కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ ప్రశ్నించారు. కానీ, ముస్లిం సమాజంలో ‘సంస్కరణ’కు ఉద్దేశించినట్టు చెబుతున్న ‘తలాక్’ రద్దు బిల్లును సివిల్ చట్ట పరిధుల్లో పరిష్కరించకుండా క్రిమినల్ చట్టపరిధుల్లోకి ఎందుకు తీసుకొచ్చినట్లు? హైందవ సమాజాన్ని అన్ని కోణాలనుంచి సంస్కరించడం కోసం డాక్టర్ అంబేడ్కర్ ప్రవేశపెట్టిన హిందూ కోడ్ బిల్లును నేటికీ సంస్కరించరేం? విడాకుల సమస్యను మన ధర్మశాస్త్రాలు సివిల్ తగాదాలుగా పరిగణించాయి. కాని వాటిలోని మంచిని పక్కనబెట్టిన బీజేపీ పాలకులు మన ఇంటి గుట్టును పట్టించుకోకుండా మతప్రాతిపదికపైన సమస్యలను జటిలం చేయబోవడం సమర్థనీయం కాదు. హిందూ సమాజం ఇంతగా పరివర్తనకు వ్యతిరేకంగా ఎందుకు స్తబ్దతను చేజేతులా కొని తెచ్చుకుని వందల ఏళ్లుగా కుంటుకుంటూ రావలసి వస్తోంది?**

‘‘ముస్లిం పురుషులు తక్షణం మూడుసార్లు తలాక్ చెప్పేసి తమ భార్యలకు విడాకులు ఇవ్వడాన్ని పౌర చట్టం కింద నేరంగా మాత్రమే కాకుండా క్రిమినల్ లా కింద నేరంగా పరిగణిస్తూ బీజేపీ ప్రభుత్వం తెచ్చిన బిల్లును లోక్‌సభతో పాటు రాజ్యసభ కూడా ఆమోదించడంతో రాష్ట్రపతి సంతకంతో చట్టంగా మారనుంది’’

– పత్రికా వార్త (30–07–2019)

‘‘మనదేశంలో లౌకిక రాజ్య వ్యవస్థ (సెక్యులరిజం) మౌలిక సూత్రాలను ఉల్లంఘించడమంటే, ప్రజాస్వామ్య జీవనం మూలాలనే ఉల్లంఘించడమని మరవరాదు’’

– ప్రముఖ రాజకీయ శాస్త్రాచార్యులు నీరా ఛందోక్

**‘త**లాక్’ పద్ధతిని రద్దు చేస్తూ ప్రతిపాదించిన బిల్లును ప్రవేశపెట్టిన కేంద్ర న్యాయశాఖా మంత్రి రవిశంకర్ ప్రసాదా మన ఇంటిగుట్టును విప్పకుండా దాచిపెడుతూ ఒక ప్రకటన చేశారు. ‘తలాక్ విషయంలో ముస్లిం దేశాలే మారుతున్నప్పుడు మనం మాత్రం మారకూడదా? అందులోనూ ఇప్పటికే 20 ముస్లిం దేశాలు తలాక్‌ను నియంత్రించా య’ని మంత్రి చెప్పారు. అంటే మార్పు, లేదా పరివర్తన అనేది మన సొంతమే కాదు, అన్ని ప్రపంచ దేశాలలోనూ తరతమ వ్యత్యాసాలతో వివాహ వ్యవస్థల్లోనూ, సామాజికంగానూ కాలానుగుణంగా అనివార్య పరిణామమే. అయితే బీజేపీ పాలకులు చట్టంగా రూపొందిస్తున్న ‘తలాక్’ రద్దు బిల్లుకు నైతికమైన బలం కొరవడుతోంది. ఎందుకంటే ఆ బిల్లుకు లేదా రేపటి చట్టానికి వివిధ కోణాలనుంచి బలం చేకూరాలంటే, సుమారు డెబ్బై ఏళ్లుగా వెలుగు చూడకుండా రాజకీయ పాలకులు కట్టిన ముళ్ల కంచెల నుంచి ఈ రోజుకీ వెలుగు చూడని ‘హిందూ కోడ్ బిల్లు’ను కూడా, హైందవ సమాజాన్ని అన్ని కోణాలనుంచి సంస్కరించడం కోసం బయటకు లాగవలసిన అవసరం ఉంది.

బీజేపీ పాలకులు ముస్లిం సమాజంలో ‘సంస్కరణ’ పేరిట ఉద్దేశించినట్టు చెబుతున్న ‘తలాక్’ రద్దు బిల్లును సివిల్ చట్ట పరిధుల్లో పరిష్కరించకుండా క్రిమినల్ చట్టపరిధుల్లోకి ఎందుకు తీసుకురావల్సి వచ్చిందో సమాధానం చెప్పగలగాలి! నేనొక ముస్లిం పెద్దకు ఒక ప్రశ్న వేశాను. మూడుసార్లు ‘తలాక్’ చెప్పి, ఆకస్మికంగా ముస్లిం పురుషుడు భార్యకు విడాకులివ్వడం న్యాయమా అని. దానికి ఆ ముస్లిం పెద్ద చెప్పిన సమాధానం హిందూ సంప్రదాయంలో భార్యాభర్తల మధ్య పొరపొచ్చాలు, తగాదాలు, ఘర్షణల ఫలితంగా విసుగెత్తి భార్యను భర్త, లేదా భర్తను భార్య వదిలించుకోవాలన్నప్పుడు వారి తల్లిదండ్రులు లేదా సంబంధిత బంధువులు ముందు ఏ పద్ధతి అనుసరిస్తారో అదే సంప్రదాయం ముస్లిం కుటుంబాలలో కూడా ఉంటుందని, ఆయన చెప్పాడు. అంటే మూడుసార్లు ‘తలాక్’ చెప్పడమంటే తెగతెంపులకు ముందు తమ కాపురాన్ని చక్కదిద్దుకోడానికి మరోసారి ప్రయత్నించమని, ఆ ప్రయత్నం మూడుసార్లు కొనసాగాలన్నదే అసలు ఉద్దేశమని, ఇదే ‘షరియత్’ నిబంధనల సారాంశమని ఆ ముస్లిం పెద్ద వివరించారు.

మనకూ తెలుగులో భార్యాభర్తల తగాదాలు, కుమ్ములాటలు, తెగే దాకా ఎవరో ఒకరు సమస్యల్ని సాగలాగడం గురించి నీతిపాఠాలన దగిన సామెతలున్నాయి: ‘ఆలు మగల మధ్య తగాదాలు’ నిలిచేది ‘పీటమీద ఆవగింజంత సేపే’ (అంటే జారిపోవడం)నని, మొగుడి మీద

### రెండో మాట



భార్యకు, భార్యమీద భర్తకు ‘కోపతాపాలు పొద్దుగుంకేవరకే’ననీ లౌక్యంగా మందలించడం. కనుకనే విడాకుల సమస్యను ధర్మశాస్త్రాలు సివిల్ తగాదాలుగా పరిగణించాయి. హైందవ సంస్కృతిలో ఈ మాత్రం మంచి సంప్రదాయాన్ని మరిచిపోయి పక్కనబెట్టిన బీజేపీ పాలకులు మతప్రాతిపదికపైన సమస్యలను జటిలం చేయబోవడం సమర్థనీయం కాదు. తలాక్ రద్దు బిల్లు ద్వారా భార్యాభర్తల మధ్య విడాకుల సమస్యలను సివిల్ తగాదా పరిధి నుంచి తప్పించి క్రిమినల్ దావాగా మార్చడం జరుగుతోంది. భార్యాభర్తల మధ్య తగాదాల పరిష్కారాన్ని క్రిమినల్ దావాగా మార్చి నిందితుడైన భర్తను మూడేళ్లదాకా జైల్లో నిర్బంధించి, అతనికి బెయిల్ ఇచ్చే సమస్యను మేజిస్ట్రేట్ విచక్షణకు వదలడంవల్ల ఆ దంపతులు సమాధానపడటానికి లేదా రాజీ పడటానికి గల అవకాశాల్ని కూడా తోసిపుచ్చడమవుతుంది ఒక సామాజిక దురాచారాన్ని పరిష్క రించడానికి ఇదే మార్గమా? అలాగే, ఇప్పుడు ‘తలాక్ రద్దు’ బిల్లు ఇటు పార్లమెంట్ ఆమో దం పొందిన 24 గంటల్లోనే, ఆ మరునాడే ఈ బిల్లు పేరిట మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, హరియాణలలో కేసులు, అరెస్టులు ప్రారంభమయ్యాయి.

అందాకా ఎందుకు, అసలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 1950 దాకా రాజ్యాంగ నిర్మాత హోదాలోనేగాక కాంగ్రెస్ నాయకత్వంలోని జవహర్ లాల్ నెహ్రూ ప్రధానిగా ఆయన క్యాబినెట్‌లో ఉండి, దేశానికి వర్తించే ఉమ్మడి హిందూ కోడ్ బిల్లును స్వయంగా ఎందుకు ప్రవేశ పెట్టించవలసి వచ్చింది? హిందూ సమాజంలో తరతరాలుగా కుల, మత, వర్గ, వర్ణ చట్రంలో మగ్గుతూన్న దళిత బహుజన, అణగారిన నిరుపేదల, మైనారిటీల మౌలిక ప్రయోజనాలను సహితం కాపాడగల సమగ్రమైన ‘హిందూ కోడ్ (సివిల్ కోడ్)’ బిల్లును పండిట్ నెహ్రూచే ప్రధానమంత్రి హోదాలో రూపకల్పన చేసి, ప్రవేశపెట్టించారు. అయితే సమాజంలో దగాపడిన, పడుతున్న దళిత బహుజనుల్ని, మహిళా లోకాన్ని సమగ్రమైన హిందూ కోడ్ బిల్లు ద్వారా బయటపడవేయాలన్నది అంబేడ్కర్ తపన. అయితే ఈ మార్పు హిందూ సమాజంలోని సంపన్న వర్గాలకు నచ్చదు కాబట్టి, ఎంతగా సోషలిస్టు సెక్యులర్ భావాలతో తొలి దశలో ప్రేరేపితుడైనప్పటికీ పండిట్ నెహ్రూ ‘హిందూ కోడ్ బిల్లు’ లోని ‘వివాహాలు, విడాకులు’ అన్న విభాగానికే కుదించాలని, మిగతా విషయాలు ప్రస్తావించరాదనీ పట్టుబట్టడంతోనే అంబేడ్కర్ నెహ్రూ మంత్రి వర్గం నుంచి తప్పుకోవలసి వచ్చిందని మరవరాదు. ‘దురదృష్టవశాత్తు మన దేశంలో శాస్త్రాల్ని, వాటి పాఠ్యాన్ని కూడా తొక్కిపట్టేలా దుష్ట సంప్రదాయాన్ని పెంచి, పోషిస్తూ వచ్చారు. నిజానికి ఈ శాస్త్రాలన్నీ సవ్యమైన వివాహ సంబంధాలకే అనుకూలం’ అని కూడా అంబేడ్కర్ అన్నారు.

శాస్త్రాలు నిర్ణయించిన ‘స్త్రీ ధనాన్ని’ కూడా కాజేయడానికి విడాకుల రాయుళ్లు ఎత్తులు వేస్తూ అరాచకాన్ని నేటి సమాజంలో సృష్టించడం మనం చూస్తున్నాం. పైగా గతంలో ఎన్నడూ లేనంత అరాచక ప్రవర్తనను చదువుకున్న మగధీరుల్లో కూడా గమనిస్తున్నాం. వీరి ప్రవర్తన చివరికి బజారు మూకలకు, ‘ఆవారా’గాళ్లకూ ఆదర్శం కావడమూ చూస్తున్నాం. ఏ రోజునా స్త్రీల హత్యలు, వివాహిత స్త్రీల పైన, బాల బాలికలపైన మనం ఎన్నడూ ఎరుగని అత్యాచారాలను రోజూ వింటున్నాం, వీడియోల పుణ్యమా అని ఇంతకుముందెన్నడూ ఎరుగని వింతలూ, దుర్భర ఘటనలూ వింటున్నాం. దేశానికి ఆదర్శప్రాయమైన పౌరస్మృతి (సివిల్ కోడ్) రావడానికి సామాజిక, ఆర్థిక రంగాలలో సమగ్ర సంస్కరణలు తొలిమెట్టు అని అంబేడ్కర్ భావన. ఈ మౌలిక ప్రతిపాదనలను చేసినందుకే, తనకు కాంగ్రెస్ ప్రతిబంధకాలు సృష్టించింది. చివరికి నెహ్రూయే బిల్లును అకస్మాత్తుగా ఉపసంహరించుకోవడానికి నిర్ణయించి, మళ్లీ మనసు మార్చుకోవలసి వచ్చింది. ఇంతకూ హిందూ సమాజం ఇంతగా పరివర్తనకు వ్యతిరేకంగా ఎందుకు స్తబ్దతను చేజేతులా కొని తెచ్చుకుని వందల సంవత్సరాలుగా కుంటుకుంటూ రావలసి వస్తోంది? ‘దాయభాగ– మితాక్షర’ న్యాయమార్గాల కుమ్ములాటల మధ్య వందల ఏళ్లుగా ఆడపిల్లల జీవితాలు నలిగిపోవలసి వచ్చిందని గుర్తించాలి. అందుకే దోపిడీ సమాజ వ్యవస్థలో మహిళలు కూడా ‘దళిత జీవులే’నని అంబేడ్కర్ ప్రకటించాల్సి వచ్చింది.

ఋగ్వేదం పురుష సూక్తంలో (10వ మండలం– 19వ సూక్తం) ‘పురుషుడు పరమ స్వార్థపరుడు’ అని వర్ణించింది. ఎందుకని? ఆ పురుషుడు ఎలా ఉంటాడు? ముఖం చూస్తే బ్రాహ్మణుడు, చేతులు క్షత్రియులని, తొడలు వైశ్యులని, శూద్రులు తదితరులు మాత్రం కాళ్లనుంచి పుట్టుకొచ్చారట. బహుభార్యత్వానికి కూడా ఋగ్వేద కాలంలోనే శాంక్షన్ పొందారు. పెళ్లి, తదితర విందు గుడుపుల కోసం గుర్రాలు, గోవులు, గొర్రెల మాంసం విస్తారంగా వాడారు. (10వ మండలం– 91 శ్లోకం) ఆ మాటకొస్తే ‘మాంసం లేకుండా విందు భోజనం ఉండరాద’ని ఫర్మానా ఆనాడే విడుదల చేశారు (‘నా మంసో మధు పర్కం భవతి’) మరొక్క మాటలో చెప్పాలంటే, ఋగ్వేదంలోని తొలి 9 మండలాల్లో లేని నాలుగు కులాలు (చాతుర్వర్ణాలు) నాలుగు వర్ణాలుగా అవతరించినా చాలక దళితులన్న పేరిట అయిదో కులావతరణకు ప్రారంభోత్సవం చేశారు. ‘ఎద్దు లేదా ఆబోతు మాంసోదనం నేతిలో వండుకుని తినాల’న్న బృహదారణ్యకానికి టీక రాసినవారు శ్రీమాన్ శంకరాచార్యులు. బహుశా అందుకే ‘రామచరితమానస్’ రాసిన తులసీదాసు (15వ శతాబ్ది) ఋగ్వేద పురుషులకు, వారి ప్రాచీనులకు నిష్కామ కర్మలతో పనిలేదు, కోర్కెలను సాధించుకోవడమే వారి పని– అందుకే వారు కాముకులే గానీ నిష్కాములు కారు అన్నాడు. కనుకనే వేదం ‘కోరికే మనస్సులో పుట్టిన ప్రథమ రేతస్సు’ అన్నాడు. అది చచ్చే కోరిక కాదు, మీకైనా, నాకైనా, మోదీ, అమిత్‌షాల కైనా. ఈ అనంత ‘కోరిక’ల మధ్య ఎవరిని దృష్టిలో పెట్టుకొని మహాకవి మనల్ని మసలమంటున్నాడో చూడండి: ‘అతణ్ణి జాగ్రత్తగా చూడండి/స్వతంత్ర భారత పౌరుడు/అతని బాధ్యత వహిస్తామని అందరూ హామీ ఇవ్వండి/ అతని యోగ క్షేమాలకు అంతా పూచీ పడండి/అతికించండి మళ్లీ అతని ముఖానికి నవ్వు’!!

abkprasad2006@yahoo.co.in

### సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



**సోషల్ మీడియా**

#### స్వాగతం



“ఆర్టికల్ 370 రద్దును స్వాగతిస్తున్నా. దేశాన్ని ఉగ్రవాద రహితంగా తీర్చిదిద్దడంలో ప్రధాని నరేంద్ర మోదీ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. మోదీ దార్శనికుడే కాదు, ధైర్యవంతుడు కూడా. అనితరసాధ్యమైన ఇటువంటి చారిత్రక నిర్ణయం కోసం నేను ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నా. జమ్మూకశ్మీర్‌తో సహా దేశంలోని ప్రజలందరికీ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నా”

– కంగనా రనౌత్, నటి

#### మీడియా



“మన దేశంలో పౌరుల భద్రత పట్ల మీడియాకు ఎంతో బాధ్యత ఉంది. ఎన్నో ఏళ్లుగా ఫేక్ న్యూస్ ప్రజల్లో ఆగ్రహాన్నీ, హింసనీ ప్రేరేపిస్తోంది. నిజాయితీగా, నిష్పక్షపాతంగా, సమతుల్యతతో న్యూస్ కవరేజ్ చేయాల్సి ఉంది. లేకపోతే ఈ సమస్యలు మరింత దారుణంగా రూపాంతరం చెందుతాయి”

– డోనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు

#### కలహాలు



“పీర్ పంచల్, చెనాబ్ లోయ ప్రాంతాల్లో నివసించే ప్రజల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నేను కోరుతున్నా. ఈ ప్రాంతాల్లో మత కలహాలు చెలరేగే అవకాశం తీవ్రంగా ఉంది. ఎటువంటి మతకలహాలు చెలరేగకుండా ప్రభుత్వం తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటుందని నేను ఆశిస్తున్నా”

– ఒమర్ అబ్దుల్లా, ఎన్సీపీ నేత

#### చచ్చినట్టే!



“ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి రాజ్యాంగ సవరణ అవసరం లేదు. రాష్ట్రపతి ఆమోదించిన బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో ప్రవేశ పెట్టారు. ఆర్టికల్ 370 చచ్చినట్టే, దాంతో పాటే ఆర్టికల్ 35ఏ కూడా”

– సుబ్రమణ్య స్వామి, బీజేపీ నేత

#### ఆక్రమణ



“ఇంటర్నెట్ సేవలు అడ్డుకున్నారు. మొబైల్ నెట్‌వర్క్ కూడా పని చేయకుండా చేశారు. ల్యాండ్ ఫోన్‌లు కూడా పలకడం లేదు. ప్రధాన రాజకీయ పక్షాలకు చెందిన నాయకులందరినీ గృహ నిర్బంధంలో ఉంచారు. కర్ఫ్యూ విధించారు. కేబుల్ టీవీ ప్రసారాలు నిలిచిపోయాయి. విద్యాసంస్థలన్నీ మూసివేశారు. పర్యాటకులు, యాత్రికులను పంపించివేశారు. స్థానికులను నిర్బంధించారు. వేలల్లో సైన్యాన్ని మోహరించారు. ప్రపంచంలోనే అత్యంత పెద్ద ప్రజాస్వామ్య దేశం కశ్మీర్‌ను ఆక్రమించుకున్న మొదటి రోజు ఇది. దీన్ని అందరూ అర్థం చేసుకోవాల్సి ఉంది”

– షజియా బక్షి, కశ్మీరీ

# జాతి మెచ్చిన సాహసోపేత చర్య

**అభిప్రాయం**



పురిఘళ్ల రఘురామ్

**అ**ఖండ భారతదేశ స్వప్నం నేడు సాకారమయ్యింది. 133 కోట్ల భారతీయులు సగర్వంగా తలెత్తుకు తిరిగేలా చేసింది భారత ప్రభుత్వం. స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలైనా... నెరవేరని స్వప్నం నేడు సాకారమయ్యింది. కశ్మీర్‌ను భారత్ నుంచి వేరుచేసేందుకు జరుగుతున్న కుట్రలు, కుతంత్రాలకు చరమగీతం పాడుతూ మోదీ సర్కారు తీసుకున్న సాహసోపేత నిర్ణయం ఇప్పుడు దేశ ప్రజల గుండెల్లో మార్మోగుతోంది. మిగతా రాష్ట్రాల మాదిరిగా భారతదేశంలో జమ్మూ, కశ్మీర్ మారింది. ‘ఇద్దరు ప్రధానులు, రెండు రాజ్యాంగాలు... రెండు జెండాలు వద్దు’ అంటూ ప్రాణార్పణ చేసిన భారతదేశ ముద్దుబిడ్డ శ్యాం ప్రసాద్ ముఖర్జీ నినాదాన్ని నేడు మోదీ సర్కారు సుసాధ్యం చేసింది. భారత్ నుంచి కశ్మీర్‌ను విడదీస్తున్న ఆర్టికల్ 370, 35 అను రద్దు చేస్తూ మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం భారత ఖ్యాతిని హిమాలయాల ఎత్తుకు చేర్చింది.

పార్లమెంట్ సాక్షిగా కేంద్రం తీసుకొచ్చిన ఆర్టికల్ 370, 35 అ నిబంధనల రద్దు నిర్ణయాలపై దేశ మంతటా పౌరులు సంబరాలు జరుపుకుంటున్నారు. భారతదేశంలో కశ్మీర్ అంతర్భాగమన్న సందేశాన్ని నేడు కేంద్రం రుజువు చేసి చూపించిందన్న సంతోషం కోట్లాది ప్రజల్లో నెలకొంది. ఇలా దేశమంతా పండుగ జరుపుకుంటుంటే... కొన్ని పక్షాలు మాత్రం కుట్రపూరితంగా వేర్పాటువాదుల వాదనకు మద్దతు పలుకుతున్నాయి.

దేశంలో కశ్మీర్ అంతర్భాగమని... ఒకటే దేశం... ఒకటే రాజ్యాంగమంటూ కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిపై నాడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఎలుగెత్తారు. పార్లమెంట్ సాక్షిగా నెహ్రూ కళ్లు తెరిపించే పనిచేశారు. తన అభ్యంతరాలను, సూచనలను పట్టించుకోకుండా నెహ్రూ ప్రభుత్వం నడుస్తున్న తీరుపై ఆందోళనను శ్యాంజీ ఉధృతం చేశారు. 26 జూన్ 1952న ఆర్టికల్ 370ను రద్దు చేయాలంటూ పార్లమెంట్ సాక్షిగా నిరసన తెలిపారు. దేశాన్ని ఇలా వేరుచేయడం సమంజసం కాదంటూ నినదించారు. కశ్మీర్ విషయంలో తీసుకున్న నిర్ణయాలను నిర్ద్వంద్వంగా ఖండించారు. కొందరు స్వార్థపరుల కోసం తీసుకొచ్చిన విధానం చెల్లదంటూ కశ్మీర్‌లో పోరుబాట సాగించి అసువులు బాశారు. నాటి నుంచి నేటి వరకు మూడు తరాలు కశ్మీర్ కోసం దేశ ప్రజలు పన్నుల రూపంలో కట్టిన లక్షల కోట్ల రూపాయలను దిగమింగారు. పైపెచ్చు మత ప్రాతిపదికన జమ్మూ, కశ్మీర్‌లో మిగతా ప్రజలకు హక్కులు లేకుండా కాలరాశారు. రెండో తరగతి పౌరుల్లా చూసి వంచించారు.

అంబేడ్కర్ కలలుగన్న భారతావనిలో నిరుపేదలకు అందాల్సిన ఫలాలు దేశమంతా లభించినా... జమ్మూ, కశ్మీర్‌లో మాత్రం లభించలేదు. దేశవ్యాప్తంగా ఎస్సీలకు, ఎస్టీలకు, బీసీలకు రిజర్వేషన్ ఫలాలు అందినా... జమ్మూ, కశ్మీర్‌లో నివశిస్తున్న బడుగు బలహీన వర్గాలకు మాత్రం ఆ ఫలాలు దక్కలేదు. రిజర్వేషన్లంటే ఏంటో కూడా తెలియని పరిస్థితి అక్కడి ప్రజలది. కేవలం కొందరికి మాత్రమే లబ్ధి చేకూరేలా తీసుకొచ్చిన ఆర్టికల్ 370తో కొన్ని వర్గాలు మాత్రమే ఆ ఫలాలను దక్కించుకున్నాయి. కేంద్రం తీసుకొచ్చిన తాజా నిర్ణయంతో ఇక ఒక దేశం ఒకటే రాజ్యాంగం పరిఢవిల్లుతుంది.

ఏడు దశాబ్దాలుగా వేల మంది భారతీయులు దేశ రక్షణ కోసం అసువులుబాశారు. భరతమాత రక్షణలో సమిధలయ్యారు. భూలోక స్వర్గంగా ఉన్న కాశ్మీర్ తీవ్రవాదులకు స్వర్గధామంగా నిలిచింది. సాధారణ కశ్మీరీలు ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా మారి తీవ్రవాదానికి ఆకర్షితులవుతున్నారంటే అందుకు కారణం అక్కడ స్థానిక ప్రభుత్వాలు, కాంగ్రెస్ పార్టీ విధానాలే. కశ్మీర్ అనంతనాగ్ గుహల్లో కొలువైన పరమశివుడ్ని దర్శించుకోవాలన్నా ఇబ్బందే. దేశంలోని ఆలయాన్ని దర్శించుకోవాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరి స్థితి. కశ్మీర్ పండితుల కులదైవమైన శారదా మాత... సరస్వతి దేవి ఆలయంలోకి వెళ్లాలంటే సాధ్యం కాదు. ఇందుకు కారణం అక్కడి పాలకులు. వారితోపాటు ఆర్టికల్ 370 మాత్రమే. తాజా నిర్ణయంతో భారతదేశం సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టిందని చెప్పాల్సి ఉంటుంది.

దేశం గురించి నిర్ణయం తీసుకోవాలంటే ధైర్యం కావాలి. అది మోదీకి సంపూర్ణంగా ఉందన్నారు హోం మంత్రి అమిత్ షా. కశ్మీర్ ఎప్పుడూ భూతల స్వర్గంగా ఉంటుందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అక్షరసత్యాలవుతాయి. అధికారం కోసమో... మరెందుకో మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోలేదు. బీజేపీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగానే తాజా నిర్ణయం తీసుకొంది. కశ్మీర్‌లో ఇకపై మూడు కుటుంబాల ఆధిపత్యం చెల్లదు. సామాన్యులే కశ్మీర్‌లో ఏలికలవుతారు. అధికారం చెలాయిస్తారు.

కశ్మీర్‌లో ఇక దేశమంతటా వర్తిస్తున్న విధానాలే అమలవుతాయ్. దేశంలో ఏ పారిశ్రామికవేత్త అయినా కశ్మీర్ వెళ్లి ఇక పరిశ్రమలు ప్రారంభించవచ్చు. తీవ్రవాదంతో కల్లోలంలా మారిన కశ్మీర్‌ను అభివృద్ధి పట్టాలెక్కించవచ్చు. అందుకు ప్రధాని మోదీ– అమిత్ షా జోడీ నవ శకాన్ని ఆవిష్కరించింది. భారతదేశ ఔన్నత్యాన్ని హిమాలయాల ఎత్తు ఎగిరేలా చేసిన ధీరుడిగా ప్రధాని మోదీ నిలిచి పోతారు. కులాలకు మతాలకు అతీతంగా భారతీయులందరూ ఉప్పొంగే సందర్భమిది.

వ్యాసకర్త బీజేపీ సమన్వయకర్త
ఈ–మెయిల్ : raghuram.bjp@gmail.com

# న్యాయ సమీక్షకు నిలుస్తుందా?

**జ**మ్మూకశ్మీర్‌పై సంచలన నిర్ణయం తీసుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి తిరుగులేనట్టేనా? ఈ అంశాన్ని భారత్ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆమోదిస్తుందా? అనే ప్రశ్నలు ఇప్పుడు చాలామందిలో చెలరేగుతున్నాయి. మోదీ, అమిత్ షా ద్వయం అత్యుత్సాహంగా తీసుకున్న నిర్ణయం భారత రాజ్యాంగ మౌలిక స్వరూపానికి వ్యతిరేకమా కాదా అన్నది సుప్రీంకోర్టు తేల్చాల్సి ఉంటుంది.

జమ్మూకశ్మీర్ ముఖ చిత్రాన్ని మార్చివేసే రెండు తీర్మానాలు, ఒక బిల్లును కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. దీనికి తోడు జమ్మూకశ్మీర్ రాజ్యాంగానికి సంబంధించిన ఆర్టికల్ 35ఏను రద్దు చేస్తూ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆదేశాలు జారీ చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 370 ద్వారా జమ్మూకశ్మీర్‌కు కల్పించిన ప్రత్యేక ప్రతిపత్తిని తొలగిస్తూ తీర్మానం చేశారు. అలాగే, జమ్మూకశ్మీర్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా మారుస్తూ జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లును ప్రవేశపెట్టారు.

జమ్మూకశ్మీర్‌లో ప్రస్తుతం రాష్ట్రపతి పాలన అమలులో ఉన్నందున అక్కడి అసెంబ్లీకి ఉండే అధికారాలను కేంద్రం చేపట్టవచ్చనే నిబంధన ఆసరాగా ఈ చర్యలు తీసుకున్నారు. అంటే, జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి బదులుగా పార్లమెంటే ఆర్టికల్ 370ని సవరిస్తూ ప్రతిపాదన చేసింది. దీంతో ఆర్టికల్ 370 రద్దును జమ్మూకశ్మీరే కోరినట్టు అయ్యింది. నిజానికి తమ రాష్ట్ర స్వయం ప్రతిపత్తిని తొలగించే ఎటువంటి చర్యనూ కశ్మీరీలు అంగీకరించడంలేదు.

స్వాతంత్ర్యానంతరం భారత్‌లో కలవడానికి ఈ ఆర్టికల్ 370 అనే తాత్కాలిక వెసులుబాటును కల్పించారు. ఈ ఆర్టికల్‌లోని 3వ క్లాజ్ ప్రకారం నోటిఫికే షన్ ద్వారా దాన్ని రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది. అయితే, ఇక్కడే ఒక మెలిక ఉంది. రాష్ట్రపతి అలా రద్దు చేయాలని భావించినప్పుడు జమ్మూకశ్మీర్ రాజ్యాంగ నిర్ణాయక సభ ఆమోదం తప్పనిసరి అని ఆర్టికల్ 370 పేర్కొంటోంది. దాన్ని 1956లో రద్దు చేశారు. అయితే, అదే స్థానంలో ఏర్పడిన అసెంబ్లీకి అటువంటి ప్రతిపాదన చేసే హక్కు ఉంది. కానీ, ఇక్కడ ఆ అవకాశం లేదు. ఎందుకంటే, ప్రస్తుతం జమ్మూకశ్మీర్ రాష్ట్రపతి పాలనలో ఉంది.

రాజ్యాంగం ప్రకారం ఏదైనా రాష్ట్రం రాష్ట్రపతి పాలనలో ఉంటే, అసెంబ్లీకి ఉండే అధికారాలన్నీ పార్లమెంటుకు ఉంటాయి. ఈ కారణంగానే మోదీ సర్కార్ జమ్మూకశ్మీర్ స్వయం ప్రతిపత్తిని రద్దు చేయ గలిగింది. అయితే, ఇలా స్వయం ప్రతిపత్తి రద్దు చేయడాన్ని అక్కడి నేతలు, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో కేంద్ర నిర్ణయం సమాఖ్య స్ఫూర్తిపై దాడిగా పరిణమించింది.

రాజ్యాంగ సవరణకు పార్లమెంట్‌లో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. కానీ, ఈ బీజేపీ ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి అటువంటి నిబంధనేమీ లేదు. అంతేగాక, రాజ్యాం గంలోని ఆర్టికల్ 367 కింద ఆర్టికల్ 35ఏను రద్దు చేసినట్టు కనిపిస్తోంది. అయితే, పార్లమెంట్ ఆమోదం లేకుండా, కేవలం ఒక ఆదేశం ద్వారా ఆర్టికల్ 370ని ఇతర రాజ్యాంగ నిబంధనల ద్వారా రాష్ట్రపతి సవరించవచ్చా అనేది మరో వివాదాస్పదమైన ప్రశ్న.

ఆర్టికల్ 370లోని నిబంధనల ఆధారంగా అదే ఆర్టికల్‌ను సవరించడంపై కూడా చాలా ప్రశ్నలు గుప్పిస్తున్నారు. ఆర్టికల్ 370లోని నిబంధనల ప్రకా రం జమ్మూకశ్మీర్‌కు సంబంధించిన ఇతర రాజ్యాంగ నిబంధనలను సవరించగలమే గానీ, అదే ఆర్టికల్‌ను సవరించలేమని కేంద్ర మాజీ హోంమంత్రి పి.చిదం బరం రాజ్యసభలో వ్యాఖ్యానించారు.

జమ్మూకశ్మీర్ విషయంలో కేంద్రం చేసిన ప్రతిపాదనలను సుప్రీంకోర్టులో సవాలు చేసే అవకాశం ఉంది. చట్టాన్ని సాంకేతికంగా అన్వయించడంకంటే కూడా కోర్టు ఎలా నిర్ణయం తీసుకుం టుందనేది ఆసక్తికర అంశం. గతంలో ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తి సుప్రీం కోర్టు ఎలా వ్యాఖ్యానిస్తుందనేది కూడా కీలకం.

కేంద్రం ఒక రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించి, ఆ రాష్ట్ర స్వభావాన్ని పూర్తిగా మార్చివేసే చర్యలు చేపట్టవచ్చా? కశ్మీరీ ప్రజలకు వ్యతిరేకమైన, ముఖ్యమైన మార్పును ఇంత సాధారణంగా చేపట్టవచ్చా? రాష్ట్రంలో బలగాలను మోహరించి, ఫోన్లు పనిచేయకుండా చేసి, ప్రజల కదలికలను నియంత్రించి ఈ మార్పులు చేయవచ్చా? రాజ్యాంగాన్ని మార్చే అధికారం లేని పార్లమెంట్ చేసిన ఈ నిర్ణయం రాజ్యాంగ మౌలిక స్వభావంపైనే ప్రభావం చూపనున్నదా అనేది సుప్రీంకోర్టు ముందున్న ప్రశ్న.

శృతిసాగర్ యమునన్, సీనియర్ జర్నలిస్ట్
‘స్క్రాల్’ సౌజన్యంతో

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083



రకుల్ ప్రీత్‌సింగ్

రాశీ ఖన్నా

కీర్తి సురేశ్

వాణీ కపూర్



రాయ్ లక్ష్మి



అంజలి

సినిమా సమాజానికి అద్దమైతే...
ఒక్కోసారి ఆ అద్దం మీద పడ్డ కాంతి కళ్లను జిగేలుమనిపిస్తుంది.
ఆ జిగేలే జీవితం అనుకుని చాలామంది
మనసు పాడు చేసుకుంటారు.
హీరోయిన్ సన్నగా ఉంటే.. అలా చిక్కిపోవాలని...
బొద్దుగా ఉంటే అలానే తయారవ్వాలనే ఫీలింగ్‌తో
ఓ చట్రంలో చిక్కుకుపోతున్నారు.
బొద్దుగా ఉంటే ముద్దు అనేది ఒకప్పటి మాట.
ఇప్పుడు రివర్స్ ట్రెండ్ నడుస్తోంది.
సినిమాలో హీరోయిన్లు బొద్దుగా ఉంటే ముద్దుగా ఉండరని
చిక్కిపోతేనే చాన్సులు చిక్కుతాయని
సన్నబడే చట్రంలో చిక్కుకుంటున్నారు.
వాళ్ళను చూసి మనమూ చిక్కుకుపోకుండా ఉంటేనే బెటర్.

# చట్రంలో చిక్కిపోతున్నారు!

బొద్దుగా, సన్నగా, నాజూకుగా, జీరో సైజ్... ఎలా ఉండాలన్నది పర్సనల్ చాయిస్. ప్రస్తుతం హీరోయిన్ల చాయిస్ స్లిమ్ వైపుకు మళ్లింది. దాంతో వాళ్ల దారి జిమ్‌కు మళ్లింది. బరువును తేలికగా తీసుకోవడం మానేశారు. వెయిట్ లాసే క్యారెక్టర్ గెయిన్ అంటున్నారు. పాత్ర బరువైనది అయితే ఆ బరువును మోయడానికి సన్నగా మారిపోవడానికి సిద్ధమయ్యారు. స్క్రిప్ట్ బావుంటే స్ట్రిక్ట్ డైట్‌కి కట్టుబడి ఉంటున్నారు. సినిమాలో కొత్త లుక్ కోసం మారిన వాళ్లు కొందరైతే, లుక్‌నే మార్చేయాలనే ఉద్దేశంతో తగ్గిన వాళ్లు ఇంకొందరు. అలా ఈ మధ్య కాలంలో సన్నగా మారిన కథానాయికలపై స్పెషల్ స్టోరీ.



అనుష్క

## సైలెన్స్ కోసం సైలెంట్‌గా

'భాగమతి' తర్వాత కొత్త ప్రాజెక్ట్ అనౌన్స్ చేయడానికి చాలా సమయం తీసుకున్నారు అనుష్క. ఈ గ్యాప్‌లో సైలెంట్‌గా లుక్ మార్చేసే పనిలో పడ్డారు. 'సైజ్ జీరో' సినిమా కోసం పెరిగిన వెయిట్‌నంతా తగ్గించేయాలనుకున్నారు. అలాగే 'బాహుబలి'లో కనిపించనదాని కన్నా స్లిమ్‌గా అయిపోవాలనుకున్నారు. అందుకే చాలా రోజులు బయటకు కూడా కనిపించకుండా సైలెంట్‌గా చిక్కిపోయారు. ప్రస్తుతం 'నిశ్శబ్దం' అనే సైలెంట్ థ్రిల్లర్‌లో నటించారామె. ఇందులో మాధవన్, అంజలి, షాలినీ పాండే, హాలీవుడ్ నటులు కూడా కీలక పాత్రలు చేస్తున్నారు. 'నిశ్శబ్దం'లో సరికొత్త అనుష్కను చూస్తారని చిత్రబృందం ప్రామిస్ కూడా చేసింది. ఈ ఏడాది చివర్లో అనుష్కను కొత్త లుక్‌లో చూడొచ్చు. ఈ చిత్రం షూటింగ్ సోమవారంతో పూర్తయింది.

## హిట్ చేయడానికి ఫిట్‌గా...

పోలీస్ ఆఫీసర్ అంటే ఫిట్‌గా.. ఎవరైనా తప్పు చేస్తే హిట్ చేసేంత టఫ్‌గా ఉండాలి. అందుకోసమే మరింత స్లిమ్‌గా మారిపోయారు అంజలి. ఇంతకు ముందు బొద్దుగా ఉండే అంజలి ఈ మధ్య ఎక్స్‌ట్రా వెయిట్‌ని కట్‌చేసి స్లిమ్‌గా మారిపోయారు. తెలుగులో సినిమాలు చేయడం కొంచెం తగ్గించినా తమిళంలో స్పీడ్‌గా సినిమాలు చేస్తున్నారామె. 'నిశ్శబ్దం' మూవీలో ఓ కీలక పాత్ర చేశారు. అది కూడా పోలీస్ ఆఫీసర్ క్యారెక్టర్. యూనిఫామ్ వేసుకోవడం కోసం ఎనిమిది కిలోలను నిర్దాక్షిణ్యంగా తగ్గించేశారు. వెయిట్ తగ్గిన తర్వాత ఫిట్‌గా అనిపిస్తుందని తెలిపారు.

## బికినీ బేబ్

ఇంతకుముందు లక్ష్మీ రాయ్. ఇప్పుడు రాయ్ లక్ష్మీ. పేరు మారింది. ఫిజిక్ కూడా మారిపోయింది. ఒకప్పుడు బొద్దుగా ఉన్న లక్ష్మీరాయ్ ఆ తర్వాత తగ్గారు. ఇప్పుడు ఏకంగా బికినీకి సెట్ అయ్యేట్లు తన ఫిజిక్‌ని సెట్ చేసుకున్నారు 'ఫిట్‌నెస్ అంటే కేవలం ఫిజికల్‌గా ఫిట్‌గా ఉండటమే కాదు. మెంటల్‌గానూ ఫిట్‌గా ఉంటాం. నాలో ఈ కొత్తమార్పుని ప్రేమిస్తున్నాను. ఇంతగా బరువు తగ్గడంకోసం చాలా కష్టపడ్డాను. ఫిట్‌గా మారాక కొత్తవ్యక్తిలా మారిపోయిన ఫీలింగ్ వస్తోంది. మనం అనుకుంటే ఏదైనా సాధ్యమే' అని మోటివేషన్ కూడా ఇస్తున్నారు రాయ్‌లక్ష్మి. మామూలుగా బికినీలో హాట్ కనిపించే భామలను 'బికినీ బేబ్' అని యూత్ పిలుచుకుంటారు. రాయ్‌లక్ష్మి విడుదల చేసిన బికినీ ఫొటోలను చూసి, అలానే అంటున్నారు.

## బెస్ట్ వెర్షన్ ఖన్నా

ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చినప్పుడు బబ్లీగా ఉన్నారు రాశీ ఖన్నా. కొంత కాలంగా స్లిమ్ అయ్యే పనిలో పడ్డారు. 'స్లిమ్ లుక్ ఓవర్ నైట్‌లో రాదు. వర్కౌట్స్ చేస్తూనే ఉండాలి' అంటారు తన స్లిమ్ సీక్రెట్ అడిగితే. ఈ సరికొత్త లుక్‌లోకి రావడానికి రాశీ ఖన్నా సుమారు రెండేళ్లుగా శ్రమిస్తున్నారట. కొత్త లుక్‌లోకి మారిపోయిన తర్వాత 'నాకు నేను నా బెస్ట్ వెర్షన్‌లా అనిపిస్తున్నాను' అని కాన్ఫిడెంట్‌గా చెబుతున్నారామె. 'క్రాష్ కోర్స్ డైట్స్‌ని పెద్దగా నమ్మను. రెండేళ్లు శ్రమించా. హెల్తీగా, హ్యాపీగా తగ్గా' అన్నారు రాశీ. ఈ మధ్యనే తన స్లిమ్ ఫిజిక్‌ను బికినీలో దింపేశారు కూడా.

## కీర్తి పెరిగింది.. తగ్గింది

'మహానటి' సినిమాలో సావిత్రి పాత్ర కోసం కొంచెం బొద్దుగా అయ్యారు కీర్తీ సురేశ్. సావిత్రి పాత్ర తాలూకు బరువు బాధ్యతలను అద్భుతంగా మోశారు కీర్తీ. నటిగా గొప్ప పేరును సంపాదించారు. 'మహానటి' కోసం పెరిగిన బరువును తగ్గించేసి మరింత స్లిమ్‌గా మారిపోయారామె. ప్రస్తుతం చేస్తున్న లేడీ ఓరియంటెడ్ సినిమా కోసమే ఈ లుక్ అని తెలిసింది.



మెహరీన్

## పంచ్‌లైన్‌కి తగ్గట్టుగా...

'కృష్ణగాడి వీర ప్రేమ గాథ' సినిమాతో తెలుగుకు పరిచయమైన పంజాబీ కుడి మెహరీన్. కొత్తలో మెహరీన్ కూడా కొంచెం బొద్దుగానే ఉండేవారు. ఇప్పుడు 'హనీ ఈజ్ ది బెస్ట్' ('ఎఫ్ 2'లో మెహరీన్ పంచ్‌లైన్) మంత్రం జపించి స్లిమ్‌గా తయారయ్యారు. సినిమాలో పంచ్ లైనే ఇప్పుడు మెహరీన్ రియల్ లైఫ్‌కి వచ్చేసింది. కొత్త లుక్‌లోకి మారిపోయిన ఈ బ్యూటీని చూసి, 'మెహరీన్ ఈజ్ ది బెస్ట్' అంటున్నారు. తెలుగు, తమిళ భాషల్లో వరుస సినిమాలు సైన్ చేస్తూ బిజీ బిజీగా ఉన్నారు.

## 25 రోజులు 10 కిలోలు

యంగ్ హీరోయిన్స్‌లో ఫిట్‌నెస్ మీద అమితంగా ఆసక్తి చూపించేవాళ్లలో రకుల్ ప్రీత్ సింగ్ ముందు వరుసలో ఉంటారని బాక్సింగ్ బ్యాగ్ గుద్ది మరీ చెప్పొచ్చు. ఈ ఏడాది బాలీవుడ్ చిత్రం 'దే దే ప్యార్ దే' కోసం ఏకంగా పదికిలోలు తగ్గిపోయారామె. అది కూడా 25 రోజుల్లో. ఆ స్లిమ్ లుక్ సినిమాకు సరిగ్గా సరిపోయింది. అయితే సన్నబడటంకోసం రకుల్ మరీ అంతలా పస్తులుండటాన్ని ఫ్యాన్స్ జీర్ణించుకోలేకపోయారు. 'పేషెంట్‌లా ఉన్నావు' అని ప్రేమగా కామెంట్ కూడా చేశారు. 'ఫిట్‌నెస్ అందరికీ ముఖ్యమే. ఎలా ఉండాలన్నది పర్సనల్ చాయిస్' అని రకుల్ బదులిచ్చారు కూడా.

## వెయిట్ ఈజ్ ఓవర్

బాలీవుడ్ యంగ్ బ్యూటీ వాణీ కపూర్. హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ నటిస్తున్న సినిమా 'వార్'లో హీరోయిన్‌గా నటిస్తున్నారామె. ఈ యాక్షన్ సినిమాలో బికినీలో అలరించనున్నారు వాణీ. బికినీ ఫిజిక్‌లోకి రావడానికి చాలా కష్టపడ్డానని తెలిపారు. ''యోగా, గంటల తరబడి జిమ్, వెయిట్‌లిఫ్టింగ్ చేశాను. డైటింగ్ చాలా కఠినంగా అనిపించింది. చీట్ డేస్ కూడా లేకుండా శ్రమించాను'' అని రహస్యం తెలిపారు. అన్నట్లు వాణీ కపూర్ తెరపై కనిపించి కొన్నాళ్లయింది. ఇప్పుడు వెయిట్ ఈజ్ ఓవర్ అంటూ.. వెయిట్ తగ్గి మరీ కనువిందు చేయబోతున్నారు.

## వెయిట్ గేమ్స్

వెయిట్ గేమ్స్ ఆడుతున్నారు జాన్వీ కపూర్. సినిమాలో పాత్రను బట్టి బరువు తగ్గుతూ పెరుగుతూ ఉండాలి. కానీ ఒకేసారి ఓ సినిమాలో బొద్దుగా, మరో సినిమాలో స్లిమ్‌గా కనిపించాల్సి వచ్చింది. దీంతో వెయిట్ గేమ్స్ ఆడుతున్నారు. ప్రస్తుతం 'కార్గిల్ గాళ్, రూహీ అఫ్జా' సినిమాలు చేస్తున్నారామె. 'కార్గిల్ గాళ్' కోసం మొదట 6 కిలోలు పెరిగారు. 'రూహీ అఫ్జా' కోసం పది కిలోలు తగ్గారు. మళ్లీ కార్గిల్ గాళ్ కొత్త షెడ్యూల్ స్టార్ట్ అయింది. మళ్లీ బరువు పెరిగే పనిలో ఉన్నారు జాన్వీ.



జాన్వీ కపూర్

– గౌతమ్ మల్లాది

అబౌనెస్

# మెడలో మంగళసూత్రం మదిలో మంగళయానం

స్త్రీ, పురుషులు ఒకర్నొకరు కో–హ్యూమన్‌గా మాత్రమే గుర్తించి గౌరవించుకునే 'నాన్–జెండర్' జీవులుగా పరిణామం చెందుతున్న క్రమంలో కొత్తగా ఇప్పుడు తలెత్తుతున్న కొన్ని అత్యుత్సాహ వాదనలు స్త్రీలను స్త్రీలుగా, పురుషులను పురుషులుగా వేరు చేయడంతో పాటు, స్త్రీలను మళ్లీ వాళ్లలోనే వాళ్లను అనేక వర్గాలుగా విభజించడం ద్వారా ఉమెన్ ఎంపవర్‌మెంట్‌కు అసలైన అర్థమేదో చెప్పేందుకు విఫలయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది.

● మాధవ్ శింగరాజు

'స్త్రీలు సాధించారు' అనకండి. 'సాధించారు' అనండి చాలు. సాధనకు స్త్రీ ఏమిటి, పురుషుడేమిటి?.. అనే వాదనలోని గొప్ప ఉద్యమ భావన.. 'పురుషుడొచ్చి పక్కన నిలబడి చేత్తో చెయ్యెత్తించి.. అండ్ షీ ఈజ్ ద అచీవర్ అంటూ లోకానికి చూపిస్తేనే ఆమె ఘన విజయం సాధించినట్లవుతుందా?' అని వాదించడంలో కనిపించదు. అదొట్టి వాదనగానో, పాయింట్ ఆఫ్ వ్యూగానో ఉండిపోతుంది. అలా 'ఉండిపోయే' ఒక ఆర్గ్యుమెంట్‌ను సమీరా సూద్ అనే కాలమిస్ట్ 'ది ప్రింట్' వెబ్‌సైట్‌లో ఇటీవల చేసుకొచ్చారు. బాలీవుడ్ చిత్రం 'మిషన్ మంగళ్' ప్రోమో వీడియోలో వాయిస్ ఓవర్‌గా అక్షయ్ చెప్పిన భావ కవిత్వం మీద ఆమె ప్రధాన అభ్యంతరం. సినిమా ఈ ఆగస్టు 15న విడుదల అవుతోంది. ఆరేళ్ల క్రితం అంగారక గ్రహం మీదకు ఇస్రో విజయవంతంగా ప్రయోగించిన 'మంగళ్‌యాన్' ప్రాజెక్టు మీద స్టోరీ. ప్రాజెక్టు మీద కాదు, ప్రాజెక్టుకు పని చేసిన మహిళా సైంటిస్టుల ఘనత మీద. ''డిటర్‌మైండ్‌గా, ఫియర్‌లెస్‌గా, ఇన్‌స్పైరింగ్‌గా మంగళ్‌యాన్‌కు పని చేసిన మహిళా సైంటిస్టులను కీర్తించడమే ఈ సినిమా'' అని ప్రోమో వీడియోలో చాలా పొయెటిక్‌గా వెనుక ఉండి చెబుతుంటారు అక్షయ్. స్క్రీన్ మీద మహిళా సైంటిస్టులు విద్యాబాలన్, సోనాక్షి సిన్హా, తాప్సీ పన్నూ, నిత్యా మీనన్, కీర్తికులకర్ణి కనిపిస్తుంటారు. 'ఆమె గాజులు విశ్వాంతరాళాల్లో ధ్వనించాయి. ఆమె నుదుటి సిందూరం నింగిని స్పృశించింది. ఆమె కాటుక చరిత్రను లిఖించింది. ఆమె మెడలో మంగళసూత్రం..

> అక్షయ్‌కుమార్ తన ఉద్విగ్న అజ్ఞానంతో భారతీయ మహిళలంతా ఒక్కటే అనే భావనను వ్యక్తీకరిస్తే, సమీరా సూద్ అనే కాలమిస్టు తన ఉద్యమ జ్ఞానంతో భారతీయ మహిళల్ని హిందువులుగా, ముస్లింలుగా వేరు చేసి చూశారు!!



'మిషన్ మంగళ్' చిత్రం టీజర్‌లో అక్షయ్ అండ్ టీమ్ : నిత్యా మీనన్, తాప్సీ పన్నూ, విద్యాబాలన్, సోనాక్షి సిన్హా, షర్మన్ జోషి, కీర్తి కులకర్ణి

ఆమె మదిలో మంగళయానం'.. ఇలా సాగుతుంది అక్షయ్ పొయెట్రీ. ''మాటల్తో భలే అల్లాడు మన జాతీయవాద స్త్రీజన రక్షకుడు.. ప్రాథమిక పాఠశాల పిల్లల కవితల పోటీకి సరిపోతుంది' అని సమీర తన వ్యాసంలో సెటైర్‌లు వేశారు అక్షయ్ మీద. ''ఈ హీరో మహిళా సైంటిస్టుల గొప్పతనం గురించి చెబుతున్నారా లేక భారతీయ హైందవ వనితల మహోన్నతమైన కట్టూబొట్ల సంస్కృతిని శ్లాఘిస్తున్నారా?!'' అని కూడా ఆమె ప్రశ్నించారు. ''ఒకవేళ వీళ్లంతా బురఖా వేసుకున్న మహిళా సైంటిస్టులు అయివుంటే అక్షయ్ ఇదే రకమైన కవిత్వాన్ని చెప్పి ఉండేవారా.. బొట్టు, కాటుక, గాజులు, మంగళ సూత్రం అంటూ..'' అని అడిగారు. ''అయినా నాకు ఈ సందేహాలన్నీ ఏమిటి? స్వాతంత్ర్య దినోత్సవం రోజు నా అభిమాన థియేటర్‌లో ఛాతీ ఉప్పొంగుతుండగా విజయగర్వంతో ఈ సినిమాను చూస్తూ కూర్చోక! సేఫ్ సైడ్‌గా భారత్ మాతాకి జై అని కూడా అంటున్నా.. అని ఆర్టికల్‌ని ముగించారు.

అక్షయ్ ఏం చెయ్యాలని సమీర ఉద్దేశం? అది కూడా చెప్పారు. కుంకుమ, కాటుక, తాళిబొట్టు అని కాకుండా రాకెట్ లాంచర్స్, ఆర్బిటర్, రోవర్, పేలోడ్స్ (పైకి తీసుకెళ్లే బరువులు) అనే పదాలతో మహిళల శక్తిసామర్థ్యాలను కవిత్వీకరించి ఉండాల్సిందట! సినిమా కేవలం ఇస్రో మార్స్ మిషన్ మీదనైతే అలాగే చేసి ఉండాల్సింది. మహిళా మిషన్ అన్నది మెయిన్ థీమ్ కాబట్టి, ఆడవాళ్లు కెరియర్‌లో ఎదగడంలో అడ్డంకులు, అవాంతరాలు ఉంటాయి కాబట్టి 'కో–హ్యూమన్' అనే స్త్రీ, పురుష సమస్థాయిని దాటి ఎలా వాళ్ల 'అబౌనెస్'ని సెలబ్రేట్ చెయ్యడం? మహిళను మహిళ అనడం కన్నా అబౌనెస్ ఏముంటుందని అనుకున్నట్లున్నారు అక్షయ్. ఆ ఉద్విగ్న అజ్ఞానంతో భారతీయ మహిళలంతా ఒక్కటే అనే భావనలో ఉండి ఆయన కవిత్వం రాస్తే, సమీర వచ్చి తన ఉద్యమ జ్ఞానంతో భారతీయ మహిళల్ని హిందువులుగా, ముస్లింలుగా వేరు చేసి చూశారు!

'ది ప్రింట్' సైట్‌లోనే కావేరీ బాంజాయ్ అనే సీనియర్ జర్నలిస్టు.. 'అక్షయ్‌కి అసలు ఆడవాళ్ల మధ్య ఏం పని?' అని చికాకు పడటం కూడా ఆశ్చర్యం కలిగించే విధంగా ఉంది. ''అక్షయ్ కుమార్ వచ్చి చెప్పకపోతే స్త్రీల గొప్పతనం దేశానికి తెలియదని బాలీవుడ్ అనుకుంటోందా! 'టాయ్‌లెట్: ఏక్ ప్రేమ్ కథ'లో అక్షయ్, 'ప్యాడ్ మ్యాన్'లో అక్షయ్, 'నామ్ షబానా'లో అక్షయ్, ఇప్పుడు 'మిషన్ మంగళ్'లో అక్షయ్. ఈ స్త్రీల కథలన్నిటిలోనూ అక్షయ్ ఎందుకు ఉమెన్ ఎంపవర్‌మెంట్‌కు బ్రాండ్ అంబాసిడర్‌లా!'' అని కావేరి అసహనం. 'మిషన్ మంగళ్' పోస్టర్ రిలీజ్ ఫంక్షన్‌లో కావేరి లాంటి జర్నలిస్టులు కొందరు సినిమాలోని ఉమెన్ టీమ్‌ని ఇదే మాట అడిగారు.. 'ఆయనేంటి పోస్టర్‌లో మిమ్మల్నందర్నీ మింగేస్తున్నారు' అని. ''మెన్ ఆర్ ఫ్రమ్ మార్స్ కదా. అందుకు..'' అని విద్యాబాలన్ నవ్వుతూ సమాధానం ఇచ్చారు. సమీరా సూద్, కావేరీ బాంజాయ్ ఐదొందల పదాల్లో చేసిన ఆర్గ్యుమెంట్‌లనే బాలన్ నాలుగైదు పదాల్లో తేల్చేశారు.

మానవుల యంత్రాలు మార్స్‌లోకి వెళ్తున్నట్లే యంత్రాల్లాంటి మగవాళ్లు (ఇన్‌సెన్సిటివ్ అనే అర్థంలో) మార్స్ దిగి వస్తున్నారు. అలవాటు లేని 'వీనస్' గ్రహంలోకి వచ్చినప్పుడు ఆడవాళ్ల మధ్యలోకి వచ్చారేమిటని వాళ్లను ఉక్కిరిబిక్కిరి చెయ్యకూడదు. ఆడవాళ్లంటే దేశ సంస్కృతీ సంప్రదాయాలేనా అని అయోమయంలోకి నెట్టేయకూడదు. ●

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ మంగళవారం
6-8-2019

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | | | 5 | 2 | | 3 | 9 | |
| 9 | | | 7 | | | 4 | | 6 |
| 8 | 3 | | | | 4 | | | |
| 3 | | 5 | | 7 | | | 6 | |
| | 8 | | 3 | 9 | 5 | | 4 | |
| | 9 | | | 8 | | 5 | | 3 |
| | | | 1 | | | | 3 | 2 |
| 1 | | 3 | | | 9 | | | 4 |
| | 2 | 9 | | 6 | 3 | | | 7 |

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి. (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

**నిన్నటి జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 4 | 1 | 7 | 2 | 6 | 3 | 9 | 5 |
| 7 | 3 | 5 | 4 | 1 | 9 | 8 | 2 | 6 |
| 6 | 9 | 2 | 8 | 3 | 5 | 7 | 4 | 1 |
| 1 | 5 | 8 | 6 | 7 | 2 | 4 | 3 | 9 |
| 4 | 2 | 6 | 3 | 9 | 8 | 1 | 5 | 7 |
| 3 | 7 | 9 | 1 | 5 | 4 | 6 | 8 | 2 |
| 2 | 8 | 4 | 5 | 6 | 1 | 9 | 7 | 3 |
| 9 | 6 | 3 | 2 | 4 | 7 | 5 | 1 | 8 |
| 5 | 1 | 7 | 9 | 8 | 3 | 2 | 6 | 4 |



# మూడు రోజుల్లో స్టెప్ ఇన్

పదమూడేళ్ల గ్యాప్ తర్వాత మళ్లీ స్క్రీన్ మీద కనిపించనున్నారు విజయశాంతి. మరో మూడు రోజుల్లో కెమెరా ముందుకు రాబోతున్నారని సమాచారం. మహేశ్‌బాబు హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'సరిలేరు నీకెవ్వరు' అనే చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఇందులో విజయశాంతి కీలక పాత్ర చేస్తున్నారు. 'దిల్' రాజు, అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ సినిమాలో రష్మికా మందన్నా కథానాయిక. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఆగస్ట్ 9 నుంచి విజయశాంతి చిత్రీకరణలో పాల్గొంటారని తెలిసింది. 9 నుంచి ఓ వారంపాటు షూటింగ్‌లో పాల్గొంటారట. ఆ తర్వాత చిన్న బ్రేక్ తీసుకొని మళ్లీ జాయిన్ అవుతారు. ఈ సినిమా కోసం సుమారు 55 రోజులు డేట్స్‌ను కేటాయించారట విజయశాంతి. దీన్ని బట్టి ఆమె పాత్ర ఈ సినిమాలో ఎంత కీలకంగా ఉండబోతోందో ఊహించవచ్చు. మహేశ్‌బాబుతో పాటు సాగే పాత్రలో విజయశాంతి కనిపిస్తారని సమాచారం. ఈ పాత్ర కోసం విజయశాంతి ఫిట్‌గా మారిపోయారు కూడా. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం రిలీజ్ కానుంది.

● విజయశాంతి

# నిశ్శబ్దంగా పూర్తయింది



● అనుష్క



● హేమంత్, అనుష్క, కోన వెంకట్, షానీ

ఈ మధ్య కాలంలో సినిమా పూర్తి కావాలంటే తక్కువలో తక్కువ ఆరునెలలు టైమ్ పడుతుంది. కానీ 'నిశ్శబ్దం' చిత్రబృందం సైలెంట్‌గా రెండు నెలల్లోనే సినిమా షూటింగ్ పూర్తి చేయడం విశేషం. అనుష్క, మాధవన్, అంజలి, షాలినీ పాండే ముఖ్య పాత్రల్లో హేమంత్ మధుకర్ తెరకెక్కించిన చిత్రం 'నిశ్శబ్దం'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మించాయి. సినిమా మొత్తం షూటింగ్‌ని అమెరికాలోని సీటెల్‌లో జరిపారు. సైలెంట్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో కొందరు హాలీవుడ్ యాక్టర్స్ కూడా నటించారు. ''షూటింగ్ పూర్తయింది. ఈ థ్రిల్లర్‌ను మీ అందరికీ త్వరగా చూపించేయాలని చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం'' అని చిత్రబృందం తెలిపింది. గోపీసుందర్ సంగీతం అందించిన ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో రిలీజ్ కానుంది.



● షబానా ఆజ్మీ

## హాలీవుడ్‌కి హాలో

బాలీవుడ్ నటి షబానా ఆజ్మీ బుడాపెస్ట్ ప్రయాణానికి సిద్ధమయ్యారు. హాలీవుడ్ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్ నిర్మిస్తున్న 'హాలో' వెబ్ సిరీస్‌లో ముఖ్య పాత్రలో షబానా నటించనున్నారు. 'హాలో' అనే పాపులర్ వీడియో గేమ్ ఆధారంగా ఈ సిరీస్ తెరకెక్కనుంది. ఈ విషయం గురించి షబానా మాట్లాడుతూ – ''ఇదో కొత్త ప్రయాణం. చాలా ఎగ్జైట్‌మెంట్‌తో పాటు కొంచెం నెర్వస్‌గానూ ఉంది. ఈ ప్రాజెక్ట్ అనుకోకుండా నా దగ్గరకు వచ్చింది. దీనికోసం రెండు సినిమాలను కూడా వదులుకున్నాను. ఆ సినిమాలు వదులుకునేంత విలువైందే ఈ సిరీస్ అనుకుంటున్నాను'' అన్నారు. అక్టోబర్‌లో ఈ వెబ్ సిరీస్ షూటింగ్ స్టార్ట్ కానుంది. ఇదివరకు 'సిటీ ఆఫ్ జాయ్, లా నూట్ బెంగాలీ' అనే హాలీవుడ్ చిత్రాల్లో నటించారు షబానా.

# వాటిని మరచిపోయే హిట్‌ని రాక్షసుడు ఇచ్చింది



● బెల్లంకొండ సురేశ్

''నేను సినిమా ఇండస్ట్రీకి వచ్చి 30 ఏళ్లయింది. సినిమాలు నిర్మించడం ప్రారంభించి 21 సంవత్సరాలైంది. ఇన్నేళ్లలో 25 స్ట్రయిట్ సినిమాలు నిర్మించా.. 8 చిత్రాలు డబ్బింగ్ చేశా. అవేవీ నాకు ఆనందం ఇవ్వలేదు. మా అబ్బాయి చేసిన 'రాక్షసుడు' సినిమాకి అందరి ప్రశంసలు దక్కడంతో చాలా ఆనందంగా ఉంది. ఇప్పటి వరకూ తను చేసిన ఆరు సినిమాలు ఒక ఎత్తయితే 'రాక్షసుడు' మరో ఎత్తు. ఫస్ట్ టైమ్ ఓవర్‌సీస్‌లో మా సినిమాకి 100 ప్రీమియర్ షోలు పడటం విశేషం" అని నిర్మాత బెల్లంకొండ సురేశ్ అన్నారు. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా రమేష్ వర్మ పెన్మత్స దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రాక్షసుడు'. కోనేరు సత్యనారాయణ నిర్మించిన ఈ సినిమాని అభిషేక్ నామా గత శుక్రవారం విడుదల చేశారు. ఈ సినిమాకి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తున్న సందర్భంగా బెల్లంకొండ సురేశ్ తన ఆనందాన్ని మీడియాతో పంచుకున్నారు.. ఆ విశేషాలు.

- మా అబ్బాయి ఈ ఐదేళ్లలో 7 సినిమాలు చేశాడు. 'అల్లుడు శీను' సినిమాకి చాలా మంది హీరోలకి తీసిపోని విధంగా ఎక్స్‌ట్రార్డినరీ ఓపెనింగ్స్‌తో 6 రోజుల్లో 34కోట్ల షేర్ వచ్చింది. అన్ని వాణిజ్య అంశాలతో వీవీ వినాయక్‌గారి దర్శకత్వంలో ఆ సినిమాలో మా అబ్బాయిని హీరోగా పరిచయం చేశా. ఆ తర్వాత బోయపాటి శ్రీనుగారి సినిమాని భారీ బడ్జెట్‌తో, భారీ నటీనటులతో నిర్మించాం. కానీ, వాటికి దర్శకులకు, తోటి నటీనటులకు పేరొచ్చింది. అయితే 'రాక్షసుడు' మాత్రం మా అబ్బాయికి మంచి పేరు తీసుకొచ్చింది. రెవెన్యూ సైడ్ కూడా సూపర్ హిట్ అయింది. మాకు ఇంత పెద్ద సూపర్ హిట్ ఇచ్చిన తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు.
- 'రాక్షసుడు' కచ్చితంగా హిట్ అవుతుంది.. తెలుగులో మంచి పేరు వస్తుందని నెలన్నర పాటు రమేశ్ వర్మ తమిళ 'రాక్షసన్' హక్కుల కోసం ప్రయత్నించాడు.. నేను కూడా తనకు సపోర్ట్‌గా ప్రయత్నించాను. ఈ రోజుల్లో స్ట్రయిట్ సినిమా తీయడం ఈజీ కానీ, రీమేక్ తీయడం చాలా కష్టం. సరిగ్గా తీయకపోతే మంచి సినిమాని చెడగొట్టారంటూ తిడతారు. రమేశ్ వర్మకి కోనేరు సత్యనారాయణ వంటి మంచి నిర్మాత కుదిరారు. మా అబ్బాయికి మంచి సినిమా ఇచ్చినందుకు నిర్మాతకి పాదాభివందనం. సాయిని అందంగా, యూత్‌ఫుల్‌గా చూపించిన కెమెరామేన్ వెంకట్‌కి హ్యాట్సాఫ్.
- మా అబ్బాయి 'అల్లుడు శీను, జయ జానకి నాయక' సూపర్ హిట్స్.. స్పీడున్నోడు, కవచం, సీత' వంటి ఫ్లాప్ సినిమాలు కూడా ఉన్నాయి. వీటన్నింటినీ మరచిపోయేలా 'రాక్షసుడు' హిట్ కొట్టింది. సౌత్ నుంచి హిందీలో డబ్బింగ్ అయిన హీరోల సినిమాల్లో నంబర్ వన్‌గా ఉన్నవన్నీ మా అబ్బాయి సినిమాలే. కావాలంటే యూ ట్యూబ్‌లో చూసుకోవచ్చు. 'జయ జానకి నాయక' సినిమాకి సరైన విడుదల తేదీ, థియేటర్లు దొరక్కపోవడం వల్ల కొంచెం నష్టం జరిగింది. లేకుంటే ఆ సినిమానే పెద్ద బ్లాక్ బస్టర్ హిట్ కావాల్సింది.. దీంతో హిట్‌తోనే సరిపెట్టుకున్నాం.
- సాయితో బాలీవుడ్‌లో స్ట్రయిట్ హిందీ సినిమా చేస్తామంటూ హాలీవుడ్ సినిమాలు తీసే ఓ పెద్ద కంపెనీ నుంచి సోమవారమే మెయిల్ వచ్చింది. మేమింకా ఓకే చెప్పలేదు. అన్నీ కుదిరితే తప్పకుండా చేస్తాం. లేదంటే వచ్చే ఏడాది మా సొంత బ్యానర్‌లో తెలుగులో హిట్ అయిన ఓ సినిమాని హిందీలో రీమేక్ చేస్తాం. ఇప్పటి వరకూ మా అబ్బాయి ఫైట్స్, డ్యాన్సులు బాగా చేయగలడనే పేరుంది.. 'రాక్షసుడు'తో బాగా నటించగలడని పేరొచ్చింది.
- హీరో అవ్వాలని ఐదో తరగతిలోనే సాయి అనుకున్నాడు. అప్పటి నుంచే ఓ వైపు చదువుతూనే మరో వైపు డ్యాన్స్, ఫైట్స్, జిమ్నాస్టిక్ నేర్చుకున్నాడు. నిర్మాత కొడుకు హీరోగా ఎదగడం చాలా కష్టం. కానీ, మా అబ్బాయిది ఎంతో కష్టపడే తత్వం.. దానికి దేవుడి ఆశీర్వాదం, ప్రేక్షకులు అభిమానం తోడవడంతో సక్సెస్ అందుకున్నాడు. దానికితోడు మంచి సినిమాని ఎప్పుడూ మన ప్రేక్షకులు ఆదరిస్తారు.
- 'రాక్షసన్' రీమేక్ చేయాలనుకున్నప్పుడు వెంకటేశ్‌బాబు రీమేక్ సినిమాల్లా ఏం మార్పులు చేయకుండా చేస్తే సరిపోతుందని చెప్పా. అలా చేయడం వల్లే 'రాక్షసుడు' మంచి విజయం సాధించింది. ఇకపై మంచి కథా చిత్రాలే చేయాలనుకున్నాం. మా అబ్బాయి తర్వాతి సినిమాని నిర్మాత 'దిల్' రాజుగారికి అప్పచెప్పా.. ఆయనే నిర్మిస్తారు. ఆ తర్వాత మా సొంత బ్యానర్‌లో ఓ సినిమా ఉంటుంది.

# ట్రైలర్ చూశాక ఇంకా ఆసక్తి పెరిగింది

**– నాని**



● అబ్బూరి రవి, నవీన్ చంద్ర, పీవీపీ, నాని, అడివి శేష్, వెంకట్ రామ్‌జీ

''గూఢచారి' చిత్రం ట్రైలర్‌ను ఇదే అన్నపూర్ణ స్టూడియోలో విడుదల చేశాం.. ఎంత పెద్ద హిట్ అయ్యిందో మనకు తెలుసు. 'ఎవరు' సినిమా కూడా పెద్ద హిట్ అయిపోతే శేష్ ప్రతి సినిమా ట్రైలర్‌ని నేనే విడుదల చేయాల్సి వస్తుందనే ప్రమాదం ఉన్నప్పటికీ, మనస్ఫూర్తిగా ఈ సినిమా హిట్ కావాలని కోరుకుంటున్నా'' అని హీరో నాని అన్నారు. అడివి శేష్, రెజీనా జంటగా, నవీన్ చంద్ర కీలక పాత్రలో నటించిన చిత్రం 'ఎవరు'. వెంకట్ రామ్‌జీని దర్శకుడిగా పరిచయం చేస్తూ పీవీపీ సినిమా బ్యానర్‌పై పెరల్ వి.పొట్లూరి, పరమ్ వి.పొట్లూరి, కెవిన్ అన్నె నిర్మించిన ఈ సినిమాని ఈ నెల 15న విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసిన అనంతరం నాని మాట్లాడుతూ– ''శేష్, రెజీనా, పీవీపీగారు సహా అందరూ నా కుటుంబ సభ్యులతో సమానం. ట్రైలర్ నేరుగా మనల్ని కథలోకి తీసుకెళ్లిపోయింది. అసలు తెలుగు సినిమానా? ఇంగ్లిష్ సినిమానా? అనిపిస్తోంది.. సినిమాను అంత బాగా చేశారు. టీజర్ చూసినప్పుడే సినిమాపై ఇంట్రెస్ట్ కలిగింది. ఇప్పుడు ట్రైలర్ చూసిన తర్వాత ఇంకా సినిమా ఎప్పుడెప్పుడు విడుదలవుతుందా? అనే ఆసక్తి పెరిగిపోయింది'' అన్నారు. ''మా సినిమా గురించి ఇప్పుడే మాట్లాడాలనుకోవడం లేదు. ప్రీ రిలీజ్ ఫంక్షన్ రోజున మాట్లాడతాను'' అన్నారు వెంకట్ రామ్‌జీ. ''సినిమాలంటే ప్యాషన్ ఉన్న టీమ్ ఇది. రెండేళ్ల ముందు అనుకున్న ఆలోచనతో చేశాం. మంచి సినిమా అని గర్వంగా ఫీల్ అవుతున్నాం. కచ్చితంగా అందరికీ నచ్చుతుంది'' అని నిర్మాత పీవీపీ అన్నారు. ''ఎవరు' సినిమాలో పనిచేయడం ఆనందంగా ఉంది'' అన్నారు నవీన్ చంద్ర. ''నేను నమ్మిన సినిమా.. నాకు నచ్చిన సినిమా 'ఎవరు'. ఈ సినిమాలో అందరూ రెండు ముఖాలను కలిగి ఉంటారు. ఈ మనిషి ఇలా ఉంటారని ప్రేక్షకుడు అనుకున్న పది నిమిషాలకు ఆ మనిషి మారిపోతుంటాడు. ఇలాంటి కథతో సినిమా చేయబోతున్నానని రామ్‌జీ చెప్పగానే ట్విస్ట్‌ను బ్రేక్ చేయలేకపోయాను. నన్ను హీరోగా ఏ ప్రొడ్యూసర్ నమ్మని టైమ్‌లో పీవీపీగారు నమ్మారు. అందుకే ఆయనతో 'క్షణం' తర్వాత 'ఎవరు' చేశా'' అని అడివి శేష్ చెప్పారు. రచయిత అబ్బూరి రవి పాల్గొన్నారు.



● హృతిక్ రోషన్

## శ్రీ రాముడిగా?

'సూపర్ 30' సక్సెస్‌తో సూపర్ ఎనర్జీలో ఉన్నారు హృతిక్ రోషన్. ఇప్పుడు వరుసగా సినిమాలను సైన్ చేస్తున్నారు. ఫర్హాన్ ఖాన్‌తో 'సత్తే పే సత్తే', ఆ తర్వాత 'క్రిష్ 4' ఉంటుందని ప్రకటించారు. లేటెస్ట్‌గా అల్లు అరవింద్, నమిత్ మల్హోత్రా నిర్మాణంలో తెరకెక్కనున్న భారీ పౌరాణిక చిత్రం 'రామాయణ్' సినిమాలో హృతిక్ హీరోగా నటించనున్నారని బాలీవుడ్ టాక్. ఇందులో శ్రీరాముడిగా హృతిక్ నటించనున్నారట. లైవ్ యాక్షన్ మూవీగా తెరకెక్కబోయే ఈ సినిమాను 'దంగల్' ఫేమ్ నితేష్ తివారి, 'మామ్' దర్శకుడు రవి ఉడయార్ దర్శకత్వం వహించనున్నారు. త్వరలోనే ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో మూడు భాగాలుగా రూపొందనున్న ఈ చిత్రం బడ్జెట్ సుమారు 1500 కోట్లు.



● జీవా, నయనతార

## సరైనోడు వీడే

జీవా, నయనతార జంటగా తమిళంలో రూపొంది, ఘన విజయం సాధించిన ఓ చిత్రాన్ని 'వీడే సరైనోడు' పేరుతో తెలుగులో అనువదిస్తున్నారు. కోకా శిరీష సమర్పణలో నోవా సినిమాస్ పతాకంపై జక్కుల నాగేశ్వరావు ఈ చిత్రాన్ని ఈ నెల 23న విడుదల చేస్తున్నారు. జక్కుల నాగేశ్వరావు మాట్లాడుతూ – ''గ్రామీణ, నగర నేపథ్యంలో ఆద్యంతం ఆసక్తికరంగా సాగే చిత్రమిది. జీవా నటన, నయనతార గ్లామర్ ప్రధాన ఆకర్షణలుగా నిలుస్తాయి. ప్రస్తుతం సెన్సార్ పూర్తయింది. ఈనెల 8న పాటలు విడుదల చేస్తున్నాం'' అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీకాంత్ దేవా, సహ నిర్మాతలు: మాస్టర్ కోకా లోహితాక్ష్ – మాస్టర్ కోకా నిశ్చల్ సాయికృష్ణ.

# ఆ నలుగురు లేకుంటే కొబ్బరిమట్ట లేదు



● సాయిరాజేష్, ఏలూరు శ్రీను, సంపూర్ణేష్‌బాబు, ఇషిక

'హృదయ కాలేయం' ఫేమ్ సంపూర్ణేష్ బాబు హీరోగా నటించిన తాజా చిత్రం 'కొబ్బరిమట్ట'. రూపక్ రొనాల్డ్ సన్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ సాయి రాజేష్ నిర్మించిన ఈ సినిమా ఈనెల 10న విడుదలకానుంది. ఈ సందర్భంగా చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. రొనాల్డ్ సన్ మాట్లాడుతూ– ''హృదయకాలేయం' విడుదల సమయంలో కొన్ని ఇబ్బందులు పడ్డాం. ఎవరీ హీరో.. మార్కెట్ అవుతుందా? అనే ప్రశ్నలతో వ్యాపారం మందకొడిగా సాగింది. విడుదల తర్వాత ఆ సినిమాకి మంచి పేరు వచ్చింది. 'కొబ్బరిమట్ట' చిత్రాన్ని 'బాహుబలి' తరహాలో ఐదేళ్లు తీశాం. ప్రమోషన్‌లో భాగంగా ఒక్కో ట్రైలర్ విడుదల చేయగా సినిమాపై ఆసక్తి పెరిగింది. ఇండస్ట్రీలో ఆ నలుగురు వల్లే మా చిత్రం నిలబడింది. గీతా ఆర్ట్స్ సంస్థ ద్వారా మా చిత్రం విడుదలకాబోతుంది. నైజాంలో 'దిల్' రాజుగారు విడుదల చేస్తున్నారు. ఆ నలుగురు లేనిదే 'కొబ్బరిమట్ట' లేదు. కథ బాగుంటే విడుదలకు సహకరిస్తారనేందుకు మా చిత్రమే నిదర్శనం'' అన్నారు. ''ఈ సినిమాలో మూడు పాత్రలు పోషించాను. యాక్షన్, కామెడీ, సెంటిమెంట్ , రొమాన్స్, సందేశం.. ఇలా అన్ని అంశాలు మా సినిమాలో ఉంటాయి'' అన్నారు సంపూర్ణేష్‌బాబు. ''నాలుగేళ్ల ప్రయాణం మా చిత్రం. గీతా ఆర్ట్స్ సహకారంతో చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. మా సినిమాకి ఇప్పటికే టికెట్స్ బుకింగ్ 80శాతం పూర్తయ్యాయి'' అన్నారు సాయిరాజేష్. నిర్మాత ఎస్‌కె.ఎన్, కత్తి మహేష్, ఏలూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి క్షణమూ పోరాటమే

డిప్రెషన్ గురించి ఇదివరకు మాట్లాడారు దీపికా పదుకోన్. డిప్రెషన్‌లో ఉన్నప్పుడు ప్రతి రోజూ పోరాటమే అన్నారామె. డిప్రెషన్, దాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? అనే విషయం గురించి దీపికా పదుకోన్ ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ''డిప్రెషన్‌లో ఉన్నప్పుడు నా పరిస్థితి ఎలా ఉందో వివరించమంటే 'పోరాటం' అని చెబుతాను. ప్రతిక్షణమూ పోరాటమే. ఎప్పుడూ అలసిపోయినట్టు అనిపించేది. అయితే ఈ మధ్యన చాలా మంది బాధపడతుండటాన్ని కూడా డిప్రెషన్ అని తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. అసలు డిప్రెషన్ అంటే ఏంటే అర్థం చేసుకోవాలి. నేను డిప్రెషన్‌లో ఉన్నప్పుడు ఆ విషయాన్ని బయటకు చెప్పినప్పుడు నాకు చాలా రిలీఫ్‌గా అనిపించింది. నన్ను కిందకు తొక్కేస్తున్న బరువంతా తీసినట్టు.. మనసంతా చాలా తేలికగా అనిపించింది. 'డబ్బు, పేరు, కావాల్సినవి అన్నీ ఉన్నాయి కదా ఇంకెందుకు డిప్రెషన్' అని కొందరు వాదిస్తారు. డిప్రెషన్ అనేది మానసిక సమస్య. మన చేతుల్లో, మన కంట్రోల్‌లో లేని విషయం అని తెలుసుకోవాలి'' అన్నారు. ప్రస్తుతం దీపికా పదుకోన్ 'చప్పాక్, 83' సినిమాలతో బిజీగా ఉన్నారు.

● దీపికా పదుకోన్

# ట్రాఫిక్ సిగ్నల్ కథేంటి



● సిద్ధార్థ్

'ఎరుపు పసుపు పచ్చ' ఈ మూడు రంగులను మనం ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర ఎక్కువగా చూస్తుంటాం. ఇప్పుడీ రంగులనే సినిమా టైటిల్‌గా ఫిక్స్ చేశారు తమిళ దర్శకుడు శశి. 'బిచ్చగాడు' చిత్రాన్ని రూపొందించిన శశి కొత్త తమిళ చిత్రం 'సివప్పు మంజళ్ పచ్చై'. సిద్ధార్థ్, జీవీ ప్రకాశ్ కుమార్ హీరోలుగా నటించారు. రమేశ్ పిళ్లై నిర్మించారు. ఈ సినిమాను తెలుగులో 'ఎరుపు పసుపు పచ్చ' టైటిల్‌తో అనువదిస్తున్నారు. రమేశ్ పిళ్లై మాట్లాడుతూ– ''ఓ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కి, బైక్ రేసర్‌కి మధ్య సాగే ఎమోషనల్ కథ ఇది. మంచి ఫ్యామిలీ డ్రామా. యూనివర్సల్ సబ్జెక్ట్ ఇది. తెలుగు, తమిళ భాషల్లో సెప్టెంబర్ మొదటివారంలో విడుదల చేస్తాం'' అన్నారు. ''నా గత చిత్రం 'బిచ్చగాడు'ని బాగా ఆదరించారు. నా నుంచి ఏం ఆశిస్తారో అవన్నీ ఆలోచించి ఈ కథ తయారు చేశాను. అందరికీ నచ్చుతుంది'' అన్నారు దర్శకుడు శశి.

# అన్నపూర్ణమ్మ మనవడు



● అన్నపూర్ణమ్మ, యం.ఎన్.ఆర్ చౌదరి, రవితేజ, శివనాగు, తారకరత్న

సీనియర్ నటులు అన్నపూర్ణమ్మ ప్రధాన పాత్రలో, జమున కీలక పాత్రలో రూపొందిన చిత్రం 'అన్నపూర్ణమ్మగారి మనవడు'. మాస్టర్ రవితేజ టైటిల్ రోల్ పోషించారు. నర్రా శివనాగేశ్వర్ రావు (శివనాగు) దర్శకత్వంలో యం.ఎన్.ఆర్ ఫిలిమ్స్ పతాకంపై యం.ఎన్.ఆర్ చౌదరి నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత సి. కల్యాణ్ విడుదల చేశారు. అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ– '' చాలా కాలం తర్వాత మళ్లీ ఒక మంచి పాత్రలో నటించడం సంతోషంగా ఉంది. శివనాగు చాలా క్రమశిక్షణ ఉన్న దర్శకుడు. నా మనవడిగా నటించిన మాస్టర్ రవితేజ పుట్టుకతోనే నటన నేర్చుకొని వచ్చాడు'' అన్నారు. యమ్.ఎన్. ఆర్ చౌదరి మాట్లాడుతూ– ''ఒక మంచి సినిమా ద్వారా మీ ముందుకు వస్తున్నందుకు సంతోషం. శివనాగు ఎంతో అందంగా ఈ చిత్రం తెరకెక్కించారు. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. సెప్టెంబర్‌లో ఆడియో, అక్టోబర్‌లో సినిమా విడుదల చేస్తాం'' అన్నారు. ''పూర్తి పల్లెటూరి నేపథ్యంలో సాగే చిత్రమిది. 200లకు పైగా థియేటర్స్‌లో సినిమాను విడుదల చేయనున్నాం'' అని శివనాగు అన్నారు. ''శివనాగుగారి దర్శకత్వంలో 'దేవినేని' సినిమా చేస్తున్నాను. సినిమా మీద ఎంతో ఇష్టంతో పని చేస్తారాయన'' అన్నారు హీరో తారకరత్న. సీనియర్ పాత్రికేయులు వినాయక రావు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: గిరికుమర్(గిరి), సంగీతం: రాజ్ కిరణ్.



● పరిణీతి చోప్రా

## ప్రయాణం మొదలైంది

కథానాయిక పరిణీతి చోప్రా రైలు ప్రయాణం చేస్తున్నారు. అదితీరావ్ హైదరీ, కృతీకల్హారీ ఈ ప్రయాణంలో పరిణీతి చోప్రాకు తోటి ప్రయాణికులు. ఈ ముగ్గురు హీరోయిన్లు కలిసి ఏ ట్రైన్ ట్రిప్ ప్లాన్ చేయలేదు. 'ద గాళ్ ఆన్ ది ట్రైన్' అనే హాలీవుడ్ సినిమా హిందీ రీమేక్ మూవీ కోసం తోటి ప్రయాణికులుగా తోడయ్యారు. రిబు దాస్ గుప్తా దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. మేజర్ షూటింగ్ లండన్‌లో ప్లాన్ చేశారు. ఓ మిస్సింగ్ పర్సన్ కేసులో చిక్కుకున్న ఓ వివాహిత ఆధారంగా ఈ సినిమా కథనం ఉంటుంది. పౌలా హాకిన్స్ ఫేమస్ నవల 'ద గాళ్ ఆన్ ది ట్రైన్' ఆధారంగా అదే టైటిల్‌తో 2015లో 'ద గాళ్ ఆన్ ది ట్రైన్' సినిమా తెరకెక్కిన సంగతి తెలిసిందే.

# డెయిరీ పెట్టుకోవటం ఎలా?



పాలకు స్థిరంగా గిరాకీ పెరుగుతూనే ఉంది. అయితే, పాడి పశువుల పెంపకం చెప్పినంత, విన్నంత సులభం కాదు. పశువుల పెంపకంపై ప్రేమ, శాస్త్రీయ అవగాహనతో పాటు సంపూర్ణ నిమగ్నతతో కూడిన ఆచరణ తోడైతే విజయం తథ్యం. మేలు జాతి పాడి పశువుల పెంపకం చేపట్టి, మార్కెటింగ్ అవకాశాలను అందిపుచ్చుకుంటే డెయిరీ ఫారాన్ని లాభదాయకంగా నిర్వహించుకోవచ్చంటున్నారు నిపుణులు..

పాలు, పాల ఉత్పత్తుల అవసరం అనుదినం ప్రతి కుటుంబానికీ ఉంటుంది. పెరుగుతున్న జనాభాతో పాటు పట్టణీకరణ, సగటు కొనుగోలు సామర్థ్యం పెరగడం వల్ల పాలు, పాల ఉత్పత్తులకు క్రమేణా డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పాడి రైతులతో పాటు, ఔత్సాహికులు, నిరుద్యోగ యువత అధిక పాల సార కలిగిన మేలు జాతి ఆవులు లేదా గేదెలతో పాడి పరిశ్రమ ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. ఎంత మంది చేపట్టినా గిరాకీ పెరుగుతూనే ఉండే రంగం ఇది.

అయితే, పాడి పశువుల పెంపకం చెప్పినంత, విన్నంత సులభం కాదు. పశువుల పెంపకంపై ప్రేమ ఉండాలి. శాస్త్రీయ అవగాహనతో పాటు సంపూర్ణ నిమగ్నతతో కూడిన ఆచరణ తోడైతే విజయం మీ వెంటే ఉంటుంది. మేలు జాతి పాడి పశువుల పెంపకంలో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటిస్తూ ఆశించిన పాల ఉత్పత్తి పొందినప్పుడే పశుపోషణ లాభదాయకమవుతుంది.

**డెయిరీని ఏర్పాటు చేయదలచిన వారు గమనించాల్సిన ముఖ్యాంశాలు**

**1** పాడి పశువుల పెంపకంపై ఆసక్తి – ఆశావహ దృక్పథం, **2** వసతులు – వనరులు, **3** మేలుజాతి పాడి పశువులు, **4** పాడి పశువుల మేపు, **5** ఖర్చు తగ్గింపు, ఉత్పత్తి పెంపు, **6** పశు ఆరోగ్య సంరక్షణ, **7** పునరుత్పత్తి యాజమాన్యం, **8** దూడల పోషణ, **9** శుభ్రమైన పాల ఉత్పత్తి, **10** పాలు, పాల ఉత్పత్తుల మార్కెటింగ్.

## పాడి పరిశ్రమను ఎవరెవరు చేపట్టవచ్చు?

డెయిరీ ఫారాన్ని సంపన్నులు, నిరుపేదలు, పురుషులు, స్త్రీలు, ప్రగతిశీల రైతులు, విశ్రాంత ఉద్యోగులు, స్వయం సహాయక బృందాలు, మహిళా సంఘాలు, సహకార సంఘాలు, ప్రభుత్వేతర సంస్థలు, నిరుద్యోగులు.. ఎవరైనా చేపట్టవచ్చు.

పాడి పశువుల పోషణపై ఆసక్తి, వాటిని ప్రేమించే స్వభావం కలిగి ఉండాలి. పాడి పశువుల పెంపకం చేపట్టబోయే ముందు కొన్ని డెయిరీ ఫారాలను క్షుణ్ణంగా పరిశీలించాలి. రెండు నుంచి 10 పాడి పశువుల వరకు నౌకర్లపై ఆధారపడకుండా స్వయంగా రైతు కుటుంబమే నిర్వహించుకునేలా సంసిద్ధులై ఉండాలి. గడ్డి కోయడం దగ్గర నుంచి పాలు పితకడం వరకు అన్ని పనులను నేర్చుకోవాలి. ఒత్తిడులను ఎదుర్కొనే మనో నిబ్బరం కలిగి ఉండాలి.

## తెలుసుకోవాల్సిన విషయాలు

పాడి పరిశ్రమ స్థాపించే ముందు లాభాల బాటలో నడిచే డెయిరీకి స్వయంగా వెళ్లి, అక్కడ పనులు జరుగుతున్న తీరును, సమస్యలను క్షుణ్ణంగా, శ్రద్ధగా గమనించాలి. సందేహాలను తీర్చుకోవాలి. వినడం కన్నా చూడటం ద్వారా త్వరగా విషయ పరిజ్ఞానం కలుగుతుంది. కష్టే ఫలి అని పెద్దలు చెప్పినట్లు.. నౌకర్లపై ఆధారపడకుండా, స్వయంగా కష్టపడి, పర్యవేక్షించి, పూర్తి సమయాన్ని వెచ్చించగలిగినప్పుడే విజయం చేకూరుతుంది.

## కావల్సిన వసతులు

పాడి పరిశ్రమను నెలకొల్పే ప్రదేశాన్ని ఎంపిక చేసుకునేటప్పుడు అనేక విషయాలను ఆలోచించాలి. రవాణా సౌకర్యం, రోడ్డు సౌకర్యం, విద్యుత్ సదుపాయం ఎలా ఉందో చూసుకోవాలి. నీటి లభ్యత, బోరు, పశుగ్రాసం పెంపకానికి తగినంత భూమి సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి. ఇవే కాకుండా చుట్టూ కంచె నిర్మించడం, పని వారి లభ్యతను కూడా దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉంది.

వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటి లభ్యత తగ్గుతుంటే, అవసరం పెరుగుతోంది. ప్రతి సంకర జాతి ఆవు లేదా ముర్రా గేదెకు రోజుకు 75–80 లీటర్ల నీరు అవసరం. వేసవిలో ఇది వంద లీటర్లకు పెరుగుతుంది. ఏడాది పొడవునా పశుగ్రాసం సాగు చేసుకోవడానికి అదనంగా నీరు అవసరం. కాబట్టి, నీటి లభ్యత అనేది అతి ముఖ్యమైన సంగతి.

### పాడి పశువుల ఎంపిక ఎలా?

పాడి పశువు త్రికోణాకారంలో ఉండాలి. చురుకైన కళ్లు, మృదువైన చర్మం కలిగి ఉండాలి. పొదుగు నాలుగు భాగాలూ శరీరానికి అతుక్కొని, మృదువుగా, పెద్దవిగా, సమానంగా ఉండాలి. నాలుగు చనుమొనలు సమానంగా ఉండాలి. తొడలు దృఢంగా, కాళ్లు పొట్టిగా ఉండాలి. పొదుగుకు రక్తం సరఫరా చేసే పాల నరం స్పష్టంగా వకరలు తిరిగి ఉండాలి. కడుపు పెద్దదిగా విశాలంగా ఉండాలి.



## ఎలాంటి పాడి పశువులను కొనుగోలు చేయాలి?

పాడి పరిశ్రమను పెట్టాలనుకునే వారు ఆ ప్రాంతంలో ఆవు పాలకు గిరాకీ ఉందా లేదా గేదె పాలకు గిరాకీ ఉందా అనేది ముందుగా తెలుసుకొని నిర్ణయం తీసుకోవాలి. గేదె పాలలో వెన్న శాతం ఎక్కువగా ఉంటుంది కాబట్టి రుచిగా ఉంటాయి. అందువల్ల కొన్ని ప్రాంతాల్లో గేదె పాలకు గిరాకీ ఉంటుంది.

## 10 ఆవులు, గేదెలకు ఎంత భూమి అవసరం?

ఒక్కో గేదె లేదా ఆవుకు 32 చదరపు అడుగుల స్థలం అవసరమవుతుంది. ప్రతి 5 పాడి పశువులకు పశుగ్రాసాల సాగుకు ఒక ఎకరా భూమి, ఇతర వసతులకు 300 చదరపు గజాల స్థలం అవసరం. 10 ఆవులు లేదా గేదెల పెంపకానికి కనీసం రెండెకరాల భూమి అవసరమవుతుంది. షెడ్డు నిర్మాణానికి, ఇతర అవసరాలకు మరో పది కుంటలు లేదా పావెకరం భూమి అవసరం.

## సంకర జాతి ఆవులు, గేదెలు ఎక్కడ దొరుకుతాయి?

హెచ్.ఎఫ్., జెర్సీ సంకర జాతి ఆవుల్లో పాల సార అధికంగా ఉంటుంది. ఇవి కర్ణాటక, తమిళనాడుల్లోని చింతామణి, కోలార్, బెంగళూరు సబర్బన్ ప్రాంతాలు, చిత్తూరు జిల్లాలో దొరుకుతాయి. ఇవి రోజుకు 12 నుంచి 24 లీటర్ల పాల దిగుబడిని ఇస్తాయి. వీటి ధర మార్కెట్‌లో రూ. 65 వేల నుంచి లక్షపైన ధర పలుకుతాయి.

గ్రేడెడ్ ముర్రా, ముర్రా అనేవి మేలైన సంకర జాతి గేదెలు. ముర్రా జాతి గేదెలు రోజుకు 8 నుంచి 12 లీటర్ల పాలు ఇస్తాయి. వీటి ధర మార్కెట్‌లో రూ. 75 వేల నుంచి లక్ష పైన పలుకుతాయి. గ్రేడెడ్ ముర్రా గేదెలు భీమవరం, ఉండి, కంకిపాడు, మాచర్ల ప్రాంతాల్లో దొరుకుతాయి. ముర్రా జాతి గేదెలు హరియాణాలోని రోహ్‌తక్, గుజరాత్‌లోని మెహసన ప్రాంతాల్లో దొరుకుతాయి.

## మేలైన పాడి, అనుబంధ వ్యాపార అవకాశాలు ఎలా ఉంటాయి?

పాడి పశువులను పెంచే రైతులు ఎక్కువగా పాల వ్యాపారానికి పరిమితం అవుతుంటారు. అయితే, పెరుగు, వెన్న, నెయ్యి, క్రీమ్ వంటి వివిధ రకాల పాల ఉత్పత్తులను తయారు చేసి అమ్మగలిగితే అధికాదాయం పొందవచ్చు. అంతేకాదు.. పేడతో గోబర్ గ్యాస్, వర్మీ కంపోస్టు వంటివి తయారు చేయవచ్చు. పాల శీతలీకరణ, పాల సేకరణ, దూడల పెంపకం చేపట్టవచ్చు.

## ఎన్ని రకాల పశుగ్రాసాలు పెంచాలి?

అనేక రకాల పశుగ్రాసాలు సాగు చేసుకోవడం ద్వారా పోషక లోపం లేకుండా పాడి పశువులను లాభదాయకంగా పెంచుకోవచ్చు. డెయిరీ ఫారం ప్రారంభానికి 2–3 నెలలు ముందు నుంచే పశుగ్రాసాల సాగు చేపట్టాలి. పప్పుజాతి పశుగ్రాసాలు పావు వంతు, ధాన్యపు జాతి పశుగ్రాసాలు ముప్పావు వంతు విస్తీర్ణంలో సాగు చేయాలి. గట్ల వెంబడి పశుగ్రాసంగా పనికి వచ్చే సుబాబుల్, స్టైలో వంటి జాతుల చెట్లు పెంచుకోవాలి.

**పప్పు జాతి పశుగ్రాసాలు రెండు రకాలు:** 1. ఏక వార్షికాలు: లూసర్న్, బెర్సీమ్. వీటిని సాధారణంగా సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలల్లో నాటుకోవాలి. 2. బహువార్షికాలు: లూసర్న్ కో, సుబాబుల్, హెడ్జ్ లూసర్న్, స్టైలో, జనుము.

**ధాన్యపు జాతి పశుగ్రాసాలు రెండు రకాలు:** 1. ఏకవార్షికాలు: పిసి–23, ఎస్.ఎస్.జి., జొన్న (మల్టీకట్). 2. బహువార్షికాలు : ఎన్‌బి–21, కో–4, కో–5, ఎస్ఎన్–ఎపిబిఎన్. వీటిని జూన్–జూలైలలో వర్షాకాలంలో నాటుకోవాలి. చలికాలంలో వీటి ఎదుగుదల తక్కువగా ఉంటుంది.

### పశువుల షెడ్డు నిర్మించేదెలా?

డెయిరీ ఫారం పెట్టాలనుకునే వారు స్థలాన్ని ఎంపిక చేసుకునే ముందు రవాణా, విద్యుత్తు, నీరు లభ్యత, మార్కెటింగ్ సదుపాయాలను దృష్టిలో పెట్టుకోవాలి. పశువుల షెడ్డు తూర్పు పడమర దిశగా గాలి, వెలుతురు ఉండేలా, కాస్త ఎత్తులో నిర్మించుకోవాలి. డెయిరీ ఫారం చుట్టూ పశుగ్రాసానికి అక్కర వచ్చే చెట్లు పెంచాలి. షెడ్డును సులభంగా కడగడానికి నీళ్లు కొట్టే ప్రెషర్ పంపును సమకూర్చుకోవాలి. మేత వృథా కాకుండా చూసుకోవడానికి పచ్చి మేతను ముక్కలు చేసి వేయాలి.



## ఎవర్ని సంప్రదించాలి?

పాడి పరిశ్రమను స్థాపించదలచిన వారు మొదట బ్యాంకు వారితో, బీమా కంపెనీ వారితో, పశువైద్య నిపుణులతో సంప్రదించి సత్సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలి. పాల వినియోగదారులైన హాస్టళ్లు, హోటళ్లు, ఆసుపత్రులతోపాటు సమీప ప్రాంతాల్లోని సాధారణ పాల వినియోగదారులతో, పాల ఉత్పత్తిదారుల సంఘాలతో సత్సంబంధాలు పెట్టుకోవాలి. పశుగ్రాస విత్తనాల విక్రయ కేంద్రాలతోనూ మంచి సంబంధాలను పెంపొందించుకోవాలి.

## డెయిరీ ఫారం పెట్టే రైతులకు శిక్షణ ఎవరిస్తారు?

స్థానిక పశు సంవర్ధక శాఖ అధికారులు, వెటర్నరీ విశ్వవిద్యాలయాలతోపాటు జాతీయ డెయిరీ పరిశోధనా సంస్థ– కర్నాల్, జాతీయ డెయిరీ అభివృద్ధి బోర్డు – ఆనంద్, భారతీయ ఆగ్రో ఇండస్ట్రీస్ ఫెడరేషన్– పుణే వంటి సంస్థలు మేలు జాతి పాడి పశువుల పోషణలో రైతులకు శిక్షణ ఇస్తున్నాయి.

## పాడి పరిశ్రమలో రికార్డుల నిర్వహణ

మేలైన పాడి పశువులను వాణిజ్య స్థాయిలో పెంచి లాభాలు ఆర్జించాలనుకునే వారు కొన్ని వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేసుకుంటూ, సమీక్షించుకుంటూ ముందడుగు వేయాలి.

**మేపు రికార్డులు:** పశువులకు ఎంత మేత వేస్తున్నదీ రాసి పెట్టుకోవాలి.

**ఆరోగ్య సంబంధ రికార్డులు:** పశువుల ఆరోగ్య రక్షణకు ఎప్పుడెప్పుడు ఏమేమి మందులు వాడిందీ రాసుకోవాలి.

**పాల ఉత్పత్తి రికార్డులు:** ఒక్కో పశువు రోజుకు ఎన్ని పూటలు, ఎన్నెన్ని పాలు ఇస్తున్నదో రాసుకోవాలి.

**పునరుత్పత్తి రికార్డులు:** ప్రతి పశువు ఎదకు వచ్చిన తేదీ, కృత్రిమ గర్భధారణ చేయించిన తేదీ, ఈనిన తేదీ తదితర వివరాలను రాసి పెట్టుకోవాలి.

**ఆర్థిక రికార్డులు :** రోజువారీగా రాబడి, ఖర్చుల వివరాలను రాసుకోవాలి.

## రుణాలు.. సబ్సిడీలు..

మేలైన పాడి పశువుల పెంపకాన్ని ప్రారంభించే బలహీన వర్గాల వారు రుణాలు, సబ్సిడీలపై సమాచారం కోసం దగ్గర్లోని సహకార పాల ఉత్పత్తిదారుల సంఘాలను, సంబంధిత ప్రభుత్వ శాఖలు/కార్పొరేషన్ల అధికారులను సంప్రదించవచ్చు. డీఆర్‌డీఏ, ఎస్సీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్, మైనారిటీ కార్పొరేషన్, ట్రైబల్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన వంటి సంస్థలను సంప్రదించాలి. జనరల్ అభ్యర్థులు బ్యాంకులను సంప్రదించి రుణం పొందవచ్చు. ప్రాజెక్టు వ్యయంలో 75% బ్యాంకు రుణంగా ఇస్తుంది. ఈ విషయాలన్నిటినీ అర్థం చేసుకొని మేలు జాతి పాడి పశువుల పెంపకం చేపట్టి, మార్కెటింగ్ అవకాశాలను అందిపుచ్చుకుంటే డెయిరీ ఫారాన్ని అత్యంత లాభదాయకంగా నిర్వహించుకోవచ్చు.




# సాక్షి సాగుబడి

నల్లగొండ
మంగళవారం 6-8-2019




జీవితంలో అనేక ప్రాథమిక అవసరాలకు భూమి సృష్టి పదార్థం. ఒక పిడికెడు ధూళితో సృష్టి ప్రారంభమవుతుంది!
– విలియం ఎ. ఆల్‌బ్రెక్ట్, మట్టి శాస్త్రజ్ఞుడు, అమెరికా

ఆశ్లేష కార్తె : ఆగస్టు 3 నుంచి

## ఉల్లి రైతులను వణికిస్తున్న కలుపు!



అచ్చం ఉల్లి మొక్కల మాదిరిగా కనిపించే కలుపు మొక్కలు మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లాలోని ఉల్లి రైతులకు తలనొప్పిగా మారాయి. ఈ సరికొత్త కలుపు మొక్కలు కల్తీ విత్తనాల ద్వారా గత రెండు, మూడేళ్లుగా ఈ ప్రాంత పొలాల్లో అంతకంతకూ విస్తరిస్తున్నాయి. ఇప్పుడు ఉల్లి పంటలో 40 శాతాన్ని ఆక్రమిస్తూ తమను ఆర్థికంగా తీవ్రంగా నష్టపరిచే స్థాయికి చేరాయని రైతులు వాపోతున్నారు. తొలి దశల్లో ఉల్లి మాదిరిగానే కనిపిస్తుండడంతో పూత దశకు చేరిన తర్వాతే కలుపును గుర్తించగలుగుతున్నామని రైతులు చెబుతున్నారు. డా. బాబా సాహెబ్ అంబేద్కర్ మరత్వాడా విశ్వవిద్యాలయం, బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా తదితర సంస్థలు రెండేళ్లుగా అధ్యయనం చేసి ఈ కలుపు మొక్కలు (asphodelus fistulosus) ఉల్లి కుటుంబానికి చెందినవి కావని తేల్చారు. దక్షిణ ఐరోపా, ఉత్తర ఆఫ్రికా, పశ్చిమాసియాలలో కనిపించే ఈ కలుపు మొక్కలు మన దేశంలో వచ్చిన విషయం గతంలో ఎప్పుడూ తెలియదని శాస్త్రవేత్తలు అంటున్నారు. దీర్ఘకాలంగా వాణిజ్య సంబంధాలున్న ఈజిప్టు నుంచే మన దేశంలోకి ఈ గింజలు వచ్చి ఉంటాయంటున్నారు.

## 15 నుంచి హైదరాబాద్‌లో గ్రాండ్ నర్సరీ మేళా

ఏడో అఖిల భారత ఉద్యాన, వ్యవసాయ ప్రదర్శనలో భాగంగా ఈ నెల 15 నుంచి 19 వరకు హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్డులో గ్రాండ్ నర్సరీ మేళా జరగనుంది. ఉ. 9 గం. నుంచి రా. 9 గం. వరకు సందర్శించవచ్చు. ప్రవేశ రుసుం రూ. 20. ఇతర వివరాలకు.. 98492 61710.

## కట్టె గానుగ నూనెల ఉత్పత్తిపై 2 రోజుల శిక్షణ



నూనె గింజలను సాగు చేసే రైతులు కట్టె గానుగను ఏర్పాటు చేసుకొని నూనె తీసి అమ్ముకుంటే అధికాదాయం పొందవచ్చు. తక్కువ ఖర్చుతో, తేలిక పద్ధతిలో కట్టె గానుగ నుంచి రసాయనాలు వాడకుండా నాణ్యమైన వంట నూనెలు ఉత్పత్తి, నిల్వ పద్ధతులపై ఈ నెల 17, 18 తేదీల్లో హైదరాబాద్ ఎ.ఎస్.రావు నగర్‌లో ఆచరణాత్మక శిక్షణ ఇవ్వనున్నట్లు న్యూలైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివశంకర్ షిండే తెలిపారు. 18 ఏళ్లు నిండిన కనీసం 10వ తరగతి చదివిన వారు అర్హులు. ఆసక్తి గల వారు విద్యార్హత, వయసు, చిరునామా వివరాలను ఈ నెల 11వ తేదీలోగా 81210 08002, 70938 55664లలో ఏదో ఒక నంబరుకు వాట్సాప్ ద్వారా మాత్రమే పంపవలసి ఉంటుంది.

## 10 నుంచి పర్మాకల్చర్ ఖరీఫ్ శిక్షణా శిబిరం



వర్షాధారంగా వివిధ రకాల పంటల సాగుపై శాశ్వత వ్యవసాయ (పర్మాకల్చర్) సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై ఈ నెల 10 నుంచి 22 వరకు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సమీపంలోని శాశ్వత వ్యవసాయ క్షేత్రంలో అరణ్య శాశ్వత వ్యవసాయ సంస్థ రెసిడెన్షియల్ ఖరీఫ్ శిక్షణా శిబిరాన్ని నిర్వహించనుంది. ప్రముఖ శాశ్వత వ్యవసాయ నిపుణుడు కొప్పుల నరసన్న, తదితరులు శిక్షణ ఇస్తారు. భూసార పరిరక్షణ, వాన నీటి సంరక్షణ పద్ధతులు, వర్షాధారంగా సేంద్రియ పద్ధతుల్లో పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు, పండ్ల చెట్ల పెంపకం తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. రిజిస్ట్రేషన్ తదితర వివరాలకు.. 79817 55785. aranyahyd@gmail.com



● తన ఇంటిపైన కుండీలో ఎల్.ఇ.డి. బల్బు వెలుగులో డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు పెంచుతున్న డా. పద్మయ్య

ఇంటి పంట

## కృత్రిమ వెలుగులో డ్రాగన్ ఫ్రూట్

డ్రాగన్ ఫ్రూట్ (సిరి జెమ్మెడు)ను ఇప్పుడు కొందరు కుండీల్లో ఇంటిపంటగానూ సాగు చేస్తున్నారు. అలాంటి వారిలో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ పద్మయ్య కూడా ఒకరు. భారతీయ నూనెగింజల పరిశోధనా సంస్థలో ప్రధాన శాస్త్రవేత్తగా ఉద్యోగ విరమణ చేసిన ఆయన హైదరాబాద్ ఉప్పల్‌లోని తన ఇంటిపైన కుండీల్లో పోషక విలువల గని అయిన సిరి జెమ్మెడు పండ్లను ఎల్.ఇ.డి. బల్బుల సాయంతో సాగు చేస్తుండడం విశేషం. సాధారణంగా మే–అక్టోబర్ మధ్యకాలంలో పుష్పిస్తుంది. 9 లేదా 12 వాట్స్ ఎల్.ఇ.డి. బల్బును ఈ మొక్కకు 2 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసి 7 గంటలపాటు రాత్రి వేళల్లో వెలుగును ప్రసరింపజేస్తే నవంబర్–ఏప్రిల్ మధ్య కూడా ఈ పండ్లను పండించుకోవచ్చని డా. పద్మయ్య (94407 08924) చెబుతున్నారు. దీనికి అడుగు లోతున్న కుండీ చాలు. నేల మీదైతే మీటరు లోతు వరకు వేర్లు వెళతాయి.

# అపారం రైతుల జ్ఞానం!

**ఏమిటి?**

జహీరాబాద్ ప్రాంతంలో మహిళా రైతులు చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు తదితర వర్షాధార పంటలను సాగు చేసుకుంటూ సంక్షోభం లేని వ్యవసాయ పద్ధతిని గత 30 ఏళ్లుగా అనుసరిస్తున్నారు. ఈ సంగతి తెలియనిదేమీ కాదు.

**ఇప్పుడు కొత్త సంగతి ఏమిటంటే..**

వీరు అనుసరిస్తున్న జీవవైవిధ్య సేంద్రియ వ్యవసాయ పద్ధతిపై వ్యవసాయ శాస్త్రవేత్తలు పనిగట్టుకొని ఏడాది పాటు అధ్యయనం చేసి సమగ్ర నివేదికను వెలువరించారు.

తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ పరిశోధనా సంచాలకులు డా. ఆర్. ఉమారెడ్డి, హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ సోషల్ స్టడీస్(సెస్) అసోసియేట్ ప్రొఫెసర్ బి. సురేష్‌రెడ్డి, డీడీఎస్ డైరెక్టర్ పి.వి.సతీష్, చిన్న నరసమ్మ, దంతులూరి తేజస్వి కలిసి న్యూఫీల్డ్ ఫౌండేషన్(అమెరికా) తోడ్పాటుతో ఈ అధ్యయనం చేశారు. 'ఇంటర్‌ఫేసింగ్ ఫార్మర్స్ సైన్స్ విత్ ఫార్మల్ సైన్స్' పేరిట ఈ విలక్షణ అధ్యయన నివేదికను వెలువరించారు.

**ఎక్కడ?**

హైదరాబాద్ బేగంపేటలోని సెస్ ఆడిటోరియంలో జాతీయ గ్రామీణాభివృద్ధి–పంచాయతీరాజ్ సంస్థ డైరెక్టర్ జనరల్ డా. డబ్ల్యూ. ఆర్. రెడ్డి, జాతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ (మేనేజ్) డైరెక్టర్ జనరల్ డా.ఉషారాణి, సెస్ డైరెక్టర్ ప్రొ. రేవతి ఈ నివేదికను ఇటీవల ఆవిష్కరించారు.

జహీరాబాద్ ప్రాంతంలో మహిళా రైతులు సాంప్రదాయ సేంద్రియ పద్ధతుల్లో వర్షాధారంగా ఒకటికి 20 పంటలను కలిపి పండిస్తున్నారు. అప్పుల్లేని, ఆత్మహత్యల్లేని జీవవైవిధ్య వ్యవసాయం వారిది. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ వీరిని సంఘటితపరచి ముందుకు నడిపిస్తోంది. వారి వ్యవసాయ సంస్కృతిని, దాని చుట్టూ అల్లుకున్న సంప్రదాయ పర్యావరణ, జీవవైవిధ్య జ్ఞానాన్ని శ్రద్ధగా గమనిస్తే– వ్యవసాయ సంక్షోభం నుంచి మన దేశాన్ని బయటపడేసే మార్గం మనకు కనిపిస్తుంది. ప్రకృతికి అనుగుణమైన సేద్య జీవనాన్ని అనుసరిస్తున్న వారికి ఉన్న అవగాహనా శక్తి గొప్పది. చిన్న రైతులు ఇప్పుడు పెద్ద రైతులుగా ఎదిగారు. సంతోషదాయకమైన, ఆరోగ్యదాయకమైన జీవనాన్ని గడుపుతున్న మహిళా రైతులను మనసారా అభినందించారు.

**ఎవరేమన్నారు?**





'రైతుల సంప్రదాయ జ్ఞానం గత కొన్ని దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైంది. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చెప్పని ఎన్నో గొప్ప విషయాలు ఈ అధ్యయన కాలంలో రైతుల పొలాల్లో చూసి నేర్చుకున్నాను. వాళ్లు ఆరోగ్యంగా ఉన్నారు. పశువులు బాగున్నాయి. భూమి ఆరోగ్యంగా ఉంది. ఎకరానికి ఏటా రూ. 10 వేల వరకు నికరాదాయం పొందుతున్నారు. వర్షానికి, నేలకు తగిన విత్తనాల ఎంపిక, నిల్వ, వినియోగం తదితర అనేక విషయాల్లో వీరి జ్ఞానం అమోఘం. ఈ జ్ఞానాన్ని వ్యవసాయ శాస్త్రవేత్తలు గుర్తించాలి. రైతుల జ్ఞానం ఆధారంగా వ్యవసాయ విధానాల రూపకల్పన జరగాలి. మన దేశం ఎదుర్కొంటున్న వ్యవసాయ సంక్షోభానికి ఇదే పరిష్కారం..' అన్నారు 'సెస్' అసోసియేట్ ప్రొఫెసర్ సురేష్‌రెడ్డి.

'పొలంలో ఒకే పంట పెడితే పండొచ్చు, పండక పోవచ్చు. మేం గవర్నమెంటు ఎరువు, కరెంటు, బోర్లపైన ఆధారపడటం లేదు. ఒకే పొలంలో 25 పంటలు పెడుతున్నం. కొన్ని పంటలు రాకపోయినా కొన్ని వస్తయి. తిండి కొనుక్కోవాల్సిన పని లేదు. పత్తి పెట్టిన రైతులు అప్పులై చచ్చిపోతున్నరు. మాకు అప్పులు అవసరం లేదు. మేం చచ్చిపోవాల్సిన అవసరమే రాదు..' అని రైతు మొగలమ్మ చెప్పింది.

'ఈ నివేదిక చాలా బాగుంది. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలన్నిటికీ ఇందులో సమాధానాలున్నాయి. డీడీఎస్ మహిళా రైతులకున్న ఆత్మస్థైర్యం, సంతోషం చాలా గొప్పది. రైతులకేమీ తెలీదు మనకే తెలుసు అని శాస్త్రవేత్తలు అనుకోకూడదు..' అన్నారు 'మేనేజ్' డీజీ డా. ఉషారాణి.

'వాతావరణ మార్పులు, రైతుల ఆత్మహత్యల నేపథ్యంలో ఆలోచించదగిన నివేదిక ఇది. 30 ఏళ్లుగా అనుసరిస్తున్న ఈ పద్ధతిలో గొప్ప గుణాలను ప్రాచుర్యంలోకి తేవటం హర్షణీయం. నేనూ కొర్రలూ, జొన్నలూ తింటూ ఆరోగ్యంగా ఉన్నాను. ఈ రైతుల జ్ఞానాన్ని రైతుల్లోకి తీసుకెళ్లాలి..' అన్నారు ఎన్.ఐ.ఆర్.డి. డీజీ డా. డబ్ల్యూ.ఆర్.రెడ్డి.



చిరుధాన్యాలు, పప్పుధాన్యాల మిశ్రమ సేంద్రియ సాగులో నిమగ్నమైన జహీరాబాద్ మహిళా రైతులు (ఫైల్)

## వారాంతాల్లో డీడీఎస్ మహిళా రైతుల పొలాల్లోనే శిక్షణ

జహీరాబాద్ ప్రాంతంలో డీడీఎస్ సెంటర్ ఫర్ అగ్రోఎకాలజీ (పచ్చశాల) ఆధ్వర్యంలో మహిళా రైతులు చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, ప్రకృతి సిద్ధమైన ఆకుకూరలు, ఔషధ మొక్కల మిశ్రమ సేంద్రియ సాగు, పెరటి తోటల సాగు పద్ధతులపై రైతులు, నగరవాసులకు వారాంతాల్లో (శని, ఆదివారాల్లో) తమ పొలాల్లోనే శిక్షణ ఇవ్వనున్నారు. ఆగస్టు 17 నుంచి ప్రారంభమయ్యే ఈ కోర్సు 24 వారాల పాటు కొనసాగుతుంది. వసతి, మిల్లెట్ భోజనాలతో కలిపి బోధనా రుసుము 24 వారాలకు రూ. 12 వేలు, 12 వారాలకు రూ. 10 వేలు, 6 వారాలకు రూ. 6 వేలు. ఆసక్తి గల వారు ఆగస్టు 10 లోగా రిజిస్టర్ చేసుకోవాలి. https://forms.gle/Ca2eHv6SGLJ5y2JX7F మొబైల్:77992 21500

సాక్షి భవిత
స్పర్ధయా వర్ధతే విద్య
మంగళవారం
6-8-2019

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

ఇంజనీరింగ్, ఎంబీఏ కోర్సుల విద్యార్థులు ఆతృతగా ఎదురుచూసే క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ ప్రాధాన్యం తగ్గిపోనుందా? కోర్సులో చేరిన నాటి నుంచే క్యాంపస్ ఆఫర్లపై ఆశలు పెట్టుకునే విద్యార్థులు తమ ఆలోచనలు మార్చుకోవాల్సిందేనా..! ఇకపై కేస్‌స్టడీ కాంపిటీషన్స్‌లో ప్రతిభ చూపితేనే కొలువు దక్కుతుందా?!.. అంటే..అవుననే సమాధానం వినిపిస్తోంది. కారణం.. ఇటీవల కాలంలో కార్పొరేట్ కంపెనీలు తమ రిక్రూట్‌మెంట్ విధానాల్లో అనూహ్య మార్పులు చేస్తుండటమే! సంస్థలు సంప్రదాయ రీతి క్యాంపస్ డ్రైవ్స్ స్థానంలో.. కేస్‌స్టడీ కాంపిటీషన్స్ దిశగా అడుగులు వేస్తున్నాయ్! ఈ నేపథ్యంలో అసలు కేస్‌స్టడీ కాంపిటీషన్స్ అంటే ఏంటి? కంపెనీలు వాటివైపు మొగ్గు చూపడానికి కారణాలు... నెగ్గడానికి మార్గాల గురించి తెలుసుకుందాం...




# కాంపిటీషన్‌లో నెగ్గు..
# కార్పొరేట్ కొలువు పట్టు!

కంపెనీలు కాలేజీల్లో ప్లేస్‌మెంట్స్‌కు రావడం... క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొనడం.. రిక్రూటర్స్ అడిగే ప్రశ్నలకు విద్యార్థులు సమాధానం ఇవ్వడం.. ఆ తర్వాత టెక్నికల్, హెచ్ ఆర్ రౌండ్‌లలో నెగ్గి కొలువు దీరడం'
*– ఇదీ ఇంతకాలం కార్పొరేట్ సంస్థల్లో జాబ్ ఆఫర్లు అందుకునేందుకు సాధారణంగా జరిగే ప్రక్రియ!*

చదువు పూర్తికాగానే కొలువు సాధించుకునేందుకు ఇప్పటివరకు విద్యార్థులకు తెలిసిన విధానం కూడా అదే!! కానీ.. ఇటీవల కాలంలో కంపెనీల నియామక విధానాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. రెజ్యూమె, అకడమిక్ ప్రతిభ కంటే.. అభ్యర్థుల్లోని రియల్ టైమ్ నాలెడ్జ్, ప్రాక్టికల్ సామర్థ్యం పరీక్షించి.. సరితూగే అభ్యర్థులను నియమించుకోవడానికి సంస్థలు మొగ్గుచూపుతున్నాయి. అందుకు కార్పొరేట్ కంపెనీలు అనుసరిస్తున్న విధానం.. కేస్ స్టడీ కాంపిటీషన్స్!! వీటిలో విజయం సాధించిన వారికే కొలువులు దక్కే పరిస్థితి కనిపిస్తోంది.

## కేస్‌స్టడీ కాంపిటీషన్స్ అంటే?

కేస్‌స్టడీ కాంపిటీషన్ అంటే.. ఓ సంస్థ నియామకాలు చేపట్టాలని భావించినప్పుడు, అభ్యర్థుల ముందు ఒక రియల్ కేస్ స్టడీని ఉంచుతుంది. అభ్యర్థులు ఆ కేస్‌ను విశ్లేషించి.. సమస్యలను గుర్తించి పరిష్కారం చూపాలి. చక్కటి పరిష్కారం చూపిన అభ్యర్థులకు మాత్రమే నియామక ఆఫర్ లభిస్తుంది. అదే విధంగా మరో తరహా కేస్ స్టడీ కాంపిటీషన్స్ విధానం కూడా సంస్థలు అనుసరిస్తున్నాయి. సదరు సంస్థ తమ భవిష్యత్తు ప్రణాళిక గురించి చెప్పి.. ఆ ప్రణాళిక విజయవంతం అవ్వడానికి ఏం చేయాలో

- 'కేస్ స్టడీ కాంపిటీషన్స్' ద్వారా నియామకాలు
- మారుతున్న కంపెనీల రిక్రూట్‌మెంట్ తీరు
- రియల్ టైమ్ నాలెడ్జ్, ప్రాక్టికల్ ప్రతిభకు పెద్దపీట
- సాఫ్ట్‌వేర్, కన్సల్టింగ్, బ్యాంకింగ్ రంగాల్లో తాజా ధోరణి

చెప్పాలని సూచిస్తున్నాయి. సరైన సక్సెస్ ప్లాన్‌ను రూపొందించిన అభ్యర్థులకే ఉద్యోగం సొంతమవుతుంది. ఇలా కంపెనీలు వివిధ కేస్‌స్టడీ కాంపిటీషన్స్ నిర్వహించడానికి ప్రధాన కారణం.. విద్యార్థుల్లోని ప్రాక్టికల్ నైపుణ్యాలను పరిశీలించడమే అంటున్నారు నిపుణులు.



## జాతీయస్థాయిలో ఆన్‌లైన్‌లో

ఇన్ఫోసిస్, టీసీఎస్, అమెజాన్ వంటి ప్రముఖ కంపెనీలు దేశవ్యాప్తంగా కేస్‌స్టడీస్ కాంపిటీషన్స్‌ను ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్నాయి. నిర్దిష్టంగా తేదీలను ప్రకటించి.. ఇందుకోసం ప్రత్యేక వెబ్ ప్లాట్‌ఫామ్‌ను రూపొందిస్తున్నాయి. అందులో అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవాలి. ఇలా నమోదు చేసుకున్న అభ్యర్థులకు ఆన్‌లైన్‌లోనే నిర్దిష్టంగా ఒక సమస్యను పేర్కొని.. దానికి పరిష్కారం చూపమని అడుగుతున్నాయి. ఆన్‌లైన్లో జాతీయస్థాయిలో కేస్‌స్టడీ కాంపిటీషన్స్ ద్వారా ప్రతి కాలేజీకి ప్రత్యేకంగా వెళ్లి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహించడానికి అవుతున్న వ్యయ ప్రయాసలను తగ్గించుకోవచ్చని కంపెనీలు భావిస్తున్నాయి. ఈ విధానం వల్ల టాప్ బి-స్కూల్స్, టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్ విద్యార్థులే కాకుండా.. ఇతర ఇన్‌స్టిట్యూట్‌లలోని ప్రతిభ గల విద్యార్థులను కూడా ఆకర్షించేందుకు వీలవుతుందని పేర్కొంటున్నాయి.

## రెండు, మూడేళ్ల క్రితమే

వాస్తవానికి దేశంలో కేస్‌స్టడీ కాంపిటీషన్స్ నిర్వహించే విధానం దాదాపు రెండు, మూడేళ్ల క్రితమే మొదలైంది. టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి ప్రముఖ ఐటీ సంస్థలే కాకుండా.. సిటీ బ్యాంక్, అమెజాన్, మహీంద్రా గ్రూప్, జేపీ మోర్గాన్, టాటా మోటార్స్, జీఈ, హిందుస్థాన్ యూనిలీవర్ వంటి సంస్థలు సైతం కేస్‌స్టడీ కాంపిటీషన్స్‌ను నిర్వహించడం ప్రారంభించాయి.

## ప్రధానంగా బి-స్కూల్స్‌లో

కేస్‌స్టడీ కాంపిటీషన్స్ ద్వారా అభ్యర్థులను నియమించుకునే విధానం ప్రస్తుతం ప్రధానంగా బిజినెస్ స్కూల్స్‌లో కనిపిస్తోంది. సంస్థలు తమ కార్యకలాపాలు విస్తరించుకునే క్రమంలో అనుసరించాల్సిన ప్రణాళికలు, వ్యూహాల గురించి మేనేజ్‌మెంట్ విద్యార్థుల నుంచి ఐడియాలు స్వీకరించాలనే ఉద్దేశమే ఇందుకు ప్రధాన కారణం. అభ్యర్థుల బిజినెస్ ఆలోచనలు బాగుంటే.. వాటిని అమలు చేసేందుకు సంస్థలు సిద్ధమవుతున్నాయి. అదే సమయంలో సదరు ఐడియాలు ఇచ్చిన విద్యార్థులకు ఆకర్షణీయమైన వేతనంతో కొలువులు అందిస్తున్నాయి.

## అన్ని విభాగాల్లోనూ

ప్రస్తుతం సంస్థలు అన్ని విభాగాలకు సంబంధించి నియామకాల కోసం కేస్‌స్టడీ కాంపిటీషన్స్ విధానాన్ని అనుసరిస్తున్నాయి. మార్కెటింగ్, ఫైనాన్స్, హెచ్‌ఆర్‌తోపాటు కీలకమైన స్ట్రాటజిక్ ప్లానింగ్, లాజిస్టిక్స్ ఆపరేషన్స్ విభాగాలకు సంబంధించి కూడా కేస్‌స్టడీ కాంపిటీషన్స్ నిర్వహిస్తున్నాయి. అధిక శాతం కంపెనీలు మార్కెటింగ్ వ్యూహాలు, మార్కెట్లో మరింత వాటా సొంతం చేసుకోవడం ఎలా? అనే విషయాలపై దృష్టిపెడుతూ.. వాటికి సంబంధించి కేస్‌స్టడీ కాంపిటీషన్స్‌ను నిర్వహిస్తున్నాయి. వీటిలో నెగ్గిన వారికి సంస్థలో సీనియర్లతో కలిసి పనిచేసే అవకాశం కల్పిస్తున్నాయి.

## ఐటీ సంస్థల్లో హ్యాకథాన్

వాస్తవానికి అభ్యర్థుల్లోని రియల్ టైమ్ నాలెడ్జ్‌ని గుర్తించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ కేస్‌స్టడీ కాంపిటీషన్స్‌ను ఐటీ సంస్థలు చాలా కాలం క్రితమే ప్రారంభించాయి. ఐటీ కంపెనీలు హ్యాకథాన్స్ పేరిట అభ్యర్థులకు కోడింగ్, ప్రోగ్రామింగ్‌లకు సంబంధించి రియల్‌టైమ్ టాలెంట్ టెస్ట్‌లను నిర్వహిస్తున్నాయి. ఈ సంస్కృతి ఇప్పుడు అన్ని రంగాలకు కూడా విస్తరిస్తోంది.

## క్యాంపస్ డ్రైవ్స్ కనుమరుగవుతాయా?

దేశంలో కేస్‌స్టడీ కాంపిటీషన్స్ విస్తరణతో కాలేజీల్లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్ కనుమరుగవుతాయా? అనే సందేహం వ్యక్తమవుతోంది. పలు సంస్థల అంచనాల ప్రకారం ఏటా సంస్థలు తమ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌ను 18 శాతం నుంచి 20 శాతం మేర తగ్గించుకుంటున్నాయి. అంటే.. రానున్న రోజుల్లో టాప్ ఇన్‌స్టిట్యూట్‌లలో చదివిన విద్యార్థులైనా కార్పొరేట్ సంస్థల్లో కొలువుదీరేందుకు కేస్‌స్టడీ కాంపిటీషన్స్‌లో నెగ్గాల్సి ఉంటుందని చెప్పొచ్చు.

## మరి నెగ్గడం ఎలా?

కేస్‌స్టడీ కాంపిటీషన్స్‌కు రోజురోజుకీ ప్రాధాన్యం పెరుగుతోంది. దాంతో కొలువు దక్కాలంటే వీటిలో నెగ్గడం తప్పనిసరిగా మారుతోంది. అభ్యర్థుల్లోని ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, క్రియేటివ్ థింకింగ్, లాజికల్ థింకింగ్, అనలిటికల్ స్కిల్స్, రియల్ టైం నాలెడ్జ్‌లను పరీక్షించేలా కేస్‌స్టడీ కాంపిటీషన్స్ నిర్వహిస్తున్నారు. కాబట్టి అభ్యర్థులు ఆయా నైపుణ్యాలు పెంచుకునే విధంగా కృషిచేయాలి.

## రీసెర్చ్ దృక్పథం పెరిగేలా

కేస్‌స్టడీ కాంపిటీషన్స్ అభ్యర్థుల్లోని రీసెర్చ్ దృక్పథాన్ని కూడా పెరిగేలా చేస్తున్నాయని చెప్పొచ్చు. ఎందుకంటే.. సంస్థలు ఒక కేస్ (సమస్య)ను ఇచ్చినప్పుడు నిర్దిష్ట సమయం ఇచ్చి.. దానిని పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి పరిష్కారం చూపాలని అడుగుతున్నాయి. ఫలితంగా విద్యార్థులు సదరు సమస్యను లోతుగా అన్ని కోణాల్లో అధ్యయనం చేయడంతోపాటు... ఇతర సంస్థల పరిస్థితితో పోల్చి చూడాల్సి ఉంటుంది. ఇది అభ్యర్థుల్లో రీసెర్చ్ దృక్పథాన్ని పెంచేలా చేస్తోంది.

## ఆ విద్యార్థులకు సదవకాశం

కేస్‌స్టడీ కాంపిటీషన్స్ ప్రముఖ బి-స్కూల్స్ విద్యార్థులకే కాకుండా.. స్థానిక కళాశాలల్లో చదివిన విద్యార్థులకు కూడా సదవకాశంగా నిలుస్తోందని చెప్పొచ్చు. ప్రతిభ, నైపుణ్యాలు ఉన్నప్పటికీ.. తమ కళాశాలకు కంపెనీలు ప్లేస్‌మెంట్స్‌కు రాకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యే విద్యార్థులు ఎంతో మంది. ఇలాంటి వారందరికీ 'కేస్‌స్టడీ కాంపిటీషన్స్' చక్కటి మార్గంగా నిలుస్తాయి. ప్రతిభ ఉంటే సాధారణ కళాశాలల్లో చదివిన విద్యార్థులు సైతం ప్రముఖ కంపెనీల్లో కొలువుదీరేందుకు కేస్‌స్టడీస్ ద్వారా అవకాశం లభిస్తుంది. కేస్‌స్టడీ కాంపిటీషన్స్ ఫలితంగా ఆఫ్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ సంఖ్య ఇటీవల కాలంలో పెరుగుతోంది. రెండేళ్ల క్రితం పరిస్థితితో పోల్చితే ప్రస్తుతం ఆఫ్ క్యాంపస్ ద్వారా కేస్ స్టడీ కాంపిటీషన్ విధానంలో నియామకాలు చేపట్టే సంస్థ సంఖ్య 20 నుంచి 25 శాతం మేర పెరగడమే ఇందుకు నిదర్శనం.

### ప్రముఖ సంస్థల కేస్ స్టడీ కాంపిటీషన్స్

కేస్ స్టడీ కాంపిటీషన్స్ పరంగా ప్రముఖ సంస్థలు ప్రత్యేక విభాగాలను నెలకొల్పి వీటిని నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో కొన్ని ప్రముఖ సంస్థలు నిర్వహిస్తున్న పోటీల పేర్ల వివరాలు.. » టీసీఎస్- ఎన్‌కోడ్, » ఇన్ఫోసిస్ – ఇన్‌జీనియస్, » కేపీఎంజీ – ఇంటర్నేషనల్ కేస్ కాంపిటీషన్, » సిటీ బ్యాంక్ – క్యాంపస్ ఇన్నోవేషన్ ఛాలెంజ్, » మహీంద్రా గ్రూప్ – వార్ రూమ్, » ఏషియన్ పెయింట్స్ – కాన్వాస్, » ఐటీసీ – ఇంటెరోబ్యాంగ్, » టాటా మోటర్స్ – మైండ్‌రోవర్, » కోకో–కోలా ఇండియా – షోకేస్.

ఇలా ఒక్కో సంస్థ ఒక్కో పేరుతో కేస్ స్టడీ కాంపిటీషన్స్‌ను నిర్వహిస్తోంది. వీటిలో విజేతలకు సంస్థలు కొలువులు ఇవ్వడమే కాకుండా నగదు బహుమతులను కూడా అందజేస్తున్నాయి.

### రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం

కేస్‌స్టడీ కాంపిటీషన్స్ ద్వారా అభ్యర్థులను నియమించుకునే ధోరణి రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉంది. కంపెనీలు ప్రధానంగా అకడమిక్ నైపుణ్యాలకంటే అభ్యర్థుల్లోని ప్రాక్టికల్ నైపుణ్యాలను, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్‌ను పరిశీలించాలనుకుంటున్నాయి. తద్వారా తమ సంస్థ అవసరాలకు సదరు అభ్యర్థులు సరితూగుతారో లేదో తెలుసుకోవడం ప్రధాన ఉద్దేశంగా కేస్‌స్టడీ కాంపిటీషన్స్‌ను నిర్వహిస్తున్నాయి. కాబట్టి విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ డొమైన్ ఏరియాస్‌కు సంబంధించిన రంగాల్లోని పరిస్థితులపై అవగాహన పెంచుకోవడం మేలు చేస్తుంది.

– ప్రొఫెసర్ దీపిక గుప్తా, చైర్మన్, కెరీర్ డెవలప్‌మెంట్ సర్వీసెస్, ఐఐఎం– విశాఖపట్నం.

---

# టీఎస్ ఐసెట్ 2019
# కౌన్సెలింగ్‌కు సిద్ధమవ్వండిలా..

**టీఎస్ ఐసెట్ 2019.. తెలంగాణ రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష. టీఎస్ ఐసెట్ 2019 కౌన్సెలింగ్‌కు తెలంగాణ ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఐసెట్‌లో ర్యాంకులు పొందిన అభ్యర్థులకు ఈ నెల 6వ తేదీ నుంచి స్లాట్ బుకింగ్, ధ్రువపత్రాల పరిశీలన, సీట్ల కేటాయింపు ప్రక్రియను చేపట్టనున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో... టీఎస్ ఐసెట్ 2019 కౌన్సెలింగ్ సమగ్ర సమాచారం...**

- ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలు
- 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ప్రక్రియ
- 8వ తేదీ వరకు స్లాట్ బుకింగ్
- 11 వరకు ధ్రువపత్రాల పరిశీలన, 12 వరకు వెబ్ ఆప్షన్లు
- 14న సీట్ల కేటాయింపు

## అర్హతలు

- టీఎస్ ఐసెట్(తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)– 2019లో అర్హత సాధించాలి.
- ఎంబీఏలో ప్రవేశం కోరుకునే అభ్యర్థులు మూడేళ్ల డిగ్రీ కోర్సులో ఉత్తీర్ణత సాధించి ఉండాలి.
- ఎంసీఏలో ప్రవేశం కోరుకునే అభ్యర్థులు మూడేళ్ల డిగ్రీ కోర్సుతోపాటు 10+2 స్థాయిలో మ్యాథమెటిక్స్ తప్పనిసరిగా చదవాలి.
- అర్హత పరీక్ష డిగ్రీలో ఓసీలకు కనీసం 50 శాతం, ఇతరులకు 45 శాతం మార్కులు రావాలి.
- తుది దశ ముగిశాక మైనారిటీ కాలేజీల్లో మిగిలిపోయిన సీట్లలో ఐసెట్–2019లో అర్హత సాధించని మైనారిటీ(ముస్లిం, క్రిస్టియన్) అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. డిగ్రీలో ఓసీలు కనీసం 50 శాతం మార్కులు, ఇతరులు కనీసం 45 శాతం మార్కులు సాధించాలి. అయితే ఈ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకం వర్తించదు.

## కౌన్సెలింగ్ ప్రక్రియ ఇలా

- కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకొని, స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.
- స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుంది.
- ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన అభ్యర్థులు ఈ నెల 12వ తేదీ వరకు కాలేజీలకు సంబంధించిన ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది.
- ఆగస్టు 14వ తేదీన సీట్ల కేటాయింపు ప్రక్రియ. సీట్ల కేటాయింపు జరిగిన అభ్యర్థులు ఈ నెల 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టు చేయాల్సి ఉంటుంది.



## ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు

అభ్యర్థులు ఉన్నత విద్యామండలి అధికారిక వెబ్‌సైట్ tsicet.nic.in లోకి లాగిన్ అయి.. పేమెంట్ ప్రాసెసింగ్ ఫీజు అనే లింక్‌పై క్లిక్ చేయాలి. దాంట్లో టీఎస్‌ఐసెట్ 2019, రిజిస్ట్రేషన్ నెంబర్, హాల్ టిక్కెట్ నంబర్‌ను, పుట్టిన తేదీ(పదో తరగతి మెమోలో ఉన్నదాని ప్రకారం) ఎంటర్ చేయాలి. ఫోన్ నంబర్, ఈ–మెయిల్ అడ్రస్, మీ సేవ ద్వారా జారీచేసిన కుల, ఆదాయ ధ్రువపత్రాల అప్లికేషన్ నంబర్‌లు ఎంటర్ చేయాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.600, ఇతరులు రూ.1200లను ప్రాసెసింగ్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ప్రాసెసింగ్ ఫీజు చెల్లించని అభ్యర్థులను కౌన్సెలింగ్‌కు అనుమతించరు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాక తమకు సమీపంలోని హెల్ప్‌లైన్ సెంటర్‌లో ధ్రువపత్రాల పరిశీలనకు నిర్దేశిత తేదీలో హాజరయ్యేందుకు స్లాట్ బుక్ చేసుకోవాలి.

## నాలుగు దశల్లో

టీఎస్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొత్తం నాలుగు దశల్లో జరుగుతుంది. అవి.. ధ్రువపత్రాల పరిశీలన, » ఆప్షన్‌ల నమోదు, » సీట్ల కేటాయింపు, » ఫీజు చెల్లింపు, కాలేజీలో రిపోర్టు చేయడం.

## సర్టిఫికేట్ వెరిఫికేషన్

సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే అభ్యర్థుల కోసం ప్రతి సెంటర్‌లో ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేస్తారు. అలాగే ఆధార్ వెరిఫికేషన్ చేస్తారు. కౌన్సెలింగ్ హాజరయ్యే అభ్యర్థులు ఈ కింద తెలిపిన ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను కూడా తమ వెంట తీసుకెళ్లాలి.

- టీఎస్ ఐసెట్–2019 ర్యాంకు కార్డు.
- టీఎస్ ఐసెట్–2019 హాల్‌టికెట్.
- ఆధార్ కార్డు.
- పదో తరగతి మెమో.
- ఇంటర్ మెమో కమ్ పాస్ సర్టిఫికేట్
- డిగ్రీ మార్కుల మెమో, ప్రొవిజనల్ పాస్ సర్టిఫికేట్.
- స్టడీ లేదా బోనఫైడ్ 9వ తరగతి నుంచి డిగ్రీ వరకు.
- ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్.
- కులధ్రువీకరణ పత్రం.
- ఆదాయ ధ్రువీకరణ పత్రం (2019 జనవరి 1 తర్వాత జారీచేసింది)
- నివాస ధ్రువీకరణ పత్రం(వర్తించే అభ్యర్థులు).
- దివ్యాంగ, స్పోర్ట్స్ కోటా, మైనారిటీ అభ్యర్థులు సంబంధిత అధికారులు జారీ చేసిన ధృవీకరణ పత్రాలు తమ వెంట తీసుకవెళ్లాలి.

## ఆప్షన్ల నమోదు

ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో కాలేజీలకు సంబంధించిన ఆప్షన్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన వెంటనే అభ్యర్థి రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు లాగిన్ ఐడీ పంపిస్తారు. ఓటీపీతో సహా అన్ని వివరాలను అభ్యర్థి ఫోన్ నెంబర్‌కు పంపిస్తారు. ఇంటినుంచి కాని, హెల్ప్‌లైన్ సెంటర్ నుంచి కాని, ఇంటర్నెట్ కేఫ్ ద్వారా కాని అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు.

వెబ్ ఆప్షన్లు ఇచ్చేందుకు సిద్ధమైన విద్యార్థులు వెబ్‌సైట్‌లో క్యాండిడేట్స్ రిజిస్ట్రేషన్ లింక్‌పై క్లిక్ చేసి... పాస్‌వర్డ్ జనరేట్ చేసుకోవాలి. పాస్‌వర్డ్ జనరేట్ చేసుకున్నాక క్యాండిటేట్ లాగిన్ లింక్‌పై క్లిక్ చేసి.. మొబైల్ నెంబర్‌కు వచ్చిన ఓటీపీ ద్వారా లాగిన్ అవ్వాలి. ఇప్పటికే సిద్ధం చేసుకున్న మ్యాన్యువల్ ఆప్షన్ ఎంట్రీ సాయంతో సాధ్యమైనన్ని ఎక్కువ ఆప్షన్లు ఇచ్చుకోవాలి.

## సీట్ల కేటాయింపు

మెరిట్, రిజర్వేషన్, స్థానికత ఆధారంగా సీట్లను కేటాయిస్తారు. 14.08.2019న ప్రొవిజనల్ సీట్ అలాట్‌మెంట్‌ను వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. సీట్ల కేటాయింపు జరిగిన తర్వాత అభ్యర్థులు సంబంధిత వివరాలు ఎంటర్‌చేసి ప్రొవిజనల్ అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.

## ట్యూషన్ ఫీజు చెల్లింపు

అలాట్‌మెంట్ ఆర్డర్‌లో పేర్కొన్న విధంగా నిర్దేశిత గడువులోపు ఆన్‌లైన్‌లో ట్యూషన్ ఫీజు చెల్లించాలి. ట్యూషన్ ఫీజు చెల్లించిన అభ్యర్థులకు అడ్మిషన్ నంబర్ వస్తుంది. సీట్ల కేటాయింపు ధ్రువీకరణపత్రంతో సహా అడ్మిషన్ నంబర్‌ను ప్రింట్ తీసుకొని సంబంధిత కాలేజీలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

### మళ్లీ అవకాశం

ఐసెట్ కౌన్సెలింగ్ రెండు దశల్లో జరుగుతుంది. మొదటి దశ కౌన్సెలింగ్ లో సీటు లభించని విద్యార్థులు రెండో దశ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే వీలుంది. అభ్యర్థి ట్యూషన్ ఫీజు చెల్లించిన తర్వాత తన సీటును రద్దు చేసుకోవాలనుకుంటే అలాట్‌మెంట్ ఆర్డర్‌లో సూచించిన విధంగా కటాఫ్ తేదీ లోపు రద్దు చేసుకోవాలి. అప్పుడు ట్యూషన్ ఫీజు రిఫండ్ చేస్తారు.

### ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, స్లాట్ బుకింగ్:** ఆగస్టు 6–8, 2019.
- **స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన:** ఆగస్టు 8–11 తేదీల మధ్య.
- **వెబ్ ఆప్షన్లు ఇచ్చే ప్రక్రియ:** ఆగస్టు 8–12 తేదీల మధ్య.
- **సీట్ల కేటాయింపు:** ఆగస్టు 14, 2019.
- **ట్యూషన్ ఫీజు చెల్లింపు, వెబ్‌సైట్ ద్వారా స్వీయ రిపోర్టింగ్:** ఆగస్టు 14–17 తేదీల మధ్య.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్: tsicet.nic.in**

---

## ఉద్యోగ సమాచారం

### హెచ్‌సీఎల్‌లో 26 ఖాళీలు

భారత ప్రభుత్వ మైనింగ్ మంత్రిత్వ శాఖకు చెందిన హిందుస్తాన్ కాపర్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్).. మలంజ్‌ఖండ్ కాపర్ ప్రాజెక్ట్ పరిధిలో పని చేసేందుకు అవసరమైన 26 అసిస్టెంట్ ఫోర్ మ్యాన్, మైనింగ్ మేట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** అసిస్టెంట్ ఫోర్ మ్యాన్ (మైనింగ్)–11, మైనింగ్ మేట్ (గ్రేడ్–1)–15.
- **అర్హత:** మైనింగ్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** 2019, జులై 31 నాటికి 35 ఏళ్లకు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500 (ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు ఫీజు లేదు).
- **ఎంపిక:** రాత పరీక్ష, ట్రేడ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 26, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.hindustancopper.com**

### పీడీఐఎల్‌లో 391 ఖాళీలు

నోయిడాలోని భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన ప్రాజెక్ట్స్ అండ్ డెవలప్‌మెంట్ ఇండియా లిమిటెడ్ (పీడీఐఎల్)..దేశవ్యాప్తంగా ఉన్న తనిఖీ కార్యాలయాలు, ప్రాజెక్టు క్షేత్రాల్లో ఖాళీగా ఉన్న 391 పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. జూనియర్ కన్‌స్ట్రక్షన్ సూపర్‌వైజర్/ జూనియర్ డ్రాఫ్టింగ్ స్టాఫ్: 50.
2. ఇంజనీర్/ఎగ్జిక్యూటివ్ (గ్రేడ్ 1,2,3): 341

- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత ట్రేడులు/బ్రాంచుల్లో ఐటీఐ/డిప్లొమా, ఇంజనీరింగ్ డిగ్రీ, సీఏ/ఐసీడబ్ల్యూఏ/ఎంబీఏ(ఫైనాన్స్), డిగ్రీ, ఎంఎస్సీ ఉత్తీర్ణత. నిర్దిష్ట అనుభవం కూడా ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.400; ఎస్సీ, ఎస్టీలకు రూ.200.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 21, 2019.
- **వెబ్‌సైట్: https://pdilcareer.in**

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం
6-8-2019

అరంగేట్ర మ్యాచ్‌లోనే అదరగొట్టిన భారత పేసర్ నవదీప్ సైనీ అదే మ్యాచ్‌లో తన ప్రవ ర్తనతో శిక్షకు గురయ్యాడు. తొలి టి20లో నికోలస్ పూరన్‌ను ఔట్ చేసిన తర్వాత అతని వైపు చూస్తూ సైనీ కనబర్చిన దుందుడుకు ప్రవర్త నను ఐసీసీ తప్పుపట్టింది. అంపైర్ల ఫిర్యాదు అనంతరం రిఫరీ ముందు అతను తన తప్పును అంగీకరించాడు. దాంతో సైనీకి 'ఒక డీ మెరిట్ పాయింట్' శిక్షగా విధించింది.



# స్టెయిన్ 'టెస్టు' ముగిసింది!



**టెస్టు కెరీర్**

ఆడిన మ్యాచ్‌లు **93**

తీసిన వికెట్లు **439**

సగటు **22.95**

అత్యుత్తమ బౌలింగ్: **7/51** (ఇన్నింగ్స్) **11/60** (మ్యాచ్)

ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు: **26** సార్లు

మ్యాచ్‌లో 10 వికెట్లు: **5** సార్లు

**టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన దిగ్గజ ఫాస్ట్ బౌలర్**

**అత్యధిక వికెట్ల జాబితాలో ఎనిమిదో స్థానం**

**వన్డేలు, టి20ల్లో కొనసాగుతానని ప్రకటన**

**జొహన్నెస్‌బర్గ్:** ఫాస్ట్‌బౌలింగ్‌కు పర్యాయపదంగా నిలిచిన ఈతరం దిగ్గజం టెస్టు క్రికెట్‌లో తన ఆటను ముగించాడు. ఎర్ర బంతితో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన సఫారీ టెర్రర్ సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. ఆధునిక క్రికెట్‌లో అత్యుత్తమ పేసర్‌గా తనదైన ముద్ర వేసిన డేల్ స్టెయిన్ టెస్టు క్రికెట్‌నుంచి రిటైర్ అవుతున్నట్లు ప్రకటించాడు. గత కొంత కాలంగా తరచూ గాయాలబారిన పడిన 36 ఏళ్ల స్టెయిన్ ఇకపై వన్డేలు, టి20లకు పరిమితం అవుతానని చెప్పాడు. 'నేను ఎంతగానో ప్రేమించిన ఫార్మాట్‌నుంచి ఇక తప్పుకుంటున్నాను. శారీరకంగా, మానసికంగా, భావోద్వేగాలపరంగా కూడా ఆటగాడిగా ఎంతో పరీక్ష పెట్టే టెస్టు క్రికెట్టే నా దృష్టిలో అత్యుత్తమం. మళ్లీ టెస్టులు ఆడననే విషయం నన్ను నిజంగా చాలా బాధ పెడుతోంది. ఇకపై వన్డేలు, టి20లు మాత్రమే ఆడి నా కెరీర్‌ను మరికొంత కాలం పొడిగించుకోవాలని భావిస్తున్నాను' అని స్టెయిన్ తన రిటైర్మెంట్ ప్రకటనలో పేర్కొన్నాడు. 93 టెస్టుల్లో స్టెయిన్ 439 వికెట్లు పడగొట్టాడు. దక్షిణాఫ్రికా తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా గుర్తింపు తెచ్చుకున్న స్టెయిన్... ఓవరాల్‌గా ఈ జాబితాలో ఎనిమిదో స్థానంతో తన కెరీర్ ముగించాడు.

## ఎదురులేని స్టెన్ గన్!

అహ్మదాబాద్‌లోని మొతెరా స్టేడియం, 2008...అత్యద్భుత పేస్ బౌలింగ్ ప్రదర్శనతో స్టెయిన్‌కు 5 వికెట్లు...భారత్ 76 ఆలౌట్! మరో రెండేళ్ల తర్వాత నాగపూర్ వేదిక... స్టెయిన్‌కు 7 వికెట్లు... కుప్పకూలిన టీమిండియా, దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ విజయం... భారత గడ్డపై టెస్టుల్లో ఒక విదేశీ బౌలర్ చెలరేగిపోవడమే అరుదు. అదీ ఒక ఫాస్ట్ బౌలర్ మన బ్యాట్స్‌మెన్‌ను ముప్పుతిప్పలు పెట్టడం అసాధారణం... కానీ స్టెయిన్‌కు పిచ్ స్వభావంతో పని లేదు. తన పదునైన బౌలింగ్‌పై నమ్మకమే తప్ప సొంత మైదానమా లేక ప్రత్యర్థి వేదికనా అనేది అనవసరం... అందుకే అతను ఈతరం ఫాస్ట్ బౌలర్లలో అందరికంటే అగ్రభాగాన నిలిచాడు. జొహన్నెస్‌బర్గ్‌తో మొదలు పెడితే పోర్ట్ ఆఫ్ స్పెయిన్, హరారే, గాలే, కరాచీ, ఓవల్, మెల్‌బోర్న్... అన్ని మూలలా అతను ప్రత్యర్థి బ్యాట్‌మెన్‌ను గడగడా వణికించాడు. పచ్చిక మైదానాల నుంచి దుమ్ము రేగే పిచ్‌ల వరకు ఒకదానితో మరోదానికి పోలికే లేని వేదికలపై అద్భుత గణాంకాలు నమోదు చేశాడు. ఉపఖండంలో ఆడిన 22 టెస్టుల్లో కేవలం 24.11 సగటుతో 92 వికెట్లు తీయడం అతడిని తన తరంలోని మెక్‌గ్రాత్, అండర్సన్‌లకంటే పైన నిలబెడుతుంది.

'నేను అమిత వేగంతో బౌలింగ్ చేసినప్పుడు బ్యాట్స్‌మెన్ చెవి పక్కనుంచి జూమ్మంటూ బంతి దూసుకుపోతుంటే ఆ శబ్దం చాలా వినసొంపుగా అనిపిస్తుంది'... ఇలా తన పేస్ గురించి స్వయంగా ఎన్నో సార్లు గొప్పగా చెప్పుకున్న స్టెయిన్ స్పీడ్‌నే శ్వాసించాడు. ఇన్నింగ్స్ ఆరంభంలోనే కాకుండా చివరి వరకు కూడా కనీసం 140 కిలో మీటర్లకు తగ్గని ఒకే తరహా వేగాన్ని కొనసాగించగలగడం అతనికే సాధ్యమైంది. ఆకట్టుకునే యాక్షన్, 19 మీటర్ల రనప్, అదరగొట్టే అవుట్ స్వింగర్లు స్టెయిన్ చిరునామాగా మారాయి. ఒకటా, రెండా స్టెయిన్ బౌలింగ్ దక్షిణాఫ్రికాకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించింది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, శ్రీలంక, పాకిస్తాన్‌లలో టెస్టు సిరీస్ విజయాలు, భారత గడ్డపై రెండు సిరీస్‌లు 'డ్రా' కావడంలో స్టెయిన్ కీలక పాత్ర పోషించాడు. ప్రతీ దేశంలో అతను 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలవడం విశేషం. స్టెయిన్ తమతో ఉన్న సమయంలో దక్షిణాఫ్రికా జట్టు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, భారత్, న్యూజిలాండ్‌లలో ఒక్క సిరీస్ కూడా ఓడిపోకపోవడం అతని విలువను చూపిస్తోంది. సొంతగడ్డపై గొప్పగా రాణించిన బౌలర్లు కూడా విదేశాల్లో పేలవ ప్రదర్శన కనబర్చారు. కానీ స్టెయిన్‌కు మాత్రమే ప్రతీ చోటా ఘనమైన రికార్డు ఉంది. దక్షిణాఫ్రికాలో 21.62 సగటుతో 261 వికెట్లు తీస్తే, విదేశాల్లో 24.23 సగటుతో 164 వికెట్లు తీయడం అతని ఘనతకు నిదర్శనం. 2010 నుంచి 2015 వరకు నిర్విరామంగా స్టెయిన్ ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా కొనసాగాడు. కనీసం 300 వికెట్లు పడగొట్టిన బౌలర్లలో అందరికంటే అత్యుత్తమ స్ట్రయిక్ రేట్ (42.30) స్టెయిన్‌దే. ఇటీవల తిరగబెట్టిన భుజం గాయం స్టెయిన్ టెస్టు కెరీర్‌ను అర్ధాంతరంగా ముగించిందని చెప్పవచ్చు. మేలిరకం అసలు సిసలు ఫాస్ట్ బౌలర్‌గా అతను టెస్టు క్రికెట్‌పై వేసిన ముద్ర మాత్రం ఎప్పటికీ ఎవరూ మరచిపోలేనిది.

–సాక్షి క్రీడావిభాగం

# మార్పులు చేర్పులతో...

**అమెరికా వేదికగా రెండు టి20 మ్యాచ్‌ల క్రికెట్ సంబరం తర్వాత ఇప్పుడు పోరు విండీస్ గడ్డకు చేరింది. వరుస విజయాలతో ఇప్పటికే సిరీస్ నెగ్గి ఊపు మీదున్న టీమిండియా క్లీన్‌స్వీప్‌పై కన్నేస్తే... కనీసం సొంత మైదానంలోనైనా గెలుపు అందుకొని పరువు దక్కించుకోవాలని వెస్టిండీస్ ఆశిస్తోంది. తొలి రెండు మ్యాచ్‌ల తర్వాత కుర్రాళ్లకు భారత తుది జట్టులో చోటు దక్కే అవకాశం కనిపిస్తోంది. మరో వైపు రెండు సార్లు వరల్డ్ కప్ గెలిచినా... అతి ఎక్కువ మ్యాచ్‌లు ఓడిన చెత్త రికార్డు మూటగట్టుకున్న బ్రాత్‌వైట్ బృందం ఈ సారైనా తమ స్థాయికి తగినట్లుగా ఆడుతుందా చూడాలి.**

- మూడో టి20కి భారత్ సిద్ధం
- నేడు వెస్టిండీస్‌తో తుది పోరు
- అమితోత్సాహంతో కోహ్లి సేన
- పరువు కోసం విండీస్ ప్రయత్నం

**రాత్రి 8 గంటల నుంచి సోనీ టెన్–1లో ప్రత్యక్ష ప్రసారం**

**జార్జ్‌టౌన్ (గయానా):** పొట్టి ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్‌ను మట్టికరిపించిన భారత్ మరో విజయంతో ముగింపు ఇచ్చేందుకు సన్నద్ధమైంది. వెస్టిండీస్‌తో మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా నేడు ఇక్కడి ప్రావిడెన్స్ స్టేడియంలో చివరి మ్యాచ్ జరుగుతుంది. భారత్ ఇప్పటికే 2–0తో సిరీస్ గెలుచుకుంది. భారత్ చేతిలో వరుసగా ఐదు టి20లలో ఓడిన విండీస్ ఒక్క విజయం కోసం తపిస్తోంది.

### చహర్ బ్రదర్స్‌కు చాన్స్!

తొలి రెండు టి20ల్లో ఒకే జట్టుతో ఆడిన భారత్... బెంచీకే పరిమితమైన మిగిలిన నలుగురికి కూడా ఒకేసారి చాన్స్ ఇవ్వాలని భావిస్తోంది. సిరీస్ ఇప్పటికే సొంతమైన నేపథ్యంలో కొత్త కుర్రాళ్లు తమ సత్తా చాటుకునేందుకు ఇది మంచి అవకాశం. పైగా ఐపీఎల్ కారణంగా ఈ ఫార్మాట్‌లో మన ఆటగాళ్లు రాటుదేలారు కాబట్టి జట్టు కూర్పు మారినా టీమ్ పటిష్టంగానే కనిపిస్తుంది. ముఖ్యంగా 'చహర్ బ్రదర్స్' మ్యాచ్‌లో ఆడేందుకు ఎదురు చూస్తున్నారు. పేసర్ దీపక్ చహర్ భారత తరఫున ఒకే ఒక్క టి20 ఆడగా, లెగ్ స్పిన్నర్ రాహుల్ చహర్ ఇప్పటి వరకు అరంగేట్రం చేయలేదు. ఈ ఏడాది ఐపీఎల్ ప్రదర్శన ఆధారంగా జట్టులోకి ఎంపికైన రాహుల్ ఎలాగూ వన్డే టీమ్‌లో లేడు కాబట్టి ఈ మ్యాచ్‌లో ఆడించవచ్చు. పైగా కెప్టెన్ కోహ్లి పదే పదే చెబుతున్నట్లు వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచ కప్ కోసం సరైన జట్టును తయారు చేసేందుకు కూడా ఈ మ్యాచ్‌లను భారత్ ఉపయోగించుకోనుంది. కేఎల్ రాహుల్‌ను పంత్ స్థానంలో ఆడించే అవకాశం ఉంది. ఇక చాలా రోజులుగా సరైన చాన్స్ లభించని శ్రేయస్ అయ్యర్‌ను బరిలోకి దించవచ్చు. వీరంతా కాకుండా కోహ్లి, రోహిత్, ధావన్, భువనేశ్వర్‌లాంటి ప్రధాన ఆటగాళ్లతో జట్టు తిరుగులేనిదిగా కనిపిస్తోంది. తాజా ఫామ్ ప్రకారం చూస్తే మరో విజయం భారత్‌కు కష్టం కాకపోవచ్చు.

### గెలిపించేదెవరు?

టి20 లీగ్‌లో విధ్వంసక ఆటతో చెలరేగిపోయే వెస్టిండీస్ క్రికెటర్లు అంతర్జాతీయ పోరుకు వచ్చేసరికి మాత్రం పేలవంగా మారిపోయారు. తొలి మ్యాచ్‌లో చెత్త బ్యాటింగ్ ప్రదర్శనతో వంద పరుగులు కూడా చేయలేకపోయిన ఆ జట్టు రెండో మ్యాచ్‌లో కూడా పేలవ రన్‌రేట్‌తో బ్యాటింగ్ చేసి మ్యాచ్‌ను చేజార్చుకుంది. రావ్‌మన్ పావెల్ అర్ధసెంచరీ చేసినా, పూరన్ నెమ్మదైన బ్యాటింగ్ జట్టును దెబ్బ తీసింది. భారత స్పిన్నర్లు సుందర్, కృనాల్‌లను ఎదుర్కోవడంలో ఆ జట్టు విఫలమైంది. జట్టు ఎన్నో ఆశలు పెట్టుకున్న హెట్‌మైర్ పెద్దగా ఆకట్టుకోలేదు. మొదటి మ్యాచ్‌లో బాగా ఆడిన పొలార్డ్ గత మ్యాచ్‌లో క్రీజ్‌లోకి వచ్చే సరికే పరిస్థితి చేయిదాటిపోయింది. పేరుకు బ్యాటింగ్ లైనప్‌లో అంతా దూకుడైన ఆటగాళ్లే కనిపిస్తున్నా ఆశించిన మెరుపులు మాత్రం రాలేదు. ముఖ్యంగా కెప్టెన్ బ్రాత్‌వైట్‌నుంచి విండీస్ అభిమానులు ఒక దూకుడైన ఇన్నింగ్స్ ఆశిస్తున్నారు. బ్యాటింగ్‌తో పోలిస్తే జట్టు బౌలింగ్ కొంత మెరుగ్గా ఉండటం ఊరట.

**తుది జట్లు (అంచనా)**

**భారత్:** కోహ్లి, రోహిత్, ధావన్, అయ్యర్, రాహుల్, కృనాల్, జడేజా, రాహుల్ చహర్, దీపక్ చహర్, భువనేశ్వర్, ఖలీల్.

**వెస్టిండీస్:** బ్రాత్‌వైట్ (కెప్టెన్), క్యాంప్‌బెల్, నరైన్, పూరన్, హెట్‌మైర్, పొలార్డ్, రావ్‌మన్ పావెల్, కీమో పాల్, ఖారీ పియర్, కాట్రెల్, థామస్

**పిచ్, వాతావరణం**

దేశం మారినా తొలి రెండు మ్యాచ్‌లలాగే ఇక్కడ కూడా నెమ్మదైన పిచ్ సిద్ధంగా ఉంది. విధ్వంసక షాట్లకు అవకాశం తక్కువ. మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించవచ్చు.

## జైపూర్ జోరుకు బ్రేక్

**పట్నా:** వరుస విజయాలతో ఊపుమీదున్న జైపూర్ పింక్ పాంథర్స్‌ను దబంగ్ ఢిల్లీ నిలువరించింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 35–24తో జైపూర్ పింక్ పాంథర్స్‌కు షాక్ ఇచ్చింది. నవీన్ కుమార్ (12 పాయింట్లు), చంద్రన్ రంజిత్‌లు (10 పాయింట్లు) ఢిల్లీకి ప్రొ కబడ్డీ లీగ్ సీజన్–7లో నాలుగో విజయాన్ని అందించారు. జైపూర్ స్టార్ రైడర్ దీపక్ హుడా విశేషంగా రాణించినా అతనికి సహచరుల నుంచి మద్దతు లభించలేదు. రెండో మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 33–31తో గుజరాత్ ఫార్చ్యున్ జెయింట్స్‌పై గెలిచింది. గిరీష్ (7 పాయింట్లు), పవన్ (6 పాయింట్లు)లు రాణించి పుణేని గట్టెక్కించారు. మ్యాచ్‌లకు నేడు విశ్రాంతి దినం. రేపు జరిగే మ్యాచ్‌ల్లో యూపీ యోధతో తమిళ్ తలైవాస్; పట్నా పైరేట్స్‌తో హరియాణా స్టీలర్స్ తలపడతాయి.



# సింధు, సైనాలకు 'బై'

- నేరుగా రెండో రౌండ్‌లో ఆడనున్న భారత స్టార్స్
- ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ 'డ్రా' విడుదల
- ఈనెల 19 నుంచి 25 వరకు స్విట్జర్లాండ్‌లో మెగా ఈవెంట్



**కౌలాలంపూర్ (మలేసియా):** అందని ద్రాక్షగా ఉన్న స్వర్ణ పతకమే లక్ష్యంగా ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పోటీపడనున్న భారత మహిళా స్టార్స్ పీవీ సింధు, సైనా నెహ్వాల్‌లకు ఒకింత క్లిష్టమైన 'డ్రా' ఎదురైంది. ఈనెల 19 నుంచి 25 వరకు స్విట్జర్లాండ్‌లోని బాసెల్ నగరంలో జరగనున్న ఈ మెగా ఈవెంట్‌కు సంబంధించి సోమవారం కౌలాలంపూర్‌లో 'డ్రా' విడుదల చేశారు. ఈ ఏడాది అంతగా ఫామ్‌లో లేని సింధు ఐదో సీడ్‌గా, సైనా ఎనిమిదో సీడ్‌గా బరిలోకి దిగనున్నారు. సింధు, సైనాలతోపాటు సీడింగ్ పొందిన 16 మంది క్రీడాకారిణులకు తొలి రౌండ్‌లో 'బై' లభించడంతో వారందరూ నేరుగా రెండో రౌండ్ మ్యాచ్ ఆడనున్నారు. పై పార్శ్వంలో ఉన్న సైనాకు రెండో రౌండ్‌లో పోర్న్‌పవీ చోచువోంగ్ (థాయ్‌లాండ్), ప్రిక్వార్టర్ ఫైనల్లో 11వ సీడ్ మిచెల్లి లీ (కెనడా) లేదా ఫిత్రియాని (ఇండోనేసియా)లలో ఒకరు ఎదురుకావొచ్చు. ఈ అడ్డంకిని అధిగమిస్తే క్వార్టర్ ఫైనల్లో నాలుగో సీడ్ చెన్ యు ఫె (చైనా) లేదా తొమ్మిదో సీడ్ బీవెన్ జాంగ్ (అమెరికా)లలో ఒకరితో సైనా ఆడే అవకాశముంటుంది. సైనా సెమీస్ చేరితే అక్కడ ప్రపంచ నంబర్‌వన్ అకానె యామగుచి (జపాన్) లేదా ప్రపంచ మాజీ చాంపియన్ ఇంతనోన్ రచనోక్ (థాయ్‌లాండ్)లలో ఒకరు ప్రత్యర్థిగా ఉంటారు. కింది పార్శ్వంలో ఉన్న సింధు తన స్థాయికి తగ్గట్టు ఆడితే క్వార్టర్ ఫైనల్‌కు సులువుగా చేరుకోవచ్చు. క్వార్టర్ ఫైనల్లోనే సింధుకు మాజీ నంబర్‌వన్ తై జు యింగ్ (చైనీస్ తైపీ) రూపంలో అసలు పరీక్ష ఎదురయ్యే చాన్స్ ఉంది. ఈ అవరోధాన్ని అధిగమిస్తే సింధుకు సెమీస్‌లో ప్రపంచ మాజీ చాంపియన్ ఒకుహారా (జపాన్) లేదా ఆరో సీడ్ హి బింగ్‌జియావో (చైనా)లలో ఒకరు ప్రత్యర్థిగా ఉండే అవకాశముంది.

**శ్రీకాంత్‌కు సదవకాశం:** పురుషుల సింగిల్స్‌లో భారత్ తరఫున నలుగురు ఆటగాళ్లు పోటీపడనున్నారు. ఏడో సీడ్‌గా కిడాంబి శ్రీకాంత్, పదో సీడ్‌గా సమీర్ వర్మ, 16వ సీడ్‌గా సాయిప్రణీత్, అన్‌సీడెడ్‌గా ప్రణయ్ బరిలో ఉన్నారు. శ్రీకాంత్ సహజశైలిలో ఆడితే క్వార్టర్ ఫైనల్ చేరే చాన్స్ ఉంది. క్వార్టర్ ఫైనల్లో రెండో సీడ్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ) రూపంలో క్లిష్టమైన ప్రత్యర్థి ఉంటాడు.

**మారిన్ దూరం:** మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ కరోలినా మారిన్ (స్పెయిన్) గాయం కారణంగా ఈ పోటీల నుంచి వైదొలిగింది. పురుషుల సింగిల్స్‌లో మాజీ విశ్వవిజేత అక్సెల్‌సన్ (డెన్మార్క్), రెండో ర్యాంకర్ షి యుకి (చైనా) కూడా తప్పుకున్నారు.

# ఆసీస్ అద్భుతం

**తొలిరోజు ఆటలో టీ బ్రేక్‌కు ముందు ఆస్ట్రేలియా స్కోరు 122/8. ఈ స్కోరుతో ఆసీస్ ఎంత ఘోరంగా ఓడుతుందో అనే అనుకున్నారంతా! అలాంటి జట్టు ఏకంగా 251 పరుగుల తేడాతో గెలుస్తుందని ఎవరూ ఊహించలేదు. అలా అనుకున్నది తలకిందులు చేసిన ఆసీస్ ఊహకందని విజయంతో ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో బోణీ చేసింది.**

- యాషెస్ తొలి టెస్టులో 251 పరుగులతో ఘనవిజయం
- లయన్ మాయాజాలం
- కుప్పకూలిన ఇంగ్లండ్



లయన్

**బర్మింగ్‌హామ్:** యాషెస్ సిరీస్ ఇంగ్లండ్‌లోనే జరుగుతున్నా ... తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండే జోరు మీదున్నా... చివరకు బోణీ చేసింది మాత్రం ఆస్ట్రేలియానే. తొలి టెస్టులో ఆఖరి ఆటలో లయన్ (6/49) స్పిన్ పడింది. దీంతో ఇంగ్లండ్ డీలా పడింది. 5 మ్యాచ్‌ల సిరీస్‌లో ఆసీస్ 1–0తో దూసుకెళ్లింది. తొలి సమరంలో ఆస్ట్రేలియా పోరాటమే గెలిచింది. 251 పరుగుల భారీ తేడాతో ఆతిథ్య ఇంగ్లండ్ పరాజయం చవిచూసింది. ఈ మ్యాచ్‌లో స్పిన్నర్ లయన్ మొత్తం 9 వికెట్లు తీయగా, రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలు సాధించిన స్మిత్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. రెండో టెస్టు లార్డ్స్‌లో 14న మొదలవుతుంది.

**భళారే విచిత్రం...**

తొలిరోజున ఓ దశలో ఆసీస్ స్కోరు 122/8. ఆఖరి రోజు ఇంగ్లండ్ స్కోరు 136/9. దిక్కుతోచని స్థితి నుంచి శాసించే దశకు ఆస్ట్రేలియా చేరుకుంటే... మూడు రోజులు పైచేయి సాధించిన ఇంగ్లండ్ చిత్తుగా ఓడింది. 398 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు ఓవర్‌నైట్ స్కోరు 13/0తో సోమవారం ఆట ప్రారంభించిన ఇంగ్లండ్ ఓటమి గే(బ్యా)ట్లెత్తింది. ఇన్నింగ్స్ పదో ఓవర్‌తో ఇంగ్లండ్ పతనం ఆరంభమైంది. కమిన్స్ బౌలింగ్‌లో ముందుగా బర్న్స్ (11) వికెట్ పడింది. రెండో వికెట్‌కు 41 పరుగులు జతచేశాక ఇదే ఇన్నింగ్స్‌కు పెద్ద భాగస్వామ్యమవుతుందని బహుశా ఎవరూ అనుకోలేదు. రూట్ (28; 3 ఫోర్లు)తో జతకలిసిన రాయ్ (28; 4 ఫోర్లు)ను లయన్ క్లీన్ బౌల్డ్ చేయడంతో అతని స్పిన్ సుడిలో ఇంగ్లండ్ చిక్కుకుంది.

**లయన్ స్పిన్ ఉచ్చులో...**

జట్టు స్కోరు 80 పరుగుల వద్ద లయన్ స్పిన్ మాయాజాలానికి జో డెన్లీ (11) మూడో వికెట్‌గా పెవిలియన్ చేరాడు. మరో 5 పరుగులకే రూట్ కూడా ఔటయ్యాడు. 85/4 స్కోరు వద్ద ఇంగ్లండ్ లంచ్‌కెళ్లింది. రెండో సెషనులో ఇంగ్లండ్ పతనానికి అడ్డుఅదుపు లేకుండా పోయింది. లయన్, కమిన్స్ చకచకా వికెట్లు తీశారు. బట్లర్ (1), స్టోక్స్ (6), బెయిర్‌స్టో (6) ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. దీంతో కేవలం 12 పరుగుల వ్యవధిలో 3 వికెట్లను కోల్పోయిన ఇంగ్లండ్ స్కోరు 97/7. ఘోర పరాజయానికి మూడే వికెట్ల దూరంలో నిలిచింది. టెయిలెండర్ వోక్స్ (37; 7 ఫోర్లు) ఇన్నింగ్స్ టాప్‌స్కోరర్‌గా నిలువడంతో రూట్ సేన రెండో ఇన్నింగ్స్‌లో 52.4 ఓవర్లలో 146 పరుగుల వద్ద ఆలౌటైంది. కమిన్స్ 4 వికెట్లు తీశాడు.

**5 రోజులు ఆడిన 'టెన్త్' ప్లేయర్ బర్న్స్...**

టెస్టు ఐదురోజులైతే అన్ని రోజులు బ్యాటింగ్ చేసిన తొలి ఆటగాడు భారత దిగ్గజం, హైదరాబాదీ ఎం.ఎల్.జయసింహా (1960) కాగా... పదో క్రికెటర్ బర్న్స్. ఈ జాబితాలో మరో ఇద్దరు భారత ఆటగాళ్లు రవిశాస్త్రి (1984), పుజారా (2017) ఉన్నారు. ఇంగ్లండ్ పరంగా చూస్తే నాలుగో ఇంగ్లిష్ బ్యాట్స్‌మన్ బర్న్స్. ఈ వరుసలో బాయ్‌కాట్ (1977), ల్యాంబ్ (1984), ఫ్లింటాఫ్ (2006) ముందున్నారు.

## పెళ్లికి భారత క్రికెటర్లనూ ఆహ్వానిస్తా: హసన్ అలీ



**కరాచీ:** సెప్టెంబర్ 20న భారత యువతి సామియా ఆర్జూను వివాహం చేసుకోనున్న పాకిస్తాన్ క్రికెటర్ హసన్ అలీ తన పెళ్లికి భారత క్రికెటర్లను కూడా ఆహ్వానిస్తానని తెలిపాడు. తన ఆహ్వానాన్ని మన్నించి వారు పెళ్లికి హాజరైతే చాలా సంతోషిస్తానని అన్నాడు. 'భారత ఆటగాళ్లందరినీ నా పెళ్లికి ఆహ్వానిస్తాను. మేము మైదానంలో ప్రత్యర్థులం... బయట కాదు' అని హసన్ అన్నాడు. హసన్‌కు కాబోయే భార్య సామియా ఆర్జూ ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ పూర్తి చేసి దుబాయ్ కేంద్రంగా పనిచేసే ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్‌లో ఫ్లయిట్ ఇంజనీర్‌గా పనిచేస్తుంది. ఆమె కుటుంబం న్యూఢిల్లీలో స్థిరపడింది.

## 'కెప్టెన్సీ నుంచి సర్ఫరాజ్‌ను తప్పించండి'

**కరాచీ:** పాకిస్తాన్ హెడ్ కోచ్ మికీ ఆర్థర్ జట్టు కెప్టెన్సీ నుంచి సర్ఫరాజ్ అహ్మద్‌ను తప్పించాలని ఆ దేశ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు సిఫార్సు చేశారు. అలాగే తనను కోచ్‌గా మరో రెండేళ్లు కొనసాగిస్తే అద్భుత ఫలితాలు చూపిస్తానని కోరారు. దిగ్గజ ఆల్‌రౌండర్ వసీమ్ అక్రమ్ నేతృత్వంలోని పీసీబీ కమిటీ పాకిస్తాన్ జట్టు గత మూడేళ్ల ప్రదర్శనను సమీక్షిస్తున్న నేపథ్యంలో ఆయన ఈ సిఫార్సు చేసినట్లు తెలిసింది.

## సాకేత్ పునరాగమనం

**పాక్‌తో డేవిస్ కప్ మ్యాచ్‌కు భారత జట్టు ఎంపిక**



**చెన్నై:** ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ ఆటగాడు సాకేత్ మైనేని భారత డేవిస్ కప్ జట్టులోకి పునరాగమనం చేశాడు. పాకిస్తాన్‌తో జరిగే ఆసియా ఓసియానియా గ్రూప్–1 మ్యాచ్ కోసం రోహిత్ రాజ్‌పాల్ అధ్యక్షతన సోమవారం సమావేశమైన అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) ఐదుగురు సభ్యులతో కూడిన భారత జట్టును ప్రకటించింది. సింగిల్స్ విభాగంలో భారత టాప్ ఆటగాళ్లయిన ప్రజ్నేశ్ గుణేశ్వరన్, రామ్‌కుమార్ రామనాథన్‌లను ఎంపిక చేశారు. డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న–దివిజ్ శరణ్ జంటను ఎంపిక చేసింది. గతవారం చైనాలో జరిగిన చెంగ్డూ చాలెంజర్ టూర్ సిరీస్ టోర్నమెంట్ డబుల్స్ టైటిల్‌ను గెలిచిన సాకేత్ మైనేనికి కూడా స్థానం కల్పించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇటలీతో కోల్‌కతాలో జరిగిన వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్ మ్యాచ్‌లో సాకేత్ ఆడలేదు. గతేడాది సెప్టెంబర్‌లో సెర్బియాతో జరిగిన వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్ మ్యాచ్‌లో చివరిసారి సాకేత్ బరిలోకి దిగాడు. డేవిస్ కప్‌లో భారత్–పాకిస్తాన్‌లు ఇప్పటి వరకు 6 సార్లు తలపడగా అన్నింటిలోనూ భారతే విజయం సాధించింది. ఇస్లామాబాద్ వేదికగా సెప్టెంబర్ 14, 15 తేదీల్లో డేవిస్ కప్ పోరులో మరోసారి భారత్–పాకిస్తాన్‌లు తలపడనున్నాయి.

## వెటోరి జెర్సీకి కివీస్ గుడ్‌బై




**వెల్లింగ్టన్:** న్యూజిలాండ్ క్రికెట్ (ఎన్‌జడ్‌సీ) తమ దిగ్గజ క్రికెటర్, మాజీ కెప్టెన్ డానియెల్ వెటోరీ సేవలకు చక్కని గుర్తింపునిచ్చింది. అతని జెర్సీ నంబర్ '11'కు రిటైర్మెంట్ ఇచ్చేసింది. దీంతో ఇక భవిష్యత్తులో ఏ కివీ క్రికెటర్ జెర్సీ మీద ఈ నంబర్ కనిపించదు. '200పైగా వన్డేలకు ప్రాతినిధ్యం వహించిన జెర్సీ నంబర్‌కు రిటైర్మెంట్ ఇచ్చేశాం. వెటోరి 11 జెర్సీతో 291 మ్యాచ్‌లాడి అత్యధిక వన్డేలాడిన న్యూజిలాండ్ క్రికెటర్‌గా నిలిచాడు' అని ఎన్‌జడ్‌సీ ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. శ్రీలంకతో జరిగే టెస్టు సిరీస్ కోసం తమ ఆటగాళ్ల జెర్సీ నంబర్లను ప్రకటించింది. రెండు టెస్టుల ఈ సిరీస్ ఈ నెల 14 నుంచి గాలే (శ్రీలంక)లో జరుగుతుంది. ఇక్కడి నుంచే కివీస్ ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ మొదలవుతుంది.

# సాక్షి బిజినెస్

మంగళవారం
6-8-2019

WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 418 ▼ | 135 ▼ |
| 36,700 | 10,863 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 7,741 | ▼ 262 |
| డోజోన్స్ | 25,776 | ▼ 708 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,223 | ▼ 183 |
| డాక్స్ | 11,658 | ▼ 214 |
| షాంఘై | 2,822 | ▼ 46 |
| నికాయ్ | 20,720 | ▼ 367 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 69.68 | 71.32 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 84.14 | 87.19 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.00 | 79.88 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 65.26 | 67.76 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 46.86 | 49.03 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.13 | 51.87 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.14 | 19.85 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.57 | 20.08 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.43 | 10.79 |

# బేర్ 'విశ్వ'రూపం!



## వాణిజ్య యుద్ధ భయాలు, కశ్మీర్ పరిణామాలతో అమ్మకాల వెల్లువ

ప్రపంచ మార్కెట్ల భారీ పతనం.. ● అజ్యం పోసిన చైనా కరెన్సీ డీవేల్యూ భయాలు

సెన్సెక్స్ 418 పాయింట్ల పతనం ● ఐదు నెలల కనిష్టానికి సూచీ ● నిఫ్టీ 135 పాయింట్లు డౌన్

అమెరికా–చైనా మధ్య వాణిజ్య యుద్ధభయాలు, కార్పొరేట్ల ఆదాయాలు బలహీనంగా ఉండటం, రూపాయి క్షీణత, జమ్మూకశ్మీర్ పరిణామాలు.. అన్నీ కలగలిసి సోమవారం మార్కెట్లను కూలదోశాయి. ఇన్వెస్టర్ల సెంటిమెంటుపై ఇవన్నీ ప్రతికూల ప్రభావాలు చూపడంతో సెన్సెక్స్ 418 పాయింట్లు క్షీణించి కీలకమైన 36,700 పాయింట్ల దిగువకు పతనమైంది. అయిదు నెలల కనిష్ట స్థాయికి క్షీణించింది. ఇక నిఫ్టీ సైతం 135 పాయింట్లు పతనమై 10,863 పాయింట్ల వద్ద క్లోజయ్యింది. నిఫ్టీ, సెన్సెక్స్ రోజంతా తీవ్ర హెచ్చుతగ్గులకు లోనయ్యాయి. సెన్సెక్స్ ఒక దశలో 700 పాయింట్ల దాకా కూడా పతనమైంది. చివర్లో కొంత కోలుకుని 418 పాయింట్ల తగ్గుదలతో (1.13 శాతం) 36,699.84 వద్ద క్లోజయ్యింది. సెన్సెక్స్ 36,417 – 36,844 పాయింట్ల కనిష్ట, గరిష్టస్థాయిల మధ్య తిరుగాడింది.

'మార్కెట్ హెచ్చుతగ్గులకు అనేక ప్రతికూలాంశాలు కారణమయ్యాయి. జమ్మూకశ్మీర్ పరిణామాలతో రాజకీయ సంక్షోభం తలెత్తవచ్చన్న ఆందోళనలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకు (ఎఫ్‌పీఐ) సర్‌చార్జీ నుంచి మినహాయింపునకు సంబంధించి కొత్తగా మరే సంకేతాలు లేకపోవడం వంటివి కూడా మార్కెట్ హెచ్చుతగ్గులకు కారణమయ్యాయి. దాదాపు అన్ని రంగాల షేర్లలోనూ అమ్మకాలు వెల్లువెత్తాయి. ఆటో, బ్యాంకింగ్ రంగాల షేర్లు ఆఖర్లో కొంత రికవర్ కాగా.. బలహీన రూపాయి వల్ల ఐటీ రంగ షేర్లు ఆసాంతం లాభాల్లోనే కొనసాగాయి. అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధాలకు సంబంధించిన చర్చలకు ప్రతికూలతలు ఉండటం, ఎఫ్‌పీఐలు రిస్కులకు దూరంగా ఉండాలని భావిస్తుండటం వంటి అంశాల వల్ల.. మార్కెట్ల కన్సాలిడేషన్ కొనసాగే అవకాశం ఉంది' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో రీసెర్చ్ విభాగం హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. విపక్షాల ఆందోళనల మధ్య.. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదానిచ్చే ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం సోమవారం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.

### అన్ని రంగాల సూచీలు క్షీణతలోనే..

ఐటీ మినహా.. అన్ని రంగాల సూచీలు క్షీణించాయి. ఎనర్జీ 2.7 శాతం తగ్గగా.. మెటల్, బ్యాంక్, ఆటో, ఎఫ్‌ఎంసీజీ, ఇన్‌ఫ్రా, ఫార్మా తదితర సూచీలు తగ్గాయి. ఇక బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీ కూడా 1 శాతం పైగా తగ్గాయి.

### యస్ బ్యాంక్ 8 శాతం డౌన్..

ఇప్పటికే కొట్టుమిట్టాడుతున్న యస్ బ్యాంక్ షేర్లకు అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ రూపంలో మరో షాక్ తగిలింది. అసెట్ క్వాలిటీ దిగజారుతుండటం, ఎన్‌బీఎఫ్‌సీలకు భారీగా రుణాలిచ్చి ఉండటం వంటి ప్రతికూల అంశాల కారణంగా బ్యాంక్ రేటింగ్‌ను డౌన్‌గ్రేడ్ చేసే అంశం ఇంకా పరిశీలనలోనే ఉందంటూ మూడీస్ వెల్లడించింది. రెండు నెలల్లో మూడీస్ ఇలాంటి హెచ్చరికలు జారీ చేయడం ఇది రెండోసారి కావడంతో బ్యాంక్ షేరు భారీగా తగ్గింది. సెన్సెక్స్ షేర్లలో యస్ బ్యాంక్ అత్యధికంగా 8.15 శాతం క్షీణించింది. ఇక దిగ్గజ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లకు కూడా రేటింగ్ సెగ తప్పలేదు. రిలయన్స్ రేటింగ్‌ను న్యూట్రల్ నుంచి అండర్‌పెర్ఫార్మ్‌కి తగ్గించడంతో పాటు టార్గెట్ రేటును రూ. 1,350 నుంచి రూ. 995కి తగ్గిస్తున్నట్లు బ్రోకరేజి సంస్థ క్రెడిట్ సూసీ ప్రకటించింది. దీంతో రిలయన్స్ షేరు 3.48 శాతం క్షీణించి రూ. 1,141 వద్ద క్లోజయ్యింది. టాటా మోటార్స్ 5.25 శాతం, పవర్‌గ్రిడ్ 4.42 శాతం, కోటక్ బ్యాంక్ (3.13 శాతం) తగ్గాయి. మరోవైపు భారతి ఎయిర్‌టెల్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ, బజాజ్ ఆటో అత్యధికంగా లాభపడిన వాటిల్లో ఉన్నాయి.

### డీహెచ్ఎఫ్ఎల్ 10 శాతం పతనం..

ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్న దివాన్ హౌసింగ్ ఫైనాన్స్ (డీహెచ్ఎఫ్ఎల్) షేరు మరింత పతనమైంది. ఆడిటర్ బాధ్యతల నుంచి డెలాయిట్ తప్పుకుందన్న వార్తలతో 10% క్షీణించింది. బీఎస్‌ఈలో 41.95 వద్ద క్లోజయ్యింది. ఒక దశలో 12.43% క్షీణించి 52 వారాల కనిష్టమైన రూ. 40.85 స్థాయికి కూడా తగ్గింది. ఎన్ఎస్ఈలో 10.07 శాతం క్షీణతతో రూ. 41.95 వద్ద ముగిసింది. బీఎస్‌ఈలో 22.03 లక్షలు, ఎన్ఎస్ఈలో 1.97 కోట్ల షేర్లు చేతులు మారాయి. డెలాయిట్ ఆడిటింగ్ బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు వార్తలు వచ్చినప్పటికీ.. తమకు ఎలాంటి సమాచారం లేదంటూ డీహెచ్ఎఫ్ఎల్ వివరణనిచ్చింది. డీహెచ్ఎఫ్ఎల్‌కు రూ. 90,000 కోట్ల రుణభారం ఉంది.

### నెల రోజుల్లో రూ. 15 లక్షల కోట్ల సంపద ఆవిరి

లార్జ్ క్యాప్, మిడ్.. స్మాల్ క్యాప్ అనే తేడా లేకుండా మార్కెట్లో అమ్మకాల వెల్లువ కొనసాగుతుండటంతో గడిచిన నెల రోజుల్లో రూ. 15 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోయింది. జూలై 5న రూ. 153.58 లక్షల కోట్లుగా ఉన్న బీఎస్‌ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ 10 శాతం తగ్గి సోమవారం నాటికి రూ. 138 లక్షల కోట్లకు పడిపోయింది. ఇదే వ్యవధిలో సెన్సెక్స్ 8 శాతం క్షీణించింది.

## రూపాయి విలవిల...

- ఆరేళ్లలో అతిపెద్ద పతనం!
- డాలర్ మారకంలో
- ఒకేరోజు 113 పైసలు డౌన్
- 70.73 వద్ద ముగింపు
- నాలుగు నెలల కనిష్టస్థాయి

**ముంబై:** డాలర్ మారకంలో రూపాయి విలువ సోమవారం ఒక్కసారిగా కుప్పకూలింది. ఒకేరోజు 113 పైసలు (1.62 శాతం) పతనం అయ్యింది. 70.73 వద్ద ముగిసింది. ఇది నాలుగు నెలల కనిష్టస్థాయి. గడచిన ఆరు సంవత్సరాల్లో (2013 ఆగస్టు తరువాత) రూపాయి ఒకేసారి ఈ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో గడచిన మూడు రోజుల ట్రేడింగ్‌లో రూపాయి భారీగా 194 పైసలు నష్టపోయింది.

**మూడు ప్రధాన కారణాలు...**

- అమెరికా–చైనా వాణిజ్య భయాలతో విదేశీ ఇన్వెస్టర్ల ఈక్విటీ మార్కెట్ అమ్మకాలు
- అమెరికా డాలర్ మారకంలో చైనా విదేశీ మారకద్రవ్యం– యువాన్ భారీ పతనం. 2008 తరువాత మొట్టమొదటిసారి డాలర్ మారకంలో చైనా యువాన్ 7% పతనమైంది. ఇది అమెరికా–చైనా వాణిజ్య యుద్ధం కొత్త దశకు సంకేతమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ క్యాపిటల్ మార్కెట్స్ వ్యూహకర్త వీకే శర్మ పేర్కొన్నారు. ఎంకే గ్లోబల్ ఫైనాన్షియల్ కరెన్సీ రీసెర్చ్ హెడ్ రాహుల్ గుప్తా కూడా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.
- కశ్మీర్ అంశంపై అనిశ్చితి. ఈ మూడు ప్రతికూలతలతో నిజానికి రూపాయి మరింత పతనం కావాల్సి ఉంది. అయితే అంతర్జాతీయంగా తక్కువ ధర వద్ద ట్రేడవుతున్న క్రూడ్ ధరలు రూపాయి పతనాన్ని కొంత నిలువరించాయి.

**ఒడిదుడుకుల ట్రేడింగ్**

ట్రేడింగ్ మొదట్లో రూపాయి 70.20 వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 70.74 కనిష్టాన్ని చూసింది. 70.18 గరిష్టస్థాయిని తాకినా.... అంతకుమించి బలపడలేకపోయింది. అక్టోబర్ 9వ తేదీన రూపాయి చరిత్రాత్మక కనిష్ట స్థాయి 74.39 వద్ద ముగిసింది. అయితే క్రూడ్ ధరల భారీ పతనం, మోదీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్న సంకేతాలతో రూపాయి కీలక నిరోధం 68.50 వద్దకు చేరింది. రూపాయి మరింత బలోపేతం కావడానికి ఈ నిరోధం కీలకం. ఇక్కడ నుంచి రూపాయి మరింత బలపడలేకపోయింది.

## ఇక కరెన్సీ యుద్ధాలు..!

అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం ఇక కరెన్సీ వార్‌కు దారితీయనుందన్న భయాలతో వివిధ దేశాల కరెన్సీ విలువలు కుప్పకూలాయి. ఈ ప్రభావం రూపాయి మారకంపై కూడా ప్రభావం చూపింది. ఒకే రోజు 113 పైసలకు పైగా కుప్పకూలింది. కొత్తగా మరో 300 బిలియన్ డాలర్ల విలువ చేసే చైనా ఎగుమతులపై 10 శాతం సుంకాలు విధించాలన్న అమెరికా నిర్ణయం ప్రభావాలను ఎదుర్కొనే క్రమంలో ఎగుమతిదారులకు ఊతమిచ్చే ఉద్దేశంతో సొంత కరెన్సీ విలువను చైనా తగ్గించుకోనుందన్న(డీవేల్యూ) వార్తలు వచ్చాయి. దీంతో డాలర్‌తో పోలిస్తే చైనా యువాన్ విలువ 7.03 స్థాయికి క్షీణించింది.

## ప్రపంచ మార్కెట్లు అల్లకల్లోలం..

అమెరికా సుంకాల దాడిని ఎదుర్కొనేందుకు చైనా కరెన్సీ అస్త్రాన్ని ప్రయోగించడం ప్రపంచ మార్కెట్లను అతలాకుతలం చేసింది. ఆసియాలో కీలక సూచీలు భారీగా క్షీణించాయి. షాంఘై కాంపొజిట్ ఇండెక్స్ 1.6 శాతం, జపాన్ నికాయ్ 1.7 శాతం మేర తగ్గాయి. హాంకాంగ్‌లో ప్రజాస్వామ్య అనుకూలవాదుల ఆందోళనలు కూడా తోడవడంతో హాంగ్‌సెంగ్ మూడు శాతం దాకా పడింది. ఈ ప్రభావాలతో అటు యూరప్ స్టాక్స్ కూడా రెండు శాతం దాకా క్షీణించాయి. అమెరికాలో కీలక సూచీలు డోజోన్స్ ఏకంగా 2.6 శాతం, నాస్‌డాక్ 3.3 శాతం మేర పడ్డాయి.



## బంగారం భగభగ

- కరెన్సీల పతనం, వాణిజ్య యుద్ధం నేపథ్యం
- ఔన్స్‌కు 1,482 డాలర్లకు దూకుడు
- దేశీయంగానూ కొత్త రికార్డులు
- ఢిల్లీలో రూ. 37 వేలకు చేరువ

**న్యూఢిల్లీ/న్యూయార్క్:** అమెరికా–చైనా వాణిజ్య యుద్ధం తీవ్రత నేపథ్యంలో అంతర్జాతీయంగా పలు దేశాల కరెన్సీలు డాలర్ మారకంలో పతనం కావడం పసిడికి వరమైంది. అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్– న్యూయార్క్ మర్కంటైల్ ఎక్స్ఛేంజ్‌లో ఔన్స్ (31.1గ్రా) ధర సోమవారం భారీగా పెరిగింది. ఒకదశలో 1,481.75 డాలర్ల గరిష్టాన్ని తాకింది. గడచిన ఆరేళ్లలో పసిడి ఈ స్థాయిని చూడ్డం ఇదే తొలిసారి. ఈ వార్త రాసే రాత్రి 10.30 గంటలకు పసిడి ధర గత శుక్రవారం ధరతో పోల్చితే, 20 డాలర్ల లాభంతో 1,477 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వాణిజ్య యుద్ధం, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో పసిడిని పెట్టుబడులకు సురక్షితమైనదిగా ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. అంతర్జాతీయంగా పలు దేశాల ఈక్విటీ మార్కెట్లు తీవ్ర నష్టాలతో ట్రేడవుతుంటే, చైనా కరెన్సీ యువాన్ ఏకంగా 7 శాతం పతనమైంది.

**దేశీయంగా రూపాయి ఎఫెక్ట్ తోడు...**

అంతర్జాతీయంగా పరుగుకు తోడు, డాలర్ మారకంలో రూపాయి విలువ 1.6 శాతంపైగా పతనం చెందడంతో దేశంలో బంగారం ధర ఒక్కసారిగా మెరిసింది. ఢిల్లీలో సోమవారం ధర 10 గ్రాములుకు (99.9 ప్యూరిటీ) రూ.800 పెరిగి రూ.36,970కి చేరింది. 99.5 ప్యూరిటీ ధర కూడా రూ.800 ఎగసి రూ.36,800కి చేరింది. బంగారంతోపాటు వెండి ధర కూడా ఢిల్లీలో భారీగా కేజీకి రూ.1,000 పెరిగింది. రూ.43,100కి చేరింది. ఈ వార్త రాసే రాత్రి 10.30 గంటల సమయానికి దేశీయ ఫ్యూచర్స్ మార్కెట్– మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో 10 గ్రాముల పసిడి ధర క్రితం శుక్రవారం ధరతో పోల్చి రూ.988 లాభంతో రూ.37,259 వద్ద ట్రేడవుతోంది. ఒక దశలో రూ.37,347ను కూడా తాకింది. కాగా వెండి ధర రూ.991 లాభంలో రూ.42,355 వద్ద ట్రేడవుతోంది. ఇదే రీతిన ట్రేడింగ్ ముగిస్తే, మంగళవారం దేశంలో పసిడి ధరలు మరింత పరుగు పెట్టే అవకాశం ఉంది.



# కియా 'సెల్టోస్' విడుదల ఈ నెల 8న

- ముఖ్యమంత్రి జగన్‌ను ఆహ్వానించిన కియా ప్రతినిధులు
- కార్యక్రమానికి హాజరు కానున్న సీఎం

**సాక్షి, అమరావతి:** దక్షిణకొరియా కార్ల దిగ్గజం కియా కంపెనీ తన కొత్తకారు 'సెల్టోస్'ను ఈ నెల 8న మార్కెట్‌లోకి విడుదల చేయనుంది. ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కియా కంపెనీ ప్రతినిధులు ఆహ్వానించారు. కియా కంపెనీ ఎండీ కూక్ హున్ షిమ్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ థామస్ కిమ్ సోమవారం ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో కలిసి అనంతపురం జిల్లా పెనుగొండలో నిర్వహించే కొత్త కారు విడుదల కార్యక్రమానికి రావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఏడాదికి 3 లక్షలకార్లను పెనుగొండ ప్లాంటు ద్వారా ఉత్పత్తి చేయగలమని కంపెనీ ప్రతినిధులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. భవిష్యత్‌లో 7 లక్షల కార్లను తయారు చేసే సామర్థ్యానికి చేరుకుంటామని సీఎంకు వెల్లడించారు. సెల్టోస్ విడుదల కార్యక్రమానికి సీఎం జగన్ హాజరుకానున్నారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కియా 'సెల్టోస్' విడుదల కార్యక్రమానికి ఆహ్వానిస్తున్న కంపెనీ ప్రతినిధులు

## రూ.8,600 వరకు తగ్గిన ఒకినావా స్కూటర్స్ ధర

**న్యూఢిల్లీ:** ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ కంపెనీ ఒకినావా స్కూటర్స్.. ఎలక్ట్రిక్ వాహనాల ధరలను తగ్గించింది. రూ.8,600 వరకు ధరలను తగ్గించిన ఈ సంస్థ.. లెడ్ యాసిడ్ శ్రేణి వాహన ధరలను రూ.2,500–రూ.4,700 వరకు తగ్గించింది. లిథియం అయాన్ శ్రేణి స్కూటర్ ధరలను రూ.3,400–రూ.8,600 వరకు తగ్గించినట్లు ప్రకటించింది. రూ.37,000–రూ.1.08 లక్షల ధరల శ్రేణిలో ఈ సంస్థ వాహనాలను విక్రయిస్తోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలపై వస్తు సేవల పన్ను రేటును 12 నుంచి 5 శాతానికి తగ్గించిన నేపథ్యంలో ఈ ప్రయోజనాన్ని వినియోగదారులకు బదిలీ చేయడం కోసం ఈ మేరకు ధరలను తగ్గించినట్లు కంపెనీ ప్రకటించింది.



# ఇండియన్ బ్యాంక్ 75% వృద్ధి

క్యూ1లో లాభం రూ.366 కోట్లు

**చెన్నై:** ప్రభుత్వరంగ ఇండియన్‌బ్యాంకు జూన్ త్రైమాసికంలో మెరుగైన పనితీరు చూపించింది. బ్యాంకు లాభం క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న రూ.209 కోట్లతో పోలిస్తే 75 శాతం పెరిగి రూ.366 కోట్లకు చేరుకుంది. మొత్తం ఆదాయం కూడా రూ.5,132 కోట్ల నుంచి రూ.5,832 కోట్లకు వృద్ధి చెందింది. జూన్ త్రైమాసికంలో తాజాగా రూ.1,035 కోట్లు మొండి బకాయిలుగా మారాయి. అన్ని విభాగాల్లోనూ మెరుగైన వృద్ధి నమోదు చేసినట్టు ఇండియన్ బ్యాంకు ఎండీ, సీఈవో పద్మజ చుండూరు పేర్కొన్నారు. ''తాజా ఎన్‌పీఏలకు కళ్లెం వేయడం వల్ల నికర లాభంలో 74.5 శాతం వృద్ధి నమోదైంది. తిరిగి గాడిలో పడ్డాం. ఒత్తిడిలోని రుణాలు ఎన్‌పీఏలుగా మారకుండా చర్యలు తీసుకుంటున్నాం'' అని పద్మజ తెలిపారు. రానున్న త్రైమాసికాల్లో తాజా ఎన్‌పీఏలను రూ.800–900 కోట్లకు కట్టడి చేయాలని లక్ష్యం పెట్టుకున్నట్టు ఆమె తెలిపారు. ''రిటైల్, వ్యవసాయం, సూక్ష్మ, చిన్న, మధ్యత తరహా విభాగాల్లో (ఎంఎస్‌ఎంఈ) వృద్ధి నెలకొంది. రిటైల్‌లో 25 శాతం, వ్యవసాయంలో 25 శాతం, ఎంఎస్‌ఎంఈ విభాగంలో 10 శాతం వృద్ధి సాధించాం. మొత్తం మీద క్యాపిటల్ అడెక్వసీ రేషియో 13.62 శాతంగా ఉంది. ఇది మాకు మరింత సౌకర్యాన్ని, నమ్మకాన్ని కలిగిస్తోంది'' అని పద్మజ వివరించారు. మొబైల్ బ్యాంకింగ్‌లో లావాదేవీల్లో 300 శాతం వృద్ధి నమోదైనట్టు ఆమె చెప్పారు.




## ఫ్లిప్‌కార్ట్‌లో ఇక సినిమాలు కూడా..

- వీడియో స్ట్రీమింగ్ సేవలపై సంస్థ కసరత్తు
- ప్రాంతీయ భాషల్లో త్వరలో అందుబాటు




**న్యూఢిల్లీ:** ప్రత్యర్థి ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్‌ను దీటుగా ఎదుర్కొనే దిశగా వాల్‌మార్ట్ సారథ్యంలోని ఫ్లిప్‌కార్ట్ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. త్వరలోనే ప్రాంతీయ భాషల్లో వీడియో స్ట్రీమింగ్ సేవలు కూడా అందుబాటులోకి తేనున్నట్లు సోమవారం ప్రకటించింది. 'ఫ్లిప్‌కార్ట్ వీడియోస్' పేరిట ఈ సర్వీసు ప్రారంభించనుంది. ప్రకటనల ఆదాయంతో నిర్వహించే ఈ సర్వీసు.. ఫ్లిప్‌కార్ట్ యాప్‌ను ఉపయోగించే యూజర్లకు ఉచితంగా అందుబాటులో ఉంటుంది. షార్ట్ ఫిలిమ్‌లు, పూర్తి నిడివి సినిమాలు, సిరీస్‌లు మొదలైనవి ఫ్లిప్‌కార్ట్ వీడియోస్‌లో ఉంటాయి. పండుగ సీజన్ రానున్న నేపథ్యంలో ఈ పరిణామం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. 'ఈ సేవలపై భారీగా ఇన్వెస్ట్ చేస్తున్నాం. షాపింగ్ కోసమే కాకుండా మా ప్లాట్‌ఫాంపై యూజర్లు మరింత సమయం వెచ్చించేలా చేయాలని యత్నిస్తున్నాం' అని ఫ్లిప్‌కార్ట్ సీఈవో కళ్యాణ్ కృష్ణమూర్తి చెప్పారు. ముందుగా హిందీతో ప్రారంభించి తర్వాత దశల్లో తమిళం, తెలుగు, బెంగాలీ భాషల్లో కూడా కంటెంట్ అందించనున్నట్లు వివరించారు.

# రుణ రేట్ల సమీక్షకు బ్యాంకర్లు ఓకే

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశంలో అంగీకారం

**న్యూఢిల్లీ:** ఆర్‌బీఐ రేట్ల తగ్గింపు ప్రయోజనాలను రుణ గ్రహీతలకు బ్యాంకులు పూర్తి స్థాయిలో అందించని పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకర్లతో సోమవారం చర్చించారు. రుణ రేట్లను సమీక్షించేందుకు బ్యంకర్లు అంగీకారం తెలిపారు. గత డిసెంబర్ నుంచి ఆర్‌బీఐ ఇప్పటి వరకు 75 బేసిస్ పాయింట్ల మేర రుణ రేట్లను తగ్గించినప్పటికీ, ఆ స్థాయిలో రుణాలపై రేట్లు తగ్గని విషయం తెలిసిందే. ''బ్యాంకులు రేట్ల తగ్గింపు ప్రయోజనాన్ని రుణాలకు బదలాయించాల్సిన అవసరం ఉంది. ఆర్‌బీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా రుణ రేట్లను సమీక్షించి చర్యలు తీసుకుంటామని బ్యాంకులు సమావేశంలో అంగీకరించాయి''అని మంత్రి అధికారికంగా విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకుల చీఫ్‌లు, ప్రైవేటు రంగంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, కోటక్ బ్యాంకు, సిటీ బ్యాంకు తదితర బ్యాంకుల సారథులతో సమావేశం అనంతరం మంత్రి నుంచి ప్రకటన వెలువడింది. ఎంఎస్ఎంఈ, ఆటోమొబైల్ రంగాలకు రుణ వితరణ వృద్ధితోపాటు సకాలంలో రేట్ల తగ్గింపు ప్రయోజనాల బదిలీ, డిజిటైజేషన్, సేవల పన్ను సంబంధిత అంశాలు సమావేశంలో చర్చకు వచ్చినట్టు ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్‌కుమార్ తెలిపారు.

**పలు రంగాల ప్రతినిధులతో సమావేశమవుతా**

పలు రంగాల ప్రతినిధులతో తాను సమావేశమై, సత్వర చర్యలు తీసుకుంటామని మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. సోమవారం బ్యాంకుల చీఫ్‌లతో భేటీ అయినట్టుగానే... ఈ వారంలోనే ఎంఎస్ఎంఈ ప్రతినిధులు, ఆటోమొబైల్ రంగం, వాణిజ్య సంఘాలు, రియల్ ఎస్టేట్ ప్రతినిధులతోనూ మంత్రి సమావేశం కానున్నారు. వారి అభిప్రాయాలను విని, తగురీతిలో, సత్వరమే చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు.




### ఎఫ్‌పీఐ ప్రతినిధులతో మాట్లాడుతా

**న్యూఢిల్లీ:** అధిక ఆదాయ వర్గాలపై బడ్జెట్‌లో సర్‌చార్జీ భారీ పెంపు అనంతరం నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) భారత క్యాపిటల్ మార్కెట్లలో అమ్మకాలు కొనసాగిస్తుండడంతో, ఎఫ్‌పీఐ ప్రతినిధులతో త్వరలోనే చర్చలు నిర్వహించనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం ప్రకటించారు. సార్వభౌమ బాండ్ల జారీకి సంబంధించి బడ్జెట్‌లో ప్రకటన మినహా దానికి సంబంధించి అదనంగా ఇప్పటి వరకు ఏ చర్యలు తీసుకోలేదని స్పష్టం చేశారు. ఈ రెండు నిర్ణయాలపై వ్యతిరేకత వచ్చిన నేపథ్యంలో కేంద్రం పునరాలోచనలో పడినట్టు మంత్రి వ్యాఖ్యల ద్వారా తెలుస్తోంది. ఆర్థిక శాఖ పరిధిలోని ఎకనమిక్ అఫైర్స్ విభాగం కార్యదర్శి అతను చక్రవర్తి ఎఫ్‌పీఐల ప్రతినిధులతో చర్చలు నిర్వహిస్తారని మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ''వారు (ఎఫ్‌పీఐలు) చెప్పదలుచుకున్నదాన్ని వినేందుకు నేను సిద్ధంగా ఉన్నాను'' అని ప్రకటించారు. ఈ నెల మొదటి రెండు రోజుల్లోనే ఎఫ్‌పీఐలు డెట్, ఈక్విటీల నుంచి రూ.2,985 కోట్ల మేర పెట్టుబడులను వెనక్కి తీసేసుకున్నారు.

## ప్రాఫిట్ ప్లస్ డైలీ

### ఎల్ఐసీ నుంచి జీవన్ అమర్

జీవిత బీమా రంగంలోని అగ్రగామి సంస్థ ఎల్ఐసీ నాన్ లింక్డ్ టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీని 'జీవన్ అమర్' పేరుతో తీసుకొచ్చింది. ఆఫ్‌లైన్‌లో లభించే ఈ ప్లాన్‌లో రెండు రకాల మరణ పరిహార ప్రయోజనాల్లో నచ్చిన దానిని ఎంచుకోవచ్చని సంస్థ తెలిపింది. పాలసీ కాల వ్యవధి వరకు ఒకటే సమ్ అష్యూర్డ్ (లెవల్ సమ్ అష్యూర్డ్) ఒకటి అయితే, సమ్ అష్యూర్డ్ (బీమా) నిర్ణీత కాలానికోసారి పెరుగుతూ వెళ్లేది రెండో ఆప్షన్. రెండో ఆప్షన్‌లో ఆరో ఏట నుంచి ఆ తర్వాత పదేళ్ల వరకు ఏటా 10 శాతం చొప్పున సమ్ అష్యూరెన్స్ రెట్టింపు అయ్యే వరకు పెరుగుతూ వెళుతుంది. 18–65 ఏళ్ల మధ్య ఉన్న వారు ఎవరైనా ఈ పాలసీ తీసుకునేందుకు అర్హులే. గరిష్టంగా 80 ఏళ్ల వయసు నాటి వరకు పాలసీ కాల వ్యవధిని ఎంచుకోవచ్చు. పాలసీని కనీసం పదేళ్లకు, గరిష్టంగా 40 ఏళ్ల కాలానికి తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. కనీసం రూ.25 లక్షలు, ఆపై మొత్తానికి బీమా తీసుకోవచ్చు. చౌక ప్రీమియానికే లభించే టర్మ్ పాలసీగా దీన్ని ఎల్ఐసీ అభివర్ణించింది.



## డిగ్రీ కోర్సుల మార్పునకు నేడు అవకాశం

### వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోండి: దోస్త్

**సాక్షి, హైదరాబాద్:** డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల్లో భాగంగా కాలేజీ పరిధిలో కోర్సు, మీడియం మార్చుకునేందుకు ఇంట్రా కాలేజీ కౌన్సెలింగ్‌ను ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు తెలంగాణ డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ (దోస్త్) వెల్లడించింది. కోర్సులు, మీడియం మార్చుకోవాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో లాగిన్ అయి వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించింది. ఆప్షన్లు ఇచ్చుకున్న వారికి ఈ నెల 7వ తేదీన సీట్లు కేటాయిస్తామని తెలిపింది.

## 8, 9, 10 తేదీల్లో ఇంజనీరింగ్ స్పాట్ అడ్మిషన్లు!

**సాక్షి, హైదరాబాద్:** ఎంసెట్ కన్వీనర్ కోటాలో మిగిలిపోయిన దాదాపు 20 వేల ఇంజనీరింగ్ సీట్లలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లను నిర్వహించేందుకు ప్రవేశాల కమిటీ కసరత్తు చేస్తోంది. ఈ నెల 8, 9, 10 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది. దీనికి సంబంధించిన ప్రకటన ఒకట్రెండు రోజుల్లో జారీ చేసే అవకాశం ఉంది.

## ఎంపీహెచ్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

### రేపటి నుంచి 21 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు

**సాక్షి, హైదరాబాద్:** మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (ఎంపీహెచ్) కోర్సుల్లో ఈ ఏడాది ప్రవేశాలకు కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ నెల 7వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 21వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. దరఖాస్తు చేసుకున్న అర్హుల జాబితాను ఈ నెల 24న వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. ఆన్‌లైన్ ద్వారా ప్రవేశ పరీక్ష సెప్టెంబర్ 1వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు ఉంటుంది. అభ్యర్థులు గంట ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందని, మిగిలిన వివరాలను www.knruhs.in, www.knruhs.telangana.gov.in వెబ్‌సైట్‌ల్లో చూడవచ్చని యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి.

## ప్రిన్సిపాల్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**సాక్షి, హైదరాబాద్:** గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో ప్రిన్సిపాల్ ఉద్యోగానికి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. పీహెచ్‌డీతో పాటు బీఈడీ విద్యార్హత ఉన్న వారు దీనికి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. ప్రభుత్వ శాఖల్లో సీనియర్ అధికారిగా పనిచేసి పదవీ విరమణ పొంది 62 ఏళ్ల వయసులోపు ఉన్న వారు సైతం అర్హులేనని తెలిపింది. మరిన్ని వివరాలకు రాజేంద్రనగర్‌లోని ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఫర్ ఎస్టీస్, మానస హిల్స్‌లో ఈనెల 13వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా దరఖాస్తులు సమర్పించాలని, మరింత సమాచారం కోసం 9963075760 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించింది. 9నెలల పాటు కొనసాగే ప్రిన్స్‌పల్ ఉద్యోగానికి అర్హత సాధించిన వారికి రూ.40వేల వేతనం, రూ.10వేలు ఇతర భత్యాలు చెల్లించనున్నట్లు తెలిపింది.

## పోలీసుశాఖలో సూపర్‌న్యూమరరీ పోస్టులు

**సాక్షి, హైదరాబాద్:** పోలీసుశాఖలో కొత్తగా సూపర్‌న్యూమరరీ పోస్టులకు భర్తీకి ఆర్థికశాఖ సుముఖత వ్యక్తం చేసింది. డీజీపీ పరిధిలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో 19 అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ర్యాంకు సూపర్‌న్యూమరీ పోస్టులు భర్తీ చేసుకునేందుకు ఆర్థిక శాఖ సోమవారం జీవో విడుదల చేసింది.

**టీఎస్ ఎస్పీలోనూ..**

డీజీపీ ఆధ్వర్యంలో పనిచేసే తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టీఎస్ఎస్పీ) లోనూ 13 అడిషనల్ కమాండెంట్ ర్యాంకు పోస్టులను సూపర్‌న్యూమరీ విధానంలో భర్తీ చేసేందుకు అనుమతినిస్తూ ఆర్థిక శాఖ మరో జీవో జారీ చేసింది. ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి కె.రామకృష్ణారావు హోంశాఖ, డీజీపీకి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

## డిగ్రీ లెక్చరర్లకు వృత్తి నైపుణ్య శిక్షణ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల లెక్చరర్లకు వృత్తి నైపుణ్యాలను అప్‌గ్రేడ్ చేసుకునేందుకు శిక్షణనివ్వాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. దీనికోసం ఆయా లెక్చరర్లకు వారం రోజుల పాటు శిక్షణనిచ్చేలా ఏర్పాట్లు చేస్తోంది. ఆ బాధ్యతలను యూనివర్సిటీలకు అప్పగించింది. ప్రతి 40 మందికి ఒక బ్యాచ్ చొప్పున రాష్ట్రంలో 1000కి పైగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లోని లెక్చరర్లు అందరికీ శిక్షణనిచ్చేలా చర్యలు చేపట్టింది. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి వెల్లడించారు. సిలబస్, బోధన పద్ధతుల్లో వస్తున్న మార్పులు, సబ్జెక్టు సంబంధ అంశాలపై లెక్చరర్లను అప్‌గ్రేడ్ చేసేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

# నదుల ఉగ్ర తాండవం



ఎల్లంపల్లి ప్రాజెక్ట్ గేట్లు ఎత్తివేయడంతో ఉరకలెత్తుతున్న వరద

## కృష్ణా, గోదావరి నదుల్లో వరద ఉధృతం

- జూరాలకు 2.662 లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు
- శ్రీశైలంలోకి 2.36 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 121 టీఎంసీలకు చేరిన నిల్వ.. రోజుకు 21 టీఎంసీల చొప్పున రాక
- మహాబలేశ్వర్‌లో 38 సెం.మీ, కోయినాలో 25 సెం.మీల కుండపోత
- నేడు కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు గరిష్టంగా 30 టీఎంసీల మేర వరద!

**సాక్షి, హైదరాబాద్:** గత వారం రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న విస్తార వర్షాలతో కృష్ణా, గోదావరి ఉగ్ర రూపం దాల్చుతున్నాయి. ఇప్పటికే వాగులు, వంకలన్నీ నిండటం, ఉప నదులు ఉప్పొంగుతుండటంతో నదుల్లో వరద ఉధృతి పెరుగుతోంది. ముఖ్యంగా మహారాష్ట్రలోని మహాబలేశ్వర్, కోయినా, పశ్చిమ కనుమల్లో అతిభారీ వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల్లోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఆల్మట్టి, నారాయణపూర్‌లోకి 2.5 లక్షల నుంచి 3 లక్షల క్యూసెక్కుల మేర వరద వస్తుండగా అంతేమొత్తం దిగువ జూరాల, శ్రీశైలాన్ని చేరుతోంది. శ్రీశైలంలో ఇప్పటికే నీటినిల్వ 121 టీఎంసీలకు చేరింది. రోజుకు 21 టీఎంసీల మేర నీరు వస్తుండటంతో 4–5 రోజుల్లోనే ప్రాజెక్టు పూర్తిగా నిండనుంది.

**భారీ వర్షాలు.. అంతే భారీ వరద**

కృష్ణా బేసిన్‌లోని మహారాష్ట్ర మహాబలేశ్వర్‌లో ఆది, సోమవారాల్లో ఏకంగా 38 సెంటీమీటర్ల వర్షం కురవగా కోయినా పరిధిలో 25 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఇతర చోట్ల సైతం భారీ వర్షాలు కురవడంతో కృష్ణా బేసిన్‌లోని ఉప నదులన్నీ పొంగిపొర్లుతున్నాయి. దీంతో ఆల్మట్టి, నారాయణపూర్‌లకు వరద ఉధృతి 20 వేల క్యూసెక్కుల నుంచి 30 వేల క్యూసెక్కుల మేర పెరుగుతోంది. సోమవారం ఆల్మట్టిలోకి ఏకంగా 2,59 లక్షల క్యూసెక్కుల (23.54 టీఎంసీలు) మేర వరద వస్తుండగా నారాయణపూర్‌లోకి 3 లక్షల క్యూసెక్కుల (27.27 టీఎంసీలు) వరద వస్తోంది. దీంతో జూరాలకు 2.62 లక్షల క్యూసెక్కుల (23.81 టీఎంసీలు) మేర వరద వస్తుండగా అంతేమొత్తంలో నీటిని దిగువ శ్రీశైలానికి వదులుతున్నారు. శ్రీశైలానికి ప్రస్తుతం 2.36 లక్షల క్యూసెక్కుల (21.45 టీఎంసీలు) వరద నమోదైంది. ఎగువ కురిసిన వర్షాల కారణంగా మంగళవారం నుంచి మరింత వరద పెరిగే అవకాశం ఉంది. కనిష్టంగా 3 లక్షల క్యూసెక్కులు.. అంటే రోజుకు 28 టీఎంసీల మేర వరద వచ్చే అవకాశం ఉందని కేంద్ర జలసంఘం అంచనా వేసింది. అదే జరిగితే శ్రీశైలం 4–5 రోజుల్లోనే నిండనుంది. ఇప్పటికే శ్రీశైలం ద్వారా ఏపీ, తెలంగాణ తాగు, సాగు, విద్యుత్ అవసరాలకు 45,453 క్యూసెక్కుల నీటి వినియోగం మొదలు పెట్టింది. అయినప్పటికీ వరద ఉధృతి దృష్ట్యా ప్రాజెక్టు త్వరలోనే నిండనుంది. ఇక మహారాష్ట్రలోని ఉజ్జయినీ జలాశయానికి ప్రవాహాలు పోటెత్తుతున్నాయి. ప్రాజెక్టులోకి 1.60 లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు వస్తున్నాయి. ప్రాజెక్టు వాస్తవ నీటి నిల్వ 117 టీఎంసీలు కాగా ఇప్పటికే నీటి నిల్వ 97 టీఎంసీలకు చేరుకుంది. మరో 20 టీఎంసీలు వస్తే ఉజ్జయినీ రెండ్రోజుల్లో నిండుతుంది. ఆ తర్వాత భీమా వరద జూరాల మీదుగా శ్రీశైలాన్ని చేరుతుంది. గతేడాది కంటే ఈ ఏడాది కృష్ణాలో నీటి లభ్యత అధికంగా ఉంటుందని జలవనరులశాఖ అధికారులు వేస్తున్న అంచనాలు తెలుగు రాష్ట్రాల్లోని ఆయకట్టు రైతుల్లో సరికొత్త ఆశలను నింపుతున్నాయి.

**ఎల్లంపల్లి గేట్లు ఎత్తివేత...**

ఇక గోదావరిలో వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. సోమవారం మేడిగడ్డ వద్ద 7.97 లక్షల క్యూసెక్కుల మేర వరద ప్రవాహం నమోదైంది. మేడిగడ్డ 81 గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఇప్పటివరకు మేడిగడ్డ పాయింట్ నుంచి 180 టీఎంసీల నీరు కిందికి వెళ్లిపోయింది. ఇక పరీవాహకంలోని వర్షాలతో ఎల్లంపల్లి పూర్తిగా నిండటంతో దానిలోకి వస్తున్న 35,953 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు వదులుతున్నారు. ఇక ఎస్సారెస్పీకి చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రవాహాలు ఇప్పుడిప్పుడే వస్తున్నాయి.

### ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ఇలా..

(నిల్వ–టీఎంసీల్లో, ప్రవాహాలు–క్యూసెక్కుల్లో)

| ప్రాజెక్టు | పూర్తి నిల్వ | ప్రస్తుత నిల్వ | ఇన్‌ఫ్లో | ఔట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| ఆల్మట్టి | 129.72 | 98.67 | 2,59,000 | 2,90,117 |
| నారాయణపూర్ | 37.646 | 27.60 | 3,00,000 | 2,90,975 |
| జూరాల | 9.657 | 8.77 | 2,62,000 | 2,64,012 |
| శ్రీశైలం | 215.807 | 121 | 2,36,331 | 45,453 |
| తుంగభద్ర | 100.86 | 35.49 | 20,105 | 1,203 |
| ఉజ్జయిని | 117 | 97 | 1,60,000 | 0 |
| నాగార్జునసాగర్ | 312.045 | 126.14 | 913 | 913 |
| కడెం | 7.60 | 6.49 | 5,225 | 408 |
| ఎల్లంపల్లి | 20.18 | 19.70 | 35,953 | 35,953 |
| ఎస్సారెస్పీ | 90.31 | 8.41 | 9,815 | 258 |

### నేడు గోదావరిని పరిశీలించనున్న సీఎం కేసీఆర్

మేడిగడ్డ నుంచి ధర్మపురి వరకు దాదాపు 140 కిలోమీటర్ల మేర సజీవంగా మారిన గోదావరి నదిని చూడడానికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మంగళవారం ఆయా ప్రాంతాల్లో పర్యటించనున్నారు. మేడిగడ్డ బ్యారేజీ, గోలివాడ పంప్‌హౌస్, ధర్మపురి పుణ్యక్షేత్రాలను సీఎం సందర్శిస్తారు. అధికారులు ఇంజనీర్లతో పాటు ఉదయం 10 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పర్యటన సాగిస్తారు.

# ‘పాలమూరు’కు రూ.10 వేల కోట్ల రుణం



- దేవాదుల, సీతారామ, ఎఫ్‌ఎఫ్‌సీకు మరో రూ. 2,638 కోట్లు
- కాళేశ్వరం ప్యాకేజీ–12 పనుల పూర్తికి రూ. 1,500 కోట్లు
- వివిధ సంస్థల నుంచి రుణాలు తీసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు

**సాక్షి, హైదరాబాద్:** పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పరుగులు పెట్టించేదిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ప్రాజెక్టు పరిధిలో ఉన్న ప్రధాన అడ్డంకులను దాటుతూనే, సమృద్ధిగా నిధులను అందుబాటులో ఉంచేలా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ) నుంచి రూ.10 వేల కోట్ల రుణం తీసుకోవాలని నిర్ణయించింది. ప్రాజెక్టులోని ఎలక్ట్రో మెకానికల్ పనుల పూర్తికి వీలుగా ఈ రుణాలు తీసుకునేందుకు అనుమతినిస్తూ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్‌కే జోషి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిజానికి పాలమూరు–రంగారెడ్డి పనులను రూ.32,500 కోట్లతో చేపట్టగా ఇందులో ఇప్పటివరకు 20 శాతం పనులే పూర్తయ్యాయి. నిధుల కొరత కారణంగా ఏడాదిగా ప్రాజెక్టు ముందుకు కదల్లేదు. ఇది వరదజలాలపై ఆధారపడిన ప్రాజెక్టు కావడంతో రిజర్వాయర్లు, కాల్వల నిర్మాణాలకు బ్యాంకులు నేరుగా రుణాలిచ్చే పరిస్థితి లేదు. దీంతో ప్రాజెక్టులోని ఎలక్ట్రో మెకానికల్ పనులకు కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారానే రుణాలు తీసుకోవాలని సర్కారు గతంలో నిర్ణయించింది. ఈ పనులకు రూ.17 వేల కోట్లు అవసరం ఉండగా రూ.10 వేల కోట్లు రుణాలిచ్చేందుకు పీఎఫ్‌సీ ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం రుణం తీసుకునేలా ఉత్తర్వులు వెలువడగా, త్వరలోనే దీనికి సంబంధించి పీఎఫ్‌సీతో ఒప్పందాలు జరగనున్నాయి.

**రూ.41,500 కోట్లకు చేరనున్న కాళేశ్వరం రుణాలు!**

దేవాదుల, తుపాకులగూడెం, సీతారామ, వరద కాల్వ(ఎఫ్‌ఎఫ్‌సీ) ప్రాజెక్టుల కోసం ‘తెలంగాణ రాష్ట్ర వాటర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్(టీఎస్‌డబ్ల్యూఐసీ)’పేరుతో ఏర్పాటు చేసిన మరో కార్పొరేషన్ ద్వారా రూ.2,638 కోట్ల రుణం తీసుకునేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ఈ కార్పొరేషన్‌కు ఆంధ్రాబ్యాంకు కన్సార్షియం రూ.17 వేల కోట్ల మేర రుణం ఇచ్చింది. ఇప్పుడు మరింత రుణం ఇవ్వనుంది. వీటిల్లో ఎక్కువగా సీతారామ, దేవాదుల పనులకే నిధులు వెచ్చించనున్నారు. దీంతో పాటే కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్యాకేజీ–12 పనుల పూర్తికి రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఆర్ఈసీ) నుంచి మరో రూ.1,500 కోట్లు రుణం తీసుకునేందుకు ఉత్తర్వులు వెలువడ్డాయి. కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారానే ఇప్పటివరకు వివిధ రుణ సంస్థల నుంచి ఏకంగా రూ.40 వేల కోట్లకుపైగా సేకరించగా, అందులోంచే ప్రాజెక్టు నిర్మాణ పనులకు రూ.32 వేల కోట్లను ఖర్చు చేశారు. ప్రస్తుత కాళేశ్వరం రుణాలు రూ.41,500 కోట్లకు చేరనున్నాయి.

## 10న గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నా

**సాక్షి, హైదరాబాద్:** గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న దాదాపు 35 వేల మంది కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 10న ఇందిరాపార్కు వద్ద చేపట్టనున్న ధర్నా విజయవంతం చేయాలని ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ పిలుపునిచ్చాయి. రూ.8,500 వేతనం ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించి ఏడాది దాటినా ఉత్తర్వులు ఇవ్వలేదని ఓ ప్రకటనలో పేర్కొన్నాయి.







## నేడు, రేపు భారీ వర్షాలు

**సాక్షి, హైదరాబాద్:** పశ్చిమ బెంగాల్, ఒడిశా తీరాలను ఆనుకుని ఉత్తర బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇది ఎత్తుకి వెళ్లే కొద్దీ నైరుతి వైపునకు వంపు తిరిగి ఉంది. రాగల 48 గంటల్లో ఇది మరింత తీవ్రంగా మారే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో మంగళవారం ఒకటి రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు, బుధవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం సీనియర్ అధికారి రాజారావు వెల్లడించారు. ఇతర ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఇదిలావుండగా గత 24 గంటల్లో వికారాబాద్ జిల్లా పెద్దేముల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పేరూరులో 3 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.







# మావోలు లేరంటూనే అడ్డుకోవడమెందుకు?

- టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం
- యురేనియం తవ్వకాల ప్రాంతాల్లోని ప్రజలను కలవనీయకపోతే ఎలా?
- 370 రద్దు సమస్యను పరిష్కరిస్తుందా? సమస్య అవుతుందా?

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వతీరుపై తెలంగాణ జనసమితి(టీజేఎస్) అధినేత ప్రొఫెసర్ కోదండరాం మండిపడ్డారు. నల్లమలలోని యురేనియం తవ్వకాల ప్రాంతాల ప్రజలతో మాట్లాడేందుకు వెళితే పోలీసులు అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సోమవారం ఇక్కడి టీజేఎస్ కార్యాలయంలో నేతలు విశ్వేశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డితో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఒకవైపు రాష్ట్రంలో మావోయిస్టులు లేరంటూ, మరోవైపు మావోయిస్టుల వారోత్సవాలు జరుగుతున్నాయంటూ వారి పేరుతో ప్రజలను కలవకుండా తమను అరెస్టు చేయడం దారుణమని అన్నారు. సెక్షన్ 151, 107లను దుర్వినియోగం చేస్తున్నారని, దీనిపై డీజీపీని కలుస్తామని, సమస్య పరిష్కారం కాకపోతే చట్టపరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి ఆలోచిస్తామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వ తొందరపాటు నిర్ణయం వల్ల రూ.20 కోట్లు వృథా అయ్యాయని, గోదావరి నీళ్లను కృష్ణానదిలో కలిపేలా చర్యలు చేపడతామనడం తొందరపాటు నిర్ణయమన్నారు. తెలంగాణ హక్కులకు విఘాతం కలిగించే నిర్ణయాలను తాము ఒప్పుకోబోమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన అంశాలపై ఇద్దరు సీఎంలు సమావేశమైన ప్రతిసారీ మినిట్స్ రికార్డ్ చేయాలని, అధికారులకు భాగస్వామ్యం కల్పించాలని సూచించారు. క్లాస్ 4 ఉద్యోగుల విభజన చేయవద్దని చెప్పినా వినకపోవడం వల్ల 1,500 మంది తెలంగాణవారు ఆంధ్రాలో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లేందుకు 1,500 మంది టీచర్లు సిద్ధంగా ఉన్నారని, వారిని త్వరగా పంపించాలని సూచించారు. షెడ్యూల్ 9లోని అంశాలపై షీలాబిడే కమిటీ నివేదిక ఇచ్చినప్పటికీ ఇంకా అమలు కావడం లేదన్నారు. ‘ఆర్టికల్ 370 రద్దు ద్వారా కశ్మీర్ సమస్యను ఎలా పరిష్కరిస్తారో కేంద్రం ముందే చెప్పాల్సి ఉండే’దని అన్నారు. ఈ రద్దు సమస్యను పరిష్కరిస్తుందో.. అదే పెద్ద సమస్య అవుతుందో చూడాలన్నారు.

# వైద్య విధాన పరిషత్ డాక్టర్లకు షాక్

- వైద్య విద్య అధ్యాపకుల పోస్టుల్లో మొండిచేయి
- అన్యాయంపై మంత్రి ఈటలకు వైద్యుల విన్నపం

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలో పనిచేస్తున్న స్పెషలిస్టు వైద్యులకు వైద్యారోగ్య శాఖ షాక్ ఇచ్చింది. వైద్యవిద్య అధ్యాపకుల పోస్టులకు సంబంధించి అసిస్టెంట్ పోస్టుల నియామకాల్లో టీవీవీపీ డాక్టర్లకు మొండిచేయి చూపింది. ఇన్ సర్వీస్ కోటా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీలో నిబంధనల ప్రకారం టీవీవీపీ స్పెషలిస్టు డాక్టర్లకు అవకాశమివ్వాలి. కానీ వైద్య విద్య అధ్యాపకుల నియామకాల్లో వారిని పరిగణనలోకి తీసుకోవడం లేదు. తెలంగాణ వైద్యుల సంఘం నేతలు డాక్టర్ లాలూప్రసాద్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ నరహరి ఆధ్వర్యంలో డాక్టర్లు సోమవారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను సచివాలయంలో కలిశారు. తమకు జరిగిన అన్యాయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇన్ సర్వీస్ కోటా భర్తీపై జీవో నంబర్ 154లో వైద్య విద్య కళాశాలల్లో పనిజేస్తున్న ట్యూటర్లు, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, టీవీవీపీలో పీజీ అర్హత ఉన్న వారంతా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అర్హులు. ఆ మేరకు నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. దాంతో టీవీవీపీలోని 120 మంది డాక్టర్లు, ప్రజారోగ్య డైరెక్టర్ పరిధిలోని 220 మంది వైద్యులు దరఖాస్తు చేసుకున్నారు. కౌన్సెలింగ్ నిర్వహించి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పోస్టింగ్ ఖాయమని టీవీవీపీ వైద్యులంతా భావించారు. కానీ కేవలం డీహెచ్ పరిధిలో ఉన్నవారికే అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా అవకాశమివ్వాలని వైద్య ఆరోగ్య శాఖ సర్క్యులర్ జారీ చేసింది. ఆ సర్క్యులర్ గతంలో అమల్లో ఉన్న జీవో నంబరు 154కు విరుద్ధంగా ఉందని టీవీవీపీ వైద్యులు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే వైద్య విద్యా డైరెక్టర్ దృష్టికి కూడా తీసుకొచ్చారు. ఉపయోగం లేకపోవడంతో మంత్రి ఈటలను కలిశారు.

## ఆరోగ్యశ్రీ బకాయిలు రూ.200 కోట్లు విడుదల



**సాక్షి, హైదరాబాద్:** ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లించాల్సిన బకాయిల్లో సర్కారు రూ.200 కోట్లు విడుదల చేసింది. మరో రూ.100 కోట్లు మంగళవారం విడుదల చేయనున్నారు. తమకు చెల్లించాల్సిన బకాయిలు విడుదల చేయకపోతే 16 నుంచి సమ్మెకు వెళ్తామని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆగమేఘాల మీద కొద్దిమేర బకాయిలు చెల్లించింది. సర్కారు లెక్కల ప్రకారం రూ. 800 కోట్లు బకాయిలుంటే అందులో రూ.300 కోట్లు చెల్లించినట్లు అవుతుందని, మిగిలిన వాటిని కూడా దశలవారీగా చెల్లిస్తామని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. కాగా బకాయిలు విడుదల చేసిన నేపథ్యంలో ఆరోగ్యశ్రీ కింద పేదలకు అందిస్తోన్న సేవలను యథాతథంగా కొనసాగించాలని ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రులను సర్కారు కోరింది. సమ్మెకు వెళ్లొద్దని విజ్ఞప్తి చేసింది. అయితే ప్రభుత్వం విడుదల చేసిన సొమ్ము ఇంకా తమకు చేరలేదని ఆస్పత్రులు పేర్కొంటున్నాయి. పూర్తి బకాయిలు చెల్లించాల్సిందేనని, లేకుంటే నిర్ణీత గడువు తర్వాత సమ్మెకు వెళ్తామని ఆస్పత్రులు హెచ్చరిస్తున్నాయి.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792